

పి.వి
సునీత్ కుమార్

# ప్రారంభం

(నవల)

పి.వి. సునీల్ కుమార్

హర్షల్ శౌర్య ప్రచురణలు
హైదరాబాద్

**PRARAMBHAM**
A novel by P.V. Sunil Kumar

First Impression: January, 2014

Cover Illustration: Kalaprapurna Sri Bapu
Cover Design: Kishen Chandar @pammu
Layout Design: K. Ramakrishna

©: Author

For Copies:
H.S. Publications, #3-5-694,
Flat No. 102, Srinivasa Residency,
Himayathnagar, Hyderabad-29.
*Also available at all noted bookshops*

email: sunil999@gmail.com

Price: **Rs.125/-**

# ‘ప్రారంభం’ మీ వంతు! ప్రయాణం నవల వంతు!!

**ఆవిడొస్తే,** ఈవిడ వుండదు!

అమ్మకానికో టైటిల్ కాదు. నమ్మకానికో నానుడి. వీళ్ళిద్దర్నీ కేవలం తోడికోడళ్ళనుకునేరు. తోబుట్టువులు కూడా.

ఒకావిడ లక్ష్మి, ఇంకొకావిడ సరస్వతి.

వీళ్ళద్దరికీ పడిచావదంటారు. తప్పు. చచ్చినట్టుపడాలి. సరస్వతి అంటే చదువే కదా! మరి పెళ్ళినాడు వచ్చే సొమ్ములు మాత్రం ‘చదివింపులు’ కావా?

ఆలోచిస్తే సగం నమ్మకాలు ‘చెవిలో పువ్వులే’. ఆమాట కొస్తే ‘చెవిలో పువ్వూ’ ఒక నమ్మకమే.

చక్రం తిప్పటం చదువు. దాంతో ‘యంత్రి’ంచటం (మంత్రించటం కాదు సుమా!) ఉత్పత్తి.

సాధన కష్టమనీ, ఫలితం ఇష్టమనీ ‘సుఖపడి చచ్చే’ చిన్ని చిన్ని బుర్రలు అనుకోవటం వల్ల సరస్వతినీ, లక్ష్మినీ వేరు చేసేశారు. ‘ఉండమ్మా బొట్టు పెడతా’ అని లక్ష్మీ దేవిని మాత్రమే గదుల్లో బంధించేశారు.

లక్ష్మీ, సరస్వతుల్లాంటి తోబుట్టువులే మరో ఇద్దరున్నారు. వాళ్ళే రూపవతి, సారమతులు. ఇక్కడా అంతే. ‘ఏవండోయ్! ఆవిడొచ్చింద’ని సృష్టికర్త కు చెప్పి, ఈవిడ చల్లగా జారుకుంటుంది. దాంతో సృష్టికర్త ఎవరో ఒకరినే నమ్ముకోవాలి.

రూపం వుంటే సారం వుండదు, సారముంటే రూపం వుండదు. నేలబారుగా చెప్పాలంటే, ‘బిల్డప్’ వుంటే విషయం వుండదు. విషయం వుంటే ‘బిల్డప్’ వుండదు. దాంతో సృష్టి కర్త అనబడే రచయిత ఏం చేస్తాడు? ఎవరో ఒకరితోనే సెటిలయిపోతాడు. అయితే రూపవతీ, లేకపోతే సారమతి.

వెంటనే పేరూ, డబ్బూ, దస్కం– కావాలనుకున్నవాడు రూపవతిని చేరదీస్తాడు. సహజత్వం, శాశ్వతత్వం, సార్వజనీనత– ఇలాంటివేవో వెతుక్కునే వాడు సారమతిని వరిస్తాడు.

క్రైం, థ్రిల్లర్, సస్పెన్స్, డిటెక్టివ్, క్షుద్ర, సెక్సు నవలల్లో వుండే స్టయిలే వేరు. వందల పేజీలు వున్నా... అలా, అలా క్షణల్లో అయిపోతాయి. ఆ వాక్యాల్లే వుండే వేగమే వేరు. ఆ ట్విస్ట్‌లూ, ఆ పంచ్‌లూ...వామ్మో ..! వెర్రెత్తించేస్తాయి. రూపం అంటే అది. విషయం పాతదే కావచ్చు. వేరే రచనల్లోంచి కొట్టుకొచ్చిందే కావచ్చు. వేల, లక్షల కాపీలు అమ్ముడుపోయే 'బెస్ట్ సెల్లర్స్' ఇవే. అంతా రూపవతి మహిమ!

దరిద్రం, ఆకలి, దగా, వంచన, కన్నీళ్ళూ, పీడన– ఈ అంశాలతో వుండే నవలల్ని చూడండి. అంతా సారమే. అంతా యధార్ధజీవితమే. కానీ, చదువుతుంటే పేజీలు కదలవు. అవార్డు కోసం మాత్రమే తీసిన డాక్యుమెంటరీ సినిమాల్లాగా, 'నంది' బహుమతుల కోసమే ఆడిన నాటకాల్లాగా– ఏ మెరుపూ కనపడకుండా, ఏ విరుపూ వినపడకుండా– సాగుతుంటాయి. ఒక్కోపేజీ చదవటానికి ఒక్కో యుగం పడుతున్నట్లు అనిపిస్తుంది. అయినా, అతి కొద్దిమంది పాఠకులు జీవితం మీద వుండే మమకారంతో చెమటోడ్చి, నిద్రకాచి మరీ చదువుతారు. ఇదీ సారమితి ప్రభావం.

సాహిత్యంలోని ఈ రెండు స్రవంతులను చూసే, రూపాన్నీ– సారాన్నీ కలపటం కష్టమని తెంపు చేసుకుని అటు రచయితలూ, ఇటు పాఠకులూ గిరులు గీసుకుని కూర్చున్నారు.

కానీ హద్దులు మీరే, గీతలు చెరిపే తుంటరి ఎప్పుడోకప్పుడు రాకుండా పోతాడా? ఎప్పుడోకప్పుడు కాదు– ఎప్పటికప్పుడు ఈ తుంటరులు పుడుతూనే వున్నారు. అలాంటి తుంటరుల్లో పెద్ద తుంటరి చలం. 'మీ ఇద్దరూ ఎలా కొట్టుకు చస్తారో చూస్తాను' అని చెప్పి రూపాన్నీ, సారాన్నీ కలిపి పారేశాడు– గదిలో కాదు– 'మైదానం' (ఆయన నవల పేరు లెండి)లో.

పురుషుడి కళ్ళతో స్త్రీని చూడటమే–సెక్సూ, శృంగారం, ప్రేమా– అని రాసుకుంటూ రచయితలు విర్రవీగుతున్న రోజులవి. ఆ భావనను తిరగేసి, అంతకు మించి వెర్రెత్తించే శైలితో (రూపం) నవలల్నీ, కథల్నీ దేశం మీదకు వదిలారు. జనాకర్షకం(పాపులర్)గానూ వుంది. జనహితం(ఆబ్జెక్టివ్)గానూ వుంది.

అలా తుంటరి రచయితలొచ్చినప్పుడల్లా రూపం–సారం ఏకమవుతూ వుంటాయి. నవలల్లో అలా చేసింది రావిశాస్త్రి కావచ్చు, బీనాదేవి కావచ్చు, వడ్డెర చండీదాస్

కావచ్చు, ఇంకెవరయినా కావచ్చు. అందరూ తుంటరులే.

ఇంకో విషయం. తుంటరులెప్పుడూ ఒంటరులే, ఏటికి ఎదురెళ్ళే ఈతగాళ్ళే. ఇప్పటికీ అలాంటి తుంటరులున్నారు. అందులో ఒకరు పి.వి.సునీల్ కుమార్.

ఆయనకీ ఒక దురలవాటుంది. తిన్నగా మాట్లాడరు. రాసినా అంతే. వాచ్యంగా ఒక్క వాక్యమూ సాగదు.

'రాంభొట్ల వారి అమ్మాయి జాణ' అని ఆయనదగ్గర అని చూడండి.

'పోదురూ. అంత పొట్టిగా వుంటుందా? మరీ జానేనా? మూరెడయినా వుండదా?' అని అనెయ్యగలరు.

ఎక్కువ ఆలోచించిన వారికి అమాయకత్వంలాగానూ, అవసరమయినంత ఆలోచించిన వారికి వ్యంగ్యంలాగానూ అనిపిస్తుంది. చిత్రమేమిటంటే, అదే ఆయన శైలి అయి కూర్చుంది.

లక్ష్మీ సరస్వతులు కలవరన్న నోటితోనే, రూప-సారాలను వేర్వేరుగా చూసే కళ్ళతోనే, మంచినీ, తెలివినీ వేరు చెయ్యటం చూస్తూనే వుంటాం. చూడటమేమిటి? రచయితలు తమ పాత్రల్ని కూడా అలా వేర్వేరుగానే సృష్టిస్తారు.

అమాయకుడయిన హీరో వుంటాడు కానీ, తింగరి విలన్ వుంటాడా? కమర్షియల్ సినిమాల్లోనూ, పాపులర్ నవలల్లోనూ వుండక పోవచ్చు. కానీ జీవితంలో వుంటారు.

మంచివాడు అమాయకంగానూ, చెడ్డవాడు జిత్తులమారి(తెలివయిన వాడు)గానూ వుంటాడన్న స్థిరాభిప్రాయాన్ని ఎందుకో మనకి కలగచేసేశారు.

కానీ సునీల్ కుమార్ 'ప్రారంభం'లో ఈ సూత్రీకరణను భగ్నం చేసే మూడు పాత్రల్ని ప్రవేశ పెట్టారు.

మొదటి వాడు: తింగర విలన్. పేరు రాజేంద్ర. వీడికి చెరువంత ఆశ. కానీ ఏం లాభం? ఊరంత నోరు. బయిట పడిపోతూనే వుంటాడు. ఇలాంటి విలన్ని పెట్టుకుని కూడా సస్పెన్స్ చివరి వరకూ కాపాడుకొస్తాడు రచయిత.

రెండవ వాడు: జిత్తుల హీరో. పేరు సుధాకర్. పాములతో చెలిమి చేస్తూనే పడగల మీద కొడుతుంటాడు. ఈ పాత్ర చిత్రమయినదంటే, తన జిత్తులతో రచయితకే టోకరా వేసి, కథను తన వెంట పట్టుకు పోగలడు.

మూడవ వాడు: పేరు రామం. నిజంగానే మీలోనూ, నాలోనూ వుండే మూడో మనిషి ఇతడు. భయాలూ, ప్రియాలూ; బలాలూ, బలహీనతలూ; అభిరుచులూ,

ఏవగింపులూ– అన్నీ ఏకకాలంలో వస్తుంటాయి, పోతుంటాయి. ఎంత తెలివయినవాడో, అంత తెలివి తక్కువ వాడు. ఇతడే నవలలో రచయిత ప్రతినిథి (ప్రొటాగనిస్ట్) రామం కూడా తనను తాను నాయకుడిగా భావించడు. తనకోనాయకుడుంటే (ఆల్టర్ ఇగో) వుంటే బాగుండుననుకుంటాడు. ఆ స్థానంలో సుధాకర్‌ను పెట్టుకుంటాడు.

ఆడపిల్లల జీవితాల్లోకి వీళ్ళూ, వీళ్ళ జీవితాల్లోకి అవకాశాలు వచ్చి పోతున్నప్పుడు– ఎవరు ఎలా స్వీకరిస్తారో తెల్పటమూ, దాంతో వారి వారి మనస్తత్వాలనూ, ఆ మనస్తత్వాలకు ఆధారభూతమైన ఆర్థిక,సాంఘిక సంబంధాలను విప్పి చెప్పటమూ ఈ నవల లక్ష్యం.

'నేను బెజవాడ వెళ్ళాలి. నాప్రేయసిని చూడాలి ' అది నాలక్ష్యం.

'రైలు మీద వెళ్ళితే అయిదారు గంటలు పడుతుంది.' ఇలా అనుకుంటే డీలా పడిపోతాను.

'ఎంచక్కా అయిదారుగంటలు, రైల్లో కిటికీ పక్కన కూర్చొని, మ్యూజిక్ వింటూ, పల్లీలు తింటూ, పక్కవాళ్ళతో ముచ్చట్లు పెట్టుకుంటూ గడపొచ్చు'. ఇలా అయితే లక్ష్యం ఎంత గొప్పగా వుంటుందో, లక్ష్యాన్ని చేరే ప్రయాణం అంతే గొప్పగా వుంటుంది.

ఈ నవలలో మొదటి వాక్యం చదవండి, రైలెక్కినట్టే. ముందే చెబుతున్నాను. బెజవాడొచ్చినా మీరు రైలు దిగరు– మీకిష్టమైన వాళ్లు స్టేషన్‌కొచ్చి మిమ్మల్ని దించే దాకా.

శుభ్ యాత్ర! హేపీ జర్నీ!!

సుఖ ప్రయాణ ప్రాప్తి రస్తు!!!

**(సతీష్ చందర్)**

2.06.2012

**స్వాతి బలరామ్ అభినందన**

# గొప్ప 'ప్రారంభం'

సీరియల్‌కు ప్రాణం ఉత్కంఠ. అటువంటి ఉత్కంఠకు సరికొత్త నిర్వచనాన్ని ఇచ్చింది స్వాతి సపరివార పత్రికలో పి.వి.సునీల్‌కుమార్ ఐ.పి.యస్ సీరియల్ 'ప్రారంభం', ఆరంభంనుండే ఓ సెన్సేషాన్ని సృష్టించింది.

13.5.2011 స్వాతి సపరివాత పత్రికలో ఆరంభమైన 'ప్రారంభం'లో శైలి, శిల్పం, ఇతివృత్తం, పాత్రలూ అన్నీ విభిన్నమే. బిగినింగ్ నుండి ఎండింగ్ దాకా ఏకబిగిన చదివించిన సీరియల్‌గా పాఠకదేవుళ్ళచేత ప్రశంసలను సాధించుకుంది.

అండర్ కరెంట్‌గా సాగే ఎమోషన్స్ అన్నీ పుష్కలంగా వున్న నవల ఇది. వచ్చే వారం ఏమవుతుందా అనే ఉత్సుకతను రేకెత్తించాలంటే ఈ వారం ఇచ్చే క్లైమాక్స్ సీరియల్‌కు ముఖ్యం.

అలా ప్రతివారం ఓ చక్కని క్లైమాక్స్‌ను, తన సీరియల్లో అందిస్తూ సస్పెన్స్‌తో సీరియల్‌ను కొనసాగించారు. అగ్రహారం నుండి హైటెక్ సిటీదాకా, సంప్రదాయం నుండి హైటెక్ కల్చర్ దాకా కథా వస్తువును నవరసాలతో నడిపించిన తీరు ప్రశంసనీయం.

భారీ వాక్యనిర్మాణం చదవడానికి కష్టంగానూ, అర్థంచేసుకోవడం క్లిష్టంగానూ వుంటుందని తన నవలలో తేలికైన, పొందికైన, అందమైన, సూటైన, సొగసైన వాక్య నిర్మాణాన్ని అందించారు పి.వి.సునీల్ కుమార్. పోలీసు ఉన్నతాధికారి అయినా, పాత్రలను ఎంతో సున్నితంగా చిత్రీకరించారు. ఇది వీరి మొదటి నవలంటే నమ్మలేం.

'ప్రారంభం'తో తన రచనా వ్యాసంగాన్ని ఆరంభించినా, ప్రముఖ సీరియల్ రచయితలతో పోటీపడేలా రాశారు. పోలీసు అధికారి కనుక సీరియల్ 'ప్రారంభం' కూడా ఇన్వెస్టిగేషన్‌తో ఆరంభమై మొదటి సంచిక నుండి చివరి సంచికదాకా ఏకబిగిన చదివింపచేస్తుంది.

సజీవమైన పాత్రల్ని ఎన్నుకుని ఆ పాత్రలకు ఓ ప్రత్యేకమైన వ్యక్తిత్వాలను ఆపాదించడం, వాటికి జస్టిఫికేషన్ కలిగించడం అంత సామాన్యమైన విషయం కాదు. దానికి ఓ ప్రత్యేకమైన నైపుణ్యం వుండాలి. ఆ నైపుణ్యం మనకు ఈ నవలలో కనిపిస్తుంది.

"చరిత్రలో శాశ్వత సత్యం అనేది ఏదైనా వుందంటే అది మార్పు మాత్రమే" అన్నాడోమేధావి. ఆ మార్పు అనేది సాహిత్యంలో వస్తే అది ఎంతోమందికి ఉపయోగ పడుతుంది. ఎన్నో సమస్యలని మనస్తత్వాలని, వాటి మనోభావాలని హృద్యంగా ప్రజెంట్ చేయడమేగాక 'ఇప్పుడేం చేయాలి' అన్న ప్రశ్నకు సమాధానాన్ని ఇప్పించవచ్చంటాడు.

ఆ ప్రయత్నమే ఈ నవలలో చేశారు శ్రీ పి.వి.సునీల్‌కుమార్. పాత్రలన్నీ మన కళ్ళకు కట్టినట్టు కనపడతాయి. మన ముందు నిలబడతాయి. వాటిలో చాలా భాగం నిత్యం మనకి తారసపడేవిగా వుంటాయి. అటువంటి పాత్రలని సృష్టించగలగడం మనం వాటి మధ్యే తిరుగుతున్నట్లుగా భ్రమింపచేయడం చేయి తిరిగిన రచయితలకే సాధ్యం.

పి.వి.సునీల్‌కుమార్‌గారు ఈ నవలలో అది సాధ్యంచేయడంతోపాటు నేడు సమాజంలో జరుగుతున్న నేర చరిత్రకు వాస్తవ రూపాన్ని కూడా అందించారు.

దమ్ము, ధైర్యం, వేగం, సూక్ష్మం వంటి అంశాలు పోలీసువారిలో వుంటాయి. అవన్నీ ఈ నవలలో సహజాతి సహజంగా కనపడతాయి.

బాధ్యతాయుతమైన ఉద్యోగంలో నిరంతరం బిజీగా వుంటూ సాహితీ వ్యాసంగాన్ని కొనసాగిస్తున్న శ్రీ పి.వి.సునీల్‌కుమార్ అభినందనీయులు.

స్వాతి సపరివార పత్రికలో సీరియల్‌గా వచ్చిన 'ప్రారంభం' నవలా పాఠకులను కూడా తప్పకుండా ఆకట్టుకుని తీరుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు.

9/12/2013

**(వేమూరి బలరామ్)**

ఎడిటర్, స్వాతి సపరివార పత్రిక

# నిజంగానే... ప్రారంభం

**ఇంతకుముందు** ఓ ఇంటర్వ్యూలో చెప్పినట్టు 1990 ప్రాంతంలో సుమారు ఓ నలభై కథలు రాశాను. అన్నీ అచ్చయినవే. ఆ తరువాత చాలా గ్యాప్ వచ్చింది. మధ్యలో ఒకటి, రెండు కథలు మినహా మరి చేయిచేసుకోలేదు. డబ్బుకోసమో, పేరు కోసమో రాయాల్సిన అవసరం నాకు లేదు.

మిత్రుడు రమ్యసాహితీ మూర్తి వచ్చి ఓ కథ రాయమన్నాడు. మళ్ళా అదే ఆలోచన. ఎందుకు రాయాలి? అప్పుడు ఓ సారి తెలుగులో వస్తున్న సాహిత్యాన్ని క్షుణ్ణంగా చూశాను. నేను చూసిన విషయాలు, నాకు తెల్సిన విషయాలు, నా దృక్కోణంలో ఎవరూ రాయడం లేదు అన్న విషయం తెలిసింది.

సరే మనం సమాజాన్ని చూసి అర్థం చేసుకున్న రీతిని కొందరితో అయినా పంచుకుందాం అనిపించింది. అప్పుడు రాసిందే మహామాయ కథ. ఉత్తమ సాహిత్యానికి పెద్దపీట వేసే 'విపుల' మాస పత్రికలో ప్రచురితమైంది. దానికి విపరీతమైన పాఠక స్పందన. ఏకీభవించేవాళ్ళూ, విబేధించే వాళ్ళూ... అలా రెండురకాలుగా... ఏమైతేనేం స్పందించారు.

ఓ సిరాచుక్క లక్షమెదళ్ళకు కదలిక... అన్న బైరన్ మాట నిజమైంది. ఎందుకు రాయాలో అర్థమైంది.

పాఠకులకు వినోదం అందిస్తూనే, ఆలోచింపచేసే విషయం, ఓ నిజం చెప్తూ పోవాలి. అంతేకానీ మనకు తెలిసిందంతా ఏకరువు పెట్టినట్టు ఉండకూడదు అనే ఆలోచనతో నా బాణీ ఒకటి ఏర్పాటు చేసుకున్నాను. అలా రాసిన రెండో కథ 'దెయ్యం'. నవ్య వార పత్రికలో ప్రచురితమైంది. అప్పుడు రచయిత, సంపాదకుడు అయిన జగన్నాథశర్మ గారు మీరు నవల రాయండి బావుంటుంది అని కోరారు.

కథ అంటే ఒక రోజులోనో, వారంలోనో రాసేది. నవల అంటే రోజూ కొద్దిగంటలు

రాసినా నెలపైన పడుతుంది. అన్ని రోజులు రాసిన కాయితాలు పట్టుకుని ఎక్కడ తిరిగేది? పైగా నేను చేతితో రాసిన స్క్రిప్టుని కంపోజ్ చేయించనపుడు వచ్చే తప్పులు, మళ్ళా వాటిని దిద్దటం చిరాకు కలిగించే ప్రక్రియ. మనమే కంపోజ్ చేసుకుంటే పోలా?

అదీ ప్రారంభం.. నేను తెలుగు కంపోజింగ్ నేర్చుకోవడానికి. ఇన్‌డిజైన్ ప్రోగ్రాం కొని, అను ఫాంట్స్ మాకింటోష్ వెర్షన్ తీసుకుని 'లతదవం సపనరక' అని టైపింగ్ పాఠాలు మొదలెట్టాను. ఓ వారం రోజుల్లో నేర్చుకున్నాను.

సీరియల్ నవల రాయాలంటే ఎపిసోడ్‌కి ఎన్ని పదాలు రాయాలి అనేది అనుమానం. వచ్చే సీరియల్స్ చూసి 1800 నుండి 2500 పదాలు ఒక్కో ఎపిసోడ్‌కి ఉండాలని కనుక్కున్నాను.

మైండ్‌నోట్ అనే ప్రోగ్రాం ఉంది మాక్‌లో. దానిలో నవల థీమ్, పాత్రలు, వాటి స్వభావాలు, కథలో వచ్చే ట్విస్ట్‌లు అన్నీ సిద్ధం చేసుకున్నాను.

ఇవన్నీ ఎందుకు రాస్తున్నానంటే చాలా మంది కొత్తగా రచన చేయాలనుకున్న ఔత్సాహికులు నన్ను అడిగిన ప్రశ్నలకు సమాధానాలు. ఇంకా ఎవరైనా కొత్తగా రాయాలనుకుంటే ఈ సమాచారం ఉపయోగపడితే సంతోషం.

ఆ తరువాత పదహారు భాగాలు రాశాను. కానీ కథ చాలా సాఫీగా పోతున్నట్టు అనిపించింది. అందుకే చివరి రెండు ఎపిసోడ్లు ముందుకు తీసుకోచ్చాను. ఇప్పుడు అసలు ప్రారంభం 3వ భాగం అయింది.

ఇంకో తమాషా ఏమిటంటే పాత్రలు కొంతవరకే మనమాట వింటాయి. ఆ తరువాత అవి స్వతంత్రంగా వ్యవహరిస్తాయి అనే విషయం నా అనుభవంలోకి వచ్చింది. అసలు నేను రాద్దామనుకున్నది ఒకటి. కానీ రాయడం పూర్తయ్యాక చూసుకుంటే అనుకన్న దానికంటే భిన్నంగా ఉంది. వాస్తవంగా ఈ నవల రాయడం నేను మొదలు పెట్టినా పాత్రలే నాతో రాయించాయి.

నేను రాసినదాన్ని ఓపికతో చదివి తన అభిప్రాయం చెప్పడంతో పాటు, కొన్ని సూచనలు చేస్తూ నన్ను ప్రోత్సహించేది, తెలుగువాళ్ళకున్న గొప్ప రచయిత, కవి సతీష్‌చందర్ గారు. ఆయన ప్రోత్సాహంతోనే నేను ఈ నవల పూర్తి చేయగలిగాను.

పూర్తయిన తరువాత ఎవరికి ఇద్దామా అన్న అనుమానం వచ్చింది. అప్పటికే నేను రాసిన భయానందం కథ స్వాతి వారపత్రికలో ప్రచురణ కావడం, మంచి పాఠక ఆదరణ రావడం జరిగింది. అందుకే స్వాతికి ఇద్దామని బలరాంగారితో మాట్లాడాను.

“నేను నవల పంపిస్తాను. బాగోలేకపోతే నిర్మొహమాటంగా తిప్పి పంపండి” అని చెప్పి మరీ పంపాను.

బలరాంగారు తన అభిప్రాయం చెప్పడానికి రెండు వారాలు టైం తీసుకన్నారు. తర్వాత ఫోన్ చేసి “చాలా బావుంది నవల... నేను ఎప్పుడూ పాఠకులకి ఏ రచనా ప్రమోట్ చెయ్యలేదు... కానీ ఈ నవల మీద నమ్మకంతో నేను కమిటవుతాను” అన్నారు. ఆయన చాలా మంచి పబ్లిసిటీ ఇచ్చారు.

పేరుతో పాటు నా హోదా వేద్దామంటే నేను ఒప్పుకోలేదు. “పాఠకులకి రచన ద్వారా పరిచయం కావాలి. వాళ్ళు నన్ను కేవలం రచయితగానే చూడాలి. అప్పుడే బావుంటే బావుందంటారు. లేకపోతే లేదంటారు” అన్నాను.

బలరాం గారు నా అభిప్రాయాన్ని గౌరవించారు. కానీ ఫోటోమాత్రం వేయాల్సిందే అని పట్టుపట్టారు. “నా అనుభవం మీద చెబుతున్నాను... వినండి” అన్నారు. అలా ఫొటో అచ్చయింది.

ఇంత పబ్లిసిటీ అవసరమా అని నేను అడిగితే “ చాలామంది పాఠకులు ఓ మంచి సీరియల్ వస్తుందని తెలీక మిస్ అవుతారు. అలా అవటం నాకు ఇష్టంలేదు. అందుకే ఇస్తున్నా” అన్నారు. బలరాం గారి అనుభవం, ఆలోచన నిజమేనని ఈ రోజుకీ నాకు వస్తున్న ఫోన్ కాల్స్ రుజువు చేస్తున్నాయి. “మేం కొన్ని వారాలు మిస్సయ్యాం... నవల ఎక్కడ దొరుకుతుంది” అని అడుగుతున్నారు పాఠకులు.

రేడియో అక్కయ్య రత్నగారు ఫోన్ చేసి “మా కార్మికుల కార్యక్రమాన్ని గుర్తుపెట్టుకుని రాశారు చాలా సంతోషం” అనడం మంచి అనుభవం.

“మిగతా సీరియల్స్‌లో ఏం జరుతుగుందో మేం ఊహించగలం... కానీ ఈ సీరియల్‌లో ఏం జరుగుతుందో ఊహించలేకపోతున్నాం” అన్నారు చాలా మంది పాఠకులు.

పాఠకుల అభిప్రాయాల్ని నేను నమ్ముతాను. వారికి రచనతో తప్ప రచయితతో పనిలేదు. ఊరికేనో... ఉత్తిత్తినేనో పొగడాలన్న అల్పత్వం కానీ, అవసరం కానీ లేవు. కొంతమంది పాఠకులు సద్విమర్శలు చేశారు. “హీరోయిన్ అవ్వాలంటే ఖచ్చితంగా అందంగా ఉండాలా? మామూలు అమ్మాయిల్లో నవలానాయకి కాగల గుణగణాలు ఉ ండవా?” అనేది నన్ను ఆలోచింప చేసిన విమర్శ.

మామూలు అమ్మాయిని నాయికిగా పెట్టి తప్పక రాస్తాను అన్నాను. రాయాలి.

తెలుగులో చాలామంది ఉత్తమ పాఠకులు ఉన్నారు. నాతో వారు సంభాషించినపుడు వారి ఆంగ్ల, విశ్వ సాహిత్య అభిరుచికి ఆశ్చర్యపోయాను. తెలుగులో మంచి నవలలకోసం... మంచి సాహిత్యం కోసం వారు ఎంతగా ఎదురు చూస్తున్నారో తెలిసింది. అటువంటి అభిరుచిగల పాఠకులకు నా ప్రారంభం నచ్చడం చాలా సంతోషం. సాధారణ పాఠకులుకు నచ్చడం ఒకెత్తు అయితే అభిరుచిగల పాఠకులను మెప్పించడమే రచయిత విజయానికి గీటురాయి.

ఇంతకు ముందు బాపుగారి బొమ్మకు నేను కథ రాశాను. ఈ నవలకి ముఖచిత్రం బాపుగారే వేయడం గొప్ప అనుభూతి, గౌరవం.

శాస్త్రసంబంధమైన విషయాల్లో నాకు అవసరమైన విషయాలు తెలీచేసిన వాజ్‌పేయి గారికి కృతజ్ఞతలు.

ఓపిగ్గా చదువుతూ, మంచీ చెడ్డా చెప్తూ, రాయించే నిత్య స్ఫూర్తిదాత సతీష్ చందర్ గారికి ఎన్ని కృతజ్ఞతలైనా తక్కువే. కవర్‌పేజి డిజైన్ చేసిన కిషన్ చందర్ గారికి కృతజ్ఞతలు. ప్రూఫులు దిద్దిపెట్టిన సత్యనారాయణ మూర్తి గారికి, జోగారావు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఎంతో సహృదయంతో నేను రాసింది అక్షరం మార్చకుండా పాఠకులకు అందించారు వేమూరి బలరాం గారు. అలానే కంపోజు అయిత తరువాత ప్రతీ వారం ప్రూఫు నాకు ముందుగా పంపి ఎక్కడైనా లోటుపాట్లు ఉన్నాయేమో చూసుకోమనే వారు. ఇంతటి గౌరవం నాకు ఇచ్చినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు. అంతే కాక 'ప్రారంభం' అని ఈ నవలకి నామకరణం చేసి, పాఠకుల దృష్టిని ఆకర్షించేలా విశేష ప్రచారం ఇచ్చినందుకు కూడా హృదయపూర్వక కృతజ్ఞతలు.

నేను మరిన్ని నవలలు, కథలు రాసేలా నన్ను ఆదరించి, అభిమానించిన పాఠకులకు ప్రధమ తాంబూలం.

మీ

**సునీల్ కుమార్**

18.5.2012

# ప్రారంభం

సైబరాబాద్‌లోని జె టెక్ సర్వీసెస్ ఆఫీసు ఉన్న టవర్ దగ్గరికి దూసుకొచ్చింది పోలీసు జీపు. కయ్యిమని శబ్దం చేస్తూ ఆగింది. బిలబిలమంటూ పోలీసులు దాని నుండి దిగి ఆ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఆఫీసులోకి దూసుకుపోయారు. బయట కొంతమంది కాపలా ఉండగా డిటెక్టివ్ యస్సై రంగరాజు కొంతమందితో లోపలికి వెళ్ళాడు.

"ఇక్కడ రామ్,సుధాకర్ ఇంకా రాజేంద్ర నారాయణ అంటే ఎవరు?" అని అడిగాడు. తనకి ఎదురైన అతన్ని ఆపి. అతడి చేతిలో ఫేస్‌బుక్ వెబ్‌సైట్‌నుండి డౌన్‌లోడ్ చేసిన ప్రింటవుట్లు ఉన్నాయి.

"రామ్ అంటే నేనే....సుధాకర్ ఆ ఛాంబర్‌లో ఉంటాడు... రాజేంద్ర నారాయణది ఆ పక్క ఛాంబర్" అన్నాడు అతడు. అతడి చేతిలో ఫోటో చూసి " ఈ ఫోటో నాదే... మీకెక్కడది?" అన్నాడు

రంగరాజు గతుక్కుమన్నాడు. అయినా తేరుకుని " ఫోటోలో క్లారిటీ తక్కువ ఉంది కదా...అందుకే గుర్తుపట్టడం కష్టమైంది...మిమ్మల్ని మా డిసిపిగారు తీసుకురమ్మన్నారు..నేను సైఫాబాద్ స్టేషన్నుంచి వచ్చాను" అన్నాడు.

"ఎందుకు ఫేస్‌బుక్‌లో ఎకవుంట్ ఉండటం నేరం కాదే...ఫేస్‌బుక్‌లో ఉన్నవాళ్ళందర్నీ అరెస్టు చేస్తున్నారా?" అని అడిగాడు రామ్

"కొంచెం వెటకారం ఎక్కువ ఉన్నట్టుంది మీది తూగోనా పాగోనా?"

"అంటే...గోదావరికి తూర్పా పడమరా అని అడుగుతున్నాను...మాది మండపేట తూగో" అన్నాడు రంగరాజు

"మాది కొవ్వూరు దగ్గర సార్...గ్లాడ్ టూ సీ యూ"

"బటయామ్ నాట్..."

"ఎందుకు సార్? మీకు వెస్ట్‌గోదావరి అంటే పడదా?"

"కాదు...కూనీలంటే పడదు...అందునా ఆడకూతుర్ని "

"ఏంటి సార్ మీరనేది?"

"దివ్య అనే అమ్మాయి రాత్రి అమానుషంగా హత్య చేయబడింది...దాన్లో ప్రధాన నిందితులు మీరు ముగ్గురు...అందుకే మిమ్మల్ని ప్రశ్నించడానికి తీసుకువెడుతున్నా" అన్నాడు రంగరాజు.

ఒక్కసారిగా సూదిపడినా వినపడేంత నిశ్శబ్దం అలుముకుందక్కడ. సిస్టమ్స్ అన్నీ జామ్ అయినట్టుగా అందరూ స్థంభించిపోయారు.

రామ్, రాజేంద్ర నారాయణ, సుధాకర్‌లు కిందికి వెళ్ళి పోలీసు జీపు ఎక్కడం అందరూ దిగ్భ్రమలో చూస్తూ ఉండిపోయారు.

పోలీసు జీపు మళ్ళా కీచుమంటూ శబ్దం చేస్తూ కదిలింది.

"మీ దుంపలు తెగా... కాస్త ఈ జీపు చక్రాలకి గ్రీజు పెట్టండయ్యా...ఆగినప్పుడూ, స్టార్టయినపుడూ ఒకటే శబ్దం...ఇంతింత శబ్దాలయితే దొంగ ఎవడైనా మనకి దొరుకుతాడా?" విసుక్కున్నాడు రంగరాజు

"ఇప్పుడు వీళ్ళు దొరికారుగా సార్" అన్నాడు డ్రైవర్ సమయస్ఫూర్తి తో

"సంతోషించా....వీళ్ళు దొంగలు కారు...కూనీకోర్లు" అన్నాడు రంగరాజు

కోర్టు చెయ్యాల్సిన పని అంటే ఫలానా వాళ్ళు నేరం చేశారని తీర్పు ఇవ్వాల్సిన పనిని కట్టా రంగరాజు చెయ్యడానికి కారణం తెలుసుకోవాలంటే ఓ రోజు వెనక్కి.. కిందటి రోజు రాత్రికి వెళ్ళాలి

★ ★ ★

గోడలమీదకి పెయింట్ విసిరినట్టు పరుచుకుని ఉంది రక్తం. గది నిండా ఎక్కడపడితే అక్కడ రక్తం మరకలు..డోర్ నాబ్‌కి సైతం అంటుకుని ఉంది రక్తం...గదంతా చిందరవందర గా ఉంది.

"కత్తులతో నరుక్కుంటూ కబడీ ఆడినట్టు ఉందిసార్ " అన్నాడు యస్సై డీసీపీ పునీత్‌తో

"బ్లడ్‌స్పోర్ట్ అంటావు...నాకైతే రక్త చరిత్ర మూడవభాగం చూస్తున్నట్టు ఉంది" అన్నాడు పునీత్

"సార్ ఆ గోడలు చూడండి సైఫ్ ఆలీఖాన్ ఆసియన్ పెయింట్స్ ఏడ్ లో వాల్ మీద రంగుచిమ్మినట్టు లేదూ" అన్నాడు యస్సై మళ్ళా

"అవును పోలీసోడు పొయ్రటీ చెప్పినట్టు...కాంట్రాక్టరు కలాపోసన చేసినట్టు ఉంది...నీకు క్రైం సీనులో పెయింటిగులు కనబడుతున్నాయంటే నీది గొప్ప కళాహృదయమోయ్"

"థాంక్యూ సార్....నాకు చిన్నపుడు స్కూలు కవితలపోటీలో బహుమతులు వచ్చాయి...డిబేచింగ్...సారీ...డిబేటింగ్ అంటే వక్తృత్వపోటీలో కూడా చాలా కప్పులు కొట్టాసార్"

"అబ్బా....ఏం కవిత రాశావోయ్?"

"అందరూ పూలమీద...నదులమీద...అమ్మాయిలమీద కవిత రాస్తారు కద సార్"

"నాకు తెలిసి కాయితంమీద రాస్తారు"

"భలే చెప్పారు సార్... అంటే కవితా వస్తువు సార్ "

"కవిత రాయడానికి ఐడియా కావాలి,చదవడానికి లేదా వినడానికి ఓ చవలాయి కావాలి కాని సరుకులు,సామాన్లు, వస్తువులు ఎందుకయ్యా"

"సార్ వస్తువు అంటే థీమ్ సార్"

"ఆ....ఆ...నిజమే అదుండాలి"

"నేను గాడిదమీద రాశాను సార్"

"వండర్‌ఫుల్....అది చదవబోయేవాళ్ళని ముందే పసిగట్టావ్...అలాగే నువ్వు చేరబోయే ఉద్యోగాన్ని కూడా కనిపెట్టావ్"

"అదెలా సార్?"

"మనం చేసేది గాడిద చాకిరీ కాదుటోయ్...మనల్ని తోమినట్టు ఎవర్నయినా తోముతారా...మనకి వేళా,పాళా సమయం సందర్భం ఉంటాయా? జిన్నీ భూతం ఏ వెధవ తోమినా ప్రత్యక్షమయినట్టు మనం కూడా బందోబస్తని, ప్రొసెషనని, ఇలా కూనీలని, కిడ్నాప్‌లనీ ఏం జరిగినా ప్రత్యక్షమవుతాం...ఇంతగా మనల్ని వాడుకునీ అందరూ మనల్ని చివరికి అలానే చూస్తారు కదా...సరే..క్లూస్ టీం వచ్చేలోగా నీ కవిత కూసేయ్"

"ఆహా గాడిద గురించి అనగానే కుయ్యమని బలే అన్నారు సార్ ...మీది కళాహృదయం సార్"

“అవునవును... మేడమ్ కి ఎపుడూ కళామందిర్‌లోనే చీరలు కొంటాను... అపుడు తను కూడా ఇలానే అంటుంది...అవును గాడిదకవిత్వం వినేముందోమాట మీ ఏసీపీ, సీఐలు ఎక్కడా?”

“ఇద్దరూ కాంపస్ డ్యూటీలో ఓయూసిటీలో ఉన్నారు సార్...నేను డీయస్పైని... నేనే ఇన్‌చార్జి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌ని సార్”

“అద్భుతం...ఈ ఏరియాలో కవిత్వం చెప్పడానికి ఇప్పుడు నువ్వే అధారిటీ... కానీయ్”

“థాంక్యూ సార్...శవం చూడండి సార్ కళ్ళు తెరుచుకుని చూస్తున్నట్టే ఉంది... వయసులో ఉన్న అమ్మాయి..సార్...చంపడానికి చేతులెలా వచ్చాయో అదీ ఇంత కౄరంగా...ఇంకా కొనప్రాణం ఏదైనా ఉందంటారా సార్?”

“ఏమీ ఉన్నట్టులేదు....శవం గురించి మర్చిపో నువ్వు కవితా పఠనం కానీయ్”

“సార్ ఇలా శవం దగ్గర పంచనామా చెయ్యాలి కానీ..కవితా పఠనం చెయ్యొచ్చంటారా...నాది శవ సాహిత్యం అవదు కదా...”

“శవాలకి మాత్రం సాహిత్యం అవసరం లేదూ...అయినా శవాలగురించి రాస్తే శవ సాహిత్యమేమో కానీ వాటి సమక్షంలో చదివేది కాదు...నువ్వు కానీ”

డీసీపీ గారిచ్చిన ప్రోత్సాహంతో డీయస్పై రంగరాజు కవిత్వం...తాను స్కూలు రోజుల్లో అల్లింది బయటకు వదిలాడు

“గాడిద...పెడుతోంది అది ఓండ్ర

తిన్నాక మామిడి తాండ్ర

తాండ్ర తిన్న వాడెల్లా తాండ్ర పాపడు కాదు

పాపమన్నదెరుగనిదియే గాడిద

కోపమన్నది ఎరుగని వాడే విశారద”

డీసీపీ పునీత్ బిగుసుకు పోయాడు..అయితే ఫాక్షన్ ఏరియాలో పనిచేసి ఎన్నో కూనీలు చూసిన గట్టి పిండం కాబట్టి తట్టుకున్నాడు...నిలదొక్కుకుని

“చాలా బావుందోయ్... ఇందాక ఏదో అనుమానం పడ్డావుచూడు... ఆ ఆడశవంలో ఇంకా ప్రాణమేమైనా ఉందేమో అని..ఒకవేళ ఉంటేగింటే ఈ దెబ్బకి ఎగిరిపోయిఉంటుంది...నౌ ఐ డిక్లేర్ హర్ క్లినికల్లీ డెడ్” అన్నాడు

“తమరి అభిమానం సార్” అన్నాడు రంగరాజు వినయంగా

"పద ...ఓ కాయితం తీసుకుని క్రైం సీన్ స్కెచ్ వేయి...మెజర్‌మెంట్సు తీసుకో" అన్నాడు పునీత్

"యస్సార్...చూశారా సార్..మనపనిలో ఎన్ని ఫైన్ ఆర్ట్సు ఉన్నాయో..క్రైం సీను డ్రాయింగ్ వేస్తాము" అన్నాడు రంగరాజు ఆ పనిలో పడుతూ

★ ★ ★

లకడీకాపూల్ లో అశోకాహోటల్ దాటాక, పెట్రోల్ బంక్ పక్కనుండి లెఫ్ట్ టర్నింగ్ తీసుకుంటే ఓ మెట్ట వస్తుంది..ఆ సందులో పైకి వెళ్తే కుడివైపు చర్చి ఎడమవైపు కొన్ని అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. అవి కూడా దాటి పైకి వెళ్తే కుడివైపు డెడ్ ఎండ్. అక్కడ పాత ఇంటిని కూల్చేసి కొత్తగా అపార్ట్‌మెంట్లు కట్టారు.

మొత్తం అయిదు ఫ్లోర్ల బిల్డింగ్ అది.ప్రతీ ఫ్లోర్‌కీ నాలుగు చొప్పున అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. అన్నీ రెండు బెడ్‌రూంలవే. దాదాపు పధ్నాలుగువందల చదరపు అడుగులు ఉంటుంది ఒకో అపార్ట్‌మెంట్. ఓ హాల్, దాన్ని ఆనుకుని చిన్న డైనింగ్ హాల్, డైనింగ్ హాల్‌నుండి ఓ వైపు రెండు బెడ్‌రూంలు, మరోవైపు కిచెన్.

శవం మెయిన్ హాలులో పడిఉంది. రక్తం ఏదో పెయింటింగ్‌బ్రష్‌లో ముంచి తీసివిదిలించినట్టుగా గోడలమీదఉంది. ట్రాక్ ఆఫ్ బ్లడ్ బెడ్‌రూం నుండి డైనింగ్ హాలుకి మళ్ళా అక్కడ్నించి మెయిన్ హాలుకి ఉంది.

"అంటే...హతురాలు బయటకి పరిగెత్తి తనని తాను రక్షించుకునే ప్రయత్నం చేసింది సార్" అన్నాడు రంగరాజు డీసీపి వెంట నడుస్తూ

కవిత్వం చెబుతాడన్నమాటే తప్ప ప్రొఫెషనల్ స్కిల్ అతడిలో చాలా ఉంది.

"హంతకుడు..ఆమెకి పరిచయమైనవాడు...ఇంకా చెప్పాలంటే ఆమెతో శారీరక సంబంధం కూడా ఉన్నవాడు అయిఉండాలిసార్"

"హంతకుడు మగవాడే ఎందుకు అవ్వాలి? స్త్రీ కూడా అయిఉండొచ్చు కదా?" అన్నాడు డీసీపి పునీత్

"కాదు సార్...ఈ సిగరెట్ ట్రే చూడండి...ఇందులో రెండు బ్రాండ్‌ల బట్స్ ఉన్నాయి..ఒకటి ఆడవాళ్ళు కాల్చే లైట్స్. మరొకటి మగవాళ్ళు కాల్చే గోల్డ్‌ఫ్లాక్ కింగ్.. కాబట్టి ఒక ఆడ ఒక మగ స్మోకర్స్ ఇక్కడ హత్య జరిగే ముందు గడిపారు అని చెప్పవచ్చు"

"ఓకే...ఒకవేళ హతురాలు స్మోకింగ్ చెయ్యదు అనుకుందాం...అపుడు ఆమె స్నేహితురాలూ, స్నేహితుడూ వచ్చారు..ఇద్దరూ స్మోక్ చేశారు..ఆ తర్వాత గొడవ

జరిగింది ఆముగ్గురి మధ్యా...అపుడు ఆ ఇద్దరూ ఈమెను చంపేసి వెళ్ళిపోయి ఉండొచ్చు కదా?"

"అది కాకపోవచ్చు సార్...ఎందుకంటే హత్య బెడ్‌రూంలో మొదలై హాలులో పూర్తయింది. మీ థియరీ ప్రకారం ఒక ఆడ ఒక మగ ఇక్కడికి వస్తే గొడవ ముగ్గురి మధ్యా జరిగితే హాలులోనే హత్య జరగాలి...మీరు చెప్పిన ఆ మూడో మనిషి స్త్రీ అయితే ఆమె ఇక్కడ ఒంటరిగా ఎందుకు కూర్చుంటుంది? ఆమెను ఇక్కడ కూర్చోపెట్టి వాళ్ళు బెడ్‌రూంలోకి వెళ్ళరు కదా"

"నిజమేనయ్యా...రంగరాజూ ...అయితే ఇక్కడికి ఖచ్చితంగా ఓ స్మోకర్ అదీ మగాడు వచ్చాడు.. బహుశా అతడే ఈ హత్య చేసి ఉంటాడు"

"ఇంకో విషయం సార్....హత్యాయుధం బయటినుంచే తెచ్చింది...అదికూడా బుచర్‌నైఫ్ లాంటిది అయిఉండాలి....ఆ అమ్మాయి ఒంటిమీద గాయాలు చూడండి చాలా షార్ప్‌గా, పొడవుగా ఉన్నాయి"

"హత్యాయుధం ఎక్కడ?"

"మిస్సింగ్ సార్"

ఆ అమ్మాయిని మరోసారి పరిశీలనగా చూశాడు డీసీపి పునీత్.

తెల్లగా మిసిమి ఛాయలో ఉంది.ఎత్తు సుమారుగా ఐదడుగుల ఆరంగుళాలు ఉండొచ్చు. డైటింగ్ చేస్తున్నట్టు స్లిమ్‌గా,సన్నగా ఉంది. పొడవాటి కాళ్ళు, పెడిక్యూర్ ఇంకా వాక్సింగ్ చేసినట్టు చాలా నున్నగా ఉన్నాయి. తొడలపై ఉండే సన్నని నూగులాంటి వెంట్రుకలు కూడా లేవు. కాలిగోళ్ళకి చెర్రీరెడ్ నెయిల్‌పాలిష్‌ఉంది. సేమ్ పాలిష్ చేతిగోళ్ళకి కూడా ఉంది.

నడుంనుంచి, అంటే బొడ్డుకిందనుండి చిన్న డెనిమ్ మినీ వేసుకునిఉంది. పైన చిన్న టాప్ పింక్ కలర్‌ది వేసుకుంది. మెడలో డైమండ్ పెండెంట్ ఉన్న లాంగ్ చెయిన్ ఇంకా షిర్డీ సాయి లాకెట్ ఉన్న చిన్న నెక్ చెయిన్ ఉన్నాయి.

మెడమీద నరికినట్టు ఉన్నాడు తెగిపోయిఉంది. చేతులు అడ్డంపెట్టినట్టు ఉంది చేతులు తెగి ఉన్నాయి. పొట్టమీద, తొడలమీద, ఛాతీమీద గాయాలున్నాయి.

"సార్...ఇది సెక్సువల్ జెలసీతో చేసినట్టుంది...ఇంత చిన్న పర్సనాలిటీని చంపడానికి అన్ని కత్తి పోట్లు అవసరమా? అదీ కత్తి దూసినట్టు ఉంది తప్ప పొడిచినట్టు లేదు. పొడిస్తే గాయం లోపలికి పెనిట్రేట్ అవుతుంది. ఎక్స్‌టర్నల్ ఇంజురీ అందునా ఎంట్రీ ఆఫ్ ఊండ్ చిన్నగా ఉంటుంది...ఇది చూడండి సార్

గాయాలు చాలా పొడవుగా ఉన్నాయి...గీతలు గీసినట్టుగా" అన్నాడు రంగరాజు

"నువ్వన్నది నిజమే అనిపిస్తోంది...మెడలో విలువైన డైమండ్ చెయిన్‌ఉంది. ఇంకో గోల్డ్ చెయిన్ ఉంది...చెవులకి డైమండ్ స్టడ్స్ ఉన్నాయి...వాటిని హంతకుడు తీసుకువెళ్ళలేదు అంటే మోటివ్ డబ్బు కాదు...ఇది మర్డర్ ఫర్ గెయిన్ కాదు.... కక్షతో చేసిన హత్యలానే ఉంది" అంగీకరించాడు డీసీపి పునీత్

"కానీ ఆ చెవుల దగ్గర చూడండి సార్...రక్తం అంటి ఉంది....అది చెవుల నుంచి కారిన రక్తం కాదు...రక్తం అంటిన చేత్తో ముట్టుకున్నాడు సార్...అంటే అవి తెంపుకుపోదామనుకుని ఇంతలో ఎవరేనా వస్తే వెళ్ళిపోయాడంటారా?"

"మేబీ...మేనాట్ బీ....ఇందులో ఎమోషన్...ప్లానింగ్ రెండూ కనపడుతున్నాయి.. పద మిగతా ఫ్లాట్ చూద్దాం"

చాలా సింపుల్‌గా ఉంది ఆ ఫ్లాట్. హాల్లో శవం పడిఉన్న సోఫాసెట్, ఇంకా టీపాయ్, దానిమీద యాష్‌ట్రే, టీపాయ్ పైన రక్తంచిందిన వోవ్ మాగజైను మినహా మరేమీ లేవు.

డైనింగ్ హాల్లో డైనింగ్ టేబుల్...బెడ్‌రూంలో బట్టలు... ఒక రాక్‌లో కండోమ్స్... రక రకాల కంపెనీలవి...

"నువ్వన్నది నిజమే రంగరాజు...ఈమెకి యాక్టివ్ నైట్‌లైఫ్ ఉన్నట్టుంది" అన్నాడు డీసీపి

"అవును సార్...ఈమధ్య ఎయిడ్స్ వ్యాప్తి తగ్గినట్టు పేపర్లో చదివాను...చికిత్సలేదు... నివారణే మార్గం అన్న నినాదం ఇంతలా వ్యాపిస్తుందనుకోలేదు...ఇప్పటికి ఆ వార్తకి ఆధారం దొరికింది" అన్నాడు రంగరాజు

"ముందు సెల్‌ఫోన్... ఈ అమ్మాయి సెల్ ఫోన్ ఎక్కడుందో వెతుకు" అన్నాడు డీసీపి పునీత్

ఆ బెడ్ రూంలోనే ఓ మూల పడి ఉంది బ్లాక్‌బెర్రీ సెల్‌ఫోన్

అదే బెడ్‌రూంలో ఓ లాప్‌టాప్...సోనీ లేటెస్టు సిరీస్ ది ఉంది. దానికే ఇంటర్నెట్ పెన్ డ్రైవ్.

ఇంతలో క్లూస్ టీం వచ్చింది. ఫింగర్ ప్రింట్సు తీసుకోవడం కోసం వాళ్ళుపొడర్లు జల్లుతున్నారు. సాలోఫిన్ టేప్ మీదికి ప్రింట్స్ లిఫ్టు చేస్తున్నారు. ఫోటోగ్రాఫులు తీసుకోవడం...పంచనామా మెదలైన రొటీన్ కార్యక్రమాలు పూర్తి అయ్యాయి.

టీవీ విలేకరులు గొట్టాలు పట్టుకుని, కెమెరాలు చేతబూని దండయాత్ర చేశారు...

"నగరం నడిబొడ్డులో హత్య....నగరంలో మరో మహిళ హతం....లకిడీకాపూల్ లో లడికీ కతం..." అని స్క్రోలింగులు మొదలయ్యాయి. కాసేపట్లోనే ఏదో పొలిటికల్ డవలప్‌మెంట్ రావడంతో అవి ఆగాయి

★ ★ ★

"అసలా అమ్మాయి పేరు ఏంటి? మిగతా వివరాలు చెప్పు రంగరాజు" అడిగాడు పునీత్

"సార్ ... తన పేరు దివ్య...వయసు పంతొమ్మిది...ఓ యంయన్సీ కాల్‌సెంటర్లో పని చేస్తూంది..నేటివ్ ప్లేస్, తల్లిదండ్రుల వివరాలు తెలియదు..ఆ ఫ్లాట్ తన స్వంతం..." చెప్పాడు రంగరాజు

"తన ఇన్సూరెన్సు పేపర్సు అవీ చూడు వాటిల్లో ఉంటాయి నామినీ డిటెయిల్స్.. అడ్రస్ ఫర్ కమ్యూనికేషన్ లో తన నేటివ్ అడ్రస్ ఉండొచ్చు...ఇవి రేపుచేసుకోవచ్చు.. పోస్టుమార్టం అయ్యేలోపు అవి సంపాదిస్తే క్రిమేషన్ కోసం బాడీ అప్పగించవచ్చు" అన్నాడు పునీత్

"అది సరే...ఇంత రాత్రిపూట మర్డర్ జరిగిందని చూసిచెప్పినవాడు ఎవడు? వాడికి ఊళ్ళో ఎక్కడ కూనీలు జరుగుతయ్యో చూసి చెప్పడమే పనా లేక హాబీనా?" అడిగాడు మళ్ళా

"లేదు సార్ ....అతను తర్డ్‌ఫ్లోర్లో ఉంటాడు...లిఫ్టు పనిచేయడం లేదు....అందుకే అతను మెట్లమీదుగా ఎక్కుతూ ఉన్నాడు...దివ్య ఉన్న అపార్ట్‌మెంటు మెయిన్ డోరు మెట్ల పక్కగా ఉంది...డోర్ తెరుచుకుని ఉండటంతో తొంగిచూశాడు... సోఫాలో శవాన్ని చూడగానే భయపడి కంట్రోల్‌రూమ్ నంబరు హండ్రెడ్ కి డయల్ చేశాడు... అలా వచ్చింది సమాచారం" అన్నాడు రంగరాజు

"అలా అయితే...హంతకుడు ఇతడికంటే ముందుగానే వెళ్ళిపోయిఉండాలి...లిఫ్టు పనిచేయడం లేదు కాబట్టి అతడు అలా వెళ్ళే అవకాశం లేదు. ఇతడు ఎవరినైనా చూశాడా మెట్లు దిగుతుండగా?"

"లేదు సార్ ..నేను అడిగాను...అతను ఎవర్నీ చూడలేదు....అంటే హంతకుడు ముందే వెళ్ళిపోయి ఉండాలి"

"వీడు లోపలికి వెళ్ళి చూశాడా?"

"లేదు సార్...తన అపార్ట్‌మెంటుకి వెళ్ళి ఫోన్ చేశాడు...లోపలికి వెళ్ళలేదు"

"హంతకుడు అప్పుడు లోపల ఉండి, ఇతడు హత్య చూసి వెళ్ళిన తర్వాత

మెట్లుదిగి వెళ్తే అప్పుడు ఇతడు హంతకుడిని చూసే అవకాశం లేదు...కింద వాచ్‌మేన్ ఉంటాడు కదా...అతడ్ని ఎగ్జామిన్ చేయి"

"అలాగే సార్"

"మొబైల్ కాల్ లిస్టు తీసుకో...లాప్‌టాప్ తీసుకురా అది చూద్దాం..అలాగే సెల్ పని చేస్తుంటే దాన్ని ఆన్ లో ఉంచు....లాస్ట్ కాలర్ ఎవరో చూడు.."

"ఇరవైనాలుగు గంటల్లో హంతకుడ్ని పట్టుకుందాం సార్"

"మనమేమన్నా ట్వంటీఫోర్ అవర్స్ మెడికల్ షాపు నడుపుతున్నామా లేక పిజ్జా సెంటర్ నడుపుతున్నామా....ఈ డెడ్‌లైన్ ఎవడయ్యా పెట్టాడు...ఫాన్సీ మాటలు వదిలేసి పని చూడు"

★ ★ ★

మర్నాడు పేపర్లలోని లోకల్ క్రైమ్‌లో ఈ హత్య ప్రముఖంగానే వచ్చింది. చిలవలు పలవలుగా రాశారు. దివ్యకు చాలా మంది బాయ్‌ఫ్రెండ్స్ ఉన్నారనీ, పబ్‌ల కి వెళ్ళేదనీ ఆమె విశృంఖల జీవనశైలి వల్లే ఆమె హత్యకు గురయి ఉండొచ్చనీ పోలీసువర్గాలు అనుకుంటున్నారనీ రాశారు.

ఆఫీసుకు వెళ్లిన తర్వాత రంగరాజుని పిలిపించాడు పునీత్

"లాస్ట్‌కాల్ ఈ నంబర్‌నుండి వచ్చింది సార్...ఇది రాజేంద్ర నారాయణ అనే వాడి నంబర్...ఈ కాల్ రాత్రి ఎనిమిది అయిదు కి వచ్చింది..ఇది రిసీవ్‌డ్ కాల్. మూడు నిముషాలు మాట్లాడింది...హత్య చూసిన వాడు మనకి రిపోర్ట్ చేసింది ఎనిమిది ముప్పైఆరుకి. అంటే హత్య ఎనిమిది పది నుండి ఎనిమిది నలభై మధ్య జరిగి ఉండాలి" అన్నాడు రంగరాజు

"బావుంది...ఇంకా ఏమైనా కాల్స్ ఉన్నాయా?"

"దానికి ముందు.. ఓ కాల్ ఉంది సార్ ...అదికూడా ఇన్‌కమింగ్ కాలే.. ఏడు గంటలయాభైఅయిదునిముషాలకి..పేరు తనఫోన్ డైరెక్టరీలో లేదు"

"ఓకే...మిస్స్‌డ్ కాల్స్ ఏమైనా ఉన్నాయా?"

"నాలుగు ఉన్నాయి సార్.. ఒకే నంబర్ నుండి... కానీ దివ్య సెల్‌లోని డైరెక్టరీ లో పేరు సేవ్ చేసి లేదు.. కాబట్టి ఎవరో అంత రెగ్యులర్ కాలర్ కాదనితెలుస్తోంది" అన్నాడు రంగరాజు

"ఎనీవే....ఆ నెంబరు ఎవరిదో కూడా తెలుసుకో....వాచ్‌మాన్‌ని ఎగ్జామిన్ చేశావా?"

"యస్సర్...ఎవరో ఇద్దరు కారులో వచ్చి దివ్యఫ్లాటుకి వెళ్ళడం చూశాడట...చూస్తే గుర్తుపడతానంటున్నాడు"

"ఏ టైంలో వచ్చారు వాళ్ళు"

"వాడు టైం చూసుకునే పరిస్థితిలో లేడు సార్... రాత్రి సుబ్బరంగా తాగి పడుకున్నాడు...వాడ్ని మర్డర్ చేసినా తెలుసుకునే పరిస్థితిలో లేడు"

"సరే ....ఆ లాస్ట్ కాలర్ ఎవడు వాడు?"

"రాజేంద్ర నారాయణ సార్"

"ఆ...వాడ్ని తీసుకురా...లాప్ టాప్‌మీద ఏమైనా ఫింగర్ ప్రింట్సు దొరికాయా?"

"ఒకే రకం ఉన్నాయి సార్...మోస్ట్‌లీ హతురాలివే అంటున్నాడు ఎక్స్‌పర్టు"

"మంచిది...అయితే అది ఎక్జిబిట్‌గా చూపక్కర్లేదు...ఇక్కడికి తీసుకరా..నేను ఓపెన్ చేస్తాను..అందులో ఏమైనా వివరాలు దొరకవచ్చు...మనవాళ్ళేమీ దాన్ని కెలకలేదుకదా"

"లేదు సార్ అది నా పర్సనల్ కస్టడీలో ఉంది...ఇపుడే తీసుకువస్తాను"

★ ★ ★

దివ్య లాప్‌టాప్ ఓపెన్ చేశాడు డీసీపీ పునీత్...పాస్‌వర్డ్ ప్రొటెక్షన్ ఉన్నా ఆమె ఆ ఆప్షన్ వాడుకోకపోవడంతో అతడిపని తేలికఅయింది.

ఆమె మోజిల్లా ఫైర్‌ఫాక్స్ వెబ్ బ్రౌజర్ వాడుతోంది. దాంట్లో అలాగే గూగుల్ క్రోమ్‌లో పాస్‌వర్డ్‌లు సేవ్‌చేసుకునే అవకాశం ఉంది. అదే అతడికిపుడు బాగా పనికొచ్చింది.

హిస్టరీ పేజీలు ఓపెన్ చేశాడు. ఆమె చరిత్ర అంతా చాటింగే. అన్నీ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లే ఉన్నాయి. ఫేస్‌బుక్, ట్విట్టర్, బాచ్‌మేట్స్, హైఫై ఇలాంటివాటిల్లో ఎకవుంట్స్ ఉన్నాయి...అన్నీ లాగిన్ యూజర్‌నేమ్, పాస్‌వర్డ్ సేవ్‌చేసి ఉన్నాయి.

అస్తమానం వాటిని వాడేవాళ్ళే అలా సేవ్ చేసి వదిలేస్తారు. ఎపుడైనా ఓసారి ఆ సైట్ విజిట్ చేసేవాళ్ళు  అలా చెయ్యరు.

వాటిల్లో లాగిన్ అయిచూశాడు...అతడి భృకుటి ముడిపడింది..రంగరాజు చెప్పిన పేరు గుర్తుకు తెచ్చుకున్నాడు ఆఖరి కాల్ చేసినవాడు రాజేంద్ర నారాయణ

రాజేంద్ర నారాయణ కు ఫ్రెండ్స్ రామ్,సుధాకర్...ఆమెకున్న అనేకమంది బడ్డీస్ లిస్టులో ఈ పేర్లు ఉన్నాయి, వాళ్ళ ప్రొఫైల్ ఫొటోలు ఉన్నాయి. పైగా ముగ్గురూ ఒకే

కంపెనీలో చేస్తున్నారు.

దివ్య ఫోటో ఆల్బమ్ ఓపెన్ చేశాడు...చాలా మంది మగవాళ్ళు, ఆడవాళ్ళతో ఆమె దిగిన ఫోటోలున్నాయి..డిన్నర్..అవుటింగ్...కాంపింగ్...చాలా సన్నిహితంగా ఉన్నవి.

దీని దుంపతెగా స్నేహమేరా జీవితం...స్నేహమేరా శాశ్వతం అని నిప్పులాంటి మనిషి సినిమాలో సత్యన్నారాయణ షేర్‌ఖాన్ పాత్ర ఫిలాసఫీని ఈమె పూర్తిగా పాటిస్తున్నట్టుంది అనుకున్నాడు పునీత్

అపుడు రామ్, సుధాకర్, రాజేంద్ర నారాయణల ప్రొఫైల్ ఫోటోలు ఉండటంతో అవి ప్రింటవుట్ తీసి రంగరాజుకి ఇవ్వడం, అతడు తన కీచుమనే జీపుతో సైబరాబాద్ దూసుకుపోవడం జరిగాయి.

★ ★ ★

"మీరు ఈ హత్య చేశారని నాకు తెలుసు....టైం వేస్ట్ చెయ్యకుండా నిజం చెప్పు...నువ్వు చేసి ఉండకపోవచ్చు ఆ ఇద్దర్లో ఎవరో నాకు చెప్పు నేను నీకు సాయం చేస్తాను...నువ్వు అప్రూవర్‌గా మారితే శిక్ష కూడా పడకపోవచ్చు" అన్నాడు డీసీపి పునీత్ రామ్‌తో

"మేమే హత్య చేస్తే, హత్య జరిగిన పధ్నాలుగు గంటల తర్వాత కూడా పారి పోకుండా మీరు ఎప్పుడు వస్తారా అని ఎదురు చూస్తూ ఆఫీసులో ఉండము కదా సార్?" అడిగాడు రామ్

"హత్య ఖచ్చితంగా పధ్నాలుగు గంటల ముందే జరిగిందని నీకెలా తెలుసు?"

తూటాలా దూసుకు వచ్చింది ప్రశ్న

# 2

"ఎందుకంటే నిన్న సాయంత్రం నేను ఆమె ఫ్లాట్‌కి వెళ్ళాను కాబట్టి" చాలా చల్లగా చెప్పాడు రామ్

కట్టా రంగరాజు మొహంలో ఆనందం కనిపించింది. ఇంత తేలిగ్గా ఈ కేసు తెమిలిపోతుందనుకోలేదు. నేరగాళ్ళందరూ ఇంతగా సహకరిస్తే, తాము చేసిన తప్పు ఒప్పేసుకుంటే తమ పని ఎంత తేలిక అవుతుంది. ఎలాగూ తాము పట్టుకుంటారు. తమకి శ్రమ తగ్గిస్తే వీళ్ళ సొమ్మేం పోతుందో అనుకున్నాడు.

"గుడ్...అయితే ఆమెనెందుకు చంపావు?" అడిగాడు రంగరాజు

"ఆమె ఫ్లాట్‌కి వెళ్ళినవాళ్ళందరికీ ఆమెను చంపడం తప్ప వేరే పనేమీ ఉండదా?" అన్నాడు రామ్.

అప్పుడుకానీ తనెంత తెలివి తక్కువ ప్రశ్న అడిగాడో అతడికి తెలియలేదు.

"ఓహో... ఆమెని చంపడం కాకుండా మరో పని ఏమిటో... ఆమెని రక్షించడమా" అని అడగబోయి తమాయించుకున్నాడు.

"నిన్న సాయంత్రం నేను ఓ ప్రోగ్రామ్‌లో ఉండగా సుధాకర్ నుండి ఫోన్ వచ్చింది...తను చాలా డిప్రెస్‌డ్ గా ఉందనీ...సినికల్‌గా ఏదో మాట్లాడుతుందనీ చెప్పాడు... ఓసారి మాట్లాడదామని అన్నాడు.. ఇద్దరం కలిసి వెళ్ళాం...ఓ పదినిముషాలు మాట్లాడాం... తనకి ఫోన్‌లు వస్తూనే ఉన్నాయి...సరే..నాకిపుడు టైంలేదు...మరోసారి మాట్లాడదాం అని మమ్మల్ని పంపించేసింది...రాత్రి నుండి ఇప్పటికి పధ్నాలుగు గంటలపైనే సమయం గడిచింది..నేనుగానీ సుధాకర్ గానీ ఈ హత్యచేస్తే ఇక్కడే ఉండం కదా? పైగా ఆమెను హత్య చేయాల్సిన అవసరం మాకు లేదు" అన్నాడు రామ్

"అక్కడ నుండి ఎక్కడికి వెళ్ళారు? నువ్వు ఇంకా సుధాకర్" అడిగాడు పునీత్

"నన్ను రవీంద్రభారతిలో దింపేసి తను తన ఫ్లాట్‌కి వెళ్ళిపోయాడు"

" మీరిద్దరూ అక్కడికి వెళ్ళింది ఎన్నింటికి?"

"సుమారుగా ఎనిమిదింటికి"

"రవీంద్రభారతిలో నీకేం పని?"

" రాత్రి ఇంగ్లీష్ డ్రామా ఉంటే చూడ్డానికి వెళ్ళాను"

"ఒక్కడివేనా?"

"కాదు...ఫ్రెండ్‌తో"

"ఎవరతను? ఏం పేరు...ఏం చేస్తుంటాడు?"

"అతనుకాదు...ఆమె..ప్రీతి..మేంచేస్తున్న ప్రాజెక్టుకి వాళ్ళ కంపెనీ యల్అండ్‌టీ నుండి సాఫ్ట్‌వేర్ సబ్ కంట్రాక్టర్...వాళ్ళనుండి మేం సబ్ కాంట్రాక్ట్ చేస్తున్నాం..తను క్వాలిటీ సూపర్‌వైజ్ చేస్తుంది..ఇంకా కోఆర్డినేషన్ చేస్తుంది" చెప్పాడు

"అమ్మ సాఫ్ట్‌వేర్ నాకొడుకులు...లైఫ్ ఎంతలా ఎంజాయ్ చేస్తున్నారో...ఒకదాన్ని డ్రామాలో కూర్చోపెట్టి ఇంకోదాన్ని ఓదార్చడానికి వెళ్ళాడంటే వీడు మామూలు ముదురుకాదు... దేశముదురు" అనుకున్నాడు రంగరాజు లోపల్లోపల. డీసీపి

ఉన్నాడని ఆగాడు కానీ లేకపోతే పైకే అనేవాడు

"సరే వెళ్ళి కూచో...ఆ సుధాకర్ ని పిలవండి" అన్నాడు పునీత్

రామ్ ఆ గదినుండి వెళ్ళగానే " సార్ ముగ్గుర్నీ విడివిడిగా కూర్చోపెట్టా...ఒకరితో ఒకరు మాట్లాడుకునే అవకాశం లేదు...కానీ సార్..నాకు ఎందుకో వీడే హంతకుడు అనిపిస్తోంది సార్.. నా అనుభవంతో చెబుతున్నా...వీడు ఎర్రగులాబీలు సినిమాలో కమల్ హసన్ సార్....అమ్మాయిలను వెయిటింగ్ కాల్‌లాగా హోల్డ్‌లో పెట్టి మరో అమ్మాయిని లైవ్ లో పెట్టి...అబ్బబ్బ...నాకు గట్టి ఫీలింగ్ సార్ వీడే హంతకుడు" అన్నాడు రంగరాజు డీసిపితో

"రంగరాజు... ఎప్పటి ఎర్రగులాబీలు...ఎప్పటి కమల్ హసన్? అతని కూతురు శృతి హసన్ కూడా హీరోయిన్ అయి డ్యూయెట్లు పాడుతోంది.. నువ్వు కొంచెం అప్‌డేట్ కావాలి"

"అలా అనకండి సార్...కమల్‌హసన్ కూతురు హీరోయిన్ కావచ్చు. కానీ కమల్ ఇంకా హీరోనే కదా సార్...మన్మథ బాణంలో త్రిష పక్కన వేశాడు కదా సార్.... అలాగే హత్యలు కూడా నిత్య నూతనం సార్" అన్నాడు

"సరేలే ముందు ఆ ఇద్దర్నీ కూడా విచారించనియ్యి..ఈలోగా రామ్ స్టేట్‌మెంట్ తీస్కో.. వీళ్ళ అడ్రస్‌లు తీసుకుని ఇమీడియట్ గా వీళ్ళ ఆఫీసు, ఇళ్ళు థరోగా సెర్చ్ చేయించు...మన అదృష్టం బావుంటే హత్యాయుధం, రక్తంతో తడిచిన బట్టలు దొరుకుతాయి" అన్నాడు డీసిపి

★ ★ ★

సుధాకర్ కూడా రామ్ చెప్పిన విషయాలే చెప్పాడు. తను లోయర్ టాంక్‌బండ్‌లో ఉన్న ఫ్రెండ్ దగ్గరికి వెళుతుంటే దివ్యనుండి ఫోన్ వచ్చిందని, ఏదో అప్‌సెట్ అయినట్టు, డిప్రెషన్‌లో ఉన్నట్టు మాట్లాడిందని కాస్త కౌన్సిలింగ్ చేస్తే మంచిదనిపించి రామ్‌ని పిలిచానని కలిసి వెళ్ళామని చెప్పాడు.

"నువ్వు రామ్‌ని ఎక్కడ పికప్ చేసుకున్నావు? అసలు నువ్వు పికప్ చేసుకున్నావా లేక రామ్ నిన్ను పికప్ చేసుకన్నాడా?" ఇందాక రామ్ చెప్పిన విషయాన్నే క్రాస్ చెక్ చేసుకోడానికి అడిగాడు పునీత్

మంచి ఇన్వెస్టిగేటర్ లక్షణం అదే. ఒకటే విషయం ఎన్నిసార్లు వినడానికి అయినా సిద్ధపడి ఉండాలి.

చిన్నచిన్న మిస్‌మాచెస్ పెద్దపెద్ద కేసుల్నికూడా అవలీలగా ఛేదిస్తాయి. ఆ

సహనం, ఓర్పులేక కొంతమంది ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్స్ మొరటు పద్ధతుల్ని అవలంబిస్తారు. అవి వెంటనే ఫలితాన్నిచ్చినట్టు కనపడినా చివరికి వాటివల్ల పెద్దగా ఉపయోగం ఉండదు. దెబ్బలు తట్టుకోలేక ఎవడైనా నేరం ఒప్పుకుంటాడు. కానీ నేరం చెయ్యడానికి కావల్సిన మోటివ్, నేరం చేశాడనడానికి కావలసిన సాక్ష్యాలు బలంగా ఉండవు. దాంతో కేసు తేలిపోతుంది.తాను కుకప్ చేసిన కథను డిఫెన్సు లాయరు తుత్తునియలు చేస్తుంటే పరిశోధన చేసిన అధికారి సిగ్గుతో తల దించుకోవల సి వస్తుంది.

ఒకరకంగా రామ్, సుధాకర్, రాజేంద్రనారాయణ అదృష్టవంతులే అనుకోవాలి. మొరటు పద్ధతుల్ని నమ్మే అధికారి అయితే ఈ పాటికి ఈ ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లనీ చాలా హార్డ్‌గా డీల్ చేసి నేరం ఒప్పించేవాడే.

అయితే ఈ ముగ్గుర్లో అసలు నేరస్తుడెవరో పట్టుకోవాలనేదే డిసిపి లక్ష్యం.

“నేనే తనని పికప్ చేసుకున్నాను సార్”

“ఎక్కడ?”

“రవీంద్రభారతి దగ్గర సార్”

“అప్పుడతనితో ఎవరున్నారు?”

“ఎవరూలేరు..నేను తనని బయట కలిసాను సార్”

“ఓకే.....”

“ఇతన్ని వెళ్ళి రాజేంద్రను రమ్మను”

సుధాకర్ వెళ్లిన తర్వాత రాజేంద్ర వచ్చి నిలబడ్డాడు.

“నిన్న సాయంత్రం ఎక్కడున్నావు?” అడిగాడు పునీత్

“ఇంట్లోనే ఉన్నాను.. నా భార్య వ్రతం చేసుకుంది. నిన్న ముత్తయిదువుల్ని పిలిచి వాయినాలు ఇచ్చాం”

“ఎవరెవరు వచ్చారో వాళ్ళపేర్లు, అడ్రసులు చెప్పు”

అతడు చెబుతూంటే రంగరాజు నోట్ చేసుకున్నాడు.

“అసలు నీకు దివ్య ఎలా పరిచయం? మీ ముగ్గురికి తను ఎలా పరిచయం చెప్పు” అన్నాడు పునీత్

అంతలో పునీత్ ఫోన్ మోగింది. అతడు కాల్ మాట్లాడి రంగరాజుతో “ నేను వెళ్లాలి.. సీపీగారు రమ్మంటున్నారు..ఇతడ్ని నువ్వు ఇంటరాగేట్ చేసి స్టేట్‌మెంట్

రికార్డు చెయ్యి... ఏమైనా బ్రేక్‌త్రూ ఉంటే నాకు ఫోన్లో చెప్పు" అని వెళ్ళి పోయాడు

"ఆ....చెప్పవయ్యా రాజేంద్ర నారాయణా...నువ్వు చూడబోతే ఏదో మంచివాడిలా ఉన్నావు...ఆ రామ్ గాడు చాలా గుండెలు తీసిన బంటులా ఉన్నాడు.. ఈ సుధాకర్‌గాడు వాడికి తోడుదొంగలా ఉన్నాడు...నువ్వయినా నిజం చెప్పు..నీకేం ఫర్వాలేదు..భయపడకు" అన్నాడు రంగరాజు

నిజంగానే రాజేంద్ర చాలా వినయంగా ఉన్నాడు. అకస్మాత్తుగా అతడ్నిచూస్తే ఏదో ప్రైవేటుకంపెనీలో గుమాస్తాలా ఉంటాడు. పట్టిచూస్తేకాని అతడు బ్రాండెడ్ బట్టలు వాడుతున్నాడు అన్నవిషయం తెలియదు. అతడి పర్సనాలిటీ అతడి ఖరీదయిన బట్టల్ని కూడా సామాన్యంగా కనిపించేలా చేస్తాయి. కొందరంతే...ఖరీదయిన బట్టలు వేసుకున్నా ఖరీదుగా ఉండరు. నానాపటేకర్ తనమీద తనే జోక్ చేసుకుంటాడు. నేను బెంజ్‌కారులో కూర్చున్నా డ్రైవర్‌లా ఉంటానే తప్ప ఎవరూ నన్ను ఓనర్‌నని అనుకోరు అని.

"అలాగే సార్...ఈ గొడవ చూస్తే సామాన్యంగా ఉన్నట్టులేదు...నాకు నవరంధ్రాల్లోంచి ఆవిర్లు వస్తున్నాయి. ఎపుడైనా కూనీలగురించి పేపర్లో చదవడం,టీవీల్లో చూడటం తప్ప ఇలా వాటిగురించి స్టేషన్లకి,కోర్టులకి తిరిగిన వంశం కాదండి మాది. మానాన్న గారు గొప్ప పండితుడు, ఆయన గురించి తెలీని వాళ్ళు మా చుట్టుపక్కల ఎవరూలేరు.

చెప్పుకుంటే సిగ్గుకానీ రామ్ అనేవాడు కూడా ఆయన శిష్యపరంపరే. గురువు యోగ్యుడైతే శిష్యులు యోగ్యులు కావాలని ఎక్కడ ఉందండి?

రామ్‌దీ మాదీ ఒకటే గ్రామం...కొవ్వూరు సమీపంలోని గ్రామం అండి. వాడు పేరుకు రాముడు...జాతకం మాత్రం నిత్యానందుడిది.

చిన్నతనంలోనండి....సాధారణంగా అమ్మాయిలని చూసి మనం ఆమడ దూరం పారిపోయే రోజుల్లో...." అని ఆగి అటుఇటు చూశాడు ఎవరైనా వింటున్నారేమో అని అనుమానంగా

తర్వాత " అయ్యా....నేను ఈ విషయాలు చెప్పినట్టుగా బయటకి వచ్చిందే అనుకోండి నాప్రాణాలకి మూడిందే...యమధర్మరాజుగారు నాకోసం తన దూతల్ని పురమాయిస్తారండి" అన్నాడు

"యములాళ్ళకి మేం అడ్డం వస్తాములేవయ్యా...మేంచెప్తే వాళ్ళు వెనక్కి వెళ్ళిపోతారు" నవ్వుతూ అన్నాడు రంగరాజు

"మహాప్రభువులు..ఏమైనా స్వజాతిధర్మం అనేది ఉంటుందిలెండి..మీరుచెబితే మారుమాటలేకుండా వారు వినాల్సిందే " అన్నాడు రాజేంద్ర వినయంగా.

అతడి వినయం చాటున అతడు వేసిన విట్టు కనపడలేదు రంగరాజుకి. అప్పటికే అతడికి రాజేంద్ర చాలాబాగా నచ్చాడు. అతడికి ఓ టీ కూడా పురమాయించాడు. కూర్చోడానికి కుర్చీ ఏర్పాటు చేశాడు.

"అయితే నేను అనుకున్నది దాదాపు నిజం కాబోతుంది...ఈ రామ్‌గాడు పెద్ద కరోడాగాడని నాకు ముందునుంచి కొడుతూనేఉంది. నీ ప్రాణాలకి నా ప్రాణాలు అడ్డు. నువ్వు చెప్పింది ఏదీకూడా ఈ నాలుగు గోడలుదాటి బయటకిపోదు. ఏం భయపడకుండా నిజం చెప్పు" అన్నాడు రంగరాజు

"అలాగే సార్...ఈ హత్య వాడు చేశాడు, లేదా ఇద్దరూ కలిసి చేశారు అని నేనుచెప్పను... నాకు అంత అధర్మం పనికిరాదు..నేను చూడనిదాన్ని చూసినట్టు చెబితే అబద్ధపుసాక్ష్యం చెప్పినట్లవుతుంది. రేపు నరకంలో గరుడపురాణం నిర్ణయించిన శిక్షకు నేను పాత్రుడినవుతాను...ఆ పాపం నాకు వద్దు...వాళ్ళగురించి నాకు తెలిసింది చెబుతాను..ఆతర్వాత మీరే నిర్ణయించుకోండి "

"అబ్బ...నువ్వెక్కడి సత్యకాలపుమనిషివయ్యా..ఇంత పాపభీతి అందరిలో ఉంటే మా డిపార్ట్‌మెంట్ అవసరమే ఎవరికీ ఉండదు... సరేచెప్పు" అన్నాడురంగరాజు టీతాగి సిగరెట్ వెలిగించుకుంటూ, అతడికి కూడా ఆఫర్ చేశాడు

"నాకు అలవాటు లేదండి" అన్నాడు రాజేంద్ర

"భయపడకోయ్....ఫర్వాలేదు కాల్చు, టీ తాగాక దమ్ముకొడితే ఆ మజానేవేరు"

"అలవాటులేదండి...మజా డ్రింక్ అయితే తాగుతాను కానీ ఈమజా నాకు వశపడలేదండీ"

అయితే అక్కడ హత్యాస్థలంలో ఉన్న సిగరెట్ పీక వీడిది కాదన్నమాట అనుకున్నాడు రంగరాజు

"మావాడు రామం ఉన్నాడే...వాడికి మదనకామరాజు అని పేరుపెడితే సరి పోయేదండి" అన్నాడు రాజేంద్ర

"వాడి ఫ్రెండ్ ఉన్నాడు వాడిపేరు ఏంటి?"

"జేమ్సు సుధాకర్ అండి"

"ఆ....వాడి పేరు మైకేల్ అయితే బాగుండేది...మైకేల్ మదనకామరాజు లాగా ఇద్దరూ కలిసి తిరిగేవాళ్ళు"

"సార్ మైకేల్‌మదనకామరాజులో నలుగురు కదండీ"

"అదే నేను చెప్పేది.. వాళ్ళ నాన్న వాడికేదో పేరుపెట్టాడు..దానిగొడవ మనకెందుకుకానీ అసలు విషయానికి రా"

"అలాగే సార్....మాఇద్దరిదీ ఒకటే ఊరు...ఇద్దరం కలిసే పెరిగాం...నేను రామం కంటే ఏడాదో ఏణ్ణర్ధమో పెద్దవాడిని. మాఊళ్ళో అతగాడికి మంచిపేరులేదు. దానికి కారణం చిన్నప్పటినుండీ వాడు చేసే చేష్టలే"

"నీలాటిరేవులో ఆడవాళ్లు స్నానంచేస్తుంటే బట్టలెత్తుకుపోయేవాడా?" అడిగాడు రంగరాజు

"లేదుసార్...బిందెలెత్తుకెళ్ళేవాడు...అవిఅమ్మి జీళ్ళు కొనుక్కుతినేవాడు... లేకపోతే ఏంటిసార్? మేటర్ అంత చిన్నదికాదు.. మీకెంతసేపూ దొంగలగొడవే అనుకుంటా" విసుక్కున్నాడు రాజేంద్ర.

"అవునవును...నేనుకొంచెం డ్యూటీమైండెడ్‌లే...నువ్వుకానీ"

"ఊళ్ళో అలగావాళ్ళపాకలుంటాయా...అదేసార్ కూలీవాళ్ళపాకలు అక్కడికెళ్ళి నిలబడి వాళ్ళెలా ఉన్నారా అని చూసేవాడు. అంతటితో ఆగకుండా వాళ్ళకి నీళ్ళివ్వలేదని, రోడ్లువెయ్యలేదని వాళ్ళనాన్నని నానాతిట్లూతిట్టేవాడు... వాళ్ళనాన్న గ్రామానికి ప్రెసిడెంటులెండి...నీళ్ళు ఇవ్వాలని, రోడ్లు వెయ్యాలని వీడు చెప్పాలా? డబ్బులుంటే ఆయన చేయడా? అయినా వీడి హాజం వీడిది. రాజ్యకాంక్ష వీడికి చిన్నప్పట్నించే ఉంది.

ఇక వీడి అల్లరి పడలేక వాళ్ళనాన్న మా నాన్నగారి దగ్గరికి పంపారు బాగుపడమని. అయితే తాచెడ్డకోతి వనమెల్ల చెరిచే అన్నరీతిలో వీడు బాగుపడకపోగా నన్ను చెడగొట్టబోయాడు.

అంత చిన్నతనంలోనే, నాకన్నా చిన్నవాడైనా నాకు తెలీని విషయాలు వాడికి చాలా తెలుసు. అమ్మాయిల విషయాలైతే మరీను. మా ఊళ్ళో చాలామంది ఆడపిల్లలు పక్కన ఉన్న కొవ్వూరులోని హైస్కూలుకెళ్లి చదువుకునేవాళ్ళు....వాళ్ళకోసం వీడు మా ఊరి కాఫీహొటల్లో మాటువేసేవాడు..అక్కడ తనకి నచ్చిన ఆడపిల్ల ఏరంగు బట్టలు వేసుకుంటే వీడూ అవేరంగు వేసుకుని సిగ్నల్ ఇచ్చేవాడు.

ఆ పిల్లకి అర్ధంకావాలన్నమాట...అయ్యగారికి తాను నచ్చానని..తనుకూడా సిగ్నల్ ఇస్తే ఇక అంతే. కొంతకాలం ఆపిల్లతో చెట్టపట్టాలు వేసుకుని తిరిగేవాడు. ఆతర్వాత అర్ధంతరంగా వాళ్ళని వదిలేసేవాడు.

నా ఎరికలో ఓ పిల్ల ఉండేది. వాళ్ళది చాలా సాంప్రదాయమైన కుటుంబం. వాళ్ళకి ఒకత్తే పిల్ల. చిదిమిదీపం పెట్టుకోవచ్చు ఆపిల్లని చూస్తే. పరువుకి ప్రాణం ఇచ్చేకుటుంబం. ఆ పిల్లవెంట పడాలని ఊళ్ళో ఏ అప్రాచ్యుడు కూడా అనుకోలేదు. కానీ వీడు అనుకున్నాడు."

"అయితే ఇతడు ప్రాచ్యుడని మీ ఉద్దేశ్యమా" రంగరాజు అనుమానపడ్డాడు

"కాదు స్వామీ కాదు... అప్రాచ్యుడుకూడా సాహసించనిదానికి వీడు తెగబడగలడని నా ఉద్దేశం"

"Fools jump to trade where wisemen are afraid to go అన్న అర్థంలో మీరీ ప్రయోగం చేశారు కదా" చూడండి నేనెంత తెలివైనవాణ్ణో అన్నట్టుగా అన్నాడు రంగరాజు

అసలు తాను అన్నదానికి ఇతడు చెప్పిందానికి ఏం సంబంధమో రాజేంద్రకు అర్థం కాలేదు. కానీ పోలీసుల్తో గొడవ పడటం ఎందుకని " భలే పట్టేశారు సార్" అని కొనసాగించాడు.

"సరే... ఆపిల్లవెంట పడొద్దురా ఆమె నిప్పులాంటిది అని చెప్పాను...నేనే కాదు నా మిత్రుడు మంగారావు కూడా చెప్పాడు. వీడు వినలేదు. తావలచిందే రంభ, తా మునిగిందే గంగ అనేరకం వీడు.

ఆ పిల్ల వీడికి లొంగలేదు. ఆమె దృష్టిలో రామ్ ఓరౌడీ, జులాయి, ఆగమ్మకాకిలా తిరిగే ఓ ఆవారా. అయితే వీడి ఎత్తులకి, జిత్తులకి తిరుగులేదు. ఏంచేశాడో ఎరుగుదురా? ఆపిల్ల స్కూలుకి వెళ్ళి మా ఊరికి ఓ డొంకదారిగుండా తిరిగి వస్తూండగా వీడు ఇద్దరు జమాజెట్టీల్లాంటి రౌడీలని తాగబోసి పంపాడు. వాళ్ళు పూటుగా తాగేసి ఒంటరిగా వస్తున్న ఆ పిల్లని అల్లరిపెట్టారు. ఇంతలో వీడు ఆవెనుకే మాటువేసి అక్కడికి చేరుకున్నాడు. రౌడీలు పారిపోయారు. పెద్దరౌడీలతో పోలిస్తే వీడు నయమనుకుంది ఆ అమ్మాయి. వీడి మాయలో పడిపోయింది. అయినా పిచ్చిమాలోకం కాకపోతే అంతపెద్ద రౌడీలు ఈ పిట్టగాడిని చూసి పరిగెడతారా? అక్కడే తెలుస్తుంది దాని అమాయకత్వం.

ఆ తర్వాత ఆ పిల్లని వీడు తిప్పని చోటులేదు. స్కూల్లో, ఊళ్ళో ఎక్కడచూసినా వీళ్ళే. ఇదిచాలాకాలం సాగింది. ఆ పిల్ల తండ్రికి ఇతగాడంటే భయం. అందుకే ఇతగాడు ఇంటర్ చదవడానికి రాజమండ్రికి వెళ్ళిన కాలంలో గుట్టుచప్పుడు కాకుండా పెళ్ళిచేసి ఊరు దాటించేశాడు.

అలా ఓ పిల్ల వీడిబారినుండి బయట పడింది. వీడికి వత్తాసు ఆ సుధాకర్‌గాడు.

వాడోపెద్ద రౌడీ. కొవ్వూరులో జరిగిన అనేక దొమ్మీల్లో అతగాడి పాత్ర ఎంతైనా ఉంది. వీడికి వాడు రాజమండ్రిలో తారసపడ్డాడు.

రామం తండ్రిగారు ఎంతో మొత్తుకున్నారు. అటువంటి అయోగ్యులతో స్నేహం పనికిరాదు అని. నావంటి ఉత్తముడితో ఉండమని. వీడు వింటేకదా? ఈ ఇద్దరూ కలిసి కొవ్వూరు రైతుల పిల్లల్ని ఎంత యాష్టపెట్టేవాళ్ళనుకున్నారు?

ఇదీ ఇతగాడి గతం...ఇక వర్తమానానికి వస్తే..దివ్య చాలా దివ్యమయిన అమ్మాయి. తను చిన్న ఇంటినుండి వచ్చినా కష్టపడి ఉద్యోగం చేస్తూ పైకిరావాలనే తపన కలిగిన అమ్మాయి. సాఫ్టవేర్‌లో ఏ బ్రాంచిలో అయితే కెరీర్ బాగుంటుందో నేను గైడ్ చేసేవాడిని. తను మా ఆఫీసుకి ఇంటర్వ్యూ కోసం వచ్చింది. ఫ్రంట్ ఆఫీసులో ఎగ్జిక్యూటివ్ పోస్టుకోసం వచ్చింది. ఇంకా ఎకడమిక్స్ పూర్తిగా లేకపోవడం... అనుభవం తక్కువగా ఉండటంతో మేం తీసుకోలేదు. నేనే సాఫ్ట్‌వేర్ సైడ్ కాన్సంట్రేట్ చెయ్యమని సలహా ఇచ్చాను.

తను అప్పుడపుడూ మా ఆఫీసువైపు వచ్చేది. తనని పరిచయం చెయ్యమని రామ్, సుధాకర్ ఇద్దరూ నాపై వత్తిడి తీసుకొచ్చారు. ఒక ఊరివాళ్ళం, ఒకచోట పనిచేసేవాళ్ళం..మొహమాటంతో పరిచయం చేశాను. అంతే సార్ ఆ తర్వాత ఏం జరిగిందో నాకు తెలీదు" అన్నాడు రాజేంద్ర

"తను ఎప్పుడైనా వీళ్ళిద్దరిగురించి మీకు చెప్పిందా? ఇబ్బంది పెడుతున్నారనిగానీ వేరే ఏదైనా? ఎందుకంటే మాకు ఆ ఫ్లాట్‌లో దొరికిన ఆధారాలనుబట్టిచూస్తుంటే తను చాలా ఫ్రీక్అవుట్ టైప్ అమ్మాయిలా తెలుస్తోంది. వీళ్ళేమైనా ఆ అమ్మాయిని ఫోర్స్‌చేసి, అడ్వాంటేజి తీసుకోవడానికి ప్రయత్నించారని మీకెపుడైనా చెప్పిందా?" అడిగాడు రంగరాజు

"మీరుచెప్పేది నేను నమ్మలేకపోతున్నాను సార్...తనేమిటి ఫ్రీక్ అవుట్ టైపేమిటి? నాదగ్గర చాలా డీసెంట్‌గా బిహేవ్ చేసేది. కానీ మీరు అన్నట్టు వీళ్ళగురించి నాకైతే చెప్పలేదు. ఒకవేళ ఇబ్బంది పడినా నేను ఫీలవుతానని చెప్పకుండా ఉండే అవకాశం కూడా ఉందనుకోండి..అయినా పాపం, పుణ్యం పైవాడికెరుక...నేనెందుకు అన్యాయంగా మాట్లాడాలి? నేను చెప్పిన ఏ విషయం కూడా నేను అన్నట్టు పొరపాటున కూడా బయటకు రాకూడదు..అదొక్కటే నేను మిమ్మల్ని ప్రార్థించేది. మీకు ఏది కావాలన్నా ఉన్నది ఉన్నట్టు చెప్పడానికి నేను సిద్ధం" అన్నాడు రాజేంద్ర

★ ★ ★

"మీ విచారణ పూర్తయితే మేం వెళతాం...మెట్రో ప్రాజక్టుకి మేం డవలప్ చేస్తున్న సాఫ్ట్‌వేర్ చాలాముఖ్యం..త్వరలోనే ప్రధాని మొదటి ఫేజ్‌ని ప్రారంభించబోతున్నారు.. .. ఇప్పటికే డెడ్‌లైను అందుకోవడానికి కష్టంగా ఉంది...ఇంకా టైం వేస్టయితే చాలా ఇబ్బంది పడాల్సొస్తుంది" అన్నాడు రామ్ రంగరాజుతో

"అవన్నీ మాకు సంబంధంలేని విషయాలు... ఈ కేసు తేలే వరకూ మీరు బయటకు వెళ్ళడం కుదరదే"అన్నాడు రంగరాజు

"మమ్మల్ని మీ కస్టడీలో ఎలా ఉంచుకుంటారు? మమ్మల్ని అరెస్టు చెయ్యలేదు..ఈ హత్యతో మాకు ఎలాంటి సంబంధంలేదు..మీరు ఎప్పుడు రమ్మంటే అప్పుడు మేం వస్తాం..మేం సహకరిస్తున్నపుడు మమ్మల్ని పంపడానికి ఏంటి ఇబ్బంది?" అన్నాడు సుధాకర్

"ఇలా మాట్లాడితే నాలుగు తన్నేవాణ్ణి ఇంతకుముందు... మా డీసీపీకి ఇష్టం ఉండదు మేన్‌హాండ్లింగ్... అందుకే ఆగుతున్నా...మేం రమ్మన్నపుడు రావాలి...ఉండమన్నన్ని రోజులు ఉండాలి... అదే లా...అంతేగాని ఇలా రూల్స్ మాట్లాడకూడదు.... అదీగాక అసలు ఈ హత్య చేసింది మీరా కాదా అన్నది తేల్చాల్సింది మేం...మీరు సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చుకుంటే చాలదు" అన్నాడు రంగరాజు

"మేమే ఈ హత్య చేస్తే ఆమెఫ్లాట్‌కి వెళ్ళామని చెప్పాల్సిన అవసరం ఏమిటి? అది చెప్పకపోతే మీరెలా తెలుసుకునేవాళ్ళు?" అన్నాడు రామ్

"అదే మీ అతి తెలివి. వాచ్‌మేన్ ఇద్దరు వచ్చివెళ్ళారని,వాళ్ళని గుర్తు పడతానని చెప్పాడు. మీరు వచ్చివెళ్ళడం ఆ వాచ్‌మేన్ చూశాడన్న విషయం మీరూ గమనించి ఉండవచ్చు..అందుకే ముందుగా మీరే వప్పేసుకున్నారు. ఎలాగూ ఆ విషయం మీరు దాచలేరు కదా. ఆ విషయం చెబితే మేం మీరు అమాయకులమని నమ్ముతామని మీ ఆశ, అతి తెలివి...అంతకుమించి మరేమీ లేదు" అన్నాడు రంగరాజు.

"అంటే మీ ఉద్దేశం మేము ఇద్దరమూ ఆ హత్య చేసి, ఆపైన తాపీగా పిజ్జా తిని ఇంటికెళ్ళి పడుకుని, ఉదయమేలేచి చక్కా ఆఫీసుకి వచ్చి మా పని మేం చేసుకుంటున్నామనా? అసలు వినడానికి ఎంత ఇల్లాజికల్‌గా ఉందో మీరే ఆలోచించండి" అన్నాడు రామ్.

"ఎందుకు కాకూడదు? ఆ అమ్మాయి ఎవరో అబ్బాయిని ప్రేమించింది. అతడితో ఉంటుంది. మీరామెను లూజ్‌కారెక్టర్ అనుకున్నారు... ఆమెను పొందాలనుకున్నారు. కోరిక తీర్చమని అడిగితే ఆమె వప్పుకోలేదు..అందుకే ఆమెపై పగ పెంచుకుని ఆమెను హతమార్చారు. హత్యకి సంబంధించిన ఆధారాలన్నీ తుడిచేసి, పారిపోతే

అనుమానం వస్తుందని ఇక్కడే తచ్చాడుతున్నారు...ఇలా ఎందుకు కాకూడదు? దొరికే వరకూ అందరూ అమాయకులే" అన్నాడు రంగరాజు.

"మీరు ఇంత దారుణంగా ఎలా ఆలోచించగలరు?" అన్నాడు రామ్.

"ఇంత దారుణం ఎవడో ఒకడు చేయగా లేంది నేను ఆలోచించడంలో తప్పు ఏం ఉంది? అది నాఉద్యోగం. పైగా హత్య జరిగిన రోజు ఆఖరుగా అక్కడికి వెళ్ళింది మీరే అన్నవిషయం గుర్తు పెట్టుకోండి...ఒకవేళ వేరే ఎవడన్నా హత్య చేస్తే ఆఖరున వెళ్ళిన మీరు చూసేవాళ్ళు కదా? అందువల్ల ఆ హత్య చేయడానికి మీకే అన్ని అవకాశాలూ ఉన్నయి" అన్నాడు రంగరాజు.

ఇక అతడితో వాదించడం అనవసరమనీ...తామే ఆ హత్య చేశామని అతడు బలంగా నమ్ముతున్నాడనీ రామ్‌కి అర్థం అయింది. ఇక తాము బయటపడటం అసాధ్యమని కూడా అర్థమయింది కొద్ది గంటల తర్వాత రంగరాజు తన డీసీపితో మాట్లాడుతున్నది విన్న తరువాత.

"రామ్ కారెక్టర్ గురించి  ఎవరో చెప్పక్కరలేదు సార్...ఇతడు పెద్ద మదనకామరాజు అని అతగాడి భార్యే చెప్పింది... అది కూడా అతడే ఆమెకు చెప్పాడట" అంటున్నాడు రంగరాజు డీసీపితో

"భార్యలు ఏదో భర్తమీద ఉండే హీరో వర్షిప్‌తో ఎక్కువ ఊహించుకుని బిల్డప్ ఇస్తారు కానీ అంత సీను ఉండదోయ్" అంటున్నాడు డీసీపి.

"మీకు తెలీదు సార్ చిన్నప్పట్నించీ మనవాడు పెద్ద గ్రంధసాంగుడట... అంటే హైస్కూల్ నుండే" అన్నాడు రంగరాజు ఏదో దగ్గరుండి చూసినట్టుగా

రామ్ నిర్వేదంగా కళ్ళుమూసుకున్నాడు. అతడి కళ్ళముందు గతం కదులుతోంది. ఎక్కడి తాను? ఎక్కడి సుధాకర్? ఎక్కడ మొదలై ఎక్కడ ఉన్నారిపుడు?

# 3

అది పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు దగ్గర ఘనపురం. స్పీడుగా సైకిల్ తొక్కుతున్నాడు రామ్. అతనికి చెమటలు పడుతున్నాయి. చల్లగా వీస్తున్న శీతాకాలపు గోదారి గాలి కూడా అతడిని చల్లగా చేయలేకపోతుంది. సన్నగా, పొడవుగా ఉంటాడు రామ్. అతడి పూర్తి పేరు పింగళి శ్రీరామచంద్రమూర్తి. ఘనపురం కరణం గారి ఏకైక సంతానం. కరణీకాలు పోయినా, తాతలు, తండ్రులు చేసిన కరణం గిరీ గుర్తింపు మాత్రం వాళ్ళని వదలడం లేదు.

రామ్ ముత్తాత, తాతలు వస్తుంటే ఊళ్ళో పెద్దలనుకునే వాళ్ళు కూడా లేచి

నుంచునేవాళ్ళు, ఎక్కడ ఏం మతలబు పెట్టి ఇరికిస్తాడో అని భయపడేవాళ్ళు. ఒకళ్ళని ఆందోళన పెట్టే వంశమే కాని ఆందోళన పడని వంశంలో పుట్టిన రామ్ ఎందుకు భయపడుతున్నాడో తెలుసుకోవాలంటే ఇంకొంచెం వెనక్కి వెళ్ళాలి

★ ★ ★

ఘనపురం చాలా చిన్న గ్రామం. గోదారి ఒడ్డున కొవ్వూరునుండి పట్టిసం వెళ్ళే రోడ్డులో ఉంది. పచ్చటి పొలాలు ఊరుచుట్టూతా ఉంటాయి. కొవ్వూరు రోడ్డు గోదారి గట్టుని ఆనుకుని ఉంటుంది. ఇంకో మాటలో చెప్పాలంటే ఆ వూరికి, గోదారికి మధ్య కొవ్వూరు నుంచి పోలవరం వెళ్ళే తారురోడ్డు ఉంది. ఆ రోడ్డును ఊరికి కలుపుతూ ఓ మెయిన్ రోడ్డు, ఊరి కోవెల వరకూ వచ్చి ఆగిపోతుంది. అది కూడా తారురోడ్డే. కోవెల పక్కనే ఊరి మంచినీళ్ళ చెరువు. చెరువుకు ఓపక్క పంచాయితీవారి నీళ్ళటాంకు, పంపు షెడ్. కోవెలకి కొంచెం దూరంలో పెద్ద రావిచెట్టు, దానిచుట్టూ పెద్ద సిమెంటు చప్టా. ఊరి పెద్దలు సాయంత్రంపూట కోవెలలోకి వెళ్ళి ఓ దణ్ణం పెట్టకుని వచ్చి ఆ చప్టామీద కూర్చుని పిచ్చాపాటీ కబుర్లు చెప్పుకుంటారు. ఆ కబుర్లకి ఊతం ఇవ్వడానికి సాయిలు గాడి టీకొట్టు అక్కడికి దగ్గరలోనే ఉంది. ఆ టీ కొట్టుని స్టార్ హొటల్ పరిభాషలో కాఫీ షాప్ అనవచ్చు. సాయిలుగాడు కాఫీ కూడా అమ్ముతాడు.

'సాయిలు గాడి దగ్గర ఆయిలు తాగుదాం పదండ్రా' అనేది ఆ ఊరి కుర్రకారు పంచ్ డైలాగ్. అయితే సాయిలు గాడిదగ్గర దొరికే ఇడ్లీ కాని, దాంతోపాటు వాడు వేసే శనగపప్పు చెట్నీ కాని, అల్లం చెట్నీ కాని అదుర్స్. అవేకాదు అక్కడ దొరికే మినపట్టు కానీ, పెసరట్టు కానీ కేక. సాయిలు గాడు హొటల్లో ఇడ్లీ, పెసరట్టు తిని, కాఫీ తాగి ఇంటికి వెళ్ళి పడుకుంటే (ఎవరిల్లైనా పర్లేదు గానీ మన సొంతిల్లైతే ఇంకా మంచిది) స్వర్గం బెత్తెడు దూరంలో ఉంటుందని ప్రతీతి.

ఆ ఊళ్ళో ఉన్న కుర్రకారుకి సాయిలు గాడి హొటల్ పెద్ద అడ్డా. అక్కడ కూర్చుని కొవ్వూరు కాలేజికి వెళ్ళే అమ్మాయిలకి లైన్ లేదా సైటు వేయడం పెద్ద టైంపాస్. కాని ఆ కుర్రనాగన్నలకి తెలీని విషయం ఏమిటంటే, అక్కడ కూర్చునే ప్రతివాణ్ణీ అమ్మాయిలు ఊరికి పరమ బోకులుగా గుర్తిస్తారని, వాళ్ళకు ఆ అమ్మాయిలు పడే అవకాశం అసల్లేదని. అనగా అసలక్కడ పనికొచ్చే వాడు కూడా ఈ వెధవల్తో చేరడం మూలంగా పనికిమాలిన బోకుగా గుర్తింపబడ్తాడని. కాగా ఆ అమ్మాయిల అభిప్రాయం అన్నిసార్లూ నిజమవ్వక్కర్లేదని అందులో ఓ భడవ కాలక్రమంలో ఎంఎల్ఏగా ఎన్నిక అయింతర్వాత ఋజువయిందనుకోండి.

ఆ ఊళ్ళో అన్నీ సిమెంటు రోడ్లే. ఊరు అద్దంలా ఉంటుంది. గొడ్లని రోడ్లమీద ఎలాపడితే అలా వదిలేయరు ఆ ఊరి రైతులు కానీ, పాలేర్లు కానీ. అందుకే మామూలుగా ఊళ్ళల్లో రోడ్లనిండా కన్పించే గోపంచకం, పేడ అక్కడ దర్శనమివ్వవు.

ఆ ఊరికి ఉన్నవే నాలుగు పెద్ద వీధులు. ఊరికి దూరంగా వాడ. అక్కడ పొలాల్లో పనిచేసే దళిత కులాలవాళ్ళు ఉంటారు. అక్కడికి కచ్చా రోడ్డు మాత్రమే ఉంది. పంచాయతీ బోర్ అక్కడికి వెళ్ళలేదు. వాళ్ళకి రామ్ తాతగారు కరణంగా ఉన్న రోజుల్లోనే వేరే చెరువు తవ్వించారు. ఆ ఊరికి ఆయనే కరణం. తర్వాత తన తమ్ముడిని కరణీకం ఉంచి ఆయనే ప్రెసిడెంటు అయ్యాడు. అందువల్ల అడాల్ఫ్ హిట్లర్ ఆ ఊరికి ప్రెసిడెంటుగా ఉంటే ఎంత అభివృద్ధి జరగాలో అంత అభివృద్ధి జరిగింది.

రామ్ అనగా అలనాటి రోజుల్లో రామంగా పిలవబడేనాడే తండ్రిగారికి గుండెపోటు తెప్పించినంత పని చేశాడు. రామం తండ్రి పేరు ప్రహ్లాదశాస్త్రి. ఆయన ఆరడుగుల పొడగరి. దిట్టంగా ఉండే విగ్రహం. తెల్లని ఛాయ, మంచి ముఖ వర్చస్సు. గానుగ ఆడించిన తమ తోట కాయల కొబ్బరినూనె తలకు పట్టించి, చిన్న తిరునామాన్ని నుదుటిపై ధరించి, పొందూరు పంచె, లాల్చీ, భుజాన ఉత్తరీయం, కాళ్ళకు ఆ ఊరి మాదిగ ప్రత్యేకంగా తయారు చేసిన చెప్పులు వేసుకుని వస్తుంటే ఎంతటివారైనా లేచి నుంచునేవాళ్ళు. చాటుగా రామాన్ని ప్రహ్లాదుడనీ, ఆయన్ను హిరణ్యకశపుడనీ పిలుచుకునేవాళ్ళు.

రామంకి ఎవరికీ రాని వింత అనుమానాలు వచ్చాయి. “నాన్నగారూ... ఊరంతా సిమెంటు రోడ్లు ఉన్నాయి. మరి ఆ వాడకి మాత్రం మట్టిరోడ్డు ఎందుకు ఉంది?”

“ఊరి చివరి వరకూ వెళ్ళిన మంచినీళ్ళ కుళాయిలు వారికి ఎందుకు వెళ్ళలేదు?”

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.

దాంతో దంగైపోయిన ప్రహ్లాదశాస్త్రి తన ఖర్మ కాలి ఏ సంఘ సంస్కర్తో తన కొంపలో పుట్టేసేడేమో అని కంగారు పడ్డాడు.

ఆ గ్రామానికంతటికీ పెద్ద ఇల్లు ప్రహ్లాద శాస్త్రిగారిదే. చుట్టూ ప్రహరీ గోడ, దానికి రెండు వాకిళ్ళు. ఒకటి వీధి వాకిలి, మరొకటి పెరటి వాకిలి. వీధి వాకిలి వారి దర్పానికి ప్రతిబింబంలా ఉంటుంది. చక్కటి రాతిశిల్పాలతో ఉన్న చిన్న గోపురం, మధ్య రకరకాల లతలు, దేవతామూర్తులు చెక్కిన బలమైన బర్మా టేకుద్వారం. దాటి వెళితే వంద అడుగుల దూరంలో పెద్ద నడవా, దానివెనుక లంకంత కొంప.

నడవాకి, వీధి గుమ్మానికి మధ్య తులసికోట, కోటకి రెండువైపులా గోశాలలు,

వాటిల్లో పూజలందుకుంటున్న గోవులు.

ఇలాంటి చక్కని వాతావరణంలో పెరిగే పిల్లాడికి పిదపకాలం అనుమానాలు వచ్చాయంటే ఏమనుకోవాలి?

వెంటనే అగ్రహారంలోనే పెద్ద వేద పండితుడైన భమిడి ప్రభాకరశాస్త్రిగారికి కబురు చేశారు. కబురు కాదు ఏకంగా కారే పంపారు.

★ ★ ★

నడవాలో ఉన్న ఉచితాసనం అంటే పేము కుర్చీలో ఆసీనులయ్యారు ప్రభాకర శాస్త్రి. లోపల తయారవుతున్న ప్రహ్లాదశాస్త్రి తనలో తాను 'పాపం వైదికమాలోకం... ఎవరూ అతగాడి కోసం రిక్షా కూడా పంపరు. నేను కారు పంపేసరికి ఉక్కిరిబిక్కిరై తబ్బిబ్బు పడుతుంటాడు పాపం' అనుకున్నాడు.

భమిడి ప్రభాకరశాస్త్రి తబ్బిబ్బు అయిన మాట నిజమే. కాని అది మరోవిధంగా.

'ఈ నియోగపాడు కొంపమీదికి ఏం తేబోతున్నాడో. రోడ్డు పెంచుతున్నాం, మీ గోడ పడగొడతాం అని కానీ అనడు కదా. ఇప్పుడు ఏం ఉపాయం?' అనుకుంటున్నాడు.

ఇంతలో బయటికి వచ్చిన ప్రహ్లాద శాస్త్రి 'నమస్కారం... వచ్చి ఎక్కువ సమయం కాలేదు కదా' అని ఆరా తీశాడు.

కుశలప్రశ్నలు, కొంత లోకాభిరామాయణం అయిన తర్వాత అసలు విషయం బయట పెట్టాడు.

"మా రాముడికి వేదవిద్యా, ధర్మ మీమాంస తమరు నేర్పించాలి" అని

"మీరు నియోగ ప్రభువులు. లోక ధర్మం, మర్మం తెలిసినవారు. ఈ శాస్త్రాలవల్ల ఏమైనా ఉపయోగం తమకి ఉందీ అంటే నేర్పించడం నాకు పరమానందం. కానీ ఉందంటారా?" అన్నాడు ప్రభాకరశాస్త్రి.

నీ వైదిక చాదస్తం మండిపోనూ అనుకున్న ప్రహ్లాద శాస్త్రి "మీరు వైదికులు, మేం నియోగులం. అయినా కూడా అందరం స్మార్తులమే కదండీ. వేదవిద్య తెలిస్తేనే కదంటండీ, మంచి చెడూ, ధర్మం అధర్మం తెలిసేది" అన్నాడు.

"అలానే... చిరంజీవిని పంపండి" అన్నాడు కానీ

'ఏమి ఈ నియోగపాడి హజం? విద్యాభ్యాసానికి వచ్చేది రాజు కొడుకైనా స్వయంగా ఆ రాజే వచ్చి గురువును అర్థించడం రివాజు. విద్య విలువ తెలిసిన వాళ్ళైతే వీళ్ళని అయోగులు అనగా యోగి కానివాడు, వేదవిద్య తెలియని వాడు అని ఎందుకనుకుంటారు' అని అనుకున్నాడు ప్రభాకరశాస్త్రి.

అలా ఆయన దగ్గర వేదం నేర్చుకోవడానికి రామాన్ని పంపడం మొదలుపెట్టారు. ఆ ప్రభాకరశాస్త్రిగారి అబ్బాయే రాజేంద్ర నారాయణ. రాజేంద్రతో తన కొడుకు స్నేహం అతడి జీవితాన్ని ఎలా మలుపు తిప్పబోతోందో తెలుసుంటే బహుశా ప్రహ్లాదశాస్త్రి ఆ పని చేసి ఉండేవాడు కాదేమో!

ప్రహ్లాదశాస్త్రి ఇంటి ఇల్లాలు తులశమ్మ. ఆమె పేరే ఆమె గురించి అన్నీ చెబుతుంది. పూజాపునస్కారాలు, వ్రతాలు, నోములు ఆమె జీవితం. ఓ రోజు పూజకి, పునస్కారానికి, వ్రతానికి, నోముకి తేడా తెలియని ఓ ఇల్లాలు ఆవిడ్ని అడిగింది.

"పూజ అంటే ఆరాధన. పునస్కారం కాదది పునస్కరం. శాంతిమంత్రాలు చదివితే పునస్కరం. వ్రతం అంటే సంస్కృత పదం, నోము అంటే తెలుగు. యజ్ఞం అంటే బలిపశువును సమర్పిస్తారు, యాగంలో ఆ ప్రస్తావన ఉండదు"

ఆ వివరణ విన్న ఆ ఇల్లాలు దాదాపు మూర్ఛపోయినంత పనిచేసింది. ఆనక "నీకు నీ అంత భక్తి గల కోడలు రావాలి వదినా" అని దీవించింది.

"నీలాంటి ముత్తైదువ, పతివ్రతా దీవించింతర్వాత ఆపడం ఆ విధాత వల్ల కూడా కాదు" అని తీర్మానించింది తులశమ్మ.

కాగా అదే సమయంలో వేదపనస కాకుండా పనస పళ్ళలాంటి పిల్లలగురించి పాఠం వింటున్నాడు రామం.

★ ★ ★

ప్రభాకరశాస్త్రి గారికి ఊరి పెద్ద మనిషి గారపాటి రాఘవయ్యగారు కబురు చేయడంతో అక్కడికి వెళ్ళారు. ఇక రాజేంద్ర ఆ రోజుకి గురుస్థానాన్ని అలంకరించాడు.

"రాంభొట్ల వారమ్మాయి వాణి భలే జాణరా రామం" అన్నాడు రాజేంద్ర.

"జానా... కాదు తను బానే పొడవుంటుందే" ఆశ్చర్యపోయాడు రామం.

"ఏడ్చి మొహం కడుక్కున్నట్టుంది తమరి కరణం తెలివి. నేనన్నది జానెడు పొడవుందా, బెత్తెడు వెడల్పు ఉందా అని కాదోయ్ చెవలాయ్. జాణ అంటే కూతకొచ్చిన పెట్టరా"

"ఇదిగో అంటే అన్నానంటావు కానీ మనుషుల్ని కోళ్ళతోనూ, కుక్కలతోనూ పోలిస్తే నాకు ఏం అర్థం అవుతుంది చెప్పు? విషయమేమిటో సూటిగాచెప్పు" చిన్నబుచ్చుకున్నట్లుగా అన్నాడు రామం.

"అవున్రా.. వయసుకి ఏడాది నాకంటే చిన్న అయినా నీకు పసితనం పోలేదురా" అని జగద్గురు లెవెల్లో నిట్టూర్చాడు రాజేంద్ర. నిట్టూర్చే కార్యక్రమం పూర్తి అయిన

తర్వాత “వయసు వచ్చిన ఆడపిల్లని కూతకొచ్చిన పెట్ట అనీ, మగ పిల్లాడిని పుంజు అనీ అంటారు. సరే చిన్న వెధవ్వి. ఎవరైనా చెప్తే కదా నీకు మాత్రం తెలిసేది. పుట్టుక కరణం పుట్టుక అయినా పెంపకం వైదీకప్పీనుగ పెంపకంలా ఉంది. నీకంటే నేనే నయం” అన్నాడు.

“నేను పుంజాలు తెంపకపోక ముందే ఒక విషయం చెప్పు. ఇంతకీ ఏది శాస్త్రం? కొక్కోకమా?” అడిగాడు రామం.

“నువ్వు అమాయకుడివో అసాధ్యుడవో తెలియడం లేదు. అంత పెద్ద శాస్త్రం గురించి అలా అలవోగ్గా అన్నావంటే నిన్నెలా అర్థం చేసుకోవాలి? అదేదో కోళ్ళ పెంపకం గురించిన శాస్త్రంలా గట్టిగా మాట్లాడుతున్నావ్. కొంచెం గొంతు తగ్గించు. లేకపోతే మనల్ని అడ్డంగా తరిగేస్తారు. దానిగురించి నాకే పూర్తి వివరాలు తెలియవు. విన్నానంతే” అన్నాడు రాజేంద్ర.

“సర్లే ఇప్పుడా సోదంతా ఎందుకు కానీ వాణి గురించి చెప్పు”

“ఆహా... పర్లేదురా. నీకూ అగ్గి రాజుకుంది. సర్లే చెప్తా విను. కానీ ఇది నేను చెప్పినట్టుగా ఎక్కడా చెప్పొద్దు. వాణీది  ఓణీ వేసి సంవత్సరం దాటిందో లేదో అప్పుడే ఆ తోట మంగారావు గాడితో గడ్డివాముల్లో దూరుతుందట”

“గడ్డివాముల్లో ఏం పనో. గడ్డి కోసం అంటావా?” అమాయకంగా అన్నాడు రామం.

తినేసేట్టు చూశాడు రాజేంద్ర.

“కాదు బాబూ నాకు తెలియక అడిగాను” అన్నాడు రామం.

“కాదురా ఒకళ్లని ఒకళ్ళు గట్టిగా పట్టుకుంటారు”

“ఎందుకు? అలా చేస్తే బావుంటుందా?”

“ఛ...ఛ... ఎందుకు బాగుంటుంది? పరమ దరిద్రంగా ఉంటుంది. ఏమిటా అనుమానం!” చిరాకు పడ్డాడు రాజేంద్ర.

“నీకెలా తెలుసు? నువ్వూ గడ్డిమేటు వైపు ఎపుడయినా వెళ్ళావా?” అడిగాడు రామం.

“అన్నీ అనుభవం మీదే తెలియవురా. కొన్ని పెద్దల్ని అడిగితెలుసుకోవాలి” చెప్పాడు రాజేంద్ర.

“ఆ పెద్దలెవరో”

“ఇంకెవరు. మంగారావే”

★ ★ ★

“నా పేరు మంగాయావు... నేను బీకు మాత్రమే తాగుతాను” ఇది మంగాయావుగా తనని తాను పిల్చుకునే మంగారావు ఎవరైనా కొత్తవాళ్ళకి స్వపరిచయం చేసుకునే విధానం.

అతడికి కొన్ని అక్షరాలు పలకవు. బీరుని బీకు అంటాడు.

ఆ ఊళ్ళో చాలామంది ఆడపిల్లల్తో అతడికి సంబంధాలున్నాయని చెప్పుకుంటారు. ఎవరో ఎందుకు స్వయంగా తనే చెప్తాడు. కాకపోతే ఓ బీకు ఖర్చవుతుంది.

లవ్ గురూ అనే పేరుతో ఓ దశాబ్దం తర్వాత చాలామంది వచ్చినా అసలు లవ్ గురు, లవ్‌కి ఆదిగురు మంగాయావే అని ఆ చుట్టుపక్కల గ్రామాల్లో ఇప్పటికీ నమ్ముతారు.

అలా రామం ప్రయాణం చిన్న ప్రేమగురు దగ్గరికి అక్కడినుంచి పెద్ద ప్రేమ గురు దగ్గరికి చేరింది. అలా చిన్న గురుతో కలిసే తోటలవెంట, పొలం గట్ల వెంట తిరుగుతూ విద్యాభ్యాసం ప్రారంభించాడు రామం.

“ఆడపిల్లలకి కూడా మనతో తియగాలని, సయదా చేయాలని ఉంటుంది. కానీ ఎవయేనా చూస్తాయని భయపడతాయు. అందుకే ఇలాంటి విషయాల్లో జాగ్యత్త పధానం” అని మొదలెట్టి

“అలా అని మయీ నిదానంగా పోతే అది ఇంకోడితో పోవచ్చు” అంటూ తన తొలి పాఠాన్ని ప్రారంభించాడు.

“అంటే అమ్మాయిలు ఎవరో ఒకర్ని ప్రేమించాల్సిందేనా?” అడిగాడు రామం.

“అంతే...అమ్మాయి అన్నాక ఖచ్చితంగా పడితీయాల్సిందే” అన్నాడు మంగాయావు.

“పడకపోతే ఏమవుతుంది?” మళ్ళా అడిగాడు రామం.

“ఏమవుతుందిరా. దానికి పెళ్ళవుతుంది” విసుగ్గా అన్నాడు రాజేంద్ర.

“అంతే మయి... వయసొచ్చిన ఆడపిల్ల మీదికి బెడ్డ వెయ్యలేకపోతే ఆ ఊళ్ళో సరైన కుయ్యకాయి లేదన్నమాట” అన్నాడు మంగాయావు.

“అలా అనకు మంగారావా... వీడుత్త వెర్రిమాలోకం. నువ్వన్నమాటకి ముక్కస్యముక్కార్థ తీసుకుని ఊళ్ళో ఉన్న రాళ్ళన్నీ ఏరి దారినపోయే అమ్మాయిల మీదికి విసరగలడు!” గాభరాగా అన్నాడు రాజేంద్ర.

“యాయి విసయమంటే అమ్మాయికి దగ్గయ అవటం” వివరించాడు

మంగాయావు.

★ ★ ★

కూసే గాడిద వచ్చి మేసే గాడిదను చెడగొట్టినట్టుగా, కొన్ని గురూజీ ఉపదేశాల అనంతరం రామానికి ఉష్ణము జనియించును. అంటే అమ్మాయిలను కాకపోయినా ఒక అమ్మాయినైనా పడగొట్టి నేను సైతం... నేను సైతం ఓ మగపిల్లవాణ్ణనే విషయాన్ని ఎలుగెత్తి చాటాలని నిర్ణయించాడు.

అమ్మాయిని పడగొట్టడానికి మొదటి మెట్టు కళ్ళు కలపడం. మంగాయావు చెప్పిన పాఠాన్ని నెమరు వేసుకున్న రామం ఆ ఊళ్ళో అమ్మాయిల వైపు చూసే ప్రయత్నం చేశాడు.

ముందుగా ఫలానా అమ్మాయని రిటైల్‌గా అనుకోకుండా రాజమండ్రి గాంధీ మార్కెట్‌లాగా హోల్‌సేల్‌గా అమ్మాయిలను చూడాలని అందులో తనంటే ఆసక్తి చూపించే అమ్మాయిని ఎంచుకోవచ్చనీ భావించాడు. చిన్న గురు ఆజ్ఞ కూడా అలానే ఉంది.

అలవోకగా అమ్మాయివైపు చూడాలనీ, అంతేతప్ప క్షుద్రమాంత్రికుడు శవం వైపు చూసినట్లు చూడకూడదని కూడా ఆ పాఠ్యాంశంలో ఉంది.

రామం అదే ప్రయత్నించాడు. కానీ అలవాటు లేకపోవడం వల్ల తపస్సు భంగమై శివుడు మూడో కన్ను తెరిచినట్టు తీక్షణంగానూ, సిగరెట్టు కాలుస్తూ పట్టుబడ్డ కుర్రాడివైపు చూసే చూపులా వాడిగానూ ఉంది.

దాంతో ఆడపిల్లలు నడక వేగం పెంచి పారిపోవడమే తప్ప పెద్దగా ఉపయోగమేమీ కనపడలేదు.

ఇలా కాదని ఇంట్లో అద్దం ముందు చిరునవ్వుతో కూడిన అలవోక చూపు సాధన చేశాడు. ఇంట్లో ఉన్నంతసేపు కొవ్వూరు గోపి టాకీస్‌లో చూసిన రాజకుమారుడు సినిమాలో ప్రిన్స్ మహేష్‌బాబు, ప్రీతిజింటాని చూసి నవ్విన నవ్వు, చూపు కాస్తా సాయిలు గాడి హోటల్ దగ్గర నిలబడి ప్రక్కనే ఉన్న బస్టాప్‌లో ఉన్న ఆడపిల్లల్ని చూసే సరికి వాళ్ళ బ్యాగులు, టిఫిన్ బాక్స్‌లు ఎత్తుకుపోయేందుకు దొంగ కోళ్ళ సత్తిగాడు చూసిన చూపులా మారింది. అయితే అతడికి ఉన్న రాముడు మంచి బాలుడు ఇమేజ్, ప్రహ్లాద శాస్త్రి గారబ్బాయనే గుర్తింపువల్ల పెద్దగా ఇబ్బంది తలెత్తలేదు.

ఐతే ఆది గురువు మంగాయావు మాత్రం దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు.

"ఇలా ఊళ్ళో అమ్మాయిల్నందన్నీ దాయినపోయే దూళ్ళమాదియి చూస్తే దేన్ని చూస్తున్నావో తెలీక ఎవత్తీ పడదు. మన చూపు సూదంటుయాయిలా చుయుక్కుమనాలి" అన్నాడు స్పెషల్ క్లాసులో.

కొంతమందిని రామం ఎంపిక చేశాడు గానీ అప్పటికే వాళ్ళు ఎవరికైనా సెట్టై ఉండటమో, లేదా కొంతమంది అమ్మాయిలకి ప్రమాదకరమైన అన్నదమ్ములు ఉండటమో తటస్థించింది. మిగిలిన వాళ్ళలో కొంతమంది కోసము అప్పటికే సాయిలుగాడి ఆయిలు టీ తాగుతూ విపరీతంగా ప్రయత్నిస్తున్నారు.

కొందరు తిండి ఎక్కువై మాళీగేదెలతో పోటీ పడుతుంటే మరికొందరు పూర్తిగా ఆర్చుకుపోయి నాలిక బద్దలమాదిరిగా ఉన్నారు.

అటువంటివాళ్ళు పడినా కూడా అది నామర్దాగా ఉంటుంది తప్ప ఏమాత్రం గర్వకారణం కాదు, కాలేదు, కాబోదు.

అలా వడపోత పోగా పోగా ఒక అమ్మాయే మిగిలింది.

"ఛ... ఛ ఏం ఊరురా ఇది. అడవిలో ఆకు కరువా ఊళ్ళో అమ్మాయి కరువా అన్నారు ఆర్యులు. ఆ లెక్కన ఇది అడవే. ఇక్కడ ఆకులే తప్ప అమ్మాయిలెక్కడ చచ్చారు?" కోపంగా అన్నాడు రామం.

"వద్దురా రామం... అంత కోపం పనికిరాదురా... ఏదో చిన్న ఊరు. ఉన్నంతలో పని పూర్తిచేసుకోవాలి గానీ అలా చెరువు మీద అలిగిన బుల్లి అవధానుల్లా కాకు" అంటూ సర్దిచెప్పాడు రాజేంద్ర.

"చెరువు మీద అలిగిన బుల్లి అవధానుల్లా... ఎవరతను? ఏమా కథ?" అడిగాడు రామం.

"అది అంత మంచి కథ, మనవంటి శిష్టులు చెప్పుకోదగ్గ కథ కాదు"

"పొద్దున్న లేస్తే అన్నీ అపభ్రంశపు మాటలు మాట్లాడే మనం శిష్టులమా? వేదం చదివేప్పుడు మొదట చివర ప్రణవనాదం చేయమన్నారు. మనకి మాత్రం మాటకి ముందొక అమ్మాయి, చివరొక అమ్మాయి. ఇవన్నీ కట్టిపెట్టి విషయం చెప్పు" అన్నాడు రామం.

"మనమీద బయటివాళ్ళకి రావలసిన అనుమానాలు నీకు వస్తున్నాయి. సరే విను. ఇందులో రెండు భిన్న వాదాలున్నాయి. ఎవరికి నచ్చినది వారు నమ్మొచ్చు. ఒక పరంపర ప్రకారం బుల్లి అవధానులకి మార్గమధ్యంలో దాహం అయ్యింది. సమీపంలో ఓ తటాకం అనగా చెరువు కనబడింది. చెరువు దగ్గరికి వెళ్ళాడు. నీరు అందలేదు.

చెరువుమీద అలిగాడు. శపించాడు. ఏం ఉపయోగం? చెరువు ఎండలేదు. అవధాన్లు గొంతు ఎండింది. ఆనక పది రూపాయలు పోసి కోకకోలా తాగాల్సి వచ్చింది.”

“బావుంది. కానీ ఇందులో శిష్యులు వినకూడనిది ఏమీ లేదే?” అన్నాడు రామం.

“అది రెండవ స్మృతి. ఇందులో ఏమంటే బుల్లి అవధాన్లు దీర్ఘ శంక ముగించుకుని, తన తెచ్చుకున్న చెంబుకు చిల్లు ఉందన్న చేదు నిజం తెలుసుకుని, చెరువుకి నీటకోసం వెళ్ళేసరికి నీరు అందదు. అవధాన్లు అలుగుతాడు. అందువల్ల చెరువు ఎండదు కదా అనేది నీతి. ఈ కథలో ఉపసంహారం తెలియదు. యథాశక్తి ఊహించుకోవడమే. అందువల్ల నువ్వు కూడా అలగడం వృథాప్రయాస అని గ్రహించి, ఎక్కడికక్కడ ఎంకటలక్ష్మి అనుకుని ఉన్నంతలో ఓ దేవకన్యను వలచి వలపింప చేసుకోవడమే తక్షణ కర్తవ్యం.” నాటకీయంగా అన్నాడు రాజేంద్ర.

“ఈ ఊరు అప్పలమ్మలకి, అమ్మమ్మలకీ లాయకీ. ఇక్కడ మళ్ళా దేవకన్య ఒకటి. మామూలు కన్య దొరికితే చాలు” అన్నాడు రామం.

“సరే, నీ వడపోత పోగా ఈ ఊళ్ళో ఏ ఆడపీనుగైనా మిగిలిందా?” అడిగాడు రాజేంద్ర.

“పీనుగు కాదు కానీ అమ్మాయే దొరికింది. కాస్త బాగుండేది ఆచారిగారమ్మాయి ఇంద్రాణి మాత్రమే” అన్నాడు రామం.

“భేషైన ఎంపిక. ఆ పిల్లకేం బంగారంలా ఉంటుంది. పేదరికం వల్ల మెరుగులు, మంచి బట్టలు లేకగానీ లేకపోతే ఆ పిల్లని కొట్టే అందం ఏ అమ్మాయికి ఉంది ఈ ఊళ్ళో” అన్నాడు రాజేంద్ర.

# 4

“డబ్బు దేముందిరా వెధవ డబ్బు మా దగ్గరలేదా? ఆ అమ్మాయి మరీ తెల్లగా ఉంటుంది. అదే సమస్య” అన్నాడు రామం.

“తెల్లగా లేకపోతే సమస్య గానీ తెల్లగా ఉంటే ఏమిట్రా సమస్య?” ఆశ్చర్యంగా అడిగాడు రాజేంద్ర.

“ఏమోరా... నాకు మరీ తెల్లగా ఉండేవారంటే ఎందుకో నచ్చదు” అన్నాడు రామం.

“అందుకే కదా పుర్రెకో బుద్ధి, జిహ్వాకో రుచి అన్నారు” అన్నాడు రాజేంద్ర.

“ఎవరన్నారు ఆర్యులేనా?” అడిగాడు రామం.

“సాధారణంగా ఏమైనా అంటే వాళ్ళే అంటారు. కాబట్టి వాళ్ళే అని ఉండాలి”

చెప్పాడు రాజేంద్ర.

★ ★ ★

అలా ఓసారి ఇంద్రాణిని ఇష్టపడుతున్నానని మరోమాటలో చెప్పాలంటే ప్రేమిస్తున్నానని రూఢి చేసుకున్నాక రోజూ ఆ అమ్మాయి గురించి ఆలోచించడం మొదలెట్టాడు రామం. ఇప్పుడు ఇంద్రాణి ఏం చేస్తూ ఉంటుంది? తను నా గురించి ఏం అనుకుంటుంది? ఒకవేళ ఆ అమ్మాయి తనని ఇష్టపడితే పెద్దగురువు మంగాయావు ఏమంటాడు?

'నా పేయు నిలబెట్టావు యామం... శబాసో' అంటాడు.

రాజేంద్ర అయితే 'గురువుని మించిన శిష్యుడు అయ్యావు రామం. ఇంతవరకూ సిద్ధాంతం చెప్పడమే నేను చేశాను. కానీ నిజంగా ఓ అమ్మాయిని పడగొట్టిన ఘనత మాత్రం నీకే దక్కింది' అంటాడు.

కానీ ఊహ మాత్రంగానైనా ఈ విషయం తన నాన్నకి గానీ, ఇంద్రాణి నాన్నకి గానీ తెలిస్తే జరిగేది మాత్రం ఊహించ సాహసించటం లేదు రామం.

కౌమారం అంటే టీనేజ్ తాలూకు అమాయకత్వం, తెలియని కొత్త ఆలోచనల వత్తిడిలో కొట్టుకుపోతున్నాడు రామం.

బాల్యాన్ని దాటి యవ్వనాన్ని అందిపుచ్చుకునే సంధికాలమే కౌమారం. అప్పటిదాకా అమ్మాయిల్లో కనబడని కొత్త అందాలు, తన దృష్టికిరాని కొత్త విషయాలు అతడికి గోచరమవుతున్నాయి.

తల్లిదండ్రుల ప్రశంసల కన్నా అతడికి స్నేహితుల శభాషులు ముఖ్యమవుతున్నాయి. కానీ రామం అణకువగల పిల్లవాడవడంతో అతనిలో వచ్చిన మార్పులు ఎవరికీ గోచరం కావటం లేదు.

ఆ ఊరు కొంచెం లోపలికి ఉండటంతో బస్సులు లోపలికి రావు. ఒకే ఒక్క ప్రైవేటు బస్సు ఉదయం, సాయంత్రం పట్టిసం నుంచి కొవ్వూరు సర్వీసు మాత్రం వస్తుంది. ఆటోలు కూడా వస్తాయి. మామూలుగా అయితే ఆర్టీసి బస్సు కోసం ఓ అరకిలో మీటరు దూరం నడిచి గోదారి గట్టున ఉన్న మెయిన్‌రోడ్డుకి వచ్చి ఎక్కాల్సిందే.

ఉదయం ప్రైవేటు బస్సు అందుకోలేని స్కూలు, కొవ్వూరు జూనియర్ కాలేజి పిల్లలు, సైకిళ్ళు లేనివాళ్ళు నడిచివెళ్ళి గోదారి ఒడ్డునున్న ఆంజనేయస్వామి గుడిదగ్గరున్న అగ్రహారం రోడ్డు బస్టాపులో బస్సు పట్టుకోవాలి.

అయితే దారి పొడుగునా రోడ్డుకి రెండువైపులా అరటి, చెరకుతోటలు, వరిచేలు పచ్చగా పరచుకుని ఉంటాయి. వాటిమీంచి వచ్చే గాలి పచ్చిగా, కమ్మని మట్టి వాసనతో పరిమళిస్తుంటుంది. ఆ ఆహ్లాదకరమైన పరిసరాల్లో నడక అలసట తెలియదు.

ఓ రోజు సాయంత్రం అనుకోకుండా రామానికి విపరీతంగా కలిసివచ్చింది. శీతాకాలం కావడంతో సాయంత్రం తొందరగా చీకటి పడింది.

అమ్మకి ఒంట్లో బాగుండకపోవడంతో రెండు రోజులు స్కూలు మానేసిన ఇంద్రాణి స్నేహితురాలు దగ్గర నోట్సు కాపీ చేసుకునేసరికి తెలీకుండానే కొంచెం ఆలస్యం అయింది. ఆర్టీసీ బస్సు దొరికేసరికి ఆలస్యమయింది.

అగ్రహారం రోడ్డులో బస్సు దిగేసరికి నునుచీకట్లు కమ్ముకుంటున్నాయి. ఇద్దరు ఊరివాళ్ళు దిగారు. కానీ వాళ్ళు తాగి తూలుకుంటూ వెళుతూ ఉండటంతో కొంచెం ఆగి బయల్దేరింది. స్కూలు వాలీబాల్ జట్టులో ఆడుతున్న రామానికి అదేరోజు కాకతాళీయంగా ప్రాక్టీసులో లేటయింది.

సైకిలు మెయిన్‌రోడ్డు దిగి ఊరుదారి పట్టేసరికి చేలమధ్య బితుకు బితుకుమంటూ నడచుకు వెళుతున్న ఇంద్రాణి.

అన్ని పల్లెటూళ్ళలాగే ఆ ఊళ్ళోనూ దెయ్యాల కథలకేం తక్కువ లేదు. దెయ్యాన్ని చూసినవాళ్ళు ఆ ఊళ్ళో చాలామందే ఉన్నారు. తళతళలాడే తెలుపు కొత్త సూపర్ రిన్‌తోనే సాధ్యమన్న అడ్వర్‌టైజ్‌మెంట్ లాగ ఆ దెయ్యాలు తెల్లని బట్టలు మాత్రమే వేసుకుని తిరుగుతూ కన్పిస్తూ ప్రజలు తమని మరిచిపోకుండా జాగ్రత్త పడుతూ వస్తున్నాయి.

ఆ రోజు రామం, ఇంద్రాణి ఇద్దరూ తెల్లబట్టలే వేసుకోవటం మరో కాకతాళీయం.

ముందుపోయిన మందుబాబులు దారిమధ్యలో ఆగి ఏదో ముఖ్యవిషయం అంటే ఇందాక తాము తగ్గింది నిబ్బా, హోఫా అన్న విషయం కార్మికుల కార్యక్రమం మాదిరి చర్చించుకుంటున్నారు.

అంతలో ఓ తెల్లని ఆకారం, ఆడమనిషి లాంటిది రోడ్డువెంట వచ్చి అకస్మాత్తుగా రావిచెట్టు దగ్గర అదృశ్యమయింది. దాంతో భయపడ్డ మందుబాబులు వెనక్కి తిరిగి చూడకుండా ఊరివైపు పరుగెత్తారు.

మందుబాబుల్ని చూసి భయంతో రావిచెట్టు పక్కన నక్కిన ఇంద్రాణికి గాలిలో తేలుతూ కనబడిన ఓ దెయ్యం రావిచెట్టు దగ్గర ఆగింది.

ఆగటమే కాకుండా "ఇంద్రాణీ" అని పేరుతో పిల్చింది.

"శ్రీ ఆంజనేయం... ప్రసన్నాంజనేయం" అనుకుంటూ భయంతో బిగుసుకున్న ఆమెకు అది రామం గొంతు అని పోల్చుకునేసరికి, భయం కాస్తా సిగ్గుగా మారింది.

ఐనా ఆడపిల్లలు భయపడటం, సిగ్గుపడటం సహజం, పైగా జన్మహక్కు కాబట్టి సర్దుకుని రోడ్డుమీదికి వచ్చింది.

"ఏంటి ఇంద్రాణీ...అక్కడ ఆగిపోయావు? పామేమన్నా కనబడిందా?" అడిగాడు రామం.

"లేదు రామం. ఇద్దరు తాగుబోతులు రోడ్డుకి అడ్డంగా ఉంటే ఆగిపోయాను. ఇప్పుడు వాళ్ళు వెళ్ళిపోయార్లే" అంది ఆమె.

"సరే. ఐతే నేను బయల్దేరనా?" అన్నాడు రామం సైకిల్ ఎక్కడానికి సిద్ధపడుతూ.

"కొంచెం నాతో నడవరాదూ, చీకటిగా ఉందికదా, తోడుగా" అంది ఆమె.

"అలాగే" అని ఆమెతో నడవడం మొదలెట్టాడు రామం.

అప్పటికి కానీ అతడికి గ్రహింపు రాలేదు, తాను మొట్టమొదటిసారి ఓ అమ్మాయితో మాట్లాడానని.

"అబ్బ... ఈ చీకట్లో తెల్లబట్టలు మనకే భయం వేసేట్టున్నాయి. ఇంతకీ నీకు ఏ రంగు ఇష్టం రామూ?" అని అడిగింది ఇంద్రాణి నడుస్తూ.

ఆమె రామూ అని గోముగా పిలుస్తుంటే హాయిగా అన్పించింది రామానికి.

తనపేరు తనకే కొత్తగా, ముద్దుగా విన్పిచ్చింది.

"నాకు కుంకుమ రంగు అంటే ఇష్టం.... మరి నీకో" అన్నాడు రామం.

"నాకు ముదురు రంగులంటే ఇష్టం. కుంకుమ రంగు అంటే కూడా ఇష్టమే అనుకో. ఇంకా పచ్చరంగంటే కూడా ఇష్టం" అంది ఆమె.

"నీకు ఏ వంట ఇష్టం?" మళ్ళా తనే అడిగింది.

"అటుకుల పులిహోర, ఆవ పెట్టిన పనసకూర బాగా ఇష్టం. ఇంకా గారెలు, ఆవడలు కూడా అనుకో" అన్నాడు.

తర్వాత తనేమీ మాట్లాడకపోయేసరికి "ఇంతకీ నీకేమిష్టమో చెప్పావు కాదు" అన్నాడు తనే.

"ఏం వండి పెడతావా ఏం? నలభీమపాకం" అంది నవ్వుతూ.

ఓ క్షణమాగి అతడేమయినా అనుకున్నాడేమోనని "సారీ.. రామూ... ఏమీ

అనుకోకే. ఏదో నవ్వతాలుకి అన్నాను" అంది.

"ఛ... ఛ... ఇందులో అనుకోవడానికేముంది? ఎప్పుడైనా అవసరం పడుతుందేమో అని మా అమ్మ మడి కట్టుకుని వండుకోవడం నేర్పింది. ఏ విద్య ఎప్పుడు అవసరం పడుతుందో తెలియదు అని ఆవిడ భావన" అన్నాడు రామం.

"ఈ చుట్టుపక్కల ఎన్నదగిన సంపన్నులై ఉండీ ఇంత నిరాడంబరంగా నిన్ను పెంచుతున్నదంటే ఆ తల్లికి నమస్కరించబుద్ధవుతున్నది రామూ" అంది ఇంద్రాణి.

ఇంతలో ఊరు సమీపించడంతో "సరే నువ్వు ముందు పద. ఎవరైనా చూస్తే బాగుండదు" అంది.

★ ★ ★

రామానికి సంతోషంతో, ఉద్విగ్నతతో ఆ పూట అదోలా ఉంది. ఒళ్ళంతా నులివెచ్చగా మారింది. రోజూ చేసే స్నానం ఆ రోజు కొత్త హాయినిచ్చింది. రోజూ తినే అన్నంలో ఆ రోజు కొత్త రుచి వచ్చింది. ఆఖరికి మంచినీళ్ళు కూడా తియ్యగా అనిపించాయి.

బూరుగదూది పరుపు హంసతూలికా తల్పం అయింది. వేపచెట్టు గాలి వింజామరలు వీచింది. చందమామలో మచ్చ మాయమై మరింత ప్రకాశించాడు.

రాత్రికి రాత్రే ఇద్దరు గురువులతో మాట్లాడాలని పరితపించాడు కానీ వాళ్ళు అందుబాటులో లేనందువల్ల 'ఇంకా తెలవారదేమీ... ఈ చీకటి విడిపోదేమీ..' అని ఘంటసాల, బాలసుబ్రమణ్యంల లాగా రెండు గొంతుల్తో పాడుకుంటూ కాలక్షేపం చేశాడు.

మర్నాడు ఉదయం రామం కొవ్వూరు బయల్దేరేముందు సాయిలు గాడి హోటల్ దగ్గర ఇడ్లీలు తింటూ కనిపించారు చిన్నగురు రాజేంద్రనారాయణ, పెద్ద గురు మంగారావు.

సంతోషంతో వెలిగిపోతున్న రామం మొహం చూడగానే ఏదో విషయం ఉందని కనిపెట్టారు గురుపాదులు. చుట్టూ జనం ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ కొంచెం ఆగమని సంజ్ఞ చేశారు.

కాఫీ, ఫలహారాలు ఐన తర్వాత, జనం కొంచెం నిమ్మళించాక "ఏదో సాధించుకొచ్చినట్టున్నాడు మనవాడు" అన్నాడు రాజేంద్ర ఓ మూలగా కూర్చున్న తరువాత, ఇక చెప్పవచ్చు అన్న సంకేతాన్నిస్తూ.

"ఏమయ్యా యామం... ఏంటి విషయం?" అన్నాడు మంగారావు లోగొంతుకతో.

"నిన్న తనతో మాట్లాడాను" అన్నాడు రామం కొంచెం బిడియం, చాలా ఉత్సాహం నిండిన గొంతుతో.

"ఇంద్రాణితోనే" అన్నాడు రాజేంద్ర.

"తను అంటే... ఇంద్యానీయా" అన్నాడు మంగారావు ఏదో బిర్యానీయా అన్నట్టుగా.

ఇంద్రాణి పేరుని అంత దారుణంగా పలకవచ్చని మొదటిసారి తెలిసింది రామానికి.

నెమ్మదిగా నిన్న జరిగిన విషయం చెప్పాడు.

"జయిగినంత వరకు బాగానే వుంది యామం...నా అనుభవంతో చెప్తున్నాను. ఆ అమ్మాయి నీకిష్టమైన యంగు ఓణీ వేసుకుని ఒస్తుంది చూడు. అదే సిగ్నల్. నువ్వు మాటాడ్డం మాత్యం కంటిన్యూ చెయ్యి" అన్నాడు మంగారావు.

'యంగు ఓణీయా... ఓణీల్లో యంగు, ఓల్డు ఉంటాయా' అనబోయి, మంగాయావు బాషలో యంగు అంటే రంగు కూడా కావచ్చునని, సందర్భాన్ని బట్టిచూస్తే అదే కరెక్టని గ్రహించి ఊరుకున్నాడు రామం.

"ఆ అమ్మాయి మాట్లాడిందంతా బాగానే ఉంది కానీ జమాబందీ వాళ్లలాగా ఆస్థి లెక్కలెందుకో" అన్నాడు రాజేంద్ర.

"అమ్మాయిలు ముందు చూసేది అదేనోయ్... తయ్యాతే మన ఫేసు... యోగి వేమన ఏమన్నాడు?" అన్నాడు మంగారావు సాయిలు అందించిన బ్రూక్‌బాండ్ గ్రీన్‌లేబిల్ కాఫీ ఆర్చుకుని తాగుతూ.

సాయిలు కాఫీ కానీ, టీ కానీ కాసిన తర్వాత, కస్టమర్‌కి సర్వ్ చేసేముందు చేసే ప్రక్రియ చాలా గొప్పగా ఉంటుంది. గ్యాస్ పొయ్యి మీదే గిన్నెలోంచి గాజుగ్లాసులోకి, మళ్ళా గ్లాసులోంచి గిన్నెలోకి అలవోకగా జీడిపాకం తీసినట్టుగా నాలుగైదు సార్లు తిరగేసి ఇస్తాడు.

యోగివేమన మంగారావుని ఎక్కడ కలిసాడా అన్న మీమాంస ఒక్కక్షణం రామాన్ని పీడించింది. కొంపదీసి సాయిలు హొటల్లో ఇద్దరం టీ తాగేవాళ్ళం అని చెప్పడు కదా అని సందేహించాడు.

ఐతే అదృష్టవశాత్తూ మంగారావు ఆ పని చేయకుండా సరాసరి విషయానికొచ్చాడు.

"గణనలేని మొగని జూచిన ఆలి సయపీనుగ నడచివచ్చుచున్నదని గేలి చేయునన్నాడు. అంటే ధనం లేనివాడు చచ్చినవాడుతో సమానం" అన్నాడు

మంగారావు.

"అవునవును వేటగాడు సినిమాలో రావుగోపాలరావు కూడా అంటాడు రామారావుతో ... ధనం నాయనా మనిషిని నడిపించే ఇంధనం అని" రాజేంద్ర కూడా వంత పాడాడు.

ఇంతలో టీ పట్టుకొచ్చిన సాయిలు తిన్నగా ఉండకుండా "అయ్యా ఏమనగారు అన్నారో లేదో నాకు తెలవదు గానీ బద్దెనగారు మట్టికి సుమతి శతకంలో అన్నారండి గడన గల మగని చూచిన అడుగులకు మడుగు లిడు అతివలు, డబ్బు గడించడం ఉడిగిన మగని చూచి నడిచే పీనుగ వచ్చెనని నగుదురు సుమతీ" అన్నారండి అన్నాడు.

"ఎప్పుడ్రా...నీ హొటల్లో బద్దెనగారు టిఫిన్ తింటానికొచ్చినప్పుడా?" అన్నాడు రాజేంద్ర.

"ఆయ్... తమ కాతాలో వసూలు చేసుకోమని కూడా చెప్పారండి" కౌంటర్ వేశాడు సాయిలు.

"ఒక మంచి మాట ఎందరైనా చెప్పొచ్చు లేయా" అన్నాడు మంగాయావు సంధి సూచకంగా.

"కరెక్టండి... బద్దెనగారూ, ఏమనగారూ లేడీస్‌వల్లే దెబ్బతినుంటారండీ" అన్నాడు సాయిలు.

ఇంత అకస్మాత్తుగా తన బుల్లి ప్రేమకథలోకి వేమన లాంటి యోగులు, రావుగోపాల రావులాంటి గంభీరమైన విలన్లు వచ్చేసరికి రామం కొంచెం కంగారుపడ్డాడు.

ఇంతకీ రావుగోపాల్రావూ, యోగివేమనా ఏమీ అడ్డంపడరు కదా అని అడగబోయి "ఎలా ఉంది విషయం... కాయా? పండా?" అన్నాడు.

"ముగ్గిన పనసపండోయ్, మంగారావు చెప్పినట్టు కుంకుమ రంగు ఓణీలో నీ దేవి దర్శనం కోసం ఎదురు చూడు" అన్నాడు రాజేంద్ర.

ఇంతలో ఒకవైపునుండి ఇంద్రాణి, మరోవైపునుండి దుమ్ము రేపుకుంటూ బస్సూ వచ్చాయి.

ఇంద్రాణి కనీసం రామంవైపు చూసే ప్రయత్నం కూడా చేయలేదు. పైగా ఆమె నీలం రంగు ఓణీ వేసుకుంది.

రామం మొహం పాలిపోయింది. గొంతు తడారిపోయింది.

★ ★ ★

స్కూలుకి వెళ్ళాడేగానీ రామం మనసు మనసులో లేదు. "నీకు దేనివల్లైతే సంతోషం వస్తుందో, దానివల్లనే దు:ఖం కూడా వస్తుంది" అనే ఫిలాసఫీ అతడి విషయంలో నిజమైంది. అతడే కాదు చాలామంది విషయంలో అదే యధార్థం. కావాలనుకున్నది దొరికితే సంతోషం. అప్పుడు అది ఆనందానికి కారణం అవుతుంది. అదే అనుకున్నది అందకపోయిందా మళ్ళా అదే విషయం బాధకి కూడా కారణమవుతున్నది.

ప్రాప్తముంటే అందుతుంది. లేకపోతే అందదు అనుకోవడంలో ఓ సుఖముంది. ఆ భావన మనిషికి రీ కన్సైల్‌మెంట్ ఇచ్చి బాధని తగ్గిస్తుంది. కానీ ఈ తత్వం ఇక ఏదైనా విషయంలో అన్ని ప్రయత్నాలూ ఐపోయి ఇక ఖచ్చితంగా దొరకని వాటి విషయంలోనే అన్వయించుకోవాలి తప్ప అసలు ప్రయత్నమే ఎగ్గొట్టేదిగా ఉండకూడదు.

తను ఎందుకలా చేసింది? నిన్న అంత చక్కగా మాట్లాడిన అమ్మాయి ఈరోజు అలా ఉందంటే తనంటే ఇష్టం లేదా? తను పెద్ద ఫాషన్‌గా ఉండడు. మామూలు పల్లెటూరి పిల్లాడిలానే ఉంటాడు. కాని చూడ్డానికి బాగానే ఉంటాడే! తెల్లగా, పొడవుగా, మరీ సన్నమూ, లావూ కాకుండా అథ్లెటిక్ బాడీతో పాటు మహేష్‌బాబు ముక్కూ, ఒంపులజుత్తు, పెద్దగా ఉండే నుదురు, విశాల నేత్రాలు, పల్చటి పెదాలు అన్నీ బానే ఉంటాయే.

ఇవన్నీ ఉన్నా నచ్చాలని రూలేంలేదు కదా! జాణ అని రాజేంద్ర నారాయణ పిలిచే వాణి తెల్లగా ఉంటుంది. కానీ తనకి నల్లగా, మొరటుగా ఉండే మంగాయావు నచ్చాడు. ప్రచారంలో వార్తలే కనుక నిజమైతే ఊళ్ళో చాలామంది అమ్మా యిలకి అతడే నచ్చాడు. కాబట్టి ఇంద్రాణికి కూడా మొరటోడో, గూండా రౌడీలాంటి వాళ్ళంటే ఇష్టంకానీ కాదు కదా!

తనకు ఇష్టమైన రంగు అడిగీ మరొకటి వేసుకొచ్చిందంటే నువ్వంటే నాకిష్టం లేదు అని చెప్పడానికా? అలా చెప్పేందుకు తనేమీ 'ఇంద్రాణీ... నువ్వంటే నాకిష్టం' అని చెప్పలేదే? తన ఇష్టాన్ని అడగలేదే?

అసలు గట్టిగా మాట్లాడితే తెల్లగా ఉండే తోలు పిల్లలు నాకిష్టం ఉండరు అనుకున్నాడు రామం. అవును తనకి చామనఛాయగా ఉండే గోధుమవన్నె తాచులా మిలమిలా మెరిసే చర్మం ఉన్న అమ్మాయిలే ఇష్టం. అంతేకానీ పాలిపోయినట్టు, పాచిపోయినట్టు ఉండే తెల్ల బుడింగీలు తనకక్కరలేదు అనుకున్నాడు.

కానీ మరుక్షణమే మరో ఆలోచన వచ్చింది. పాపం ఇంద్రాణి పేద అమ్మాయి. తనకి అన్నిరకాల ఓణీలు ఉండాలని ఎక్కడ ఉంది? తను తెల్లగా ఉంటుంది కానీ

అది ఆ అమ్మాయి తప్పెలా అవుతుంది? తనేం కావాలని తెల్లగా పుట్టలేదు కదా? భగవంతుడు చేసిన తప్పుకి తనని నిందించడం సరికాదు. ఐనా తెల్లగా ఉంటుందన్న మాటేకానీ ఇంద్రాణి అందంగానే ఉంటుంది. కావాలంటే నల్లగా అవ్వొచ్చు, కానీ కష్టం. బజారులో ఫెయిర్ అండ్ లవ్లీ దొరుకుతుంది. కానీ బ్లాక్ అండ్ బ్యూటీ దొరకదు. పైగా అతడిని అనునయిస్తూ గురువులు మంగాయావు, రాజేంద్రలు ఏమీ కంగారు పడవద్దని పిల్ల లైన్లో పడేముందు ఇలాంటి ముక్తాయింపులు, సన్నాయి నొక్కులు సహజమని సెలవిచ్చారు. ఏదైనా సెలవివ్వడం సులభం. కానీ ఆచరించడం కష్టం.

కాగా ఇంటర్వెల్‌లో ఎదురైన ఇంద్రాణి చూసిన స్నేహపూరితమైన క్రీగంటి చూపు సన్నటి చిరునవ్వు అతడి తాత్విక చింతనకి అడ్డుకట్ట వేసాయి. మళ్ళా ఉత్సాహాన్ని నింపాయి.

★ ★ ★

పిల్లల్లో వచ్చే మార్పు సాధారణంగా తల్లికే ముందు తెలుస్తుంది. రామం మునుపటి కంటే ఉత్సాహంగా ఉండటం, అద్దం ముందు మామూలు కంటే ఎక్కువసేపు గడపటం తులశమ్మ దృష్టి దాటిపోలేదు. కొడుకులో వచ్చిన మార్పు సాధారణంగా ఆ వయసు పిల్లల్లో వచ్చేదే కావడంతో ఆవిడ పెద్దగా ఆందోళన పడలేదు.

కానీ తల్లిగా తన బాధ్యత విస్మరించలేదు. ఎంత మంచి పిల్లాడికయినా పెద్దలు చెప్పాల్సిన విషయాలు వాళ్ళ బాధ్యతగా చెప్తూనే ఉండాలి. ప్రహ్లాదశాస్త్రికి ఎంతసేపూ ఊరివాళ్ళని ఎలా అదుపులో పెట్టాలా అన్న ఆలోచన, దాని తాలూకు సమాలోచనలతోనే సమయం గడిచిపోతున్నది. కాగా తనే సమయం, సందర్భం చూసుకుని అతను బాధపడే రీతిలో పరుషంగా కాకుండా, మెత్తగానే చెప్పేది ఆమె.

"మనకి విద్యే నిజమైన ఆస్థి నాయనా. బ్రాహ్మడికి ఏం లేకపోయినా ఫర్వాలేదు. చేతిలో ఏదో ఒక విద్య ఉంటే చాలు బతికేయొచ్చు... సమాజంలో రాణించవచ్చు. మనకే కాదు, ఎవరికైనా చదువే ఆస్థి. జ్ఞానం సమాజాన్ని శాసించింది. నిన్నటిదాకా అది వేదం. ఈ రోజు అది వైద్యం, ఇంజనీరింగ్. రేపు మరొకటి కావచ్చు. సరస్వతి స్వరూపం మారవచ్చు కానీ మూలం మారదు. ఇది గుర్తుంచుకో నాయనా. పెద్దల మాట చద్దిమూట" అని చెబుతూ ఉండేది.

ఆ మాటలు రామం మనసులో గాఢంగా ముద్రించుకుపోయాయి. అమ్మ చెప్పినట్టు ఎంత ఆస్థి ఉన్నా చదువుకోనివాడికి సమాజంలో చిన్నచూపే. మంగాయావుకి ఎంత ఆస్థి ఉన్నా ఊళ్ళో అతన్ని ఓ పోరంబోకులానే చూస్తారు. కారణం అతడు

ఇంటర్మీడియెట్ పరీక్షలని చేధించలేకపోవటమే. అతడికి ఇంటర్ గజనీ మహమ్మద్ అనే పేరు కూడా ఉంది. ఆడవాళ్ళు అర్థమైనట్లుగా అతడికి ఇంటర్ సబ్జెక్టులు అర్థం కాలేదు.

దాంతో తనకి వచ్చిన పని చేసుకుంటూ, వ్యవసాయం, వ్యాపారం చూసుకుంటూ బండి లాగిస్తున్నాడు మంగాయావు.

కానీ తను అతనిలా బతకలేడు. తనకి గౌరవం కావాలి. సమాజంలో విలువ ఉండాలంటే చేతిలో విద్య తప్పనిసరి అనుకున్నాడు రామం.

★ ★ ★

రామానికి కళ్ళు పెద్దవయ్యాయి. నోరు అతని ప్రయత్నం, ప్రమేయం లేకుండానే తెరుచుకుంది. ఆ రోజు ఇంద్రాణి చాలా ప్రత్యేకంగా కన్పిస్తుంది. తలారా స్నానంచేసి, పాపిట దువ్వి జుట్టు వెనక్కి వదిలిందేమో అలలు, అలలుగా ఎగురుతున్న ఆమె కురులు శ్రావణ మేఘాలను తీసిపడేసేలాగా నల్లగా, చిక్కగా ఉన్నాయి.

కోలగా ఉండే కళ్ళు కాటుక దిద్దటంతో నల్లగా మిలమిలలాడుతున్నాయి. తీర్చి దిద్దినట్టుండే ముక్కు చిత్రకారుడు ఆర్తితో గీసినట్టుండే పెదవులు, మన్మథుడి విల్లు అప్పుడప్పుడే ప్రాణం పోసుకున్నట్లుండే ఒళ్ళు...ఇవేవీ కావు రామాన్ని కట్టిపడేసినవి... ఆమె కట్టుకున్న కుంకుమ రంగు ఓణీ... దానికి మాచింగ్‌గా వేసుకున్న క్రీం కలర్ జాకెట్.

తిన్నగా రామం దగ్గరగా వచ్చి "భోజనాల టైంలో పక్కనే ఉన్న కోవెలకు రా రామం" అనేసి చిరునవ్వుతో వెళ్ళిపోయింది.

రామానికి సంతోషంతో ఉత్సుకతతో సమయం భారంగా గడిచింది. ఆమె నవ్వు మాటిమాటికీ కళ్ళముందు కనబడుతుంటే ఏదో తెలియని హాయి.

భోజనాల గంట మోగగానే బయటకు పరుగెత్తాడు రామం. మిగతా నేస్తాలు కలిసి భోంజేయడానికి పిలుస్తున్నా పట్టించుకోకుండా.

ఆలయంలో ఎవరూ లేరు. నూతి దగ్గర కాళ్ళు, చేతులు కడుక్కుని బాదం చెట్టు పక్కనే ఉన్న మండపంలో కూర్చున్నాడు రామం, అన్నం క్యారేజి, పుస్తకాల సంచీ పక్కన పెట్టుకుని.

కొంచెం సేపటికి వచ్చింది ఇంద్రాణి. గర్భగుడి వైపు రెండుచేతులతో మొక్కి తను కూడా నూతినీళ్ళతో కాళ్ళు, చేతులు కడుక్కుని కొన్ని బాదం ఆకులు బాగా పెద్దవి ఏరి శుభ్రంగా కడిగి తీసుకువచ్చింది.

రామానికి కొంచెం దూరంగా కూర్చుని తన అన్నం కారేజీ విప్పుతూ అంది "ఈరోజు నా పుట్టినరోజు రామం. అందుకే నీకు భోజనం తెచ్చాను" అని

"హాపీ బర్త్‌డే టుయూ" అన్నాడు రామం.

"థాంక్స్... కాని నాకు తెలుగులో చెప్పితే నచ్చుతుంది" అంది పాయసం వడ్డిస్తూ.

"జన్మదిన శుభాకాంక్షలు... పోనీ పుట్టినరోజు అభినందనలు" అన్నాడు రామం.

అతడికిదంతా కలలా ఉంది. ఆమె, తను ఈ ఏకాంతం ఎంతో బాగున్నాయి. ఎప్పుడూ ఇలానే ఉండిపోతే ఎంత బాగుంటుందో అనిపించిందతనికి.

ఆమె చేతి గాజుల గలగలలు, ఆమె శరీరంనుంచి వచ్చే వింత పరిమళం, శీతాకాలపు నులివెచ్చని ఎండ, చల్లగా వీచే గోదావరి గాలి... అనుభవం, అనుభూతే తప్ప వివరణలకు, వర్ణనలకు లొంగనివి కొన్ని ఉంటాయి. అలాంటిదే ఆ పూట ఆ అమ్మాయితో కలిసి భోజనం చెయ్యడం.

తను తెచ్చిన వంటకాలని చూసేసరికి రామం మనసు నిండిపోయింది. అటుకుల పులిహోర, ఆవ పెట్టిన పనసపట్టు కూర....

నువ్వంటే నాకిష్టం అని వంద మాటలు చెప్పక్కర్లేదు. ఒక్క చిన్నపని, నీ ఇష్టాన్ని నేను గౌరవిస్తాను అన్న చిన్న సంకేతం చాలు.

"నేనున్నానని నిండుగా పలికే తోడొకరుండిన.... అదే భాగ్యమూ, అదే స్వర్గమూ" ఎక్కడినుంచో పాట గాలిలో తేలుతూ వస్తోంది.

★ ★ ★

ఆ రోజు ఇంద్రాణితో జరిగిన సంభాషణ గానీ, కలిసి భోజనం చేసిన సంగతి గానీ రాజేంద్రతోనూ, మంగాయావుతో కానీ చెప్పలేదు రామం.

ఇంద్రాణితో స్నేహం చేయాలని కేవలం గొప్పకోసమే అనుకున్నా తనతో పరిచయం అలాంటి కృత్రిమ గొప్పలకంటే ఉన్నతమైనదని తోచింది రామానికి.

"ముందే చెబితే ఏదైనా గిఫ్ట్ తెచ్చేవాడ్ని కదా" అన్నాడు రామం.

"నీదికానిది నువ్వు ఇవ్వలేవు రామం" అంది ఇంద్రాణి.

"అంటే" అన్నాడు రామం.

"మనం సంపాదించిందే మనది అవుతుంది. మనకి సంక్రమించింది వారసులది అవుతుంది. మనం ఇంకా సంపాదించే స్థితికి రాలేదు. కాబట్టి ఏమీ ఇచ్చిపుచ్చుకోలేము. కానీ ఒకటి అడుగుతాను ఇస్తావా?" అంది.

తప్పకుండా అన్నట్టు తలాడించాడు రామం.

"నువ్వు స్కూలు ఫస్ట్ రావాలి రామం. నీ తెలివితేటలు వృధా పోకూడదు. నీకంటే తక్కువ తెలివి ఉన్నవాళ్ళ కన్నా నువ్వు వెనకపడితే చూడ్డం నాకిష్టం వుండదు" అంది ఇంద్రాణి.

"ప్రయత్నం చేస్తాను...కానీ ఇంత లోతుగా ఎలా మాట్లాడగలుగుతున్నావు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"మన చుట్టూ ఉండే పరిస్థితులే పెద్ద గురువులు రామం... గోదావరిని చూడు... లోతు ఎంత ఎక్కువ ఉంటే వడి అంత ఎక్కువ ఉంటుంది" అని నవ్వింది.

ఆ వయసులో అతడికి తెలియదు కానీ... ఉన్నత వ్యక్తిత్వం కలిగిన ఏ స్త్రీ అయినా నిజంగా ఎవరినైనా ఇష్టపడితే అతడు జీవితంలో పైకి రావాలని కోరుకుంటుంది. అంతేకానీ పనులు మానుకుని వాజమ్మలాగ తనచుట్టూ తిరగాలని కోరుకోదు.

ఇష్టం అనేది ఈ వయసులోనే కలగాలి... ఫలానా వయసులో కలగకూడదని నిబంధనలేమీ లేవు ప్రకృతిలో.

కానీ ఓ మంచి అమ్మాయికి ఇష్టం కలగడం మాత్రం నిజంగా... అదృష్టమే.

# 5

ఆ తర్వాత రామం జీవితంలో చాలా మార్పులు చాలా వేగంగా చోటు చేసుకున్నాయి. పదవ తరతరగతి పరీక్ష దగ్గర పడుతుండటంతో రామం చదువుమీద దృష్టి పెట్టాడు. రాజేంద్రతోనూ మంగాయావుతోనూ కనబడడం బాగా తగ్గింది.

ఓ రోజు సాయిలు దగ్గర కాఫీ తాగుతుంటే అతడడిగాడు "ఏంటి రామం బాబూ... ఈ మధ్య రావడం తగ్గించారు?" అని.

"ఏం లేదు సాయిలూ పరీక్షలు కదా.. అందుకనే" అన్నాడు.

"బాబూ... మేం యాపారం చేసుకునేవాళ్ళం... మామూలుగా ఎవరిగురించీ ఓ మాట అనం. కానీ తమరు చిన్నప్పటినుంచీ తెలిసినవారు... వయసులో చిన్నవారు... అందుకే సొతంత్రించి ఓ మాట చెప్తాను... ఆ రాజేంద్రబాబు స్నేహితం కానీ, మంగారావు స్నేహితం కానీ తమరికి తగ్గవి కాదు బాబూ. తమరీ ఊరికి యువరాజు. కానీ ఏ రోజూ తమరిలో ఆ గీర్మాణం సూడ్లేదు అంటే మహాతల్లి తుల శమ్మ గారి పెంపకం అసుంటిది. ఆరికీ తమరికీ సాపత్తమే లేదు బాబూ" అన్నాడు.

స్వంత ఊళ్ళో తన మిత్రుల పేరు చివరికి కాఫీ హోటల్ వాడి దగ్గర కూడా ఎలా మారుమోగిపోతోందో చూసి ఆశ్చర్యపోవడం రామం వంతైంది.

నవ్వి తలూపాడు రామం. మన మంచి కోరేవాళ్ళు మనచుట్టూ ఉంటారు. వాళ్లని గుర్తించడంలోనే మన విజ్ఞత దాగి ఉంది.

★ ★ ★

రామం పేరు కూడా మారుమోగిపోయింది. కాకపోతే మంగాయావు, రాజేంద్ర అంత స్థాయిలో కాదు. అతడు పదవతరగతి పరీక్షల్లో స్కూలు ఫస్ట్ కాదు... జిల్లాకి ప్రథముడుగా నిలిచాడు.

ప్రహ్లాదశాస్త్రి ఆనందానికి అంతులేదు. "పులి కడుపున పిల్లి పుడుతుందా?" అన్నారాయన. పులికి పురుడు పోసినవాళ్ళు కానీ, పులి ప్రసవిస్తుండగా చూసినవాళ్ళు కానీ ఆ చుట్టుపక్కల లేపోవడంతో ఎవరూ మాట్లాడేదు.

తులశమ్మ అయితే దేవాలయానికి వెండి కలశం సమర్పించుకుంది. ప్రత్యేక అభిషేకాలూ, అర్చనలూ సరేసరి. అన్నదానం ఎప్పుడూ ఉండేదే.

రామానికి మాత్రం ఇంద్రాణి ఎప్పుడు కలుస్తుందా అనే ఉంది. చివరికి ఆ రోజు రానే వచ్చింది. మార్కుల లిస్టు తీసుకోవడానికి వెళ్ళినప్పుడు కోవెలలో కలిశారు ఇద్దరూ.

"చాలా సంతోషంగా ఉంది రామూ" అంది. అతడి కుడిచేతిని తన కుడిచేతిలోనికి తీసుకుని అభినందనపూర్వకంగా ఒక్కక్షణం పట్టుకుని వదిలింది.

అది అతడికి వయసు వచ్చాక తొలి స్త్రీ స్పర్శ. అందులోనూ తను ఎంతో ఇష్టపడే, తనని ఇష్టపడే అమ్మాయి చేతి స్పర్శ.

ఒళ్ళంతా ఒకసారి ఝుల్లుమంది.ఒకే ఒక్క క్షణం ఇళయరాజా వెయ్యి వయొలిన్‌లు మోగించి అదృశ్యమయ్యాడు. ఒక్క క్షణం వాయుదేవుడు గాలిలో కోట్లగులాబీ పరిమళాలు వీచాడు. ఒక్కక్షణం ఆకాశం మెరుపులా తరళాయతమైంది.

"నీవల్లే" అన్నాడు.

"కాదు... రామూ.. నీలో తెలివితేటలు ఉన్నాయి. నేను ఉత్ప్రేరకాన్ని ఐతే కావచ్చు. అలా అని మొత్తం ఘనత నాకు ఆపాదించకు. ఒక విషయం చెబుతా ఏమీ అనుకోకు రామూ. మా పెద్దమ్మగారి అబ్బాయి... చిన్నప్పటినుంచి అన్ని తరగతుల్లో ఫస్టే. అలా వాడికి మితిమీరిన గర్వం పెరిగింది. చివరికి ఎందుకూ కొరగాకుండా తయారయ్యాడు. మనసులోకి గర్వం రానివ్వకు రామూ. ఇంకా ఏదైనా సాధించాలి

అని అనుకో కానీ ఇప్పుడే అన్నీ ఐపోయాయనుకోవద్దు" అంది ఇంద్రాణి.

అందరూ రోజూ అనేక జీవితాలు చూస్తుంటారు. కానీ వాటిల్లోంచి పనికొచ్చేది తీసుకోవడం కొందరికే తెలుస్తుంది.

ఆ రోజు ఆమెని కలవడం రామానికి చాలా లాభించింది. లేకపోతే చుట్టూ ఉన్న భజన బృందం అతడ్ని ఆకాశానికి ఎత్తుతూ చాలా తొందరగా అతడి పతనానికి కారణమయ్యేవారే.

పదవతరగతి, ఇంటర్ వరకూ బాగా చదివిన కొంతమంది విద్యార్థులు తర్వాత సరిగా చదవకపోవడానికి కారణం ఆ రిలాక్సేషనే. ఇంజనీరింగ్, మెడిసిన్‌లో చేరిన మొదటి సంవత్సరం స్టూడెంట్సు వెనుకపడటానికి కూడా ఇదే కారణం.

★ ★ ★

ఐతే ఆ ఘట్టన అతడికి పూర్తిగా మంచే జరిగిందని చెప్పలేం. ఎందుకంటే అతడ్ని గారంటీగా ఇంజనీరింగ్ సీటు తెప్పించే ఓ ఫాక్టరీలో చేర్పించారు. అదీ రాజమండ్రిలో. ఊరి పేరుకి అది కాలేజీనే కానీ హిట్లర్ నడిపిన కాన్సంట్రేషన్ కాంపు నమూనాలా ఉంది.

అక్కడ ఎవరూ జీవించరు. కేవలం బతుకుతారు, ఆ బతికేది కేవలం ఎమ్సెట్‌లో సీటుకోసం. అన్నం తినేది, నిద్రపోయేది మేలుకునేది, అన్నీ ఆ సీటుకోసమే.

రోజూ రాజమండ్రి వెళ్ళిరావడం ఇబ్బంది కనుక ప్రహ్లాదశాస్త్రి తల్లిగారి అప్పగారి కొడుకు ఇంట్లో బస ఏర్పాటు చేశాడు.

రామం పెదనాన్న గారి ఇద్దరు పిల్లలు అదే చదువుల ఫ్యాక్టరీలో బాలకార్మి కులుగా చేరి పెద్దవాళ్ళై ఇంజనీరింగ్, మెడిసినూ వైజాగులో చదువుతున్నారు.

ఇంద్రాణి కొవ్వూరులోనే ఉన్న జూనియర్ కాలేజీలో చేరింది.

రాజేంద్ర కూడా అదే ఫ్యాక్టరీలో భర్తీ అయ్యాడు. అతగాడు రామంకంటే ఒక సంవత్సరం పెద్దవాడైనా పునాది గట్టిగా ఉండాలనే సూక్ష్మగ్రాహి కావడంవల్ల పదవతరగతి బోర్డువారి సహకారంతో రెండుసార్లు అధ్యయనం చేశాడు. గిట్టనివాళ్ళు అతడు ఫెయిలయ్యాడంటారు. లోకులు కాకులు అన్నమాట ఊరకే రాలేదు కదా!

ఐతే చదువు ఫ్యాక్టరీలో ఒక్క ఉదుటున తొందరపడి పాసయినవాళ్ళకే అదీకాక, తొంభయి శాతం పైన మార్కులు సంపాదించిన 'మెరిట్' గాళ్ళకే సీటు. కానీ ఆ ఫ్యాక్టరీ వాళ్ళు కూడా రామం తండ్రిగారికి దూరపుబంధువు కావడంతో సైంధవుడు వలె అడ్డుపడకుండా ఏ పుట్టలో ఏ పాముందో, ఇతగాడిలో ఏ విద్యుత్తు దాగుందో

అని సర్పన్యాయాన్ని పాటించి, పాము కోటాలో అతగాడికి సీటు ఖాయపరిచారు.

అలా రాజేంద్రకూడా అక్కడికి తయారయ్యాడు.

★ ★ ★

గ్రౌండు లేనిదే పర్మిషన్ ఇవ్వమన్న ప్రభుత్వ నిబంధన ప్రకారం ఇష్టం, అవసరం లేకపోయినా ఆ స్కూలు కమ్ కాలేజివాళ్ళు ఓ గ్రౌండు ఏర్పాటు చేశారు.

ఓ రోజు సాయంత్రం అక్కడ వాలీబాల్ ఆడుతున్నాడు రామం. అతడు సహజంగా మంచి ఆటగాడు. రాజేంద్ర పెద్ద ఆటగాడు కాకపోయినా అతనూ సరదాగా ఆడుతున్నాడు.

రామం టీముకి అటుపక్క ఆడుతున్నది కొవ్వూరు నుంచి వచ్చే కావూరి సుబ్బారాయుడు గారి దత్తుడు వెంకటరాయుడు అతని స్నేహితుడు. రామం నెట్ పైకి ఎగిరి కొడుతున్న స్మాష్‌ను బ్లాక్ చెయ్యలేకపోతున్నారు వాళ్ళు.

"పప్పు దప్పళం తిన్నా బాగానే కొడుతున్నాడురా" అన్నాడొకడు.

"వీళ్ళు పప్పు తింటే చికెను మటనూ రేట్లెందుకు పెరుగుతున్నాయిరా" అన్నాడింకొకడు.

రామానికి కోపం వచ్చింది. "మేం ఏం తిన్నా మా స్వంతందే తింటున్నాం. బావ మరుదుల్ని చంపి వాళ్ళ ఆస్తులేమీ తినడం లేదు" అన్నాడు.

వెంకటరాయుడి తండ్రి తన బావమరిదిని చంపి ఆస్తి కాజేశాడని ఓ పుకారు చాలా గట్టిగా ఉంది ఆ ప్రాంతంలో.

"ఏంట్రా పంతులూ వాగుతున్నావ్?" అంటూ మీదికి వచ్చాడు రాయుడు.

"రాయుడూ తప్పుమీది. ఆడుకుంటున్న కుర్రాడిని మాటలతో రెచ్చగొట్టింది మీరు. ఇది ఇక్కడితో ఆపితే మంచిది" గంభీరంగా వినపడింది.

అందరూ తల తిప్పి చూశారు. ఎవరా మాట అన్నది.... అంత ధైర్యంగా అని.

కొవ్వూరు ఇసుక వీధి కుర్రాడు జేమ్స్ సుధాకర్ నుంచున్నాడక్కడ.

"వీడి గొడవ నీకెందుకోయ్... నీ దారిన నువ్వు పో" అన్నాడు రాయుడు గాంగ్‌లో ఒకడు.

"ఇతన్ని నేను స్కూల్లో చూశాను... ఎవరి జోలికీ వెళ్ళడు. వాడిని వంటరి చేసి ఏడిపించడం మంచిపద్ధతి కాదు. వదిలేయండి" అన్నాడు సుధాకర్.

"వదలకపోతే?" అన్నాడు రాయుడు.

"ఓసారి నన్ను ముప్పియ్యారు అన్నందుకు ఏమయిందో గుర్తుకు తెచ్చుకో" నవ్వుతూ అన్నాడు సుధాకర్.

అసలు అలాంటి సమయంలో అతడు ఎలా నవ్వగలుగుతున్నాడో అర్థం కాలేదు రామానికి.

అతన్ని స్కూల్లో చూశాడే కానీ పెద్దగా పరిచయం లేదు.

కోస్తా ప్రాంతంలో రైతు పిల్లలు హాస్టల్స్‌లో ఉండి చదువుకునే దళిత పిల్లల్ని ఏడిపించే విధానం అది. హాస్టల్ పిల్లలు ముప్పై ఆరుని ముప్పియ్యారు అని పలుకుతారు. అది కేవలం యాస మాత్రమే. అయితే దళిత పిల్లల్ని గేలి చేసి, హింసించి ఆనందం పొందే క్రూరమైన, నీచమైన మనస్తత్వానికి అది చిహ్నం.

సుధాకర్ కొవ్వూరు వాడైనా వాళ్ళ నాన్న ఉద్యోగరీత్యా వేరే వేరే ఊళ్ళలో ఉండడంతో అతడు స్కూల్లో కొత్తపిల్లాడిలా కన్పించాడు. అతడి పేరుని బట్టి, రంగుని బట్టి కులం కనిపెట్టిన రాయుడు ఓసారి స్కూల్లో "రేయ్ ముప్పై ఆరు అనరా" అన్నాడు.

"ఏం అనాల్రా ముప్పై ఆరనా?" అన్నాడు సుధాకర్.

"ఏంట్రా వీడు బాగానే పలుకుతున్నాడు" అని అంతలోనే వాడు తనని రా అన్నాడని గుర్తొచ్చి

"ఏరా... బలిసిందా.... నన్ను రా అంటున్నావ్?" అన్నాడు.

"బాగా పలక్కపోవడానికి మేం మీలా చద్దన్నం తినే దద్దమ్మలం కాదురా. మేం టిఫిన్ తింటాం... నువ్వు నన్ను రా అంటే నేను నిన్ను రా అనే అంటానురా" అన్నాడు సుధాకర్.

"నా కొడకా..." అంటూ రాయుడు, అతని చుట్టూ ఉన్నవాళ్ళు సుధాకర్‌ని కుమ్మేశారు.

అయితే ఆ ఆనందం పూర్తిగా అనుభవించకుండానే ఇసుకవీధి నుండి వచ్చిన పెద్దబాచ్ రాయుడు వాళ్ళని ఎలా కొట్టారంటే... ఆ తర్వాత వారం ఏ ఒక్కడూ సరిగా నడవను కూడా నడవలేకపోయారు. ఇప్పుడదే గుర్తు చేశాడు సుధాకర్.

చేసేదేం లేక గురగురా చూస్తూ వెళ్ళిపోయాడు రాయుడు.

రామం కృతజ్ఞతగా సుధాకర్ వైపు చూశాడు. "టీ తాగుదామా" అన్నాడు అంతకన్నా ఇంకేం మాట్లాడాలో తెలియక.

"సరే పద" అన్నాడు సుధాకర్.

రాజేంద్ర కోసం చుట్టూ చూసేసరికి అతను ఎక్కడున్నాడు? పుంజాలు తెంపుకుని ఎప్పుడో పారిపోయాడు.

★ ★ ★

"లోకువగా కనిపిస్తే ఏడిపించే శాడిస్ట్‌లు చాలామంది ఉంటారు రామం. కొంద రికి కులం, కొందరికి మతం, కొందరికి ప్రాంతం ఇలా అవతలివాడ్ని తక్కువ చేసి తద్వారా తాము గొప్ప అనుకోవడం వాళ్ళకి సరదా. ఎందుకంటే ఇలాంటివాళ్ళకి చెప్పుకోదగ్గది ఏదీ ఉండదు. ఆడవాళ్ళు కనబడితే మగవాళ్ళు ఎందుకు ఏడిపిస్తారు? అదే ఆడాళ్ళు మగాళ్ళని ఎందుకు ఏడిపించరు? .... లోకువ ... లోకువ ఇవ్వకూడదు.... ముతక సామెతైనా లోకువగా కనబడితే కాకులు ఏదో చేశాయన్నది నిజం" అన్నాడు సుధాకర్ టీ తాగుతూ.

"అది సరే నన్ను ఏడిపిస్తుంటే అడ్డం ఎందుకు వచ్చావు? వాళ్ళు నిన్నేమైనా చేస్తే?" అన్నాడు రామం.

"చెయ్యనీ... అవమానం పడుతూ బతకడం కంటే... తిరగబడి చావడం మంచిది" అన్నాడు సుధాకర్.

"నువ్వు మంచివాడివని తెలుసు. కాబట్టి అలా చేయాలన్పించింది... నాకు కులాల మీద నమ్మకం లేదు.... మనుషుల్లో రెండే కులాలు. మంచివాళ్ళు... చెడ్డవాళ్ళు... మనదే కదాని కొరకంచు తీసి కొంప అంటించుకోం కదా... స్నేహానికి మనిషి ప్రధానం, కులం కాదు" అన్నాడు సుధాకర్.

"సర్లే వాళ్ళ గొడవ ఎందుకు వదిలేయ్... వాళ్ళు చదువు కోసం కాదు వచ్చేది... నువ్వేం చేద్దామనుకుంటున్నావ్?" అడిగాడు రామం.

"కంప్యూటర్ సైన్స్ తీసుకుందామనుకుంటున్నాను.... సి.ఎస్.సికి మంచి ఫ్యూచర్ ఉంది" అన్నాడు సుధాకర్.

"నేను కూడా అదే తీసుకోనా?" అడిగాడు రామం.

"ముందు నీకు ఏది ఇష్టమో చూసుకో... నాకు కంప్యూటరంటే ఆసక్తి ఉంది... అలానే కెరీర్ కూడా బాగుంటుందని తీసుకుంటున్నాను" అన్నాడు సుధాకర్ బదులుగా.

★ ★ ★

"ఏం రాజేంద్రా... అదృశ్యవిద్య ఎప్పటినుంచి సాధన చేస్తున్నావు? చటుక్కున మాయమైపోయావు?" అడిగాడు రామం మర్నాడు క్లాస్‌రూంకి రాగానే.

"ఏం లేదు... హఠాత్తుగా కడుపు తిప్పితే రూంకి వెళ్ళాను" అన్నాడు రాజేంద్ర.

"ఆ కిరస్తానీ వాడికి భయం లేదు సుమా" అన్నాడు మళ్ళా.

"అతనికో పేరుంది... తెలియకపోతే తెలుసుకో... సుధాకర్ అతని పేరు" అన్నాడు రామం.

"ఓహో... కొత్త స్నేహితుడన్నమాట.. బావుంది.... ముందొచ్చిన చెవులకంటే వెనుకొచ్చిన కొమ్ములు వాడి" అన్నాడు రాజేంద్ర వ్యంగ్యంగా.

"నాకు అర్థమైంది... కొత్తా.. పాతా... కులం... గోత్రం కాదు... మనుషులు రెండు రకాలు.... రెండే రకాలు.... మనకి పనికొచ్చేవాళ్ళు... పనికిరానివాళ్ళు" అంతే వెటకారంగా అన్నాడు రామం.

సంభాషణ ఎటో పోతుందని గ్రహించి "అయినా ఆ శూద్రపు వాళ్ళకి ఏం పొగరు? సహాసనమభిప్రేప్సురుత్క ృష్టస్యాపకృష్టజః కట్యాం కృతాంకో నిర్వాస్య: స్ఫిచం వా:స్యావకర్తయేత్ అన్నారు. మన బ్రాహ్మణులతో సమానంగా ఉన్న కుర్చీలో కూర్చునే అర్హత కూడా శూద్రుడికి లేదు అని మనువు చెప్పాడు. అలా కూర్చున్నవాడి నడుము మీద కఱ్ఱు కాల్చి వాత పెట్టమన్నారు. అలాంటివాళ్ళు మనల్ని దూషించే, ఎగతాళి చేసే స్థాయికి చేరారు. చూశావా ఈ దారుణం?" అన్నాడు విషయాన్ని పక్కదోవ పట్టించే ఉద్దేశ్యంతో.

"మహబాగా సెలవిచ్చావు. కానీ ఆపు. ధర్మాలు మనం చెప్పినవే... తనకు మాలిన ధర్మం ఉండదని ఊరికే అనలేదు. మనకి పనికొచ్చే విధంగా మనకి అనుకూలంగా ఉండే విధంగా మనం రాసుకున్న, గట్టిగా మాట్లాడితే పుట్టించిన శాస్త్రాలు అవి... ఇంకా వర్ణ ధర్మాలు అని వ్రేలాడతావేం..? శూద్రుల్ని మనక్రింద, క్షత్రియ, వైశ్యుల కిందా పడి ఉండమని మనువు అన్నాడు. మరి ఇప్పుడు శూద్రుడే రాజయ్యాడు... దీన్ని మార్చేద్దామా? అక్కడితో ఆపు... ఎవడో చెవలాయి చెప్పినట్టుగా గాయత్రీ మంత్రాన్ని తిరగేసి చదివి రాయుడికి చేతబడి చేద్దామని పిచ్చి సలహాలు ఇచ్చి టైం వేస్టు చేయక, చదువు మీద దృష్టి పెట్టు" అన్నాడు రామం.

ఈ బాణం కూడా గురితప్పడంతో రాజేంద్ర అయిష్టంగానే పాఠంమీద దృష్టి పెట్టాడు.

★ ★ ★

ఎంసెట్ రాసి ఇంటికొచ్చాడు రామం. చదువు పాడవుతుందని అప్పుడప్పుడూ తాము వెళ్ళి చూడటమే కానీ రామానికి ఇంటికి వచ్చే అవకాశం ఇవ్వలేదు ప్రహ్లాదశాస్త్రి.

స్నానం చేసి కొత్తగా అలవాటైన లుంగీపంచ, చొక్కా వేసుకుని అమ్మ వండిన పాయసం, గారెలు తింటున్నాడు రామం. ఎప్పుడూ చూసే ఇల్లు ఐనా చాలాకాలం తర్వాత చూస్తుంటే కొత్తగా ఉంది.

ఊళ్ళో రామం లేనప్పుడు జరిగిన విషయాలు చెప్పుకొస్తూంది తులశమ్మ. వాటిల్లో పిడుగుపాటు లాంటి మాట ఒకటి వచ్చింది.

“మన ఇందూ లేదూ... ఇంద్రాణి.... తనకి హఠాత్తుగా పెళ్లయిపోయిందిరా రామం. వాళ్ళకి బంధువులే అవుతారు. అబ్బాయి పెద్దగా చదువుకోలేదు. పౌరోహిత్యము అదీ చేస్తాడట. కొద్దోగొప్పో పొలం ఉందనుకుంటా... పిల్లాడికి తండ్రి లేదు... తల్లి కూడా ఇవాళా రేపా అన్నట్టుగా ఉందట... గుండెకు సంబంధించి ఏదోనట.... పిల్లాడి పెళ్ళి చూసి తృప్తిగా కన్ను మూయాలనుకుందట... అప్పటికప్పుడు పిల్ల ఎక్కడ దొరుకుతుంది? పైగా పిల్లాడికి నౌకరీ కూడా లేదాయె... గోత్రం... జాతకం అన్నీ కుదిరి దొరికిందే మహాభాగ్యమని ముడిపెట్టేసింది. చారికి మాత్రం గొప్ప సంబంధం తెచ్చి చేయగల స్థితి ఎక్కడుంది? పిల్ల పెట్టి పుట్టింది... కానీ ఖర్చు లేకుండా మంచి ఇంటికి వెళుతుందని పెళ్ళి చేసేసి కాపురానికి పంపేశాడు... ఆ పిల్లకి చదువుకోవాలని ఉంది కామోసు.... వద్దని చాలా ఏడ్చిందట... కానీ ఈ సంబంధం తప్పితే తను మళ్ళా పెళ్ళి చేయలేనని చారి పట్టుపట్టి చేసేశాడు...”

అప్పటికే రామం వినడం లేదు

★ ★ ★

దు:ఖం రెండు రకాలు. ఉప్పొంగి వరదలా వచ్చేది, ఊబిలా నెమ్మదిగా చుట్టుకునేది. మొదటిరకం దు:ఖంతో ఓ సుఖముంది. గట్టిగా ఏడుపు వస్తుంది. ఎంత త్వరగా వస్తుందో అంతే త్వరగా ఉపశమనం కూడా లభిస్తుంది.

చావంతా రెండో రకంతోనే. చాలా నెమ్మదిగా చుట్టుముడుతుంది. కానీ బయటపడటం కష్టం. ఆ బాధ అనుభవించే వాడికే అర్థం అవుతుంది.

మెత్తటి కత్తి గుండెలో నిశ్శబ్దంగా దిగితే ఎలా ఉంటుందో అలా ఉంటుంది. పక్కవాడికి ఏమీ తెలీదు, మెదడంతా పని చెయ్యడం మానేసి దిమ్ముగా అయిపోయి, ఉందో లేదో తెలీకపోతే ఎలా ఉంటుందో అలా ఉంటుంది.

అలా ఐపోయిన బీడులో అకస్మాత్తుగా పళుక్కుమంటూ నెర్ర విచ్చుకున్నట్లు ఓ స్పృహ విచ్చుకుంటుంది. ఓ జ్ఞాపకం నాగటికొమ్ములా గుచ్చుకుంటుంది.

కళ్ళల్లో నీళ్ళు రావు... కానీ ఉన్న నీరు ఇంకిపోయి నిర్జీవం మేటవేస్తుంది.

జీవితంలో మొదటిసారి అంత దు:ఖాన్ని, అలాంటి దు:ఖాన్ని అనుభవిస్తున్నాడు రామం. సైకిలెక్కాడు. అతనికి తెలియకుండానే అతని సైకిలు కొవ్వూరు దారి పట్టింది. సైకిలు వేగంగా తొక్కుతున్నాడు రామం. గోదారి గాలి కూడా అతడి చెమటల్ని ఆపలేకపోతోంది. తెలీని భయం ఒళ్ళంతా పాకి జ్వరం వచ్చినట్టు వెచ్చగా మారింది. తన అనేవాళ్ళు అందర్నీ పోగొట్టుకుని పై పటేల్ పడే జలదరింపు... అప్పటికి యన్‌మార్టెల్ తన లైఫ్ ఆఫ్ పై రాయలేదు కానీ రామం ఉన్న స్థితి మాత్రం అదే.

అతడికి తెలీకుండానే అంబేద్కర్ బొమ్మ వెనుకున్న ఇసుకవీధికి వెళ్ళాడు.

"సుధాకర్.... జేమ్స్ సుధార్ ఇల్లెక్కడ?" ఎవర్నో అడిగాడు.

"రండి... చూయింతాను..." అని ఓ డాబా ఇంటికి తీసుకెళ్ళాడు.

సుధాకర్ అమ్మ వచ్చింది కాలింగ్ బెల్ శబ్దం విని. చాలా శుభ్రంగా, గంజిపెట్టిన చీరలో దర్జాగా ఉంది ఆవిడ. మంచి పొడగరి, తెల్లటి మనిషి, మొహంలో ఎంతో ప్రేమ, ప్రశాంతత ఉట్టి పడుతున్నాయి. ఆవిడ్ని చూడగానే అమ్మ దగ్గర్నించి అమ్మ దగ్గరికి ఒచ్చినట్టు అన్పించింది రామంకి. ఎవరో ఎరిగిన మనిషిలానే ఉంది.

"నేను... రామూని అమ్మా... సుధాకర్ క్లాస్‌మేట్‌ని" అన్నాడు.

"అయ్యో నువ్వు తెలీకపోవడం ఏంటి బాబూ.. తను ఎప్పుడూ చెబుతూనే ఉంటాడు... రా బాబూ లోపలికి రా...." అంది.

సుధాకర్ చెల్లెలు మంచినీళ్ళిచ్చింది. అన్నా ఏం తీసుకుంటావ్... కాఫీ... టీ... కూల్‌డ్రింక్" అడిగింది సోఫీ.

"టీ" అన్నాడు రామం.

అకస్మాత్తుగా తనకో చెల్లెలు దొరికినట్టనిపించింది రామానికి. సోఫీ అలా పిలుస్తుంటే. ఒంటరిగా పెరిగిన అతడికి అదో అనుభూతి.

"అమ్మా... అన్నకి టీ ఇవ్వు... నే వెళ్ళి సుధాగాడ్ని పిలుచుకొస్తాను" అని ఆ పిల్ల తన మోపెడ్‌ను దింపింది వరండా నుంచి సిమెంట్ రోడ్డుమీదికి.

★ ★ ★

"బాబూ కాళ్ళూ చేతులూ కడుక్కుని రామ్మా.... ఈలోగా టీ పెడతాను" అంది సుధాకర్ అమ్మ ఉతికి ఇస్త్రీ చేసిన తువ్వాలును అతడికి ఇస్తూ.

వాళ్ళ బాత్‌రూం తమ ఇంట్లో బాత్‌రూం కన్నా ఎన్నోరెట్లు శుభ్రంగా ఉందన్న విషయం అతడికి తట్టింది. కాస్త శుభ్రపడి వచ్చి ఆవిడ ఇచ్చిన ఏలక్కాయ టీ తాగే

సరికి కాస్త రిలీఫ్‌గా అనిపించింది.

అంతలో వచ్చాడు సుధాకర్.

"హాయ్ రామూ ఎంతసేపయింది వచ్చి..." అని "అమ్మా నాక్కూడా టీ" అనేసి ఫ్రెషప్ అవడానికి వెళ్ళాడు.

"వీడికి ఆటల పిచ్చి అన్నయ్యా... కొంచెం టైం దొరికితే చాలు... క్రికెట్టో, వాలీబాలో ఆడుతూ ఉంటాడు... స్కూల్లో నువ్వు మంచి ప్లేయర్ అని పెద్ద టాక్" అంటూ గలగలా మాట్లాడుతోంది సోఫీ.

"ఏమే నాన్‌స్టాప్... రామూన్ని ఏమైనా మిగిల్చావా.... పూర్తిగా తినేశావా" అంటూ వచ్చాడు సుధాకర్.

"పోరా... అందరూ నీలా ఉంటారా... నే మాట్లాడితే చాలా బావుంటుందంటారు అందరూ...నీలా అందరూ కుళ్ళు మొహాలే ఉండరు... కద రామూ అన్నా" అంది సోఫీ లోపలికి పోతూ.

"అదంతే రామూ పట్టించుకోకు... నన్ను పేరు పెట్టి పిలుస్తుంది.... తనకు నచ్చితే అన్నా అంటుంది... తిక్క మేళం" అన్నాడు సుధాకర్.

అతడు డల్‌గా ఉండటం గమనించి "నా రూమ్ చూద్దువుగాని రా" అని తన గదిలోకి తీసుకువెళ్ళాడు. చాలా పొందికగా ఉందా గది. సింగిల్ కాట్, చదువుకునేందుకు బల్లకుర్చీ, బట్టలకోసం అల్మైరా దానికి బిగించిన అద్దం... కిటికీ తెర.

తలుపు దగ్గరగా వేసి వచ్చి "ఏంటి రామం.. ఏదో డల్‌గా ఉన్నావు... నిన్నెప్పుడూ ఇలా చూడలేదు... ఏమైంది?" అన్నాడు అనునయంగా.

"ఇంద్రాణి వెళ్ళిపోయింది... తనకి పెళ్ళి చేశారు... అదీ తను వద్దంటుంటే బల వంతంగా" అంటూంటే అప్పుడు పేరుకుపోయిన దు:ఖం కరిగి కన్నీళ్ళ రూపంలో వచ్చేసింది. ఆ ఉద్రేకానికి రామం శరీరం, తలా కంపించాయి. కదిలిపోతూ పాపాయిలా రోదించాడు అతడు.

అతడ్ని ఆపే ప్రయత్నం చెయ్యలేదు సుధాకర్. అనునయంగా భుజంమీద చెయ్యి వేశాడు అంతే. అదే కొండంత అండగా అనిపించింది రామానికి. గోదారి వరదలో కొట్టుకుపోతున్న వాడికి మోకు దొరికినట్టుంది.

అలా ఎంతసేపు బెక్కాడో తెలీదు. చాలాసేపటి తర్వాత నెమ్మదిగా అది తగ్గు మొహం పట్టి నెమ్మదిగా ఆగిపోయింది.

తన రూమ్‌కి ఉన్న అటాచ్డ్ బాత్‌రూం చూపించాడు సుధాకర్. రామం మొహం కడుక్కుని వచ్చాడు. కళ్ళు ఇంకా ఎర్రగా ఉన్నాయి. మొహం ఉబ్బింది. సుధాకర్ వెళ్ళి మళ్ళా ఓ టీ తీసుకు వచ్చాడు.

అది తాగి కొంచెం నిమ్మళించాడు రామం.

బాధనుంచి కొంత ఉపశమనం లభించింది అతడికి. నవ్వు ఎవరితోనైనా పంచుకోగలం... కానీ కొందరిముందే ఏడవగలం... ఎవరితో దు:ఖాన్ని పంచుకుంటామో వాళ్ళే మన నిజమైన స్నేహితులు.

“ఈ విషయలో నిన్ను ఓదార్చలేను... నేను బాధపడొద్దు అని ఏం చెప్పినా అది మోసమే అవుతుంది. మా అమ్మ చెబుతూ ఉంటుంది. జీవితంలో ఏదిపోయినా దొరుకుతుంది. డబ్బు, పేరు... కానీ మన అనే మనిషిని దూరం చేసుకుంటే మళ్ళా అలాంటి మనిషి తిరిగి దొరకరని. ఆ అమ్మాయి గురించి వింటే ఎవరికైనా తనలాంటి స్నేహితురాలు భార్యగా దొరికితే జీవితంలో అంతకుమించిన అదృష్టం ఉండదనిపిస్తోంది. కానీ తనే చెప్పినట్టు ఇంకా మన లైఫ్ మనది కాదు. మనం దాన్ని సంపాదించుకోవాలి. తన జీవితం తనది కాకముందే ఆ అమ్మాయి జీవితాన్ని మళ్ళా పరాధీనం చేశారు. ఇద్దరికీ బాడ్‌లక్.... కానీ ఒక్కటి చెప్తాను... తను ఎప్పుడైనా నీ సాయం కోరివస్తే చేసే పరిస్థితి మాత్రం సంపాదించుకో... తను అడిగి నువ్వు చెయ్యలేని పరిస్థితి చాలా దారుణంగా ఉంటుంది” అన్నాడు సుధాకర్.

ఏదో రామం చదువుకుని కెరీర్‌ని పాడు చేసుకోకూడదని ఆ మాట అన్నాడు కానీ... ఇంద్రాణి లాంటి అమ్మాయి ప్రాణం పోయినా రామాన్ని కానీ ఎవర్నీ కానీ యాచించదని, ఇబ్బంది పెట్టదని అతడికి తెలుసు.

కానీ జీవితం చిత్రమైంది. అన్నీ అనుకున్నట్టూ, ఊహించినట్టే జరిగితే ప్రపంచంలో సగం మంది ఫ్రస్ట్రేషన్‌తో ఆత్మహత్య చేసుకునేవాళ్ళు...

“రేయ్ సుధా... భోజనానికి టైం అవుతోంది.... వంట చేస్తాను... తను ఉల్లిపాయ తింటాడేమో అడుగు” అంది వాళ్ళమ్మ వాళ్ళ ప్రైవసీకి అడ్డం రాకుడా సుధాకర్‌ని బయటికి పిలిచి.

“నువ్వు ఉల్లిపాయ తింటావా?” అడిగాడు సుధాకర్.

“తింటాను... మా గురించి మీకు చాలా అపోహలున్నాయే” అన్నాడు రామం.

“నాకేం తెలుసు... తను అడగమంది అడిగాను... అలా నియమం ఉందా?” అడిగాడు సుధాకర్.

"పలాండుం గృంజనం చైవ మత్యాజగ్ధ్వా పతేద్ద్విజం అని మనువు విధించిన నియమం" అన్నాడు రామం.

"ఏంటీ ఉల్లిపాయ తినద్దన్న చిన్న విషయానికి ఇంత చెప్పాలా... ఇది ఉల్లిపాయ తినడం కన్నా దారుణం" అన్నాడు సుధాకర్.

బాధ మరిచిపోయి నవ్వాడు రామం.

# 6

"ఇంటికి రా" అన్నాడు రామం తన ఊరి పొలిమేరదాకా తనని దింపడానికి వచ్చిన సుధాకర్‌తో.

"చీకటి పడుతోంది... మరోసారి" అన్నాడు అతడు నవ్వుతూ సైకిల్ వెనక్కు తిప్పుతూ.

ఇంటికి రమ్మని అన్నాడే కానీ అతడు నిజంగానే వస్తే జరిగే మర్యాద ఏమిటో రామానికి తెలీక కాదు.

ఓసారి రాజమండ్రి వచ్చిన సుధాకర్‌ని తనతో చూశాడు. అతడితో మామూలుగానే మాట్లాడిన తండ్రి అతడు వెళ్ళగానే "సరే మగాళ్ళన్నాక బయట పదిమందితో తిరగటం, తినటం తప్పవు. ఐతే మనిల్లు ఇలాంటివాటికి దూరంగా పెట్టుకోవాలి. ఇతర నేస్తాల్ని పిలిచినట్టు ఇతడ్ని పిలిచేవు... మనకి అంటుసొంటు ఉన్న విషయం మరువకు" అన్నాడు.

తన తండ్రి తనకి జీవితంలో మొదటిసారి చాలా క్రూరంగా కనిపించాడు. తన అనుకున్న ఇల్లు తనది కాదని తెలిసొచ్చింది. ఆ ఇల్లు తండ్రిది, అతడి నమ్మకాలది. అలా మొదటిసారి జీవితంలో నాది ఏది? నాది కానిది ఏది? అన్న ఆలోచనకి బీజం పడింది.

తనకి, బయట ప్రపంచానికి ఉన్న తేడాని గుర్తించడం తను అనే భావనకి, ఉనికికి తొలిమెట్టు. తనకీ చుట్టూ ఉన్న వాళ్ళకీ మధ్య తేడా గుర్తించడం వ్యక్తిత్వం ఏర్పడడానికి మొదలు. తను ఎవరు అన్న ప్రశ్న సత్యాన్వేషణకు బీజం.

★ ★ ★

ఊళ్ళోకి వచ్చేసరికి తగిలారు... రాజేంద్ర నారాయణ, మంగాయావు. "అదే నీకు తెలుసో లేదో... ఇంద్రాణి పెళ్ళయిందట.... ఏదో దిక్కుమాలిన సంబంధం చూసి కట్టబెట్టినట్టున్నాడు చారి..." అన్నాడు రాజేంద్ర.

"పెళ్ళయితే ఇంకా సేఫ్టీ.... మనకి ఏ బాదయాబందీ ఉండదు... ఏదైనా సోదయుడి కాతాలోనే జమ అయిపోతుంది" అన్నాడు మంగాయావు.

జుగుప్స అంటే ఏమిటో అది కలిగించే మనుషులు ఎలా ఉంటారో చూశాడు రామం వాళ్ళిద్దర్లో. "రేపు నీకు పెళ్ళయినా ఇదే సూత్రం వర్తిస్తుందా?" అనబోయి పేడమీద రాయివేస్తే మన మొహమే పాడవుతుందన్న విషయం గుర్తొచ్చి

"పెళ్ళయి తనదారిన తను ఉంటున్న అమ్మాయి గొడవ మనకెందుకు?" అనేసి ఇంటికెళ్ళిపోయాడు.

★ ★ ★

ఎంసెట్ ఫలితాలు వచ్చాయి. రామం, సుధాకర్‌లకు చాలా మంచి రాంకులొచ్చాయి. రామానికి 44, సుధాకర్‌కి 46 రాంకులొచ్చాయి.

రాజేంద్ర రాంకుకు అతీతుడని నిరూపించబడింది. అసలు తను ఇంటర్ ఒక్క ఉదుటున పాసవటమే ఊరికి అరిష్టం అని చాలామంది భయపడ్డారు. వాళ్ళమీద జాలిపడ్డ రాజేంద్ర తను త్వరలోనే బాసర వెళ్ళి అమ్మవారికి అభిషేకం చేయిస్తానని, ఒక్కసారిగా పాసైనందుకు ప్రాయశ్చిత్తం చేసుకుంటాననీ, ఎవరూ కంగారు పడొద్దనీ, దోషం పోతుందనీ భరోసా ఇచ్చాడు.

ఊరి క్షేమం పట్ల అతడి శ్రద్ధకు కొంతమంది కంటతడి పెట్టారు కూడా.

★ ★ ★

కాకినాడ జెయన్‌టియులో సియస్ఇ అనే కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో చేరారు రామం, సుధాకర్. రాజేంద్ర తనకి అచ్చివచ్చిన రాజమండ్రిలోనే బియస్‌సి చేరాడు.

రాజమండ్రితో పోలిస్తే కాకినాడ స్లీపీ టౌన్. రాజమండ్రి వాళ్ళు సరదా మనుషులు. చిన్న కుర్రోడి దగ్గరకూడా వెటకారం చూడొచ్చు. బట్టలు హోల్‌సేల్, రిటైల్ వ్యాపారానికి పెట్టింది పేరు. కోటగుమ్మం సెంటర్లో కోటా లేదు, గుమ్మమూ లేదు కానీ గోదావరి రైల్వే స్టేషను, దాని ఎదురుగా అమలాపురం వాళ్ళు పెట్టిన శ్రీకన్య హోటలూ, బాదం అమ్మే ఏరుకొండ వెంకన్న ఎలక్ట్రానిక్సు, రకరకాల వ్యాపారాలు చేసే కొట్లూ ఉన్నాయి. సినిమాలు చూడ్డానికి రంభ, ఊర్వశి, మేనక ఇంకా చాలా థియేటర్లు ఉన్నాయి.

అలవాటైన ఊరు వదిలి వెళ్ళాలంటే అదోలా అన్పించింది ఇద్దరికీ.

కాకినాడలో రాజమండ్రి హడావుడీ, సందడి కనిపించవు. కొంచెం స్తబ్దుగా

ఉంటుంది. కోటయ్యగారి గొట్టం కాజా, సుబ్బయ్య హోటల్ భోజనం అక్కడ స్పెషాలిటీస్. గొప్ప గొప్ప కళాకారులు ఆ ఊరి నుండి వచ్చారు. యస్వీ రంగారావు, రావుగోపాలరావు, సూర్యకాంతం కాకినాడవారే. వేరే హీరోయిన్‌ని తీసేసి తనకి వేషం ఇస్తే "ఇతరులు బాధపడుతుంటే వారి బాధని తాను ఆనందంగా మలుచుకోలేన"ని ఆ అవకాశాన్ని వదిలి సూర్యకాంతమ్మ గయ్యాళి అత్తగా తెలుగునాట పీట వేసుకు కూర్చుండిపోయింది.

కాకినాడని బ్రిటిష్‌వారు కోకెనడా అని పిలిచేవారు. నంద సామ్రాజ్యకాలంలో కాకినందివాడ, కోకెనడా నుండి కాకినాడ అయింది.

త్రిపురా ఇంటర్నేషనల్ అనే హోటల్ తరువాత పేరు మార్చుకుని ఐశ్వర్యా గ్రాండ్‌గా మారింది.

యల్టీటీయీ ప్రభాకరన్‌కి శ్రీలంకలో ఎంత నెట్‌వర్క్ ఉందో ప్రహ్లాదశాస్త్రికి కూడా ఆ జిల్లాలో అంత నెట్‌వర్క్ ఉన్నట్టుంది. కాకినాడలో కొంతమంది బంధువులు ఉన్నారతనికి. వాళ్ళలో ఒకతడు బాంకు ఉద్యోగి. కొంచెం స్థితిమంతుడే కానీ తనతో తులతూగే తాహతు లేదతనికి.

తాహతు ఎందుకు చూడాల్సి వచ్చిందంటే అతగాడికో ఈడుకొస్తున్న అమ్మాయి ఉంది. అలాంటివారికి పిల్లాడ్ని అప్పగిస్తే, ఇక అప్పగించినట్టే. అందుకే వార్ని వదిలేశాడు. తనకి అన్న వరుస అయ్యే ఆయన నత్తా రామేశ్వరం వాసి. ఆయనగారి కొడుకు సోమేశ్వరం కాకినాడ పోర్టులో ఎలక్ట్రిక్ వర్కు కాంట్రాక్టు పని చేస్తున్నాడు.

మొగుడూ పెళ్ళాము కలిసి ఉంటున్నారు. ఇంకా పిల్లాజెల్లా లేరు. కాలేజీలో, హాస్టల్లో చేరడం అయిన తర్వాత వాళ్ళ ఇంటికి వెళ్ళారు. అసలు రామం తమ ఇంట్లోనే ఉండాలని, హాస్టల్లో ఎందుకని పట్టుబట్టాడు సోమేశ్వరం.

హాస్టల్లో అయితే సహాధ్యాయులు పదిమందీ ఉంటారనీ, చదువుకు సంబంధించిన విషయాల్లో ఒకరికొకరు సాయంగా ఉంటారనీ చెప్పి, అబ్బిగాడిని వారం వారం మీ ఇంటికి తీసుకుపో, అప్పుడప్పుడూ వెళ్ళి మంచీ చెడూ చూస్తూ ఉండు అని అప్ప గింతలు పెట్టి గ్రామానికి తిరిగి వెళ్లిపోయాడు ప్రహ్లాదశాస్త్రి.

★ ★ ★

సోమేశ్వరం మంచి రంగు మనిషి, అంతకన్నా రంగీలా మనిషి. నెలకి ఒకటి రెండు మార్లైనా పెద్దాపురం ఎత్తరుగు ఇళ్ళకి వెళ్ళి రావాల్సిందే.

ఐదడుగుల ఏడు అంగుళాల ఎత్తు, కళగా వెలిగిపోయే మొహం, సుఖజీవ-

నాన్ని సూచిస్తూ చిరుబొజ్జ, ఇదీ అతడి రూపం. వయసు ముప్ఫై రెండుకి అటూ ఇటూ ఉంటుంది. పెళ్ళయి తొమ్మిదేళ్ళయింది. అతడి భార్యకి ఇరవై తొమ్మిది. ఇంకా పిల్లల్లేరు.

అతడి జల్సాతత్వం తెలిసినవాళ్ళు "ఇంకా ఎంతకాలం ఫామిలీ ప్లానింగ్ గురూ... పిల్లలు పుట్టినా ఎంజాయ్ చేయొచ్చు.... ఇక స్టార్ట్ చెయ్యి" అంటారు.

"అలాగే చేద్దాం... ఇప్పుడేం వయసయిపోయిందనీ" అని నవ్వేస్తాడు. అలా జాలీగా బండి లాగించేస్తున్నాడు.

అతడి భార్య పేరు కుసుమ. ఆమెది అగర్తిపాలెం. డిగ్రీ చదువుకుంది. ఆమె తండ్రికి ఇద్దరు ఆడపిల్లలు. అతడు తహసీల్దారుగా ప్రారంభించి డిప్టీ కలెక్టరుగా రిటయిరయ్యాడు. పిల్లలిద్దరికీ మంచి సంబంధాలే చేశాడు. సోమేశ్వరం కుటుంబం కూడా ఆర్థికంగా మంచి స్థోమత ఉన్నవాళ్ళే.

★ ★ ★

రామానికి హాస్టల్ జీవితం కొత్తగానూ, ఇష్టంగానూ ఉంది. స్వేచ్ఛ ఒకటి కొత్తగా వచ్చింది. చాలామంది కుర్రాళ్ళు సిగరెట్, బీరు మొదలు పెట్టారు. ఆరకంగా తాము బాలుల నుండి పెద్దవాళ్ళయి యువకులుగా పరిణమించామని, ఈ అలవాట్లు తమ కొత్త హెూదాకు సంకేతమనీ తలచారు.

రామం, సుధాకర్ కూడా బీరు రుచి చూశారు. అది కూడా చాలా తమాషాగా జరిగింది.

"ఈ మధ్య అమ్మాయిలు కూడా బీరు తాగుతున్నారని విన్నా... నిజమేనంటావా?" అడిగాడు రామం

"అయితే అయ్యుండవచ్చు... మనకి తెలీదు కదా..." అన్నాడు సుధాకర్.

"పోనీ వాళ్ళనే అడిగితే?"

"మన పళ్ళు రాలగొడతారు... ఇదేంటి... ఏమైనా ఫలానా సినిమా చూశావా అని అడగటమా ఏంటి?"

"మరేమిటి మార్గం?" అన్నాడు రామం.

"ఇప్పుడు వాళ్ళు తాగితే ఏంటి... తాగకపోతే ఏంటి... మనమేమైనా ట్రై చేద్దామా" అడిగాడు సుధాకర్.

"అలాకాదు... వాళ్ళు మనకన్నా ముందున్నారని తెలిస్తే అదో ధైర్యం" అన్నాడు రామం.

"వాళ్ళు చేస్తే తప్పు ఒప్పవుతుందా... మనకి తప్పు కాదనిపిస్తే చెయ్యడమే... ఇదేమీ దొంగతనమో, మోసమో కాదు కదా" అన్నాడు సుధాకర్.

"ఐనా సరే... నాకోసం కనుక్కో" అన్నాడు రామం.

"నేను అబద్ధం చెబితే?"

"నమ్ముతాను" అని అన్నాడు రామం.

★ ★ ★

తన క్లాస్‌మేట్ రాగిణి అని ఒకమ్మాయిని ఎన్నుకున్నాడు సుధాకర్ తన జేమ్స్‌బాండ్ పనికి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్ లాబ్‌లో పరిచయం పెరిగింది.

సిలో చిన్న ప్రోగ్రామ్ రాయాలి. సమ్ ఆఫ్ యక్స్ మైనస్ ఒన్ బై యక్స్ స్క్వేర్ అలా సాగిపోతుంది ఆ ప్రాబ్లమ్.

రాగిణి సుధాకర్‌ని అడిగింది "ప్రెస్ ఎనీ బటన్ అన్నాడు... కీ బోర్డులో ఎనీ బటనెక్కడా కనపడలా" అని.

ముందు ఆమె జోక్ చేస్తుందనుకున్నాడు సుధాకర్. నిజంగానే అని తెలుసుకుని తూలిపడబోయాడు.

ఇక ఆమెకి కంపైలర్ అంటే ఏమిటో చెప్పడం నుండి, ఇంటిగర్ అంటే ఏమిటో చెప్పడంతో మొదలైన వారి స్నేహం రాసిన ప్రోగ్రామ్‌ని హెచ్‌టియమ్మెల్ పేజీలో రన్ చేసేసరికి పక్వానికి వచ్చింది.

ఓ రోజు కాంటీన్‌లో కొంచెం ప్రైవసీ దొరికాక నెమ్మదిగా అడిగాడు ఆమెని.

"నేనొకటి అడుగుతాను... ఏమనుకోకూడదేం... రాగిణి... మరి ఓకేనా" అన్నాడు సుధాకర్.

"హా... అడుగు నువ్వు అడుగుతావనే ఎదురు చూస్తున్నా... నాకు తెలుసు... ఏదోరోజు ఈ ప్రస్తావన తెస్తావని... అడుగు ఏ అబ్బాయీ ఒక అమ్మాయికి ఉత్తనే సాయం చెయ్యడు" అంది రాగిణి చాలా దీర్ఘంగా నిట్టూరుస్తూ.

"ఏం లేదు... అమ్మాయిలు ఎపుడైనా సరదాగా... కాస్త బీరు పుచ్చుకుంటారా?" నసుగుతూ అడిగాడు సుధాకర్.

"దీనికా ఇంత సీను క్రియేట్ చేశావు?... ఇంకేదో అడుగుతావనుకున్నాను... ఏం... మందు మీద ఇది మగాళ్ళకి మాత్రమే అని రాసుంటుందా? మందేయాలంటే దమ్ముండాలి. గట్స్‌కి ఆడామగా తేడా లేదు" అంది

"కరక్టే... అంటే అమ్మాయిలు"

"నీ నసుగుడు దొంగలు తోలా... నేనమ్మాయినే కదా... నేను ఒకటిన్నర బీరు కొడతా... సరేనా?" అంది రాగిణి.

"ఒకటిన్నరా... మరి మిగతా అరా?" అమాయకంగా అడిగాడు సుధాకర్.

"నీకోసం దాచి ఉంచాను... ఎప్పుడన్నా హాస్టల్‌కి వచ్చినప్పుడు గుర్తు చెయ్యి" చిలిపిగా నవ్వుతోంది రాగిణి.

దొరికిపోయారా... బాబూ దొరికిపోయా అనుకుంటూనే ఇంకో తింగరి ప్రశ్న అడిగాడు సుధాకర్.

"ఇందాక ఇంకేదో అడుగుతావనుకున్నా అని అన్నావు... ఏంటది?"

"ఏం లేదు... ఒక ముద్దో... లేకపోతే ప్రపోజ్ చేస్తావో అని అనుకున్నా... చాలా" అంది రాగిణి.

"నాకా ఉద్దేశ్యం లేదనుకో... ఒకవేళ అడిగితే ఏం చెప్పాలనుకున్నావ్"

"యస్... అనేదాన్ని. అలా అడిగితే అదృష్టమే కదా!" అంది ఆమె.

"థాంక్స్... నాకలా అన్పిస్తే తప్పక చెబుతాను... ప్రస్తుతానికి సారీ" అన్నాడు సుధాకర్.

"అలాగే కానీ.. ఇంతకీ యస్ ఎందుకు చెబుతావో అడగలేదే... మిగిలిన అరబాటిల్ షేర్ చేసుకుని, దాంతోనే సర్దుకునే బాయ్‌ఫ్రెండ్ దొరకడం నిజంగా అదృష్టం... కాదంటావా?" అని పకపకా నవ్వుతోంది రాగిణి.

ఇంకా అక్కడే ఉంటే ఇంకెంత మోస్తుందో అని పలాయనం చిత్తగించాడు సుధాకర్.

★ ★ ★

"నీ అనుమానాలు పాడుగానూ ఎనీకీ రాగిణి నా జీవితంతో ఆడుకుంది కదా" సముద్రాన్ని చూస్తూ అన్నాడు సుధాకర్.

ఇద్దరూ బీచ్‌కి వచ్చారు బాగా చీకటి పడ్డాక. షాపుకెళ్ళి బీరు తెచ్చే బాధ్యత సుధాకర్ తీసుకున్నాడు. దానికి చాలా ధైర్యం కావాల్సి వచ్చింది.

ఈ ఊళ్ళో మనకి తెలిసిన వాళ్ళెవరున్నారు... భయం లేదు...అనుకుంటూ వెళ్ళి తెచ్చాడు రెండు బీర్లు. వాటితో పాటు ముంతకింద పప్పు... షాపువాడు మూత సగం తీసి ఇచ్చాడు. అక్కడ కొనేది ఎక్కువమంది స్పాట్ కన్జంప్షన్ చేసేవాళ్ళే కావటంతో.

ఇసుకలో కూర్చున్న తర్వాత మిగిలిన అరమూత తీసుకుని నెమ్మదిగా సిప్ చేయడం మొదలు పెట్టారు "చీర్స్" చెప్పుకున్న తర్వాత.

వగరుగా, చిరు చేదుగా ఉంది బీరు. ముంతకింద పప్పు రిలీఫ్ ఇచ్చింది. మొదటిసారి కావడంతో పూర్తి బాటిల్ తాగలేకపోయారు.

రామానికి మంగాయావు గుర్తొచ్చాడు. ఊరికే రావాలి కానీ నాలుగు బీర్లు కూడా తాగేస్తాడు మంగాయావు. అబ్బ ఎలా తాగుతాడో అనుకున్నాడు రామం.

"నిజంగా ఎనీకీ రాగిణీ ఒకటిన్నర బీరు తాగుతుందంటావా లేక మనతో కోతలు కోసిందంటావా?" అనుమానంగా అన్నాడు రామం.

"రేపు తనని కేంటీన్‌కి తీసుకొస్తాను... నువ్వే అడుగు" అన్నాడు సుధాకర్

"ఒద్దురా బాబూ... కావాలంటే వెనక్కి వెళ్ళి వదిలేసిన ఆ బీరు కూడా తాగేస్తాను... అంతేకాని ఎనీకీతో మాట్లాడలేను" అన్నాడు రామం.

"ఇలాంటోళ్ళని చూసే... అమ్మ నాన్న తమిళ అమ్మాయిలో సిగరెట్ సీను పెట్టుంటారు" అన్నాడు సుధాకర్.

అందని ద్రాక్షపళ్ళు పులుపులా, తాగలేని బీరు చేదు అని గ్రహించి "ఇదే ఆఖరుసారి మనం తాగటం" అనుకున్నారు చాలా గట్టిగా.

వాళ్ళది ఎంత దృఢసంకల్పం అంటే ఆ తర్వాత చాలాసార్లు అదే మాట గట్టిగా అనుకున్నారు. కాకపోతే అలా అనుకునే ముందు బీరు పుచ్చుకున్నారు.

★ ★ ★

అప్పుడప్పుడూ సోమేశ్వరం ఇంటికి వెళ్తున్నాడు రామ్. ఇప్పుడందరూ కాలేజీలో అలానే పిలుస్తున్నారు. స్కూల్లో రామం కాస్తా కాలేజ్‌లో రామ్ అయ్యాడు.

ఓసారి తన ఫ్రెండ్సుతో పాటు రామ్‌ని హోటల్‌కి తీసుకెళ్ళాడు సోమేశ్వరం. అక్కడ సోమేశ్వరం శుభ్రంగా చికెనూ, ప్రాన్సూ, కాకినాడలో మాత్రమే దొరికే చీరమేను చేపా, పీతని తొలిచేసి అందులో మీట్‌ని మసాలా పెట్టి వండి మళ్ళా పీతలో నీట్‌గా స్టఫ్ చేసి ఆపైన ఫ్రై చేసే ప్రత్యేక వంటకం తినడం చూసి ఆశ్చర్యపోయాడు రామ్.

"చీరతో వండుతారు కాబట్టి దీన్ని చీరమేను అంటారు. ధవళేశ్వరం పులస, భీమవరం రామలు లాగా ఈ ఏరియా స్పెషాలిటీ ఇది" అన్నాడు

"మీరు ఇవి తింటారా?" అన్నాడు రామ్.

"నువ్వూ తినవోయ్... మీ నాన్నతో చెప్పనులే" అన్నాడు సోమేశ్వరం.

"మీరు ఇవన్నీ తినకూడదని ఎక్కడన్నా వుందా?" అడిగాడు ఓ స్నేహితుడు.

"ఉందనుకుంటా... నాకు సరిగా జ్ఞాపకం లేదు... అయినా ఈ రోజుల్లో ఇవన్నీ పెట్టుకుంటే ఎలా?" అన్నాడు సోమేశ్వరం.

"ఛత్రాకం విడ్వరాహం చ లశునం, గ్రామ కుక్కటమ్: పలాండుం గృంజనం చైవ మత్యాజగ్ధ్వా పతేద్ద్విజః... అంటే గోంగూర, పందిమాంసం, వెల్లుల్లిపాయ, గ్రామంలోని కోడి, ఉల్లిపాయ తింటే భ్రష్టులవుతారు అని మనువు చెప్పారు" అన్నాడు రామ్.

"అదీ సంగతి... మొన్న నువ్వేం చెప్పావు? గోంగూర చిన్న ఉల్లిపాయతో కచాపిచా చేసిన బండ పచ్చడి ఇష్టమని చేయించుకు తిన్నావుగా మనింట్లో... గోంగూర తిని నువ్వు భ్రష్టుపట్టావు... నేను హాయిగా చికెను, ఫిష్షు తిని భ్రష్టు పట్టాను.. ఎవరు బెటరంటావు?" అన్నాడు సోమేశ్వరం.

"ఏది తిన్నా ఒకటే అయినప్పుడు అన్నీ తినడమే బెటరు" అన్నాడు ఒకతను.

"పూర్వం అర్చకవృత్తిలో మాత్రమే మనవాళ్ళున్నప్పుడు పెట్టినవి ఇవి. నాలిక తిరగాలి కాబట్టి మొద్దుబారకుండా ఉండటానికి పెట్టింది. ఇపుడు మనలో ఆర్థికంగా ఎదగని వాళ్ళే అర్చకంలో ఉన్నారు. ఇవి వాళ్ళకి వర్తిస్తాయి. మనకి కాదు" అన్నాడు సోమేశ్వరం.

"నాకు అలవాటు లేదు...తప్పని కాదు అలవాటు లేదు కాబట్టి తినలేను... నేను వెజిటేరియనే తింటాను" అన్నాడు రామం.

"అయినా మనవాళ్ళు తెలివైనవాళ్ళు సుమండీ... బుద్ధిబలం తగ్గకూడదని అలా పెట్టారు. అమెరికా ఐరోపా వాళ్ళతో పోలిస్తే మనవాళ్ళు చాలా తెలివైన వాళ్ళు కదండీ" అన్నాడో మిడిమేళం.

"మనం వాడే పెన్ను, తిరిగే బైకు, కారు, రైలు, విమానం, మాటాడే ఫోను, ఇపుడిపుడే వస్తోన్న సెల్‌ఫోను, చూసే టీవీ, సినిమా, వాడే కంప్యూటర్, కరెంటు, బల్బు, పైకి ఎగిరిన శాటిలైట్, దాన్ని ఎగిరేసిన రాకెట్ వీటిల్లో ఒక్కటి మన శాఖాహారులు కనిపెట్టారా? అన్నీ గొడ్డుమాంసం తినే యూరోపు, అమెరికా దేశాల వాళ్ళు కనుక్కున్నవే" అన్నాడు రామ్.

"అంటే మనం కూడా వాళ్ళల్లా గొడ్డుమాంసం తినాలా? తెలివితేటలు కావాలంటే?" అన్నాడు మిడిమేళం.

“తెలివి అనేది ఒక్క తిండివల్లే రాదు. అలా ఆలోచించనిచ్చే పరిస్థితులు, విద్యావ్యవస్థ వల్ల రావచ్చు” అన్నాడు రామ్.

అతడికున్న ధారణా, గ్రాహ్యశక్తిలో శతాంశం అక్కడున్న వారెవరికీ లేదు. అందుకే ఆ విషయాన్ని వదిలి భోజనానంతరం తామెళ్లబోతున్న పెద్దాపురం వైపు చర్చ మళ్ళించారు.

రామ్‌కి తన సంభాషణల్లో పాలుపంచుకునే వయసులేదని గ్రహించిన సోమేశ్వరం “సరే నువ్వు నా బైక్ తీసుకుని ఇంటికెళ్ళు...తను లోన్లీగా ఉంటుంది... నేను మా ఫ్రెండ్సు కారులో వచ్చేస్తానులే” అని పంపించేశాడు.

★ ★ ★

ఎప్పుడూ తమ సంభాషణలు సోమేశ్వరం సమక్షంలోనే జరగటం వలన అంత ఫ్రీగా ఉండకపోయేది కుసుమ. అప్పుడప్పుడు కూర్చుని మాట్లాడినా అవి పొడిపొడిగానే ఉండేవి. చదువెలా సాగుతోంది? మీ నాన్న అమ్మ ఎలా ఉన్నారు? హాస్టల్లో భోజనం బావుందా? ఇలాంటి కుశలం అడగటంతో సరిపుచ్చేది. లేదా వంటింటిలో ఏదో ఒకటి తయారు చెయ్యడంలో మునిగి ఉండేది.

కుసుమ స్టన్నింగ్ బ్యూటీ. ఓ క్షణం ఆమెని చూసినవాళ్ళు వెంటనే తల తిప్పుకోవడం సాధ్యం కాదు. సోమేశ్వరంతో సమానమైన ఎత్తు ఆమెది. సన్నమూ లావూ కాని శరీరం ఆమెది. ఆరోగ్యంగా మెరిసే తనువు, సన్నగా ఉండే నడుము రెండు కొండల మధ్య చిక్కిన గోదావరిలా ఉంటుంది.

మరి కొండల మధ్యన చిక్కినా గోదావరి, కొండా పైనా కిందా సువిశాలమే కదా!

ఆమె పెదవులు చిక్కగా, తడిగా ఉండి అంజలీనా జోలీని గుర్తుకు తెస్తాయి. బుగ్గలు నున్నగా ఉన్నా బంగారు తీగలు అద్దినట్టు నూగుగా ఉన్నజుట్టు అందాల చెమ్కీలు అద్దుతుంది. నాసిక సన్నగా తురిమినట్టుగా కాక ఉరిమినట్టు స్పష్టంగా ఉంటుంది.

ఆమె చీరకట్టు... ఓ కనికట్టు. అందాలకు పానిపట్టు. పరువం బుసకొట్టు, యవ్వనం జతకట్టు, చూసిన కన్ను చిక్కబట్టు, అందక రాచిరంపాన పెట్టు... ఆమె రతీదేవి తోబుట్టు.

కొంతమంది ఆడాళ్ళు మాట్లాడుతుంటే నోరు మాత్రమే కదులుతుంది. కొంతమంది మాట్లాడితే ఒళ్ళంతా కదులుతుంది. కుసుమ మాట్లాడితే అదే జరుగుతుంది. ఒత్తైన ఆమె ఒళ్ళు గమ్మత్తుగా కదులుతుంది.

ఒళ్ళంత తుళ్ళింత అన్నమాట ఆమెని చూసి పుట్టిందే అన్పిస్తుంది.

రామ్‌కి ఆమె మాట్లాడుతుంటే చూపు ఆమె ఒంట్లో చిక్కడిపోయి ఇబ్బందిగానూ, తడిగా మెరిసే ఆమె పెదవులు చూడ్డం ఇష్టంగానూ ఉంటుంది. ఆమె సరదాగా మాట్లాడుతుంది.

సోమేశ్వరం లేకపోవడంతో ఆ రోజు అతడితో చాలా సరదాగా, చలాకీగా ఓ ఫ్రెండు మాదిరిగా ఉంది. అప్పటికే కొత్త పోవడమూ, పరిచయం పెరగటంతో రామ్‌కి కూడా ఇబ్బందిగా ఏమీలేదు.

విశాలమైన ఫాలభాగం మధ్య ఎర్రగా మెరిసే కుంకుమబొట్టు, సన్నటి మెడ, పొడవాటి జడ. ఆమె జుట్టు నొక్కులు నొక్కులుగా ఉంటుంది. కళ్ళు విశాలం, నవ్వు జలపాతం.

ఎనీకీ రాగిణి గురించి చెప్పాడు రామం.

"ఓహో మీ దగ్గర ఓ ఆసిన్ ఉందన్నమాట... వావ్ అంది"

"అసిన్ ఏంటి?" అన్నాడు రామ్.

"నువ్వే అన్నావు కదా అమ్మా నాన్నా తమిళ అమ్మాయి అని. దాన్లో అసిన్ దమ్ము కొడుతుంది. మీ అసిన్ బీరు. అంతే తేడా" అంది కుసుమ.

"అంటే నిజంగా కొంతమంది అమ్మాయిలు బీరు, చుట్టాభ్యాసం చేస్తారా?" అడిగాడు రామ్.

"పల్లెటూరి నుండి వచ్చావు కనుక అలా అనిపించడం సహజం... పెద్ద సిటీల్లో కొంతమంది అమ్మాయిలకి... హై ఫైగా ఉండేవాళ్ళకి అది మామూలు విషయం. హాస్టల్లో ఉన్నప్పుడు సరదాకి ఓసారి ట్రై చేస్తారు కొంతమంది. అంత సీరియస్ విషయమేమీ లేదు ఇందులో. భయపడకు, నీ పెళ్ళికి నేనుండి నువ్వు చేసుకోబోయే అమ్మాయి దగ్గరకెళ్లి వాసన చూస్తాలే" అంది నవ్వుతూ.

"ఇవన్నీ నీకెలా తెలుసు?" అడిగాడు రామ్.

"సీక్రెట్... నేను కొంతకాలం వైజాగ్‌లో చదువుకున్నాను. మధ్యలో నాన్నకి ట్రాన్స్‌ఫర్ అయితే నన్ను హాస్టల్లో చేర్చారు" అంది కుసుమ.

"ఐతే నువ్వు కూడా ఆసినేనా?" అన్నాడు రామ్.

"దొంగపిల్లాడా..." అని చిరుకోపం అభినయించి, చేత్తో అతడిని మెత్తగా మొట్టింది.

అలా మొట్టినప్పుడు అతడు కూర్చుని ఉన్నాడు, ఆమె నుంచుని ఉంది, ఆమె చేయి పైకి లేచిన భంగిమ, దట్టంగా పెరిగిన తాటితోపుచివర మెరిసే ఆకాశంలా చేతిపై పరుచుకున్న పైట చివర లిప్తపాటు దర్శనమిచ్చినపుడు నడుము ఒంపూ, ఆపైన చంద్రదర్శనమూ అతడిని నిరుత్తుడిని చేశాయి.

అలా సరదాగా మాట్లాడుకుంటూ సాయంత్రం వరకూ గడిపారు.

"కొంచెం గడ్డం వస్తే నువ్వు టక్కరిదొంగలో మహేష్‌బాబులా ఉంటావు రామం" అంది.

"సరే ఐతే గడ్డం వచ్చాక కౌబాయ్‌లా గుర్రం ఎక్కి మీ ఇంటికొస్తాలే" అన్నాడు రామ్.

"పెద్ద టోపీ, ఆ కాస్ట్యూమూ మర్చిపోకు…నీకు టక్కరిదొంగలా ఇద్దరు ఖాయం" అంది కుసుమ.

ఆమెని ఏమండీ అని పిలిచేవాడు రామ్ మొదట్లో. మరీ వయసైపోయినట్టుంది అలా పిలిస్తే… మామూలుగా పేరుతో పిలు అంది కుసుమ. అయితే అలా పిలవడానికి ఇబ్బంది పడి ఎలాంటి సంబోధనా లేకుండానే మాట్లాడతాడు రామ్.

★ ★ ★

సోమేశ్వరం తను ఊళ్ళో ఉంటే ప్రతీ ఆదివారం తన బైక్‌మీద హాస్టల్‌కి వచ్చి రామ్‌ని భోజనానికి ఇంటికి తీసుకెళ్తాడు. లంచ్‌కి తీసుకెళ్తే మళ్ళా డిన్నర్ తిన్నాకే తిరిగి హాస్టల్‌కి వెళ్ళేది.

ఒక్కోసారి సోమేశ్వరం స్నేహితులు మధ్యాహ్నం చతుర్ముఖపారాయణానికి పిలిస్తే వెళ్ళిపోయేవాడు. కుసుమ, రామ్ టీవీ చూస్తూ, కాలక్షేపం చేసేవాళ్ళు.

తను రాలేకపోతే ఫోన్ చేసేవాడు సోమేశ్వరం హాస్టల్‌కి. రామాన్ని తన బైక్ మీద డ్రాప్ చేసేవాడు సుధాకర్.

ఓసారి అలానే సోమేశ్వరం లేనప్పుడు ఇంటికి వెళ్ళిన రామ్ హాల్లో కూర్చున్నాడు. బెడ్‌రూం తలుపు తీసుకుని చీర సవరించుకుంటూ కుసుమ బయటికి వచ్చింది. ఆమె వెనుక వచ్చిన వ్యక్తిని చూసి రామ్ అదిరిపడ్డాడు.

# 7

లోపల నుండి కుసుమతో పాటు బయటికి వచ్చింది ఓ వృద్ధ స్త్రీ. ఆమె సోమేశ్వరం తల్లి. ఎవరీ కుర్రాడు? అన్నట్టు, రామం ఏదో పురుగులా కనిపించినట్టూ

చూసింది ఆమె.

"ఈవిడ మా అత్తయ్యగారు..." అని పరిచయం చేసింది కుసుమ.

"అత్తయ్యగారూ...ఇతను.. రాము అని మన ప్రహ్లాదశాస్త్రి గారి పేరు వినే ఉంటారు...వారి వంశాకురం..ఇక్కడ ఇంజనీరింగు చదువుతున్నాడు" అని చెప్పింది కుసుమ తన అత్త గారితో

అప్పటి వరకూ రామాన్ని పురుగులా చూసిన ఆవిడ చూపులో ఎంతో మార్పు. ఛండాలుడిలో పరమశివుడ్ని చూసినంత మార్పు.

"వారు తెలీకపోడం ఏం...మనప్రాంతంలో వారిది ఎంతపెద్ద జమీ!! ఎంత పేరుమోసిన వంశం వారిది!!" అంటూ మొదలెట్టిన ఆవిడ రామ్‌ని చాలాసేపు చెరుకుగడను నమిలేసినట్టు నమిలేసింది.

రామ్ అవస్థ కుసుమ కిచన్‌లోంచి క్రీగంట చూస్తూ, మునిపంట నవ్వు ఆపుకుంటోంది. కుసుమలో రామ్ కి రెండు షేడ్స్ కనపడతాయి. ఏకాంతంలో తనవయసు స్నేహితుడితో ఉన్నట్టు చనువుగా, చిలిపిగా ఉండే ముగ్ధకుసుమ వేరు. ఆమె అల్లరిపిల్ల. స్వేచ్ఛగా ఎగిరే విహంగం. భర్త సమక్షంలో అంటీముట్టనట్టు, కేవలం గృహస్తు భార్యగా తన పనితాను చేసుకుపోయే గృహిణి గంభీరకుసుమ. అత్తగారి సమక్షంలో ఆమె అత్తచాటు కోడలు.

రామ్ బాధ చూడలేక లోపల్నించి వచ్చింది. అప్పటికి పదోసారి " నీలాంటి వంశోద్ధారకుడు ఒక్కడు పుడితే వాడ్ని చూసి ఇహలోక యాత్ర చాలించేస్తాను... అపుత్రస్యగతిర్నాస్తి అన్నారు...ఎవరికేంచేశామో భగవంతుడు నాకు ఆ భాగ్యం లేకండా చేశాడు" అంటోంది

ఆ మాటలువిన్న కుసుమ మనసు చివుక్కుమంది. చందమామకి అడ్డుగా చిన్నమబ్బు వచ్చినట్టు ఆమె మోము మ్లానమయింది. లిప్తలో తేరుకుని "ఎక్కడికో వెళ్తూ ఇటొచ్చినట్టున్నావు...నీకు కానీ జాగుకావటంలేదుకదా?" అంది అతడు అక్కడినుండి జంపవడానికి చిన్న క్లూ ఇస్తూ.

"అయ్యో నా మతిమండా...పెద్దముండాదాన్ని ఏదేదో వాగేస్తున్నాను కానుకోకుండా...అయినా ఆ పెద్దలపట్ల భక్తికలిగిన వంశం కాబట్టి వింటూఉన్నాడు బిడ్డ...పోయిరా నాయనా...నేను ఊరు వెళ్ళేలోపు ఓమారు వీలు చూసుకునిరా...చూస్తేనే కడుపునిండుతోంది" అంటూ అతడ్ని సాగనంపింది కుసుమ అత్తగారు. మనసులోనే కుసుమకు కృతజ్ఞత తెలుపుకుని అక్కడినుండి వీలైనంత వేగంగా బయటపడ్డాడు రామ్.

ఆ తర్వాత అటుగా వెళ్ళే సాహసం చెయ్యలేదు రామ్. ఆవిడ సమక్షం లో కుసుమ చాలా అసౌకర్యంగా ఉండటం అతడు గమనించాడు.తను కొత్త అన్న పట్టింపు కూడా లేకుండా ఆవిడ వాళ్ళ ఆంతరంగిక విషయాలు అదీ తన కోడలు ఏమన్నా ఫీలవుతుందేమో అన్న పట్టింపు ఏమాత్రం లేకుండా మాట్టాడటం అతడ్ని ఆశ్చర్య పరిచింది.

ఆ ఇల్లు తనదనీ, తను ఏం మాట్లాడినా అడ్డుకునేవాళ్ళు ఎవరూలేరనీ చెప్పడమే ఆవిడ ఉద్దేశం లా ఉంది.

★ ★ ★

కొన్ని రోజుల తర్వాత ఓరోజు రామ్ హాస్టల్ కి ఫోన్ వచ్చింది.

ఆశ్చర్యంగా అది కుసుమనుండి. " ఓసారి ఇంటికి రాగలవా ప్లీజ్" అంది ఆమె.

అతను సుధాకర్ బైక్ తీసుకువెళ్దామనుకుని వర్షం వచ్చేలా ఉండటంతో ఆటోలో వెళ్ళాడు.అతను దిగే సరికి చిన్నగా పడుతున్న చినుకులు ఒక్కసారిగా ఏనుగులు తొండంతో చిమ్మినట్టు ఝల్లున కురిశాయి. ఇంటి గేటు తీసుకుని లోపలికివెళ్తూ అనుకున్నాడు ఎన్నడూ లేంది కుసుమ ఫోన్ చేసిందంటే పాపం ఏం ఇబ్బంది వచ్చిందో అని.

ఇంటిలోకి చేరుకునేసరికి అతడు తడిచిముద్దయిపోయాడు. కుసుమ ముందుహాల్లోనే కూర్చుని ఉంది.

"అయ్యో పూర్తిగా తడిచిపోయావే..ఉండు" అని లోపలికి వెళ్ళి టవల్ తీసుకొచ్చింది. దాంతో తల తుడుచుకున్నాడు.

"పాంటు, షర్టు కూడా మార్చుకో..అవి ఆరబెడతాను..లేకపోతే జలుబు చేస్తుంది" అని ఓ పట్టుపంచ, పట్టుచొక్కా ఇచ్చింది.

"ఇదేంటి...మామూలు లుంగీ, చొక్కా లేవా?" అడిగాడు రామ్

"ఆ...ఉన్నాయి కానీ అన్నీ వాడినవే...ఇవి మెన్న అత్తగారు తెచ్చినవి. ఆయన ఎలానూ వీటిని వాడరు..నీకు వాడిన బట్టలెందుకని ఇవిచ్చాను" అని చెప్పి తమ బెడ్రూంకి వెళ్ళమని దారి చూపించింది.

అతడు లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకున్నాడు. పట్టుబట్టలు మెత్తగా, వెచ్చగా ఉన్నాయి.

అతడు బయటికి వచ్చాక అతడు విడిచిన బట్టలు తీసి వేరే బెడ్రూంలో ఫాన్ హై స్పీడులో పెట్టి ఆరబెట్టింది. కిచెన్లోకి వెళ్ళి వేడిగా కాఫీ తీసుకువచ్చింది.

"అన్నయ్య లేడా?" అని అడిగాడు రామ్ ఏదో ఒకటి మాట్లాడాలన్నట్టు.

"ఉన్నారు.... సోఫా కింద దాక్కున్నారు...వర్షం పడుతోంది కదా..." అని వంగి సోఫా కిందికి చూస్తున్నట్టు అభినయిస్తూ "ఏమండీ...మీ తమ్ముడు వచ్చాడు....అడుగుతున్నాడు...రండి" అంది.

"అబ్బా... పొరపాట్న అడిగాను...వదిలేయ్..." అన్నాడు రామ్.

సరే అని నవ్వుతూ పైకిలేవబోయిన కుసుమ నడుం పట్టేయడంతో "అమ్మా..." అనేసి సోఫా అంచుని పట్టుకుని అలా ఉండిపోయింది.

కాఫీ కప్పు టీపాయ్ పై పెట్టి ఆమెకు సాయం చెయ్యడానికి లేచాడు రామ్. కానీ ఏం చెయ్యాలో తోచక అలా ఆగిపోయాడు.

"కొంచం నన్ను బెడ్‌రూంకి తీసుకెళ్ళు.. ప్లీజ్.. బోర్లా పడుకుంటే నడుం సర్దుకుంటుంది" అంది కుసుమ

దగ్గరగా వెళ్ళిన అతడి భుజంమీద చెయ్యి వేసి, తన వంటిబరువుని అతడిమీద ఆన్చింది. ఆమె శరీరం నుంచివచ్చిన పరిమళం అతడ్ని వివశుడ్ని చేసింది. వాత్సాయనుడు పద్మినీ జాతి స్త్రీ శరీరానికి సహజంగా ఓ పరిమళం ఉంటుందని చెప్పినమాట అబద్ధం కాదు.

ఆమె ఒంటిమెత్తదనానికి పోలికలేదు. బూరుగుదూది పరుపూ గరుకుగా ఉంటుంది ఆమెతో పోలిస్తే, వెన్న మెత్తగానే ఉంటుందికానీ ఆమె ఒంటికున్న పటుత్వం లోపిస్తుంది వెన్నలో.

మృగమదసౌరభవిభవ ద్విగుణితఘనసారసాంద్రవీటిగంధస్థగితేతర పరిమళమై, మగువపొలపుతెలుపు ఒక్క మారుతమెలసెను అన్నాడు అల్లసాని. గాలి ఆమెమీంచి వీచి పరిమళాన్ని సంతరించుకుంటోంది

ఆమె కట్టుకున్న చీర ఆకుపచ్చ వనంలా ఉంది. పున్నమి చంద్రద్వయాన్ని ఒడిసి పట్టిన కారుమబ్బుతునకలా ఆమె రవిక గర్విస్తోంది. అయితే మేఘాలు చంద్రోదయాన్ని అడ్డుకున్న చరిత్ర ఎక్కడాలేదు. గర్వము శాశ్వతమూకాదు, భంగానికి అతీతమూకాదు. మాయకు మానవులూ, దేవతలే అతీతులుకారు, సౌందర్యాన్ని ఒడిసిపట్టిన విజయోత్సాహంలో ఉన్న రవికదేముంది. ఆ పొగరుతోనే అప్పుడపుడూ అతడిని మెత్తగా కొడుతూ, తడుతూ 'చూశావోయ్' అన్నట్టు నీలిగింది.

తెల్లని పాలనురుగులాంటి దుప్పటి కప్పుకుని శేషతల్పంలా ఉంది శయ్య. జాగ్రత్తగా, గాజుబొమ్మని దింపినట్టు జాగ్రత్తగా ఆమెని మంచం మీద బోర్లా పడుకోబె

ట్టాడు. కొందరికి అణిగిపోయినా అణకువరాదు, పైపెచ్చుపెచ్చరిల్లుతారు. ఆమె రవికా అలాంటి పొగరుబోతే.

ఆమె కురులు నల్లమబ్బులే గోదావరిగా మారి ప్రవహిస్తున్నట్టున్నాయి. నీతో నాకేమిటని ఆమె మేని పరిమళాన్ని సవాలు చేస్తూ తమ ఉనికిని ప్రత్యేక పరిమళంతో చాటుతున్నాయి. అందం నఖ,శిఖ పర్యంతం ఉంటుందని ఎందుకంటారో అతడికి అప్పుడు సగం అర్ధమయింది.

"కొంచం వీపు మర్దనా చేస్తావా?" ఆమె గొంతు కొత్తగా, స్వరం గుసగుసలాడుతున్నట్టు ఉంది.

సమాధానంగా అతడి చెయ్యి అందాల పాయలా ఉన్న ఆమె నడుముని తడిమింది. చేతిలో విద్యుత్తు జనించిందో ప్రవహించిందో తెలీదు కానీ విద్యుల్లతా ప్రవాహం మాత్రం నిజం. అలా ఎంత సేపు గడిచిందో తెలీదు.

ఆమె వెల్లకిలా తిరగటం మాత్రం తెలుసు. సునామీ అలలో రెండు లక్షణా లుంటాయి. ఒకటి వడి అంటే వేగం, రెండు ఉనికిని మరపించే వ్యాప్తి. ఆమె అల అయింది. ఓ కల మొదలయింది.

★ ★ ★

మధ్యాహ్నం... సాయంత్రమయింది. సాయంత్రం రాత్రి అయింది. రాత్రి పూర్తయింది. ఉదయం టిఫిన్ చేసి సరాసరి కాలేజికి వెళ్ళాడు రామ్. అతడికి అంతా కొత్తగా ఉంది. నిన్న మొదలై నేటి వరకూ జరిగింది కలా, నిజమా లేక తన ఊహా అన్న అనుమానం కలిగిందతనికి.

కుసుమలో ఎన్ని ఛాయలు చూసినా ఎంత సన్నిహితంగా ఉన్నా ఏరోజూ తనకి అలాంటి ఆలోచన వచ్చేవిధంగా ఆమె ప్రవర్తన లేదు. ఇంద్రాణి లో ఉన్న స్నేహితురాలి ఛాయ కుసుమలో కనిపించింది. కానీ ఇంద్రాణి తన స్వంతం కావాలని కోరుకున్నాడు. ఆమెతో జీవితాన్ని పంచుకోవాలనుకున్నాడు. కుసుమతో అలా అనుకునే అవకాశమే లేదు. ఆమె పరాధీన.

కానీ జరిగింది తప్పుగా అనిపించలేదు. చాలా సహజంగా , జరగాల్సిందే జరిగి నట్టుగా ఉంది. కాకపోతే తొలి అనుభవం అనేది చాలా ఉత్సుకతని కలిగించేది. జీవితాంతం గుర్తుండి పోయేది. అది అంత చక్కగా జరిగినందుకు సంతోషించాడు రామ్. అప్పటికే అతడి క్లాసులో కొందరు ముదుర్లు పెద్దాపురం వెళ్ళి రావడం, ఆ అనుభవాలు గొప్పగా చెప్పుకోవడం అతడు వింటున్నాడు.

వాటిల్లో శృంగారం కంటే అపరాధపరిశోధన పుస్తకాల్లో ఉండే థ్రిల్ ఎక్కువగా ఉంది. చాలా కథలు లేదా అనుభవాలు కంగాళీగా ఉండి శృంగారమంటేనే నేరమనే స్థాయిలో చవకబారుగా ఉన్నాయి.

"ఇవి శృంగారమూ, చాటువులూ కాదు, ఎవడింట్లోనో జామకాయలో, ఎవడితోటలోనో మామిడి కాయలో దొంగతనానికి వెళ్ళిన వాడి అనుభవాల్లా ఉన్నాయి" అన్నాడు సుధాకర్

తన అనుభవాన్ని అతడితో పంచుకోవాలని అనిపించినా మళ్ళా అతడు తన పట్ల చిన్న అభిప్రాయం ఏర్పరుచుకుంటాడేమో అన్న ఆలోచనతో ఆగిపోయాడు రామ్.

అంతేకాక కుసుమ ఒట్టేయించుకుంది కూడా, తమ విషయాలు తమిద్దరినీ దాటిపోకూడదని. ఆమె చేసిన ఆ చిన్న పని అతడి జీవితాన్ని ఎలా కాపాడబోతోందో ఆ క్షణంలో ఆమెకూ తెలీదు.

రామ్‌కి విచిత్రమనిపించిన విషయం ఏమిటంటే ఆమె తన కాళ్ళకి మొక్కి ఆశీర్వాదం తీసుకోవటం, అక్షింతలు చేతికిచ్చి ఆమె నెత్తిన చల్లమనడం. విచిత్రంతో పాటు అతడికి ఇబ్బందిగా కూడా అనిపించింది.

కానీ ఆమె అడిగింది కాబట్టి కాదనకుండా చేశాడు.

ఆ రోజు కూడా సాయంత్రం కుసుమ కోసం వెళ్ళాడు రామ్. మళ్ళా పట్టుపంచా, ఆమెనుండి అదే సువాసనా, కించిత్తు కమ్మటి ఆవు నేతిని పోలిన, గంధం కలిసిన సుగంధం.

"నేత్తో ఏమన్నా స్నానం చేశావా?" అని అడిగాడు రామ్.

బదులుగా నవ్వింది. ఈ రోజు ఆశీర్వాదం ముందే అయ్యింది. మరలా సాయంత్రం యంత్రాలనూ మంత్రమగ్ధుల్ని చేసే రసరాజుల్ని చేసే శృంగార సంధ్య అయింది. సరస గంగోత్రి వరద వెల్లువెత్తింది. పయిగాలి సోకినన్ వెన్నవలే కరిగే అలివేణి కౌగిలి చేర్చు భాగ్యము అతడికి కలిగింది.

ఉదయం భారంగా తెల్లారింది. మళ్ళా స్నానం, పాదపూజ, ఆశీర్వచనం అన్నీ యధావిధిగా ముగిశాయి.

మరో సంధ్య వచ్చింది. ముగిసింది. వివిధ కుసుమ కదంబము అంటే అనేక పూల కదంబమాల, దివిజ, తరుజ మృదుల పనస ఫలాస వామేయ రత్న భూషణములు కలవిందు  భోగపరుడవై రమింపుము ఇద్దినంబు అన్న వరూధినీ ఆహ్వాన పత్రికలా ఉంది ఆమె ఆరోజు. అయితే విశేషమేమిటంటే ఫలాలు,పుష్పాలు,

రత్నఖచిత భూషణాలు వేరెక్కడో విడిగాలేవు, సకల మధుర, మకరందాలకు, విశేషాలకు విడిది ఆమె ఒడలే.

అతడి ఆనందం ద్విగుణీకృతం నుండి త్రిగుణీకృతమయింది. ద్వితీయ విఘ్నం లేకుండా కార్యం పూర్తయింది.

★ ★ ★

అప్పటి నుండి వీలు చిక్కినపుడల్లా అతడు కుసుమ ఇంటికి వెళ్ళేవాడు. ఎపుడైనా సోమేశ్వరం తన కాంట్రాక్టు పనులమీద ఊళ్ళో ఉండకపోతే కుసుమ ఫోన్ చేసేది. ఆరోజు ఆమె శృంగారనాయకి. అతడు మాయాప్రవరుడు.

అయితే సోమేశ్వరం ఉన్నపుడు మాత్రం ఆమె రామ్‌తో ఇంతకుముందులానే ఎవరో అపరిచితుడితో ఉన్నట్టు ఉండేది. ఆ డిటాచ్‌మెంట్ చూసి అతడు ఆశ్చర్యపోయేవాడు. ఎక్కడా ఒక్కనవ్వు కానీ, చూపు కానీ చనువుగా ఉండేవి కావు.

అదీ మంచిదేలే ఎలాంటి ప్రమాదమూ ఉండదు అనుకున్నాడు రామ్. అయితే చెప్పి వచ్చేది ప్రమాదం ఎందుకవుతుంది? ఊహించని విధంగా వచ్చేదే ప్రమాదం. అది ఒక రోజు జరిగింది.

ఓ రోజు రాత్రి అలసి సొలసి తమకంగా ఉన్న సమయంలో కాలింగ్ బెల్ మోగింది. ఉలిక్కిపడ్డారు ఇద్దరూ. రామ్‌కయితే గుండెనోట్లోకి వచ్చినట్టయింది. నాలుక ఎండిపోయింది. పెదవులు పిడచగట్టాయి. ఒళ్ళు వేడెక్కింది. గుండె టకటకా కొట్టుకుంది.

అయితే ముందు తేరుకున్నది ఆమే. "నువ్వు బట్టలు వేసుకుని సెకండ్ బెడ్ రూమ్‌లో పడుకో. నేను చూసుకుంటాను. నేను చెప్పేదానికి నువ్వు ఊ కొట్టు.. సరేనా" అంది.

రామ్ రెండో బెడ్ రూంకి వెళ్ళి లోపల బోల్టు పెట్టుకున్నాడు. ఆ రూం పెద్ద జైలు మాదిరి కనిపించింది రామ్‌కి. ఇప్పుడు సోమేశ్వరం తనగురించి నాన్నకి చెప్తే? వంశం పేరు చెడగొట్టావని చదువు మానిపించేస్తే? తల్లి తన గురించి ఏమనుకుంటుంది? ఏం చెప్పాలి తను? అసలు తమ మధ్య సంబంధమే లేదని చెప్పాలి. కుసుమ, సుధాకర్ తనగురించి ఎలా అనుకుంటారు? వీడేదో మంచివాడనుకున్నాము, తీరా చూస్తే ఇదీ వీడి మంచితనం అనుకుంటారా? అయినా ఒక అమ్మాయితో, అదీ తన అంగీకారంతో సంబంధం పెట్టుకుంటే చెడ్డవాళ్ళయి పోతారా? పోనీ అలా అనుకున్నా తన చెడ్డతనం వల్ల ఎవరికి నష్టం?

క్షణాల్లో తమ బెడ్ రూంని మామూలుగా సర్దేసింది కుసుమ.

గాఢ నిద్రలోంచి లేచివెళ్ళినట్టు గా " హా.... ఎవరూ?" అంది.

"నేనే....తలుపు తియ్...నీ భయం దొంగలు తోలా" ముద్దగా వినిపించింది సోమేశ్వరం గొంతు.

ఆమె తలుపు తీసేసరికి అతడికంటే ముందు జొరబడింది గాఢమైన ఆల్కహాల్ వాసన. అతడు నడవలేని స్థితిలో ఉన్నాడు. అతడ్ని పట్టుకొని జాగ్రత్తగా బెడ్ రూం కి తీసుకెళ్ళింది. సోమేశ్వరం కనీసం బట్టలు మార్చుకునే పరిస్థితిలో కూడా లేడు.

మంచం మీద పడగానే గురకలు పెడుతూ గాఢనిద్రలోకి వెళ్ళిపోయాడు. అతడికి జాగ్రత్తగా దుప్పటికప్పి, బెడ్‌రూం తలుపు బయటినుంచి లాక్ చేసింది. రామ్ కి సంబంధించినవేమైనా అక్కడ ఉన్నాయేయో అని మరోసారి చూసింది. రామ్ రూం తాళాలు ఉన్న గుత్తి అప్పుడు కనిపించింది. అదితీసుకుని, మరేమీ లేవని నిర్ధారించుకున్నాక రామ్ ఉన్న రూం తలుపు చాలా నెమ్మదిగా కొట్టింది కుసుమ.

దడదడలాడుతున్న గుండెతో తలుపుతీశాడు రామ్.

"తను బాగా తాగి ఉన్నాడు. ఏమీ గమనించే స్థితిలో లేడు. నువ్వు వచ్చావన్న విషయం తెలియక్కర్లేదు. ఇప్పుడు నువ్వు వెళ్ళవచ్చు" అంది కిస్ అతడికి ఇస్తూ.

"ఇంత సడెన్ గా ఎందుకువచ్చాడు?" గుసగుసగా అడిగాడు రామ్

"పద... లేపి అడుగుదాం" అంది కుసుమ

"వద్దు..వద్దు" కంగారుగా అన్నాడు రామ్ ఆమె నవ్వుతుందన్న విషయం గమనించక.

"సరే నేను కనుక్కుని రేపు చెప్తాలే.....భలే ధైర్యమోయ్ నీది" అంటూ నవ్వేసింది కుసుమ.

అంత అలాంటి సందర్భంలో ఆమె ఎలా అంతకూల్‌గా ఉందో అర్ధం కాలేదు రామ్‌కి. నెమ్మదిగా అతడా ఇంట్లోంచి బయటపడ్డాడు.

★ ★ ★

ఆ సంఘటన వల్ల కాదు కానీ తనకి సెమ్ ఎగ్జామ్స్ దగ్గర పడటంతో ఆమెని కలవడం కుదరలేదు రామ్‌కి. ఆ తర్వాత సోమేశ్వరం ఓరోజు పెద్దపార్టీ ఇచ్చాడు ఫ్రెండ్సుకి. రామ్‌ని, అతడి ఫ్రెండ్స్ ని కూడా పిలిచాడు.

అప్పుడు తెలిసింది రామ్‌కి కుసుమ తల్లి కాబోతోందని. సోమేశ్వరం తల్లి ఇక కొడుకు దగ్గరే ఉండి సీమంతం అయ్యేంతవరకూ వెళ్ళనంది. ఆ తర్వాత రామ్‌కి ఆమెని కలిసే అవకాశం చిక్కలేదు.

తన అమ్మానాన్నలు ఓరోజు అకస్మాత్తుగా రావడంతో మళ్ళా అతడికి ఆ రోజు రాత్రి బెడ్‌రూంలో ఇరుక్కున్నప్పటి భయం మళ్ళా ఒక్కసారి నరనరాల్లోకి పాకింది. తన విషయం ఏమైనా తెలిసిందా? లేకపోతే అంత అకస్మాత్తుగా వాళ్ళు ఊరు వదిలిపెట్టి ఎందుకు వచ్చారు? అన్న ఆలోచన అతడ్ని ఊపేసింది.

"కుసుమ సంగతి నీకు తెల్సిందా?" అంది తులశమ్మ

"ఏ విషమం?" అన్నాడు రామ్

"ఏంట్రా ఎక్కడో అగ్రహారంలో ఉన్న మాకు తెల్సింది... నీకు తెలియలేదా?" అంది ఆవిడ

"ఊరుకుందూ....అది ఆడాళ్ళ గొడవ. పైగా వీడు చిన్నపిల్లాడు....అందుకే సోమేశ్వరం వీడికి విషయం చెప్పిఉండడు" అన్నాడు ప్రహ్లాద శాస్త్రి.

"ఏం లేదురా కుసుమ నీళ్ళోసుకుంది. ఏడోనెల. ఈరోజు సీమంతం. సోమేశ్వరం, అతడి తల్లీ పనిగట్టుకు మన ఊరువచ్చి మరీ పిలిచారు. తప్పదని వచ్చాం. లేకలేక సంతానం కలగబోతోంది కదా సోమేశ్వరం చాలా హడావుడి చేస్తున్నాడు" అంది ఆమె.

"నువ్వు కూడా రా... ఓ సారి కన్పించి వెళ్ళు... ఎంత చదువులేనా.. లేకపోతే బావుండదు" అన్నాడు ప్రహ్లాద శాస్త్రి.

★ ★ ★

అంగ రంగ వైభవంగా జరిగింది కుసుమ సీమంతం. రామ్ తల్లిదండ్రుల పాదాలకు ప్రత్యేకంగా మొక్కింది కుసుమ.

ఆమె వినయ విధేయతలకు ముగ్ధులయ్యారు ప్రహ్లాద శాస్త్రి దంపతులు.

"మా రామానికి కూడా నీ లాంటి భార్యా దొరికితే చాలమ్మా...మంచి కోడలు దొరకడం కన్నా అదృష్టం లేదీవయసులో" అంది తులశమ్మ.

కుసుమ కొత్త అందాలతో మెరిసి పోతోంది. రామాన్ని చూసి తృప్తి గా నవ్వింది. ఇంతకుముందు అతడెరుగని నవ్వు అది. కుసుమకు సీమంతం అయినతర్వాత ఆమె తల్లిగారింటికి వెళ్ళి పోయింది పురుడు పోసుకోడానికి.

★ ★ ★

తర్వాత రామానికి క్లాసులు నడుస్తున్నాయి. ఓరోజు సోమేశ్వరం హాస్టల్‌కి వచ్చిచెప్పాడు. కుసుమ కి ప్రసవం బాగా అయిందని, తనకి మగపిల్లవాడు పుట్టాడని. మగపిల్లవాడు పుట్టిన ఆనందంలో మళ్ళా మందుపార్టీ ఇచ్చాడు సోమేశ్వరం. ఈసారి కూడా రామ్ ఫ్రెండ్స్‌ని పిలవడంతో వాళ్ళు చాలా సంతోషించారు.

"రామ్ గాడిపుణ్యమాని మనకి మంచి పార్టీలు దొరుకుతున్నయ్. ఈ సోమేశ్వరంకి పదిమంది పిల్లలు పుట్టాలి. మనకి పది పార్టీలు దొరుకుతాయ్" అన్నాడో ఫ్రెండ్.

"పదిమంది పుడితే తను పార్టీ ఇవ్వడం కాదు... మనల్ని డబ్బులు అడుక్కోవాలి..అతిగా ఆశపడే మగాడు సుఖపడ్డట్టు చరిత్రలో లేదు" రజనీకాంత్ లాగా అన్నాడు సుధాకర్

"అన్నోయ్ అలా ఎవరన్నా నన్ను డబ్బులడగడానికి వస్తే... నాదారి....అడ్డదారి..పరుగో పరుగు" అన్నాడు ఆ ఫ్రెండ్

రామ్‌కి మాత్రం తను ఎప్పుడొస్తుందా, ఎప్పుడు తనని చూస్తానా అని అనిపించింది. కానీ తను కాకినాడ రానేలేదు.

సోమేశ్వరానికి విశాఖపట్నం స్టీలుప్లాంటులో పెద్దకాంట్రాక్టు తగిలింది. పిల్లాడు పుట్టిన వేళావిశేషమన్నారు అంతా. దాంతో అతడు విశాఖలోనే ఇల్లు తీసుకున్నాడు. కుసుమ సరాసరి అక్కడికే వెళ్ళింది.

సామాను తీసుకువెళ్ళడానికి వచ్చిన సోమేశ్వరం తన కొత్త నంబరు ఇచ్చాడు రామ్‌కి.

"ఎపుడేనా విశాఖ వస్తే తప్పక ఇంటికి రావాలోయ్" అని మరీ మరీ చెప్పాడు.

ఓ క్లాస్‌మేట్ అన్నయ్య పెళ్ళి విశాఖలో తగిలింది. సరదాగా ఎంజాయ్ చెయ్యడం కోసం ఆ వంకన ఫ్రెండ్సందరూ సామర్లకోట వెళ్ళి ట్రైను ఎక్కి విశాఖ తరలారు. రిజర్వేషన్ లేకుండా ప్రయాణం ఓ సరదా అనుభవం.

రయ్యిమని వీచే చల్లని పొలాల గాలులు, వెనక్కి పరిగేట్టే కొండలూ, టీకాఫీ అమ్ముకునేవాళ్ళ రన్నింగ్ ట్రైన్ ఎక్కిదిగే విన్యాసాలూ, తుని తాండ్ర, అనకాపల్లి జాంకాయలు స్నేహితుల ఎకసెక్కాల మధ్య మాయమైపోయిన సమయం. ఇట్టే వచ్చేసింది విశాఖ.

కుర్రకారుకి ఓ హాలు మాత్రం కేటాయించారు. పెళ్ళి గాజువాకలో. సోమేశ్వరం ఉండేది కూడా అక్కడికి దగ్గర్లోని మర్రిపాలెంలో.

అక్కడ దిగగానే రామ్ మొదట ఫ్రెషప్ అయిపోయాడు. మిగతావాళ్ళు

బీచ్‌కెళదామనీ, సినిమాకనీ ప్లాన్ చేసుకుంటున్నారు.

“నే వెళ్ళి మా సోమేశ్వరం అన్నయ్యని ఓమారు కలిసి వస్తాను....ఇందాకా వచ్చి తన ఇంటికి రాలేదంటే మళ్ళా బాధ పడతాడు” వాళ్ళతో చెప్పాడు రామ్

“సర్లేరా...ఈవెనింగ్ మందుపార్టీ ఉంటేమాత్రం మేమిక్కడ ఉన్నామని చెప్పడం మరిచిపోకురోయ్” అన్నారు వాళ్ళు

“సరే” అని నవ్వేసి రోడ్డుమీదికి వచ్చాడు రామ్.

పబ్లిక్ ఫోన్ బూత్ నుండి సోమేశ్వరం ఇచ్చిన నంబరుకి ఫోన్ చేశాడు రామ్. ఫోన్ ఎత్తిన చప్పుడు...అవతల కుసుమ

“బావున్నావా?” అడిగాడు.

“బావున్నా...నువ్వు?” అంది కుసుమ.

“హా... ఫ్రెండ్ వాళ్ళన్నయ్య పెళ్ళికి వైజాగ్ వచ్చాను... నిన్నోసారి చూద్దామనిపించి....”

“ఎందుకు..... చూడ్డం?” గురిచూసి విసిరిన బాకులా వచ్చింది ప్రశ్న అటువేపునుంచి

# 8

“చెప్పు .... ఎందుకు నన్ను చూడాలనుకున్నావు? ” సూటిగా అడిగింది కుసుమ.

ఏం చెప్పాలో తెలీక మౌనంగా ఉన్నాడు రామ్.

ఫోన్లో కటువుగా మాట్లాడాక అతడు ఫీలయ్యాడని గ్రహించిన కుసుమ అంది “సరే.. పాతపోస్టాఫీసు దగ్గర ఉన్న కనకమహాలక్ష్మి గుడికి రా....మాట్టాడదాం” అంది.

అన్నట్టు గానే గుడిలో కలిశారు ఇద్దరూ. జనం పలుచగా ఉన్నారు. గుడి ఆవరణలో చెట్టుకింద కూర్చున్నారు.

“ఒకవేళ నీ చదువునిగానీ, నీ మనసుకిగానీ నేను కల్లోలంచేస్తే నన్ను క్షమించు రామ్...నా పరిస్థితి నీకు చెప్పాలి. మాకు పెళ్ళయి చాలా సంవత్సరాలు గడిచినా పిల్లలు పుట్టలేదు. నాభర్త కి ఇతరత్రా లోపాలేమీలేవు. కానీ ఎందుకు పుట్టలేదో తెలీదు. ఆయన మగమహారాజు.  టెస్టులమాట ఎత్తితేనే ఇంతెత్తున లేచాడు. నేనేమన్నా పేడెగాడిననుకున్నావా? నా గురించి పెద్దాపురంలో అడుగు, చెప్తారు నా మగతనం గురించి అన్నాడు నిస్సిగ్గుగా. డబ్బుకోసం వచ్చినవాళ్ళు వంద మాటలు

చెప్పొచ్చు మెరమెప్పుకోసం. అలాంటివి ఇంటి ఇల్లాలి దగ్గర మాట్లాడకూడదన్న కనీస ఇంగితం ఆయనకు లేదు. సరే నేను టెస్టులు చేయించుకున్నా ఆయనకు చెప్పకుండానే. నాలో ఏలోపం లేదన్నారు డాక్టర్.

తన లోపాన్ని కప్పి పుచ్చుకోడానికే ఆ ఇచ్చకాల తిరుగుళ్ళు. పదిమంది ఆడాళ్ళతో తిరిగితే మగాడయిపోతాడా? అవుతాడంటుంది మన చుట్టు ఉన్న సమాజం. నాకు పిల్లల్ని ఇవ్వలేనపోయినా, ఆయనలో ఇతరత్రా లోపాలున్నా నేను సర్దుకుంటాను. నాకసలు ఆయన సంసార సౌఖ్యం ఇవ్వకపోయినా నేను ఆయన్ను చిన్న పుచ్చను. కానీ ఆయనలో సమస్య అదికాదు. ఆయన సౌఖ్యం ఇవ్వగలడు కానీ నన్నుకానీ ఇంకెవర్ని కానీ సంతానవతిని చెయ్యలేడు.

ఇక మా అత్తగారు. ఆవిడ నన్ను ఎన్నిసార్లు మానసికంగా చంపిందో లెక్కలేదు రామ్. ఎత్తిపొడుపు మాటలు, గొడ్రాలినని, కొడుకును తండ్రిని చెయ్యలేకపోతున్నానని, నా తరువాత పెళ్ళయిన వాళ్ళు అపుడే రెండో కాన్పుకూడా కానిచ్చారనీ..అంతా నా తప్పే...లోపమంతా నాదే అని ఆవిడ మాట్లాడే మాటలు వింటే చచ్చిపోవాల నిపించేది.

పుట్టింటికి వెళ్ళిపోదామంటే మానాన్న సంపాదించింది అంతా అల్లుళ్ళ కొనుగోలు మీద తగలేశాడు.

పైగా సమాజం వేసే నిందలు తలుచుకుంటే వేసే భయం... ఆకలి చూపుల మగాళ్ళ వేట చూపులు నేను తట్టుకోగలనా?

నీకు గుర్తుందా ఓరోజు మా అత్తగారు నిన్ను చూసి నీలాంటి మనమడుంటే చూసి హాయిగా కన్నుమూస్తానంది. బహుశా అప్పుడే తథాస్థు దేవతలు కాకినాడ మీదుగా వెళ్తూ తథాస్థు అన్నారనుకుంటా.....నాకు అప్పటివరకూ లేని ఆలోచన అప్పుడు వచ్చింది.

పైగా ఆవిడ కొత్తగా ఓ రాగం మొదలెట్టింది. నాలో ఏదో లోపం ఉంది కాబట్టి తన కొడుకు పిల్లలకోసం మరో పెళ్ళి చేసుకుందుకు నేను ఒప్పుకోవాలట.

దేవరాద్వా సపిండాద్వా స్త్రియా సమ్యక్ నియుక్తయా

ప్రజేప్సితాధి గంతవ్యా సంతానస్య పరిక్షయే

అన్నది మనువు ఆజ్ఞ. సంతానం లేనపుడు మరిదితో గాని, సపిండ దాయాదితో గాని సమర్ధుడైన కొడుకుని కనవచ్చు అని మనువే సెలవిచ్చాడు. దీని కోసం గురువు, భర్త అంగీకారం కావాలన్నాడు. అత్తగారు పెడుతున్న బాధల్ని వారించకపోవడం ద్వారా తనకు పుత్రుడే ముఖ్యమని ఆయన ఇచ్చిన సూచనే అంగీకారంగా భావించాను.

యస్తల్పజ: ప్రమీతస్య భీస్య వ్యాధితస్యదా

స్వధర్మేణ నియుక్తాయాం స పుత్ర: క్షేత్రజ: స్మృత:

అన్నాడు మనుమహర్షి, భర్త చనిపోయినా, నపుంసకుడైనా, సంతానం కలిగించలేని వాడైనా అతడి భార్య గురువు సమ్మతితో, నేతి స్నానం చేసి తనని సంగమించినవాడితో కొడుకుని కంటే వాడు క్షేత్రజుడు అని. తన తండ్రికి కర్మలు చేసే అధికారం వాడికి ఉంటుంది. తన తండ్రిని పుత్ అనే నరకం నుండి వాడు బయట పడేయగలడు అని ధర్మ నిర్ణయం.

అవన్నీ తరువాత, ముందు నన్ను అత్తగారి నరకం నుండి రక్షించాడు.

ఆరోజు, అదే అనుకోకుండా ఆయన వచ్చిన రోజు నేనంత నిబ్బరంగా ఎలా ఉన్నాననుకున్నావ్? నేను చేసేది ధర్మం, న్యాయం అనుకున్న మనిషికి భయం ఉండదు. నా కోరిక ఒకటే రామ్, నా కారణంగా నువ్వు చదువు పాడు చేసుకోవద్దు... అది నాకు క్షోభ కలిగిస్తుంది.

మళ్ళా మనం కలవడం వల్ల ఏ ప్రయోజనం లేదు...ఇద్దరికీ హాని తప్ప" అంది కుసుమ

ఆమె దగ్గర నేతివాసన ఎందుకొచ్చేదో అప్పుడు అర్దమైంది రామ్‌కి. దానికంటే ఆమెపడ్డ క్షోభ, వేదన ఇంకా బాగా అర్థమయ్యాయి. ఒక్కో స్త్రీ జీవితంలో కనిపించని వెతలు ఎన్నుంటాయో అర్థమై అతడి హృదయం ఆర్ద్రమయింది.

ఆమె పట్ల ఆరాధనా భావం పెల్లుబుకుతుండగా అక్కడ్నించి మౌనంగా కదిలాడు.

★ ★ ★

"అసలు నువ్వు ఆడాళ్ళతో గుడికెళ్ళడం మానెయ్....అది నీకు అచ్చిరాలేదు" అన్నాడు సుధాకర్ సీసాలో బీరు గొంతులోకి వంపుకున్న తరువాత హాయిగా తేన్చి, నవ్వుతూ

"దుర్మార్గుడా... నేను హృదయం బద్దలై ఏడుస్తుంటే నువ్వు దానిమీద వాస్తూ, బల్లిపడ్డశాస్త్రమూ లాంటివి సాధన చేస్తావా?" తను కూడా నవ్వేస్తూ అన్నాడు రామ్.

"ఏం చెయ్యమంటావు... నేను విన్న రెండు సంఘటనల్లో గుడి కామన్. ఇంద్రాణి నిన్ను మొదట గుడిలో కలిసింది. కానీ కలిసి ఉండలేకపోయింది. కుసుమ నిన్ను గుడిలో కలిసింది ఇది ఆఖరి సారి కలవడం అని చెప్పడానికి. ఇందువల్ల గుడి నీకు అచ్చిరాలేదని తేలింది" అన్నాడు సుధాకర్.

"నీ సిద్దాంతాన్ని గొయ్యితీసి పాతా... రేపు నాకు పెళ్ళయ్యాక నా భార్యతో కూడా

గుడికి వెళ్ళద్దనేలా ఉన్నావు" అన్నాడు రామ్ ఎదురుగా ఉన్న సముద్రాన్ని చూస్తూ

"విడాకుల ఆలోచన ఉంటేతప్ప" అన్నాడు సుధాకర్

ఇద్దరూ ఉడా బీచ్‌లో జనంలేని చోట కూర్చుని బీరు కొడుతూ మాట్లాడు కుంటున్నారు. కుసుమతో మాట్లాడిన తర్వాత చాలా అప్‌సెట్ అయ్యాడు రామ్. సుధాకర్‌తో చెప్పుకున్నాక రిలీఫ్ ఫీలయ్యాడు.

"ఆవిడని తప్పుపట్టడానికేంలేదు రామ్...సమస్య ఒకటే అయినా తమకి తోచిన పరిధిలో, తమకు తెలిసున్న శాస్త్రాలతో, పరిజ్ఞానంతో పరిష్కారం ఆలోచిస్తారు. అందుకే ఏ ఇద్దరికి తోచిన పరిష్కారాలూ ఒక్కలా ఉండవు. నిజానికి ఆవిడ చాలా రిస్క్ చేసింది. నువ్వు కాబట్టి సరిపోయింది అదే ఇంకొకడయితే ఆవిడ జీవితంతో ఆడుకునేవాడు. అందుకే ఆచితూచి నిన్ను ఎన్నుకుంది. ఎనీవే....జరిగిందానికి బాధ పడాల్సిన అవసరం నీకు కానీ ఆవిడకి కానీ లేదు. నువ్వుకూడా మొత్తం మర్చిపో... నేను కూడా మర్చిపోతాను. ఇది ఎక్కువ చర్చించడం కూడా మంచిదికాదు. డియర్ బాలచందర్.... ఇది ఓ అందమైన అనుభవం అనుకో" అన్నాడు సుధాకర్

"బాగు..బాగు కాకినాడ మిగిల్చిన అందమైన అనుభవం" అన్నాడు రామ్

"ముసలిముత్తైదువ రాజమండ్రి... పడుచుభోగంపిల్ల కాకినాడ.. రాజమండ్రి సుఖాన్నివ్వదు, కాకినాడ కాపురం చెయ్యదు అన్నాడు ఓ మహానుభావుడు... నీ విషయంలో అది నిజం" అన్నాడు సుధాకర్

"ఆయనకి నాగొడవ ఎవరు చెప్పారు నువ్వుకానీ కాదుకదా" అన్నాడు రామ్

"నీకంటె ముందు కలడు ఓ అతనికంటె ఘనుడు ఆచంటమల్లన్న" అన్నాడు సుధాకర్ లేచి నిలబడి రామ్ కి చెయ్యి అందిస్తూ

★ ★ ★

ఇద్దరూ డిస్టింక్షన్ లో బీటెక్ పూర్తి చేశారు. కాంపస్ ఇంటర్వ్యూల్లో హైదరాబాద్ లో ఉన్న జెటెక్ సర్వీసెస్ కంపెనీ లో మంచి పాకేజీతో ఉద్యోగాలు వచ్చాయి.

ఇద్దరూ కలిసి గౌతమీ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ చేరుకున్నారు. రిపోర్టు చేయడానికి మాదాపూర్ లో ఉన్న కంపెనీ ఆఫీసు కి వెళ్ళారు. ఆశ్చర్యం... అక్కడ రాజేంద్ర.

"నీకు తెలీదా రామం... నేను బీయస్సీ లాభం లేదని బీకాం పూర్తి చేసి, ఓ ఆర్నెల్లు జావా అనీ, ఒరాకిల్ అనీ డాట్‌నెట్ అనీ నేర్చుకున్నా... ఇక్కడ ప్లేస్‌మెంట్ దొరికింది.... ఇది మనవాళ్ళ కంపెనీయేలే...ఇంకో ఆర్నెలల్లో టీం లీడర్ కూడా

అవుతాను" అన్నాడు రాజేంద్ర

రామ్‌కి ఏదో తెలీని నిస్సత్తువ లాంటిది వచ్చింది. నాలుగేళ్ళు కష్టపడి ఇంజనీరింగ్ చేసిన తామూ, అందులో సీటురాక, కనీసం బీయస్సీ కూడా చదవలేక బీకాం చదివి నాలుగు కోర్సులు చేసిన రాజేంద్ర ఒకే గాటన ఉన్నారు. ఒరాకిల్ ఒక్కటి మాస్టర్ చెయ్యడానికే ఏళ్ళు పడుతుంది. వీడు ఆర్నెలల్లో మూడు కోర్సులు చుట్టబెట్టాడంటే ఏ స్థాయిలో అతడి పరిజ్ఞానం ఉంటుందో ఊహించవచ్చు.

"అయితే ఇది మన రిజర్వేషన్ అంటావు " అన్నాడు రామ్

"ఛ..ఛ అలాంటి అప్రాచ్యపు మాటలు మాట్లాడకు...కింది కులాలవాళ్ళకి వస్తే అది రిజర్వేషన్...మనకి వస్తే అది మెరిట్.... మన మెరిట్ మనవాడు గుర్తించకపోతే ఇంకెవడు గుర్తిస్తాడు?" అన్నాడు

పదోతరగతి ఓసారి బోకిన రాజేంద్ర మెరిట్ గురించి మాట్లాడుతుంటే రామ్ కి చిరాకేసింది. అదికూడా ఇంజనీరింగ్ డిస్టింక్షన్ లో పాసయిన తన దగ్గర.

"నువ్వు నా రూమ్ లో ఉందువు గాని వచ్చెయ్" అన్నాడు రాజేంద్ర నారాయణ.

అతడు కావాలనే సుధాకర్ విషయం ప్రస్థావించడం లేదని అర్ధమైంది రామ్‌కి. సుధాకర్ తో కలిసి ఉండటం ఎందుకు అతడికి ఇష్టంలేదో కూడా అర్ధమైంది.

"లేదులే నేనూ సుధాకర్ కలిసి ఉంటున్నాం... ఆల్రెడి ఓ అపార్ట్‌మెంట్ కి అడ్వాన్సు కూడా ఇచ్చాం" అన్నాడు రామ్.

అదోలా నవ్వాడు రాజేంద్ర..." ఓకే...ఓకే... ఏమన్నా కావలిస్తే నన్నడుగు... అన్నట్టు మన మంగారావు కూడా ఇక్కడే ఉంటున్నాడు...రియల్ ఎస్టేటులో బాగానే సంపాదించాడు...మన నియోజకవర్గం రిజర్వుడు అయిందిగా.. అందుకే చుట్టపక్కల నియోజకవర్గాలమీద దృష్టి పెట్టాడు " అన్నాడు

"మంగారావా...ఎమ్మెల్లేనా...." అన్నాడు రామ్ ఆశ్చర్యంగా.

"ఏం...మన సాయిలు గాడి కాఫీ హొటల్లో మనతో దేకిన సత్యం అయితే లేదుగానీ మంగారావు అయితే ఏం తప్పు? " అన్నాడు రాజేంద్ర అక్కడికేదో సాయిలు హొటల్లో దేకడం ఓ క్వాలిఫికేషన్ అయినట్టు.

★ ★ ★

"చాలా బాగుంది.... హైదరాబాదు... నాకు నచ్చింది" అన్నాడు రామ్ సుధాకర్‌తో

"ఇక్కడ నీకు ఏం నచ్చింది?"

"మనలాగా చెమటలు పట్టడంలేదు...గాలి పొడిగా ఉంది. అన్ని భాషల వాళ్ళు కనిపిస్తున్నారు...ఇదో మినీ ఇండియాలా ఉంది"

"ఇంకా...."

"అమ్మాయిలు సూపర్‌గా ఉన్నారు...చాలామంది కోస్తా అబ్బాయిల్లాగే నాకూ జీన్స్,టీ షర్టు వేసుకుని, బాబ్డ్ హెయిర్‌తో, ఇంగ్లీషు గలగలా మాట్లాడే అమ్మాయిలంటే ఇష్టం... అది ఇన్‌ఫాట్యుయేషన్ అనుకో, టేస్ట్ అనుకో...అలాంటి అమ్మాయిలు కోకొల్లలు ఇక్కడ"

"వేల వరూధినుల సమాహారం.... గంధర్వసమ కన్యకా మణుల విహారం..ఈ భాగ్యనగరం" పొయటిక్‌గా అన్నాడు సుధాకర్

"నాకో సరదా కల ఉండేది...కాదు..కాదు ఇంకా ఉంది..అలాంటి జీన్స్‌పాంటు జింగ్‌బాంగ్ పిల్లని చేసుకుని మా ఊరికి తీసుకువెళ్ళి అందరూ నోళ్ళు వెళ్ళబెడితే చూడాలని....ఒక్కోసారయితే ఫారిన్ అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే ఎంత ఎక్సయిటింగ్‌గా ఉంటుందా అన్పిస్తుంది....ఇందులో ఏది నిజమవుతుందో" అన్నాడు రామ్

"రెండూ అయితే..." అన్నాడు సుధాకర్

"ఉన్నది ఒక్క జీవితం... ఎలా?"

"అంతే మిత్రమా... కలలు మనల్ని ఎనర్జిటిక్‌గా ఉంచే బూస్టర్‌లు. జీవితంలో తీరని ఆశ ఒక్కటన్నా ఉండకపోతే బోర్ కొడుతుంది. జీవితాన్ని ఎక్జయిటింగ్‌గా ఉంచేందుకు అది అవసరం...దాన్నలా ఉంచెయ్యాలి....అది తీరకపోయినా డిస్టర్బ్ కాకూడదు... ప్రాక్టికల్ గా ఉండే ఛాలెంజ్‌లు జీవితం నువ్వు వద్దన్నా ఇస్తుంది. వాటినీ అధిగమించాలి. ఉదాహరణకి కులరహిత సమాజం ఒకటి వస్తుందన్న ఆశ...కల అలా ఉంచుకోందే దళితుడెవడూ సుఖంగా నిద్ర పోలేడు. అది ఎప్పుడు వస్తుందో...అసలు వస్తుందో రాదో తెలీదు... దేవుడున్నాడు అన్న భావన ఎలా మనిషికి సెక్యూరిటీ ఫీలింగ్‌ని ఇస్తుందో అలానే ఇలాంటి కలలు జీవితం పట్ల ఆసక్తి ఉంచుతాయి...పునర్జన్మ ఉందన్న నమ్మకం...స్వర్గం ఉందన్న నమ్మకం ఇవన్నీ మనిషిలో ఆశ చావకుండా కాపాడతాయి...ఆ నమ్మకాలకీ నీ కలలకీ పర్పస్ మాత్రం ఒక్కటే " అన్నారు సుధాకర్

"అబ్బ....ఇందులో ఇంత ఉంటుందనుకోలేదు" అన్నాడు రామ్

"కలలు లేని జీవితమూ, అలలు లేని సముద్రమూ ఉండవు మిత్రమా" అన్నాడు

కానీ రామ్ జీవితం అతి త్వరలోనే ఎన్ని మలుపులు తిరగబోతోందో, ఎన్ని అలలు, ఎన్ని తుఫానులు అతడి జీవితాన్ని ముంచెత్త బోతున్నాయో అతడు ఊహించలేక పోయాడు..అసలు రామ్ జీవితాన్ని అతలాకుతలం చెయ్యబోతున్న 'లైలా' తుఫాను 'జల్' తరంగం అనంతపురం లో పుట్టి బెంగుళూరులో పెరిగి కేంద్రీకృతమై ఉన్నది.

కలల అవసరం రామ్‌కి ఎంతో ఎక్కువగా ఉండబోతోంది.

★ ★ ★

జానకి దేవి అబ్బూరి పుట్టింది అనంతపురంలో. అది వాళ్ళ అమ్మమ్మ గారి ఊరు. తండ్రి హరిహరరావు అబ్బూరి బెంగుళూరు ఇన్ఫోసిస్‌లో చాలాకాలం పనిచేసి, చివరికి ఈక్విటీ హోల్డర్‌గా ఎదిగి, వాటిల్లో చాలా వరకు అమ్మి కొన్ని కంపెనీల్లో పెట్టుబడి పెట్టాడు.

అతడికి తనలో సరుకేమిటో తెలుసుకాబట్టి తెలివైన వాళ్ళని పార్టనర్స్‌గా తీసుకుని బాగుపడ్డాడు. అతడికున్న బలమల్లా నెట్‌వర్కింగ్. అంటే అగ్రహారం స్థాయినుండి అమెరికా వరకూ పనికొచ్చే 'తమవాళ్ళ' చిట్టా అతడివద్ద ఉంటుంది.

వాటిని తన కంపెనీలకి ప్రాజక్టులుగా మార్చగలగే 'ప్రతిభ' అతడిసొంతం.

ఇక అతడికున్న ఏకైక సంతానం జానకీదేవి.

హరిహరరావు మొదట్లో సింగిల్ టీకి టికాణా లేనివాడు. వారాలు చేసుకుని చదువుకున్నాడు.

బెంగుళూరులో చిన్న జీతానికి పనిచేసేవాడు. అతడు పనిచేస్తున్న ఆఫీసు పక్కనే చిన్న కంప్యూటర్ ట్రెయినింగ్ సెంటర్ ఉండేది. అది నడిపేది ఉడిపినుండి వచ్చిన కుటుంబం. తమ ఆఫీసుకి సంబంధించిన కొంత జాబ్‌వర్క్ అక్కడ చేయించడానికి వెళ్తూ ఉండటంతో ఉడిపి అమ్మాయితో, కంప్యూటర్‌తో పరిచయం ఏర్పడింది.

అతడూ తమవాడే అని తెలుసుకున్న ఉడిపి కుటుంబం అతడ్ని కంప్యూటర్ గురించి, తమ అమ్మాయి గురించి నేర్చుకోడానికి ప్రోత్సహించారు.

ఫలితంగా హరిహరరావుకి స్త్రీ గురించి క్షుణ్ణంగా, కంప్యూటర్ గురించి ఓ మోస్తరుగా విషయ పరిజ్ఞానం పెరిగింది. చివరికి ఇతడికి ఓ చిన్న సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం, ఉడిపి అమ్మాయికి కడుపూ మిగిలాయి.

ఆ ఉద్యోగాన్ని అడ్డుపెట్టుకుని గతంలో అనంతపురంలో తను వారాలు చేసిన

ఓ ఇంట్లో కుజ దోషమున్న ఓ అమ్మాయిని ఉద్ధరించడానికి పెళ్ళి చేసుకున్నాడు. ఆ అమ్మాయికి బాగా డబ్బుండటం వేరే విషయం.

ఆ డబ్బుతో, పరపతితో అంచెలంచలుగా ఎదిగాడు. ఉడిపి అమ్మాయి ఇతడికి పెళ్ళయిన విషయం తెలుసుకుని ఆత్మహత్య చేసుకోబోయింది. ఆ తర్వాత ఆ అమ్మాయి కుటుంబం ఏమయిందో ఎవరికీ తెలీదు.

కానీ ఉడిపి అమ్మాయి ఎప్పుడువచ్చి నిలదీస్తుందో అని హరిహరరావు నిత్యం భయంలో ఉండేవాడు.

అదీ కాక తమింట్లోనే వారాలు చేసుకున్న వాడవటాన అతడి స్థితి ఏమిటో తెలిసిన అతడి భార్య రాజరాజేశ్వరి అతడ్ని భర్తగా కంటే ఓ నేతిగిన్నెలాగా, కుక్కపిల్లలాగా, అట్లపెనంలాగా, చెప్పులుపెట్టుకునే స్టాండులాగా, కాళ్ళు తుడుచుకునే డోర్‌మాట్ లాగా, పిండం తినే కాకిలాగా, చూరులో పిచ్చుకలాగా చూసుకునేది.

రాజరాజేశ్వరి అందగత్తేకానీ జానకి పుట్టిన తరువాత రుబ్బురోలు పొత్రంలా ఉండేదికాస్తా సాక్షాత్తూ రుబ్బురోలు మాదిరిగా తయారయింది. జానకి తరువాత ఓ పిల్లాడు పుట్టినా పురిట్లోనే పోయాడు.దాంతో గర్భసంచి తొలగించాల్సివచ్చింది.

అప్పట్నించి ఆవిడకి కొత్తగా భర్తమీద అనుమానం అనేది కూడా మొదలైంది. అప్పట్నించీ ఆవిడ దగ్గర హరిహరరావు పరిస్థితి సొట్టపోయిన నేతిగిన్నెలాగా, గజ్జి కుక్కపిల్ల లాగా, కోటింగు పోయిన నాన్‌స్టిక్ అట్లపెనం లాగా, శిధిలమయిన చెప్పుల స్టాండులాగా, చిరిగిన డోర్‌మాట్ లాగా, ఇంట్లో గిన్నెలు ఎత్తుకుపోయే కాకిలాగా, కళ్ళంలో పంట పాడుచేసే పిచ్చుకలాగా వెలిగిపోవడం మొదలయింది.

చిన్నారి జానకి ఆవిధంగా తండ్రి అంటే ఇంట్లో మగవాడికి ఎంత గౌరవం ఇవ్వాలో, అతడికి ఎలా జాగ్రత్తగా చూసుకోవాలో చూస్తూ పెరిగింది.

ఇక ఆవిడకి భర్తతో కలసి ఒక కప్పుకింద ఉండటమే తప్ప కాపురం చెయ్యాల్సిన అవసరం లేకపోవడంతో షాపింగు, ప్రతీ మాసానికి తగ్గ వ్రతాలు చెయ్యడం, గుళ్ళు గోపురాలు చూడటం తద్వారా ఫలానా ఆవిడ ఉత్తమ ఇల్లాలు అన్న పేరు సంపాదించడం కాలక్షేపంగా మారాయి.

ఇదీ బెంగుళూరు లైలా తుఫాను కథ.

★ ★ ★

కంపెనీలో చేరిన రెండునెలలకే రామ్‌కి బెంగుళూరు వెళ్ళాల్సివచ్చింది కంపెనీ పనిమీద. మామూలుగా అయితే అప్రెంటీస్‌కి ఫ్లయిట్‌లో వెళ్ళే అవకాశం ఉండదు.

కానీ కంపెనీ అది ముఖ్యమయిన పని అని భావించడంతో మిగతా టీమ్‌తోపాటు అతడు కూడా విమానంలో బెంగుళూరు వెళ్ళాడు.

అదే సమయానికి ఆశ్చర్యంగా ప్రహ్లాదశాస్త్రి , తులశమ్మ గారితో ఏదో పని మీద బెంగుళూరు వచ్చాడు.

“నీ పని చూసుకుని.. సాయంత్రం ఐదు గంటలకల్లా వచ్చేసేయ్...మేం తాజ్ లో దిగాం...మళ్ళారాహుకాలం రాగలదు” ఫోన్లో అన్నాడాయన.

“కంపెనీలో పని ఏ టైం అవుతుందో?” అన్నాడు రామ్

“మరేం ఫర్వాలేదు నీ పని ముందుగానే అవుతుంది...భగవదేచ్ఛ” అన్నాడు

రామ్‌కి అంతా గందరగోళంగా ఉంది. తన తండ్రికి అక్కడ ఏం పనో అర్ధం కాలేదు.

ఆయన చెప్పినట్టుగానే రామ్ పని ముందుగానే అయిపోయింది. కొంపతీసి తన తండ్రికి అతీంద్రియశక్తులవీ వచ్చి ఏ బాబాగానో మారే సమయం వచ్చిందేమో అని భయపడ్డాడు రామ్.

తన తల్లిదండ్రులు హొటల్‌లో ఉండటం, తమకు బెంగుళూరులో చెప్పుకోతగ్గ బంధువులెవరూ లేకపోయినా ఇక్కడికి రావడం అంతా మిస్టరీగా ఉంది రామ్‌కి.

కారులో వెళ్తుండగా చెప్పాడు ప్రహ్లాదశాస్త్రి “ఏంలేదురా ఓ మంచి సంబంధం ఉందంటే చూడ్డానికి వచ్చాం.. వాళ్లే నీగురించి తెలుసుకుని మేం రావడానికి అన్ని ఏర్పాట్లూ చేశారు. మన బంధువర్గాన్ని ఎలా పట్టుకున్నారో....మొత్తానికి మేం సరే అనే వరకూ వినలేదు. నిన్ననే నేను మీ అమ్మ అమ్మాయిని చూశాం.. లక్ష్మీదేవిలా ఉంది...వేదోక్తంగా చూశాను .... అన్ని శుభలక్షణాలూ ఉన్నాయి”

రామ్‌కి రెండు అనుమానాలు వచ్చాయి. ఒకటి అమ్మాయి లక్ష్మీదేవిలా ఉందంటున్నాడు తండ్రి, అసలాయన లక్ష్మీదేవిని ఎప్పుడు చూశాడా అనేది ఒకటి, ఈ వేదోక్తమైన పరీక్ష ఏమిటా అనేది రెండోది.

వాళ్ళ ఇల్లు బెంగుళూరులో పోష్ లొకాలిటీ రిచ్‌మండ్‌టౌన్‌లో ఉంది. అతిధిమర్యాదలు చాలా గట్టిగా జరిగాయి. వాటినిబట్టి చూస్తే హరిహరరావు అంత మర్యాదతెలిసిన మర్యాదరామన్న ఇంకోడు ఉండటానికి వీల్లేదు.

రాజరాజేశ్వరి అయితే అణకువ గల ఇల్లాలు పాత్రలో ఒదిగిపోడానికి యధాశక్తి ప్రయత్నించింది కానీ ఆవిడది అత్తకు యముడు అమ్మాయికిమొగుడు సినిమాలో వాణిశ్రీ వేసిన అత్త పాత్ర కావడంతో రసపోషణ అంతగా జరగలేదు.

జానకీదేవిని అలంకరించి తీసుకొచ్చారు. ఆమెతల్లి అందమైందే కానీ తల్లి అందం రాలేదు. ఆవిడ తెలివితేటలు వచ్చాయి. దురదృష్టవశాత్తూ ఆ తెలివితేటలు భర్త అజమాయిషీ వరకే పరిమితం. తండ్రి తెలివైనవాడు. కానీ అందగాడు కాదు. ఆమెకి అతడితెలివి రాలేదు. అందం వచ్చింది. వెరసి ఆమె చైనీస్‌హోటల్లో మసాలాదోశ లాగా, ఉడిపి హోటల్లో మంచూరియన్‌లా తయారయింది.

జానకి అనాకారి కాదు... అలా అని అందగత్తె ఎంతమాత్రం కాదు. ఆమెని చూడగానే ఒక అభిప్రాయం ఏర్పడటం కష్టం. చూసినకొద్దీ చూడాలనిపించడానికి ఆమేమీ బ్లాక్‌బస్టర్ సినిమాకాదు. అలా పదిసార్లు చూసినా ఓ అభిప్రాయం ఏర్పడటం అనుమానమే.

అందుకే రామ్‌కి ఆమె నచ్చలేదు .... అలాని పూర్తి అయిష్టంగానూ లేదు. ఇదో వింత స్థితి. పెళ్ళి చూపుల్లో సాధారణంగా ఏర్పడేది.

నచ్చింది అనిచెప్పడానికి ఏం ఉండదు... అలాని నచ్చలేదనడానికి కారణం ఉండదు. అప్పుడు మిగతా విషయాలు ఆ సంబంధం వైపు మొగ్గటానికి దారితీస్తాయి.

పరస్పర పరిచయాలు అయ్యాక ఆయన తన కార్డు ఇచ్చాడు.

'హరిహరరావు'....కార్డువెనుక అతడికి సంబంధించిన కంపెనీల వివరా లున్నాయి. అందులో రామ్ పనిచేస్తున్న జె టెక్నలాజికల్ సర్వీసెస్ కూడా ఉంది.

జె అంటే జానకి....జానకి అబ్బూరి

# 9

అమ్మాయిని చూసివచ్చాక చాలా కుటుంబాల్లో జరిగే సంభాషణ రామ్ ఇంట్లో కూడా రిపీటయింది. జానకి ఎందుకు నచ్చలేదో చెప్పమని నిలదీశాడు ప్రహ్లాద శాస్త్రి.

"అమ్మాయికి కన్ను వంకరా? కాలు వంకరా? చక్కటి రంగు, కోడలు నలుపయితే కులం నలుపనే దోషం కూడాలేదు. పైగా వేద పరీక్ష కూడా పాసయింది" అన్నాడు ఏదో అక్కడికి కన్నుముక్కు వంకర లేకుండా,తెల్లగా ఉన్నవాళ్ళందరూ నచ్చితీరాల న్నట్టుగా.

"ఏంటి నాన్నగారూ వేద పరీక్ష అంటారు...అదేమన్నా ఎంసెట్టా" అన్నాడు రామ్ విసుగ్గా.

"నీకు తెలీదా ఏమిట్రా.... అధర్వణవేదంలో ఉంది...పుట్టమట్టీ, పొలం మట్టీ, శ్మశానం మట్టీ అమ్మాయి ముందుపెట్టాం... పుట్ట మట్టి పట్టుకుంది...కాబట్టి శుభం జరుగుతుంది... పైగా ఈ కాలం పిల్లలకి తెలీని పూజాపునస్కర పద్ధతులు తనకి బాగా

తెలుసు" అంది తులశమ్మ

నన్ను తగలేసి ఆ బూడిదకూడా అక్కడ పెట్టాల్సింది అనుకున్నాడు రామ్

"మీరు మీక్కావలసినవన్నీ చూసుకుంటున్నారు....నాకు కావల్సింది ఏమిటో మీకు పట్టినట్టు లేదు" అన్నాడు రామ్

"పిచ్చి భడవ... నీకేం కావాలో నీకు తెల్సా...తనకి కోట్ల ఆస్తి ఉంది..పైగా ఒక్కతే పిల్ల..సంప్రదాయమైన కుటుంబం..ఇంకా ఎక్కువ ఏం ఆశిస్తాం?" అన్నాడు ప్రహ్లాద శాస్త్రి

"ఉత్తమంస్వార్జితంవిత్తం మధ్యమంపితురార్జితమ్...అధమం భ్రాతృజాయాది స్త్రీవిత్త మధమాధమమ్ " అన్నాడు రామ్

"వచ్చాడండీ ధర్మజుడు... ఏంటీ సొంతంగా సంపాదించింది ఉత్తమమా... నువ్వుపెళ్ళిచేసుకుంటే వచ్చిన సొమ్ము స్వార్జితమే.. తండ్రి సంపాదించింది మింగితే మధ్యమం..సోదరుడు సంపాదన అధమం, స్త్రీ సొమ్ము అధమాధమం.. బాగుంది...తనకుమాలిన ధర్మం ఉంటుందా? అంత సొమ్ము నువ్వు ఏనాటికి సంపాదించాలి? ధనమేరా అన్నిటికీమూలం అన్నారు ఆర్యులు" అన్నాడు ప్రహ్లాదశాస్త్రి.

"అలా అన్నది ఆర్యులు కారు...ఆరుద్ర 1968లో రాసిన పాట అది" అన్నాడు రామ్.

"పనికొచ్చేముక్క చెప్పినవాడు ఎవడైనా ఆర్యుడే...సంస్కృతంలో ఏం కూసినా అది సుభాషితమవుతుంది...

ధనంయేవ మూలం సర్వస్య ...

తత్ధనస్య ప్రాతాధ్యన్యజ్ఞానమేవ మానవధర్మశ్య:

ఆ...ఇప్పుడు ఆర్యుడు చెప్పినట్టు ఉందా..... అసలు ధర్మం నిర్వచించేదే మనం .... కాబట్టి ఎక్కడ మనకి ఎలా వీలయితే, ఎక్కడ మనకి ఏది కలిసివస్తే అదే ధర్మం... చవలాయిలు మనం ఏం చెబితే అది విని పాటిస్తారు....అదీ ధర్మసూక్ష్మం.. మనకి పనికివచ్చేదే ...అనుకూలంగా ఉన్నదే శాస్త్రం....

నువ్వు మాకు సేవ చేసేందుకే పుట్టావు...నువ్వు వెధవ్వి, అదినీ కర్మ, పూర్వజన్మ ఫలం అని మనం చెప్పగానే ఎందుకు అని అడక్కుండా గాడిద చాకిరీ చేసే చెవలాయిల్లా ఆలోచించకు... ఇది నేను చెప్పింది కాదు... వేల సంవత్సరాలుగా మన పూర్వీకులు నిరూపించింది...కాబట్టి శషభిషలన్నీ కట్టిపెట్టి నేను చెప్పినట్టు చెయ్యి..... ఆ పిల్ల మెళ్ళో తాళి కట్టు... కాపురాలు చెయ్యడానికి రంభా ఊర్వశులు

అవసరం లేదు" అని తీర్మానించాడు ప్రహ్లాదశాస్త్రి

తులసమ్మ భర్త మాటకి ఎదురుచెప్పదు. పైగా జానకి పూజావిధానాలు వల్లె వేసి ఆవిడని ఆకట్టుకుంది.

మొదటిసారి రామ్ కి తనమీద తనకే జాలి కలిగింది. తల్లిదండ్రుల్ని చూస్తే విసుగేసింది.

ఆ విధంగా... ప్రత్యామ్నాయం చూపలేని కారణంగా, తల్లి, తండ్రి పదేపదే అడిగి విసిగించడంతో తన జీవితంలో ఓ ముఖ్యనిర్ణయం అలా ఒత్తిడిలో తీసుకున్నాడు రామ్.

పెళ్ళి అనేది రాయల్‌భూటాన్ లాటరీ లాంటిది. టికెట్ ఆలోచించి కొన్నా, ఆలోచించకుండా కొన్నా ఫలితంలో పెద్దతేడా ఏమీ ఉండదు. ఈ ఒక్కచోటా మాత్రం బరాక్ ఒబామా కైనా, అనిల్ అంబానీ కైనా, దారినపోయే దానయ్యకైనా కావలసింది ఒక్కటే.....బోలెడంత అదృష్టం.

చిన్నపిల్లలు తోటిపిల్లల్ని బెదిరించడానికి " మీ అమ్మకి చెబుతా ఉండు...నీ పెళ్ళవుతుంది" అంటారు.....బాలాదపి సుభాషితమ్. పెళ్ళి అనగా ఇబ్బంది అని ఇక్కడ అర్థం. చాలా పెళ్ళిళ్ళు అంతే...

మొత్తానికి రామ్‌కి, జానకిదేవితో పెళ్ళి అయింది, అంగరంగ వైభవంగా. పెళ్ళవుతుంటే రామ్‌కి దిగులేసింది... ఏదో ఊహించుకున్నాడు... ఎలాగో ఉంటుందనుకున్నాడు.... ఇంతేనా.. .ఇదేనా.... ఇక పెళ్ళి గురించిన కలలకు ఫుల్‌స్టాపా? అనుకున్నాడు...సర్వరోగనివారిణి జిందాతిలిస్మాత్ లాగా పెళ్ళి కూడా ఓ మందు..చాలావాటికి ఫుల్‌స్టాప్.

రామ్ పెళ్ళిలో రాజేంద్రకో అనుమానం వచ్చింది. "పిచ్చి ఉన్నవాళ్ళకి పెళ్ళిచేస్తే పిచ్చికుదురుతుందంటారు... మామూలు వాడికి పెళ్ళిచేస్తే? " అని

"పిచ్చి మొదలై ముదురుతుంది" అన్నాడు ఓ కొలీగ్.

"అనుమానం ఉంటే నీపెళ్ళి వయకూ ఆగు" అన్నాడు మంగాయావు.

★ ★ ★

భార్యలు రెండురకాలు. సముద్రం, ఎడారి లాగా. భర్తను విపరీతమైన పొసెసివ్‌నెస్‌తో, లేదా అభద్రతాభావంతో ఉక్కిరిబిక్కిరి చేసి సముద్రంలా చుట్టూముంచేసే ఉప్పెన ఒకరైతే, ఏ ఫీలింగ్ లేకుండా చాలా మెకానికల్‌గా, డల్‌గా, రొటీన్‌గా ఉండే ఎడారిలాంటివారు మరో రకం.

రామ్‌కి మామూలుగానే ఫ్రీ కన్సల్టెంట్సు కొన్ని అమూల్యమైన చెత్త సలహాలు ఇచ్చారు. వాటిల్లో రొటీన్‌గా వచ్చేది, పరమ ప్రమాదకరమైనది ఒక సలహా ఉంది.

భార్యాభర్తలమధ్య రహస్యాలు ఉండకూడదు అనేది అన్నిటికన్నా ప్రమాదకరమైన సలహా.

ఆ సలహా ఇచ్చిన సలహారాయుడు దాన్ని ఎంతవరకూ పాటిస్తాడు అన్నది ఒక సందేహమైతే, వివేకంలేకుండా వాడే మందు రోగానికన్నా ప్రమాదకరంగా తయారయినట్టు అది వికటించే ప్రమాదం ఎంతైనా ఉంది. అసలు ఏ ఇద్దరు వ్యక్తుల మధ్య అయినా ట్రాన్సపరేన్సీ అనేది ఇద్దరి పరస్పర అవగాహనాశక్తి మీద, వాళ్ళ మెంటల్ మెచూరిటీ మీద ఆధారపడి ఉంటుంది.

అవతలివాళ్ళ అవగాహన స్థాయి, వాళ్ళ దృక్పథం తెలీకుండా తన అంతరంగిక విషయాలు చర్చించడం అనవసరం, ప్రమాదకరం.

చాలామంది ఫ్రాంక్‌నెస్ అంటే లొడలొడా అవతలివాళ్ళకి ఈ విషయం తెలీడం అవసరమా, కాదా, తెలుసుకోవాలనే ఆసక్తి ఉందా, లేదా అని ఆలోచించకుండా తనకి సంబంధించిన అన్ని విషయాలు వాగెయ్యడమే అనుకుంటారు.

'నాకు రహస్యాలు ఏమీలేవు.... నాగురించి నీకు తెలీంది ఏముంది?' అనేది చాలామంది దగ్గర వీళ్ళఊతపదం.

కానీ ఫ్రాంక్‌నెస్ అంటే అవతలివాళ్ళకి సంబంధించినంతవరకూ మాత్రమే నిజం, అదీ అవసరమైతేనే మాట్లాడటం, వాళ్ళని మోసం చెయ్యకుండా ఉండటం. అంతేకానీ రేడియో మిర్చిలాగా నాన్‌స్టాప్ గా ఏదో ఒకటి మాట్లాడటం కాదు.

ప్రతీ మనిషి జీవితం కొన్ని అరలు కలిగి ఉంటుంది. అన్ని అరలూ చూసే హక్కు, తెలిసి ఉండే అవకాశం కేవలం ఆ జీవితం సొంతదారుకే ఉంటుంది. మిగిలిన అరల్లో సమాచారం అతను ఇచ్చిన మేరకు, వాళ్ళకి అవసరమైనమేరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది, అలాగే ఉండాలికూడా.

మొదటిరాత్రి చాలా కాజువల్‌గా అడిగినట్టు అంది జానకి 'మనమధ్య రహస్యాలు ఉండకూడదండీ...మనం అందరిలాగా కాకూడదు. నేనే చాలా ఓపెన్ అండ్ ఫ్రాంక్...మీరుకూడా అంతేకదా' అంది

'ఏమో నా గురించి నేను అంత గొప్పగా ఊహించుకోను కానీ ఒకర్ని మోసం చెయ్యాలన్న ఆలోచనా, అవసరమూ ఇంతవరకూ రాలేదు ' అన్నాడు రామ్

'మీ జీవితంలో జరిగిన విషయాలు ఎలాంటి దాపరికం లేకుండా చెప్పండి,

నేనుకూడా చెబుతాను' అంది జానకీదేవి.

'నేనో మామూలు మనిషిని...గొప్ప పనులేమీ చెయ్యలేదు. అందువల్ల అంత గొప్ప సంగతులూ, రహస్యాలు ఏముంటాయి?' అన్నాడు రామ్.

'అలాకాదు.. మామూలు విషయాలే... అంటే మీ స్నేహితులు... ఇష్టాఇష్టాలు.. అలాంటివి చెప్పండి' అంది.

అతడికి ఇంద్రాణి గుర్తుకొచ్చింది. కుసుమ గుర్తొచ్చింది.. కానీ కుసుమ ప్రమాణం చేయించుకున్న విషయం కూడా గుర్తొచ్చింది.

ఇంద్రాణి విషయంలో పెళ్ళయి తన కాపురం తను చేసుకుంటున్న అమ్మాయి విషయం స్వంత భార్యతో అయినాసరే చర్చించడం సభ్యత కాదనిపించింది. అందుకే పేరు వదిలిపెట్టి చాలా మామూలుగా చెప్పాడు

'టీనేజ్‌లో ఓ అమ్మాయి అంటే క్రష్ ఉండేది. అది ఇన్‌ఫాట్యుయేషనా, ట్రూలవ్వా అనేదాని విషయంలో నాకేమీ స్పష్టతలేదు' అన్నాడు

'చెప్పండి...చెప్పండి..ఎవరా అమ్మాయి...ఏం పేరు? ఏ ఊరు? అందంగా ఉంటుందా? ముందు మీరు చెప్పారా, తను చెప్పిందా?' అని నవ్వుతూ అడిగింది జానకీదేవి

'పేరు ఎందుకులే..ఎప్పుడో చిన్నప్పటి గొడవ... తరువాత తనని నేను చూడలేదు...నేనంటే ఇష్టమని ఆ అమ్మాయి చెప్పలేదు...నేనూ ఏమీ చెప్పలేదు... అంతే ' అనాడు రామ్

'మూగప్రేమ అన్నమాట..బాగుంది....పోనీ ఇదిచెప్పండి..నేనంటే ఇష్టమేనా?' అంది జానకి

'ఏమో తెలీదు... నచ్చావు అనలేను.. నచ్చకపోవడమైతే లేదు' అనబోయి ఆ అమ్మాయి అడుగుతున్న విధంమీద అనుమానం రావడంతో

'ఇష్టపడేకదా చేసుకున్నాను' అన్నాడు కష్టంమీద నవ్వుతూ

'ఇంతకీ నాగురించే చెప్పాను... నీగురించి ఏమీ చెప్పలేదు' అన్నాడు రామ్ టాపిక్ మార్చడానికి

'నా గురించి ఏముంటుందండీ.. ఇలా ప్రేమాదోమా అంటే మా అమ్మానాన్న చీల్చేస్తారు...అలాంటివేమీ లేవు' అంది అక్కడికి ఎవరినైనా ప్రేమించడం అంటే అదో నీచమైన విషయమన్నట్టు.

'పూజాపునస్కరాలు...చదువు, అమ్మానాన్నలు ...ఇంతే నాలోకం' అంది జానకి.

'అంటే ఫ్రెండ్స్?'

'నాకేమీ ఫ్రెండ్స్ లేరు... నా ఇల్లే నాలోకం..అమ్మానాన్నలే నాప్రపంచం... నా చదువంతా గాళ్స్ స్కూల్సు, కాలేజీల్లోనే జరిగింది... నాకు క్లాస్‌మేట్లేతప్ప ఫ్రెండ్స్ ఎవరూలేరు..ఎక్కడికన్నా వెళ్ళాలంటే అమ్మతోనే.. ఒక్కదాన్నే ఎప్పుడూ పంపరు' అంది జానకి.

అయితే అందులో తనగురించిన పరిచయంకన్నా ఓబలమైన డిఫెన్స్‌వాదం ఉండటం రామ్‌కి చూచాయగా అర్థమైంది. నేను చదివింది కో ఎడ్యుకేషన్ స్కూలు, కాలేజీల్లో కాదు కాబట్టి తనకి మగస్నేహితులు ఉండే అవకాశమేలేదని, తనవెంట ఎపుడూ అమ్మానాన్నా ఉంటారనీ చెప్పడంద్వారా తనగురించి అడగాల్సింది, అనుమానించాల్సింది ఏమీలేదని అన్యాపదేశంగా చెబుతున్నట్టుంది తప్ప తనగురించిన పరిచయంలా లేదు.

'వాళ్ళులేకుండా వెళ్ళకపోడానికి నువ్వు మరీ చిన్నపిల్లవేమీకాదే...అయినా ఒక్కోసారి నువ్వు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం వస్తే ఎలా?' అన్నాడు రామ్

'ఏమోలెండి...ఇంతవరకూ అలాంటి అవసరం రాకుండానే పెంచారు '

అది నిరసనో, వ్యంగ్యమో తెలియలేదు...కానీ మామూలుగా మాత్రం లేదు.

ఈ మొత్తం సంభాషణలో అతడు తననితను అభినందించుకున్నది ఏమైనా ఉందీ అంటే కుసుమ గురించినోరు జారకపోవడం గురించే.

★ ★ ★

అంతలా పోలీసులు ఇంటరాగేషన్ చేసిన పద్ధతిలో ఒకరినొకరు తెలుసుకోవాల్సిన అవసరం లేదనిపించింది రామ్‌కి. కొంతకాలం కలిసిఉంటే సందర్భాన్నిబట్టి జరిగే సంభాషణలద్వారా ఒకరికి తెలుస్తుంది. దానిబదులు మీడియా ఇంటర్వ్యూ చేసినట్టు చేయడం అంతమంచి విధానం కాదు.

ఉదయం తన అత్తగారు మొహం అదోలాపెట్టుకుని టిఫిన్ చేయడం గమనించాడు. వాళ్ళ ఇంట్లో అన్నీ పనిమనుషులు వడ్డించడమే. పనివాళ్ళు వడ్డించి వెళ్లిన తర్వాత జానకి సరిగా టిఫిన్ తినకపోవడం గమనించాడు రామ్.

'ఏంటి జానకీ .. టిఫిన్ తినడం లేదు.. నలతగా ఉందా?' అడిగాడు.

'కలత పెట్టే మాటలు మాట్లాడితే నలతగానే ఉంటుంది.. అయినా బాబుది చిన్నతనం..నువ్వు సర్దుకోవాలి' అంది రాజరాజేశ్వరి

తనేం అన్నాడో.. చేశాడో ఒక్కక్షణం రామ్‌కి అర్థం కాలేదు.

‘అదే బాబూ..మీరు ఎవరో అమ్మాయి గురించి మాట్లాడారట....తను ఫీలయింది.. మేం ఎప్పుడూ ఇలాంటివి వినలేదు.... అయినా చిన్నతనం.. ఏదో మాట్లాడారులే అని నేను చెబుతున్నా తను  ఫీలయింది.’ అంది రాజరాజేశ్వరి మళ్ళా.

ఈడ్చి కమ్చీతో కొట్టినట్టు ఫీలయ్యాడు రామ్. రాత్రి తాము గదిలో మాట్లాడుకున్న మాటలు పొద్దుటే ప్రత్యక్షప్రసారంలా ఎలా ఆమెకు తెలిసిపోయాయో అతడికి ఆశ్చర్యమనిపించింది. అంటే తమకంటూ ప్రైవేటు లైఫ్ అంటూ ఏమీ ఉండదనీ, అన్నీ అత్తగారి ప్రత్యక్ష పర్యవేక్షణలో జరుగుతాయనీ అర్థం కావడానికి ఓ క్షణం పట్టింది.

ఆమె సర్దిచెబుతుందో, దెప్పిపొడుస్తుందో అర్థంకాలేదు రామ్‌కి.

ఆరోజు చెప్పాడు రామ్ తన భార్యతో.. ‘కొన్ని విషయాలు మనమధ్యేఉంటే మంచిదేమో.. పెద్దవాళ్ళతో ఎందుకు చెప్పుకోవడం’ అని.

‘అయ్యో..నేను కావాలని చెప్పలేదండీ..ఏదో మాటవరసకి చెప్పానంతే... అబ్బాయి బాగా మాట్లాడాడా అని అమ్మ అడిగితే చాలా బాగామాట్లాడారు తనకి సీక్రెట్స్ కూడా ఏంలేవు అని చెప్పానంతే’ అంది

కానీ అతడికి సమాధానం అత్తగారే చెప్పింది ‘మా ఇంట్లో అందరి ఇళ్ళలాకాదు బాబూ.. ఏ అరమరికలూ ఉండవు మామధ్య.. మేమూ పిల్లకి అన్నీ చెబుతాము.. మా పిల్లకూడా మాదగ్గర ఏమీ దాయదు’ అని ఏదో మాటలమధ్య అంటున్నట్టుగా అంది.

‘ఓహో...అయితే మీ పడకింటివిషయాలు కూడా కూతురుతో చర్చించి, తన పడగ్గది అనుభవాలు కూడా అడుగుతారా? దాపరికం లేకపోవడమంటే మీ నిర్వచనం ఇదేనా?’ అని అడగబోయి ఊరుకున్నాడు.

అతడిని నిస్సత్తువ ఆవహించింది. తన ఇల్లు తనదికాదు. అక్కడికి తండ్రి అనుమతించిన వాళ్ళే రావాలి. తన భార్య తనదికాదు. ప్రతీదీ ఆమె తల్లికి చేరుతుంది. ఆమె నక్సలైట్లతో చర్చించే ప్రజాసంఘాల నాయకురాలిలాగా తనతో చర్చలు పెడుతుంది. అసలు తన స్వంతం అనే మనుషులు ఎవరున్నారు? అతడికి సుధాకర్ గుర్తుకొచ్చాడు.

సుధాకర్‌కి ఫోన్ చేసి కాసేపు మాట్లాడాడు. మనసు తేలిక గా అనిపించింది.

‘ఏమోనమ్మా... కొత్తపెళ్ళాం పక్కనుండగా వాళ్ళతో వీళ్ళతో మాట్లాడటం విడ్డూరం కదా’ అని అత్తగారు భార్యతో అనడం వినిపించింది.

అతడికి ఏదో లోయలోకి పడిపోతున్న ఫీలింగ్ కలిగింది.

★ ★ ★

మూడురాత్రుల ముచ్చట ముగిసిన తర్వాత హైదరాబాద్ బయలుదేరుతుంటే చర్లపల్లి జైలు నుండి బయటపడుతున్నట్టనిపించింది రామ్‌కి. ఎన్ని సౌకర్యాలు ఉన్నా జైలు జీవితం ఎంత దుర్భరమో అతడికి తెలిసివచ్చింది.

మాదాపూర్‌లో అయ్యప్పసొసైటీలో ఓ అపార్ట్‌మెంట్‌లో కాపురం మొదలయింది. ఇంటికి కావల్సిన వస్తువులన్నీ అత్తగారే స్వయంగా ఎంపికచేసి, కొని పంపించింది. తను దగ్గరుండి అన్నీ సర్దించి మరీ వెళ్ళింది. జైలు వార్డెన్ కొత్త జైలు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నట్టనిపించింది రామ్‌కి.

కొంతకాలం మామూలుగా గడిచింది. ఇల్లు, ఆఫీసు అంతే. జానకిలో ఓ లక్షణం ఉంది. ప్రతీ మాటనీ నెగిటివ్‌గా మార్చడం. రాజకీయాల్లో ప్రతిపక్షాలూ, ఎల్లో జర్నలిస్టులూ కూడా ఆమె ముందు దేనికీ పనికిరారు.

ఆమెకి సాహిత్యమూ, సంగీతమూ ఇలాంటివాటిలో ఏమాత్రం ప్రవేశం కానీ, ఆసక్తిగానీ లేవు. కేవలం సినిమాలు, లేదా చుట్టుపక్కల వాళ్ళ గురించి పనిమనిషి చెప్పే గాసిప్స్, ఇంకా బెంగుళూరు నుండి తన అమ్మ చెప్పే చీరలు, నగలు, తెలిసిన వాళ్ళ గురించిన గాసిప్స్. ఇవే జానకి పౌష్ఠికాహారం.

అతడికి వాటిల్లో ప్రవేశమూ, ఆసక్తీ రెండూ లేవు. అందువల్ల ఎక్కువగా వినడానికే పరిమితమయ్యేవాడు.

'ఏంటండీ ... నాతో మాట్లాడటం మీకు ఇష్టం ఉండదా? ఎందుకు ఎప్పుడూ మౌనంగా ఉంటారు' అంటుంది ఆమె.

'అదేం లేదు... కానీ నీకు తెల్సినంత నాకు తెలీదు...' అని ఊరుకునే వాడు రామ్

★ ★ ★

కొంతకాలానికి రాజేంద్ర పెళ్ళి అయింది. ఆ అమ్మాయి పేరు సునంద. వాళ్ళది రాజమండ్రి. ఏడుబళ్ళమార్కెట్ దగ్గర ఇల్లు. మిడిల్‌క్లాసు కుటుంబం నుంచి వచ్చింది. తను కొంచెం అందంగానే ఉంటుంది. తను బీయస్సీ చదివింది. పైగా డాట్‌నెట్ ప్రోగ్రామింగ్ నేర్చుకుంది. ఎక్కడేనా ఉద్యోగం సంపాయిస్తే వేణ్ణీళ్ళకి చన్నీళ్ళ తోడులా ఉండి గోరువెచ్చని కాపురం చిలుకాగోరువంకల్లా చేసుకోవచ్చున్న చిన్న ఆశతో రాజేంద్ర ఆ పెళ్ళికి ఒప్పుకున్నాడు.

రాజేంద్ర పెళ్ళి రాజమండ్రిలో జరిగింది. రామ్ భార్యతో పెళ్ళికి వెళ్ళి, ఊళ్ళో రెండు రోజులు ఉండి వచ్చాడు.

వాళ్లుకూడా రామ్ ఉంటున్న కాంప్లెక్స్‌కు కొంచెం దూరంలోనే ఓ అపార్ట్‌మెంట్ ఖాళీ అయితే అది తీసుకున్నాడు రాజేంద్ర

సునంద చాలా కలుపుగోలు అమ్మాయి. ఆమెకు త్వరలోనే ఉద్యోగం దొరికింది. వేరెక్కడో కాదు జె టెక్నాలజీస్‌లోనే. రాజేంద్రకు తన మామగారి కంపెనీలో ఉన్న పలుకుబడి చూసి ఆశ్చర్యపోయాడు రామ్.

'మెరిట్‌కి మనదగ్గర బాగానే గుర్తింపు ఉన్నట్టుంది' అన్నాడు రాజేంద్రతో

'నాదేం లేదు బాసూ... ఇది తన ప్రతిభే ' అన్నాడు రాజేంద్ర

★ ★ ★

'ఎపుడూ ఆ డల్ షర్టులేం వేసుకుంటారు... ఇది చూడండి .. నేను తెచ్చాను... ఈ షర్టు మీకు బాగుంటుంది ' అంది జానకి ఓ షర్టు చూపిస్తూ.

అది ముదురు ఆకుపచ్చరంగులో ఉంది.

"ఇది మరీ కలర్ సినిమాల్లో యమ్జీఆర్, శివాజీ గణేశన్ వేసుకునే చొక్కాలా ఉంది... నాకు ఇంత డార్క్ షేడ్స్ నచ్చవు" అన్నాడు రామ్

"అవును లెండి... నచ్చనివాళ్ళు సెలక్ట్ చేస్తే ఎలా నచ్చుతుంది..... అదే ఇంద్రాణి తెస్తే నచ్చేదనుకుంటా " అంది జానకి

అతనో క్షణం అవాక్కయ్యాడు. తను క్రష్ ఉందని చెప్పాడు కానీ ఆ అమ్మాయి పేరు చెప్పలేదు. తనకి ఇంద్రాణి పేరు ఎలా తెలిసింది?

"అనవసరంగా మాట్లాడకు....నాకు చొక్కా నచ్చడానికి నచ్చకపోవడానికి ఇక్కడలేని మూడోమనిషికి ఏం సంబంధం? అయినా ఈ పత్తేదారు పని ఎప్పుడు మొదలెట్టావు? నన్ను అడిగితే నే చెప్పేవాడ్నే కదా... ఆ అమ్మాయి పేరు ఎత్తడం ఇప్పుడంత అవసరమా?" అన్నాడు కోపంగా.

"అవునులేండి... తన పేరు ఉచ్చరించడానికి కూడా మేం పనికిరాం...ఆ అమ్మాయి పేరేం ఖర్మ ...మీ ఊళ్ళో లాగూలేసుకునే పిల్లాడ్ని అడిగినా చెబుతాడు మీ భాగోతం.. ఏ గడ్డిమేటును అడిగినా, ఏ తోటని అడిగినా, ఏ గోదావరి గట్టునడిగినా తమ దేవీభాగోతమేనటగా" చాలా కూల్‌గా, నెమ్మదిగా ఒక్కొక్క మాటా రిహార్సల్ చేసినట్టుగా అంది జానకి.

అతడికి రక్తం మరిగిపోయింది. ఆమె గొంతులో హేళన, కసి సమపాళ్ళలో ఉన్నాయి. అతడి హృదయాన్ని తూట్లు పొడవటమే తన లక్ష్యం అన్నట్టుంది ఆమె ధోరణి.

"ఏం మాట్లాడుతున్నావ్...? అర్థం ఉందా నువ్వు మాట్లాడేదానికి... ఒక అమ్మాయి కారెక్టర్ గురించి అలా వల్గర్‌గా మాట్లాడవచ్చా? నేనేదో చిన్న జోక్ చేస్తే దానికి ఇంత రాద్ధాంతమా? నీతో జోక్ చెయ్యకూడదని నాకు తెలీదు "

"మీరు వల్గర్ పనులు చెయ్యచ్చుకానీ నేను అనకూడదా? వల్గారిటీ మీరు చేసిన పనిలో ఉంది, నేను అన్న మాటల్లో కాదు. నచ్చని వాళ్ళతో జోక్ ఏం చేస్తారులేండి. నచ్చినవాళ్ళనే చేసుకుంటే పోయేది. నా ఆస్తి చూసి నన్ను చేసుకున్నారు... మీ స్నేహాలు కూడా సరైనవాళ్ళతో ఉంటే కదా. మెరకవీధి పంచముల్తో స్నేహాలు చేస్తే ఇంత కన్నా మంచి బుద్ధులెలా వస్తాయి?"

"ఓహో ... అంటే నేను ఎవరితో స్నేహం చెయ్యాలో కూడా తమరే నిర్ణయిస్తారన్నమాట...బాగుంది.. నాకన్నా ఓ కుక్కపిల్లని చేసుకోవాల్సింది. నీ బోడి ఆస్తి చూసి నిన్ను చేసుకోలేదు... అందులో రూపాయి కూడా నేను తినను. నాకూ కావల్సినంత ఉంది.. సంపాదించుకోగలను "

"అయితే ఎవరిగొంతు కొయ్యడానికి చేసుకున్నావ్ నాయనా నన్ను? ఎవరి బతుకులు తేరగా ఉన్నాయనుకున్నావ్? నాకు డైవోర్స్ ఇవ్వు.... నేను పెళ్ళికి ముందు ఎలా ఉన్నానో అలా...కన్యగా నన్ను వెనక్కి పంపు"

"మతి ఉండే మాట్లాడుతున్నావా? అదెలా సాధ్యం? నన్ను కూడా పెళ్ళికాకముందు ఎలా ఉన్నానో అలా చెయ్యగలవా?"

"నువ్వు పెళ్ళికి ముందు ఎంత గ్రంథం నడిపావో తెలీక మావాళ్ళు నన్ను ఇచ్చారు. నీకేమన్నా ఆడాళ్ళు కొత్తా... నాకు తెలిసింది ఒక అమ్మాయి... తెలీని వాళ్ళు ఎంతమంది ఉన్నారో?"

"సరే.. నీకు ఆ చెత్త చెప్పినవాళ్ళనే అడుగు..."

"నాకేం సలహాలు అక్కర్లేదు... అన్నీ అవే బయటకు వస్తాయి.. పైన ఆభగవంతుడులేడా? ఫోటోలతో సహా భాగోతం మొత్తం బయటపెట్టకపోతే నేను అబ్బూరివారి ఆడపడుచునే కాదు"

"లేని దానిక్కూడా ఫోటోలు తియ్యగలరన్నమాట మీ బెంగుళూరు వాళ్ళు"

"మాది బెంగుళూరుకాదు... రాయలసీమ... మీ ఆంధ్రావాళ్ళలా మేం తిరుగుబోతులం కాదు.."

ఇక ఆమెతో మాట్లాడటానికి కూడా అసహ్యమేసి బయటకు నడిచాడు రామ్

★ ★ ★

“నాకు రెండు అనిపిస్తున్నాయి సుధాకర్...ఒకటి చచ్చిపోవాలని, రెండు తన అనుమానాన్ని నిజం చెయ్యాలని.. ఏమీ చెయ్యకుండా మాట పడటం కంటే ఏదో చేసి మాట పడటం మంచిదికదా...పైగా తను మాట్లాడే తీరు...మైగాడ్... పెళ్ళంటే ఇంత నరకమా... నాకు ఊహతెలిసి నన్ను ఇంతగా అవమానిస్తూ మాట్లాడినవాళ్ళు ఎవరూ లేరు..కేవలం పెళ్ళాం అనే ఒక్క అధికారంతో ఇంత అవమానిస్తుందా?” అన్నాడు రామ్

“ప్రాంతీయ విభేధాలు ఇంతవరకూ వచ్చాయా?” అతడ్ని తేలిక పరచడానికి అన్నాడు సుధాకర్

“ఇప్పుడు చెప్పు...నేనేం చెయ్యాలి? ఆత్మహత్యా... మరో అమ్మాయా.. దెబ్బకుదెబ్బా?”

# 10

“జీవితం చాలా విలువైనది...ఏ ఒక్క కారణంచేతా, ఎవరికారణంగానూ జీవితాన్ని అంతం చేసుకోకూడదు. మన జీవితాన్ని తృణప్రాయంగా భావించేంత గొప్పకారణం ఉన్నప్పుడే జీవితాన్ని ఫణంగా పెట్టవచ్చు. దేశ స్వాతంత్ర్యం కోసమో, ప్రజలంతా సుఖంగా ఉండాలనో లేదా అంతగొప్ప కారణం ఉన్నపుడే జీవితం పోయినా ఫర్వాలేదనుకోవచ్చు...కానీ ఎవరో తిట్టారనీ, ఏదో అనుకున్నారని జీవితాన్ని చాలించుకుంటే అంత నిరర్థకమైన పని ఇంకోటుండదు....కానీ నువ్వు ఎంత బాధ పడ్డావో నేను ఊహించగలను.

అలా అని తను ఏదో అన్నదికదా అని నువ్వు దాన్ని నిజం చెయ్యపూనుకోవడం కూడా మంచిది కాదు. తనతో సఖ్యంగా ఉండటానికి ప్రయత్నించు..తను ఏమన్నా నువ్వు మాటకి మాట చెప్పకు... దానివల్ల సమస్య పెరగటం తప్ప ఉపయోగం ఉండదు. తనకి అర్థమయ్యేలా చెప్పడానికి ప్రయత్నం చెయ్యి... కొత్తలో ఈ సమస్యలున్నా నెమ్మదిగా సర్దుకోవచ్చు” అన్నాడు సుధాకర్

‘మాకు సంబంధించిన ప్రతీవిషయం మా అత్తగారికి చెబుతుంది...ఆమె నిస్సిగ్గుగా కల్పించుకుంటుంది...ఆవిడ ఇచ్చే సలహాలు చాలా దారుణంగా ఉంటాయి’ అన్నాడు రామ్

‘ఇక్కడ నీకో విషయం అర్థం కావడం లేదు.. ఆమె ఇంకా పూర్తిగా గృహిణి పాత్రలోకి అంటే నీ భార్య పాత్రలోకి రాలేదు... ఇది ట్రాన్సిషన్ టైమ్.. అందువల్ల ఓపిక పట్టు.. అన్నీ సర్దుకుంటాయి...మీ అత్త గారికి కూడా తాను కూతురుకి మేలు

చెయ్యాలన్న ఉద్దేశమేకానీ.. చెడగొట్టాలన్న ఉద్దేశం ఉండదు.. కాకపోతే మేలు చెయ్యబోయి కీడు చేస్తుండవచ్చు... అంతే" అన్నాడు సుధాకర్

'సరే చూద్దాం' అన్నాడు రామ్ తన బీరు ముగిస్తూ.

★ ★ ★

'మీకీ తాగుడు అలవాటుందని పెళ్ళికి ముందు నాకెందుకు చెప్పలేదు?' ఆ రాత్రి అడిగింది జానకి.

'మనదేం ప్రేమవివాహం కాదు.. పెళ్ళికి ముందే అన్నీ మాట్లాడుకోడానికి... పైగా మీవాళ్ళు అన్నీ వాకబు చేసుకునే ఉంటారుగా' అన్నాడు రామ్

'అసలు తాగుబోతులంటే మాఇంటి చుట్టుపక్కలకి కూడా రానియ్యం... ఇక మీకు పిల్లనిస్తారా? అసలు మీ గోదావరి వాళ్ళే అంత... అయినా అందరూ మీలా ఉంటారా? నా రాతనిబట్టిగాని... ఆ రాజేంద్ర అన్నయ్యని చూడండి.. ఒక్క అల వాటులేదు.. తన భార్య గీసిన గీటు దాటడు... సాయంత్రమయితే ఆవిడ చుట్టూనేనట'

'అవునవును...వాడికి ఒకటీరెండూ అలవాట్లు లేవు... ఉండాల్సినవన్నీ ఉన్నాయి..మీ ప్రాంతంలో అసలు బ్రాందీషాపులే లేవా... అన్నీ మాదగ్గరే ఉన్నట్టు చెబుతున్నావ్?'

'అవ్వ ...అవ్వ ... భార్యతో ఇలానేనా మాట్లాడేది? బ్రాందీకొట్లగురించి నన్ను వాకబుచేస్తారా? అంటే నేనుతాగేదాన్ననా మీ ఉద్దేశ్యం? పోనీ అలాంటి దాన్నయినా బాగుండును... మీకు అలాంటిదే సరిజోడి'

'సరే నీకు తెలిసినవాళ్ళెవరైనాఉంటే చెప్పు' అనబోయి సుధాకర్ చెప్పిన మాట గుర్తొచ్చి ఆగిపోయాడు

'అయినా.. ఆ సుధాకర్ గాడితో మీకు స్నేహం ఏమిటి? అలాంటి తాగుబోతుల్తో ఉంటే అంతే మరి'

భర్త స్నేహితుడికి కనీసమర్యాద ఇవ్వాలన్న సంస్కారం కూడాలేని ఆమెని చూసి జుగుప్స కలిగింది అతడికి

'నీతో మాట్లాడాలంటే నేను చాలా మెట్లు దిగజారాలి' అన్నాడు

'అవునవును..మాతో ఏం మాట్లాడతారు? మీతో తియ్యగా మాట్లాడే బుర్రపిట్టలు ఆఫీసునిండా ఉంటే.. పాంటుచొక్కా వేసుకుని హాయ్ యార్..బై యార్ ..అంటూ నాలుగు ఇంగ్లీషు ముక్కలు పలికితే చాలు...మీకు వళ్ళుపాయ తెలీదు'

సరిగ్గా అదే సమయానికి ఏదో పనిమీద ఆ అపార్ట్‌మెంటు పైన ఉన్న

ఎయిర్ రూట్‌లో వెళ్తున్న తధాస్తు దేవతలు “తధాస్థు” అనేసి ఆరోజు తధాస్థు కోటా పూర్తి చేసుకున్నారు

★ ★ ★

ఆఫీసులో పేద్ద పార్టీ జరిగింది... హైదరాబాదు మెట్రో... పన్నెండువందలకోట్ల ప్రాజక్టు..మొదట సత్యం గ్రూపుకుచెందిక మైటాస్ పూర్తి చెయ్యాల్సింది. కానీ విండో డ్రస్సింగ్ అంటే లేని లాభాలని ఉన్నట్టు చూపి షేర్ విలువ పెంచుకోవడం, నిధుల్ని రియల్ ఎస్టేట్‌కి మళ్ళించడం వంటి కారణాలతో ఆ కంపెనీ పతనమయింది. కాంట్రాక్టు లార్సన్ అండ్ టూబ్రో కి వెళ్ళింది. అందులో మొదటి ఫేజ్ మియాపూర్ నుండి యల్‌బీ నగర్ వరకూ.( కధాకాలానికి ఈ ప్రాజెక్టు పూర్తి కాలేదు..సౌలభ్యం కోసం ముందుకు జరపడం జరిగింది)

దీంట్లో స్మార్ట్‌కార్డ్ టికెటింగ్ సాఫ్ట్‌వేర్, కంట్రోల్ రూమ్ నుండి అన్ని రైళ్ళ కదలికలని నియంత్రించే వ్యవస్థలకు సాఫ్ట్‌వేర్ ఇచ్చే సబ్ కాంట్రాక్టు అది. నూటయాభై కోట్ల కాంట్రాక్టు అది. అదికూడా యల్అండ్‌టీ నుండి సాఫ్ట్‌వేర్ సబ్‌కాంట్రాక్టు పుచ్చుకున్న సంస్థ తన లాభాలు పట్టుకుని మళ్ళా జె టెక్నాలజీస్‌కి సబ్ కాంట్రాక్టు ఇచ్చింది. హరి హరరావుకున్న పరపతివల్లే అది వచ్చింది తప్ప ఆ తరహా అప్లికేషన్ తయారుచేసిన అనుభవం జె టెక్నాలజీ సంస్థకి లేదు. మామగారి పనితనం తెలిసివచ్చింది రామ్‌కి.

కాంట్రాక్టు ఇచ్చిన సంస్థతో కో ఆర్డినేషన్‌కి రామ్ టీమ్ లీడర్ అయ్యాడు. కానీ ఆశ్చర్యమేమిటంటే టెక్నికల్ టీమ్‌కి రాజేంద్ర లీడర్ అయ్యాడు. అక్కడ ఉన్నవాళ్ళలో నిస్సందేహంగా సుధాకర్ సబ్జెక్టు పరంగా జీనియస్. మామూలుగా అయితే అతడే టీమ్ లీడర్ కావల్సింది. కానీ సీనియారిటీ... అదీ ఆర్నెల్లు కారణంగా చూపి రాజేంద్రని టీమ్ లీడర్ ని చేసింది మేనేజ్‌మెంట్. ఇక్కడ సుధాకర్ మోర్ క్వాలిఫయిడ్ అనేదాన్ని కన్వీనియంట్‌గా విస్మరించారు.

వడ్డించే వాడు మనవాడయితే కడబంతిలో కూర్చున్నా అన్నీ అందుతాయన్న సామెత ఊరికే పుట్టలేదు.

‘ఎందుకు వప్పుకున్నావ్? రిజైన్ చెయ్యి...నువ్వు కాక ఈ కంపెనీలో ఇంత క్లిష్టమైన ప్రోగ్రామింగ్ రాయగలవాడు ఎవడూలేడు... నేను చెయ్యగలను కానీ డెడ్ లైన్‌లోపల కాదు...’ అన్నాడు రామ్ సుధాకర్‌తో

“పోనీయ్ రామ్...నేను ఇక్కడ ఉండటానికి రెండు కారణాలున్నాయి...ఒకటి.. ప్రాజెక్టు హేండిల్ చేసి ఆ అనుభవంతో ఇంకో పెద్ద కంపెనీకి పోవచ్చు...ఇప్పుడు పెద్ద కంపెనీకి వెళ్ళినా పెద్దప్రాజక్టు హేండిల్ చెయ్యనివ్వకపోవచ్చు... ఇక రెండోది

నువ్వు...నీ చుట్టు ఉన్న పరిస్థితుల్లో ఒంటరిగా నిన్ను వదిలివెళ్ళడం నాకు ఇష్టంలేదు... వీళ్ళు చూడబోతే తక్కువ వాళ్ళలాగా లేరు..." అన్నాడు సుధాకర్

"ఏడ్చారు.... ఏం పీకుతారు?" అన్నాడు రామ్ తేలిగ్గా

కానీ తమ చుట్టూ పెను ప్రమాదం పొంచి ఉందనీ, ఓ మహాపథకం తమ చుట్టూ రచించబడుతోందనీ వాళ్ళకి ఆక్షణంలో తెలీదు.

★ ★ ★

"హాయ్... ఐయామ్...ప్రీతి....కోఆర్డినేషన్ చీఫ్ సాఫ్టవేర్ సైడ్... హౌడు యుడూ.." అంది వీణమీటినట్టుగా ఓ కంఠం

రామ్ తలెత్తి చూశాడు...గాలికి అలల్లా ఎగురుతున్న లూజ్ హెయిర్...కోల ముఖం.. మన్మధుడివిల్లుని సగంలో రెండుగా విరిచి ఆమె కనుబొమలు అమర్చి నట్టున్నాయి... పెద్దకళ్ళు...చెలమల్లా మిలమిలలాడుతున్నాయి...ఆమెలో ఆకర్షణ అంతా ఆ కళ్లల్లోనే ఉంది.. సూదంటురాళ్ళు అంటారు... ముక్కు ప్రపంచంలోని అందమైన ముక్కులన్నింటికీ నమూనాలా ఉంది.. ఆమె అధరాలు... అమర్చిన పగడాలు... తేనెలూరు రసగుల్లాలు.

ఆమె నలుపూకాదు... తెలుపూ కాదు.... రెండూ సమపాళ్ళలో రంగరించిన గోధుమవన్నె... ఆమె ఒంటిరంగు పక్కన తాజ్‌మహల్ తెలుపు వెలతెలా పోతుంది, గులాబీరంగు మోటుగా ఉంటుంది.

నల్లటి షర్ట్, సిమెంట్ కలర్ ట్రౌజర్, అదేరంగు పులోవర్ అన్నీ ఇటాలియన్ బ్రాండ్ సిస్లే వాళ్ళు తయారు చేసినవే. ప్రాడా బాగ్, షూస్...మెడలో సన్నని నెక్‌చెయిన్

అకస్మాత్తుగా శ్రీనాధుడు రామ్ పక్కనే ప్రత్యక్షమయ్యాడు.

"పలుతెరంగుల రంగు పద్మరాగలవీణె

చకచకలప్రభ సాక్షాత్కరింప

సొంపుతో రవ చక్కడంబు ముంగరచాయ

పవడంపు మోవిపై పరిఢవిల్ల

విరిసి యోసరిలి కిక్కిరిసిన చనుదోయి

బిగువున నెర చౌక్కా పిక్కటిల్ల"

అలా ఉంది కదోయి ఈ భామామణి అన్నాడు.

'మహాశయా పైనే ఆగిపోయారేం...కిందికి దిగండి' అన్నాడు రామ్

"దానికేం భాగ్యం..విరులతావియు నెమ్మేని వెనుకకచ్చ

ఫెళఫెళక్కను చిరుతొడల్ బెళుకు నడుము

వలిద పిరుదులు కలికిచూపుల బెడంగు

లొలియ కంగొంటి వేపారి కలువగంటి " అన్నాడు శ్రీనాధుడు

'అందుకే తమరు కవిసార్వభౌములయ్యారు' అన్నాడు రామ్

'కృతజ్ఞుడను...అభీష్టసిద్దిరస్తు...  సెలవు' అని ఆయన అదృశ్యమయ్యాడు.

'హలో...' అంది ప్రీతి

ఉలిక్కిపడి ఈలోకంలోకి వచ్చాడు రామ్

"హాయ్ ..ఐయామ్...రామ్ ..శ్రీరామ్..." అన్నాడు డేనియల్‌క్రేగ్ మైనేమీజ్ బాండ్ ..జేమ్స్‌బాండ్ అన్నట్టుగా

కొందర్ని చూస్తే నాకు పెళ్ళికాకముందు ఈ అమ్మాయి ఎందుకు కనపడలేదా అన్పిస్తుంది. తను కనపడి, తనకి నచ్చితే తననే చేసుకునే వాణ్ణి అన్పిస్తుంది. రామ్‌కి తన జీవితంలో మొదటిసారి అలా అనిపించింది.

"ఐవిల్ హావెలుకెట్ యువర్ ఆఫీస్ అండ్ ఫెసిలిటీస్..అండ్ హావె ఇంట్రో విత్ టెక్ టీమ్...బట్ ఫ్రమ్ నౌఆన్వార్డ్స్ ఐవిల్ టేక్ బ్రీఫింగ్ అండ్ డెమో ఓన్లీ ఫ్రమ్ యు...దట్‌టూ ఇన్ మై ఆఫీస్...ఎట్ ద మోస్ట్ యుకెన్ గెట్ వన్ గై....ఐయామ్ నాట్ కంఫర్టబుల్ విత్ టూ మనీ పీపుల్ " అంది ప్రీతి.

"స్యూర్ మిస్ ప్రీతి...యాజ్ యు లైక్ " అన్నాడు రామ్

"ఓహ్...జస్ట్ కాల్‌మీ ప్రీతీ...దట్సెనఫ్" అంది ఆమె

"యాజ్ యు విష్ "

ఆ తర్వాత తమ టీంని, టెక్నికల్ టీంని పరిచయం చేశాడు.. ఆఫీసులోని ఫెసిలిటీస్, తమ కాపబులిటీస్ క్షుణ్ణంగా ఆమెకి, ఆమెవెంట వచ్చినవారికి వివరించాడు. ఢిల్లీలోని మెట్రోని స్టడీ చెయ్యడానికి టీం వెళ్తున్న విషయం కూడా ఆమెకి చెప్పాడు.

క్వయిట్ ఇంప్రసివ్ అని చెప్పి తన కార్డ్,తన ఛాంబర్ ఆఫీసులో ఎక్కడ ఉంటుందో అతడికి చెప్పి ప్రీతి వెళ్ళిపోయింది.

"అబ్బ ఏం ఉందిరా ఇది... సెక్సప్పీల్ అంటే అది.. స్మితా పాటిల్, హాలీబెర్రీ

రేంజ్‌లో ఉంది. అసలు ఏంజలీనా జోలీ కొంచెం బ్రౌన్‌గా ఉంటే ఎలా ఉంటుందో అలా ఉంది..నువ్వు లక్కీరా రామం” అన్నాడు రాజేంద్ర

“ఆమెతో జాగ్రత్తగా ఉండకపోతే కోట్ల కాంట్రాక్టుకి చిల్లు పడుతుంది...అప్పుడు నానా పాట్లూపడుతూ, బెర్రీపళ్ళు అమ్ముకుంటూ ఏంజల్స్‌ని ప్రార్థించాల్సివస్తుంది” అన్నాడు రామ్ నవ్వుతూ

“మనం ఢిల్లీ వెళ్తున్నాం కదా....అక్కడ ఏ గల్లీలో చూసినా గలగలా నవ్వుతూ కన్పిస్తారు ఏంజల్స్...అక్కడ అంతా సెటప్ చేసేశా... చూడు గురూ కుమ్మేద్దాం ” అన్నాడు రాజేంద్ర

“నాకేమీ వద్దు.. కావాలంటే నాపేరు చెప్పి నువ్వే ఎంజాయ్ చెయ్యి...నాకు సంబంధించినంత వరకూ మనసు కలవకుండా చేసే హడావుడి వ్యవహారం నచ్చదు”

“అలా అయితే నీ జన్మలో ఎంజాయ్ చెయ్యలేవు... కాలంతో పాటు మారు రామం... పూర్వం టీవీలో ఒక్కటే చానల్... ఘోర దూరదర్శన్... ఇప్పుడో వందలాది చానల్స్...పిండికొద్దీ రొట్టె అన్నట్టు డిష్ కొద్దీ చానల్స్...పూర్వం పొట్ట టీవీ సెట్లుండేవి...ఇప్పుడో..ప్లాస్మా, యల్‌సీడీ, యల్ఈడీ ...అలా ఎంత మార్పు వచ్చింది..మనవూ మారాలి....మనుషులు మారాలి అని సినిమా కూడా తీశారు వి.మధుసూదనరావు ఎందుకు? నీలాంటి వాళ్ళ కోసం కాదూ”

“సరే నేనా సినిమా చూసి చెప్తా కానీ...నువ్వేంటి మీ ఆవిడ దగ్గర ఏదో మాఆయన బంగారం సినిమా వేస్తున్నావని విన్నాను ”

“లేకపోతే...రౌడీగారిపెళ్ళాం వెయ్యమంటావా? ఇంట్లో అనుమానం రానంతవరకే మన ఆటలు ఎన్నయినా సాగేది. నమ్మకముంటే మనదగ్గర సెంటువాసన వచ్చినా ఫర్వాలేదు...అనుమాన పడ్డారా...మన చమట వాసన కూడా వాళ్ళకి కత్రినా కైఫ్ కొట్టే సెంట్ వాసనవస్తుంది.. అందుకే మనం ఇంట్లోరామయ్యా...వీధిలో రాజేంద్ర ”

“నారాయణ...నారాయణ ”

“అవును... రాజేంద్ర నారాయణ...ఏపేరు చెబితే భార్య గుడ్డిగా నమ్మేస్తుందో... ఏ పేరు చెబితే పెద్దాపురం పులకించిపోతుందో... ఏ పేరు చెబితే ఇసుకవీధి, మెరకవీధి గుసగుసలాడతాయో, ఏ పేరు చెబితే రష్యా భామలు కూడా రయ్యిన పరిగెట్టుకు వస్తారో అతడే రాజేంద్ర నారాయణ ఉరఫ్ రానా” అని “ భలే ఉంది గురూ... ఫ్లోలో వచ్చినా నాపేరులో ఓ హీరో పేరు ఉందని గమనించలా... ఇకనుంచి నేను రానా”

“మంచిది...ఇక నేను వెళ్ళి రానా?”

“రా....తిన్నగా ఎయిర్‌పోర్టుకి రా... ఎయిర్ హోస్టస్‌లని ఎలా పడేయాలో నాదగ్గర నేర్చుకుందువుగాని ”

“తెలుసులే..కాలు అడ్డం పెట్టి పడేస్తావు...అంతకన్నా సీనులేదు గానీ...బై” అన్నాడు రామ్

★ ★ ★

శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు చేరుకున్నారు రానాగా మారిన రాజేంద్ర, రామ్, సుధాకర్ ఇంకా మిగిలిన బృందం. టికెట్లు చూసి కెవ్వుమన్నాడు రానా.

“ఎవడ్రా టికెట్లు బుక్ చేసింది...వీడెబ్బా.. కింగ్‌ఫిషర్ లోనో, ఇండిగోలోనో, స్పైస్‌లోనో చెయ్యకుండా ఇండియన్‌లో చేస్తాడా? చచ్చాం ”

“ఏమైంది రాజేంద్రా.. ఇబ్బందేమిటి? ఏదయినా విమానమేగా” అన్నాడు సుధాకర్

“అది నీలాంటి రసపోషణ లేని వారికి...మాలాంటి వారికి కాదు... ఎయిర్ హోస్టస్ ఎలా ఉంటారు ఆ ఎయిర్ లైన్స్‌లో? విమానాలకంటే బాగా మెరుస్తుంటారు...కుర్రగా, బుర్రగా బొమ్మల్లా ఉంటారు...మరి ఇండియన్‌లో....రైటుసోదరులు విమానం కనిపెట్టినరోజుల్లో పుట్టిన అమ్మమ్మలుంటారు ”

“పోన్లే ...మదర్లీ ట్రీట్‌మెంటనుకో ”

“అనుకోను.... స్టెప్ మదర్లీ ట్రీట్‌మెంటు అనుకుంటాను ”

అతడు అన్నట్టుగానే విసుగ్గా మొహం పెట్టి ఆహ్వానించారు ఎయిర్ హోస్టస్. అసలది ఆహ్వానం కూడా కాదు. టికెట్‌లేకుండా జనరల్ కంపార్ట్‌మెంటులోనికి జొరబడుతన్న అడుక్కునే వాళ్ళని టీసీ చూసే రకాయింపు చూపది.

విమానం కదిలేముందు ఫస్ట్‌క్లాస్‌కీ, ఎకానమీకీ మధ్యతెర వేయడం కూడా దిష్టి తగులుతుందని పిల్లాడిని దాచేసే తల్లిలా చాలా జోరుగా వేశారు.

“రానా....నాకేదో ట్రెయినింగు ఇస్తానన్నావ్” అన్నాడు రామ్ వెటకారంగా

“నేను వీళ్ళని పడెయ్యడం కాదు మగడా... చూస్తుంటే వీళ్ళు తేడా వస్తే పడేసి తన్నేలా ఉన్నారు” భారంగా అన్నాడు రానా.

రామ్, సుధాకర్ గలగలా నవ్వారామాటలకి.

ఖైదీలకి చిప్పకూడు పెట్టే జైలర్ మాదిరిగా ఉదయం బ్రేక్‌ఫాస్ట్ పడేశారు. రానా మొహం చూసుకుంటూ ఎంజాయ్ చేస్తూ తిన్నారు రామ్, సుధాకర్

అందరికీ గెస్ట్‌హౌస్ ఏర్పాటు చేసింది కంపెనీ. కానీ ఆ గెస్ట్‌హౌస్ ఎయిర్‌పోర్టుకి దగ్గరా, వీళ్ళు తిరగాల్సిన ఆఫీసులకి దూరంగానూ ఉంది.

'మీ మావ ఉచితంగా వస్తే పచ్చిపులుసుకోసం మైళ్ళు పరిగెట్టేవాడిలా ఉన్నాడు గురూ' అన్నాడు సుధాకర్

'అవును... రోజూ ప్రయాణంలోనే గంటలు వృథా అయ్యేలా ఉన్నాయి.... సాధారణంగా అన్నీ కాలిక్యులేట్ చేసుకుంటారు...మాన్ అవర్స్ వృథా చేసుకునే కంపెనీ బహుశా ఇదేనేమో ప్రపంచంలో ' అన్నాడు రామ్

'షార్ట్‌సైటెడ్‌వాడికి డబ్బులే కనపడతాయి.... ఎంప్లాయీదేముంది...? గంటముందు లేపి పొమ్మంటే సరి ' అన్నాడు సుధాకర్

'ఇంతింత దూరాలు తిరగటం నావల్ల కాదు... మీరు వెళ్ళి చూసిరండి....విశేషాలు నాకు చెబితే చాలు ' అన్నాడు రానా మొదటిరోజునే

★ ★ ★

రానాకి ముఖ్యమైన పని అన్నింటికన్నా ఏమిటంటే తను రష్యన్ అమ్మాయిల బ్రోకర్‌తో మాట్లాడటమే.

తన సెల్ నంబర్‌నుండి హైదరాబాదులో మిత్రుడిచ్చిన నంబర్‌కి ఫోన్ చేశాడు రానా. అవతలినుండి ఎలాంటి స్పందనా లేదు.

"మేం వెళ్తున్నాం.. ప్రాజెక్టు నీడ్స్ స్టడీ చెయ్యడానికి..నువ్వు వస్తావా?" అడిగాడు సుధాకర్ రానాని.

"నేను టీం లీడర్‌ని అమ్మా...మీకేమన్నా డౌట్స్ ఉంటే అడగండి చెబుతాను... అంతే కాని చిన్న చిన్న విషయాలకి నన్ను డిస్టర్బ్ చెయ్యకండి...వెళ్ళి అన్నీ మంచిగా స్టడీ చేసుకురండి" అన్నాడు రానా

"అలాగే...ఇంతకీ ఈ ప్రోగ్రామ్స్ అన్నీ ఏ ప్లాట్‌ఫాంమీద చెయ్యమంటావు? విండోసా, లినక్స్ లేదా మాకింటోష్ ఇంకా సోలారిస్" అడిగాడు సుధాకర్

"ఇలాంటి వాటికి లినక్సేకదా వాడేది... నీకు లినక్స్‌మీద ఆప్స్ డవలప్ చెయ్యడం వచ్చనే కదా నిన్ను రికమెండ్ చేసిమరీ నా టీమ్‌లో పెట్టుకున్నది...లేకపోతే వేరే ఎవర్నన్నా రిక్రూట్ చేసుకుంటామన్నారు మేనేజ్‌మెంట్....నేను చెప్పాను... ఎందుకూ మనదగ్గర జెమ్ములాంటి కుర్రాడ్ని పెట్టుకుని ఎవర్నో తెచ్చుకోడం అని... పూర్తి రెస్పాన్సిబిలిటీ నేను తీసుకుంటే నీకు ఈ చాన్సు వచ్చింది...ఏమైనా తేడా వస్తే నీకేం కాదు... నేనే పోతాను" అన్నాడు రానా అక్కడికి సుధాకర్‌కి ఏదో గొప్ప ఫేవర్

చేసినవాడిలా.

"థాంక్స్ బాస్" అన్నాడు సుధాకర్ అతడి మాటలునేర్చిన తనాన్ని, బతకనేర్చిన తనాన్ని చూసి ఆశ్చర్యపోతూ.

"చూడు  వీడు... వీడికి కాని వీడి పెళ్ళానికి కాని లినక్స్‌లో ఓనమాలు రావు...మిగతాది కూడా అంతంత మాత్రమే....అయినా నీకేదో ఉపకారం చేసిన వాడిలా మాట్లాడుతున్నాడు" అన్నాడు రామ్ వాళ్ళకోసం ఏర్పాటుచేసిన ఐషర్ ఏసీ మినీ బస్‌లో కూర్చున్నాక.

"కాపిటల్ స్పీక్స్ రామ్...పెట్టుబడి మాట్లాడుతుంది...కర్రపెత్తనం చెయ్యడానికి ప్రతిభ ఎందుకు? అవసరాలకి అడ్డం పడటానికి నాలాంటి టెక్ కూలీలు ఎప్పుడూ సిద్దంగా ఉంటారు.. మేనేజ్‌మెంటుది ఇతడిది ఒకే సామాజికవర్గం అంటే కులం. కనుక ఇతడు ఎప్పుడూ మిగతావాళ్ళకంటే అడ్వాంటేజియస్ పొజిషన్ లోనే ఉంటాడు.. మీ మామగారి పెట్టుబడి ఇందులో లేకుంటే నిన్నూ దాటతాడు.. అయితే సీని యారిటీ లేకుంటే మెరిట్ ఏదో ఒకటిచెప్పి తమకు కావల్సినవాళ్ళకి మంచి పొజిషన్లు కట్టబెట్టడం చాలా మామూలు..అది ప్రైవేటు కంపెనీ అయినా సరే, ప్రభుత్వం ఇచ్చే పోస్టింగులైనా సరే" అన్నాడు సుధాకర్

"అదేంటి ప్రభుత్వంలో రిజర్వేషన్లున్నాయిగా...?"

"అది కేవలం ఉద్యోగంలో చేరేవరకే...తరువాత ప్రాముఖ్యత ఉన్న ఏ పదవీ మావాళ్ళకి దక్కదు...ఎక్కడో ఎక్సప్షన్లు తప్ప... టీచర్లయితే రోడ్డుపక్క స్కూలులో వెయ్యరు....మూలమూలకి విసురుతారు..ఇదంతా చాలా సహజంగా జరిగిపోతుంది. వ్యవస్థ అటువంటిది..మా చైతన్య స్థాయి మారకపోవడాన్ని మాత్రమే నిందిచాలికానీ ప్రభుత్వాన్నో వ్యక్తుల్నో కాదు...తొలగి తోవనిచ్చువాడెవ్వడు...? తోసుకొనిపోవలె కాని అన్నాడు ప్రజాకవి, మహాకవి కాళోజీ...మనకి ఎవడూ ఏమీ చెయ్యడు...మనకి మనమే మేలు చేసుకోవాలి అన్న స్పృహ మాకు రావాలి..అప్పుడు కానీ మాకు మంచి జరగదు ..నాయకత్వస్థానాల్లో తోడేళ్ళని పెట్టిన గొర్రెలకి మాకు తేడాలేదు....తప్పు గొర్రెదా...తోడేలుదా?"

బస్సు ఢిల్లీ వీధుల్లో పరిగెడుతోంది. అక్కడ గెస్ట్‌హౌస్‌లో రానా చాలా బిజీగా ఉన్నాడు.

అతడు ట్రై చేయడమే కానీ రష్యా అమ్మాయిలని చూపించే బ్రోకర్ సింఘానియా ఫోన్ తియ్యడం లేదు.

మళ్ళా హైదరాబాద్‌లో తన ఫ్రెండ్ కి చేశాడు రానా.

"రేయ్...ఈ సింఘానియా గాడు ఫోన్ తియ్యడం లేదు... వేరే నంబర్ ఏమీ లేదా"

"నువ్వు చెయ్యగానే తియ్యడానికి వాడేమన్నా పిజ్జాలమ్మేవాడా..అమ్మాయిలని సప్లైచేసేవాడు..వాడికి వంద పనులుంటాయి....చేస్తూఉండు"

"ఇంకా ఎంతసేపురా.... నీయబ్బ... నడిచివెళ్ళినా ఈపాటికి రష్యా వెళ్ళి మంచి ఫిగర్‌తో ఎంజాయ్ చేసి తిరిగివచ్చి గంట అయ్యేది"

"ఇప్పుడేనా మించిపోయిందిలేదు....నడవడం మొదలెట్టు"

"రేయ్... ఇలా ఎకసెక్కాలాడావంటే ఈసారి నీకు చిల్లుపెట్టిన కండోమ్ ఇస్తా...ఏదోవచ్చి చస్తావ్" కోపంగా అన్నాడు రానా

"అంత పని చెయ్యకురా బాబూ నేనే వాడికి ట్రై చేస్తా" అన్నాడు ఫ్రెండ్

ఆ తర్వాత అరగంటకి అతడి ఫ్రెండ్ నుంచి ఫోను వచ్చింది. "నేను చేసాను.. ఈ మధ్య పోలీసుల తాకిడి ఎక్కువయిందట...అందుకే తెలీని నంబర్ నుండి ఫోన్ వస్తే తీసుకోడం లేదు... నీ నంబర్ వాడికి యస్‌యంయస్ చేశాను...ఇప్పుడు చెయ్యి.. తీస్తాడు"

"సర్లే...చంపావుకదా.....నేను చేస్తాను....నాకు నీమీద డౌటొచ్చింది ఏ రైల్వే ఎంక్వయిరీ నంబరో ఇచ్చావేమో అని...ఓకే..ఓకే" అన్నాడు రానా

మళ్ళా సింఘానియాకి ఫోన్ ట్రై చేశాడు రానా

ఈ సారి వెంటనే లైన్ లోకి వచ్చాడు సింఘానియా.

"మై ఫ్రెండ్ హాజ్ గివెన్‌యువర్ నంబర్..." అన్నాడు రానా

"హా...హా బోలియే " అన్నాడు సింఘానియా

ఆ తర్వాత వాళ్ళ సంభాషణ ఇంగ్లీషు, హిందీల్లో ఇలా సాగింది

"నాకు రష్యా అమ్మాయిలు కావాలి...మంచి అమ్మాయిలు.. బాగుండాలి"

"నాదగ్గర ఫస్ట్‌క్లాస్ అమ్మాయిలు ఉన్నారు..మీకెలాంటి వాళ్ళు కావాలో చెప్పండి"

"తెల్లగా ఉండాలి....బాగా బలంగా ఉండే అమ్మాయి...రాగి రంగు జుట్టు, నీలికళ్ళు ఉండాలి"

"అలాగే... తప్పకుండా...మీ అదృష్టం...నిన్ననే ఫ్లయిట్‌లో కొత్త అమ్మాయిలు వచ్చారు...చాలా ఫ్రెష్..మీ ఫ్రెండుకి కూడా ఇలాంటి వాళ్ళు దొరకలేదు"

"సరే...మంచి ఎత్తుగా ఉన్న అమ్మాయిని తీసుకురా.. పొట్టివాళ్ళు వద్దు"

"రష్యన్ అమ్మాయిలు అయిదు అడుగుల పదకొండు అంగుళాలకి తక్కువ ఉంటే పొట్టి కిందే లెక్క.. ఆరడుగుల పైనే ఉంటారు అంతా"

"అదిరిపోయింది....నా గెస్ట్‌హౌస్‌కి తీసుకొచ్చేయ్..."

"అరగంటో అక్కడుంటాం.. నలుగుర్ని తీసుకొస్తా ..మీకు నచ్చినవాళ్ళని తీసుకెళ్దురుగాని"

"అడ్రస్ చెప్పండి"

తమ గెస్ట్‌హౌస్ పేరు అడ్రస్ చెప్పి రష్యా భామలకోసం ఎదురు చూడసాగాడు రాజేంద్ర నారాయణ

# 11

అన్నట్టుగానే అరగంటలో అక్కడికి చేరుకున్నాడు సింఘానియా ఓ కారులో. సరాసరి గెస్ట్‌హౌస్ లోపలికి రాలేదు అతను. అక్కడికి కొంచం దూరంలో కారు ఆపాడు. అక్కడినుండి రానాకి ఫోన్ చేశాడు.

"నేనిక్కడ జర్మన్ బేకరీ దగ్గర ఉన్నాను..మీరున్న చోటుకి దగ్గరే...ఇక్కడికి రండి.. నాది ఇన్నోవా కారు..ఢిల్లీ రిజిస్ట్రేషన్ 6871..సిల్వర్ కలర్" అన్నాడు.

రానా గబగబా బయలుదేరాడు. మళ్ళా బట్టలు విప్పడంలో టైం ఎందుకు వృధా అని షార్ట్స్, టీషర్టుల్లోకి మారినవాడు కాస్తా అతడు బయటకి రమ్మనటంతో షార్ట్స్‌మీద ఫాంటు వేసుకుని, సాక్స్‌లేకుండా షూ వేసుకుని బయలుదేరాడు.

బయటకి వచ్చిన తర్వాత అటూ ఇటూ చూశాడు అలవాటుగా..తెలిసినవాళ్ళు ఎవరన్నా  ఉన్నారేమో అని. తను ఉన్నది ఢిల్లీలో అనీ తెలిసిన వాళ్ళు ఉండే అవకాశం లేదని గుర్తొచ్చి నవ్వుకున్నాడు తనలో తను. ఇదేమన్నా ఘనపురమా? రాజమండ్రా? లేక హైదరాబాదా తనకి తెలిసిన వాళ్ళుండటానికి అనుకున్నాడు.

అతడికి తెలీని విషయమేమిటంటే అతడు బయటకువెళ్ళగానే ఆ గెస్ట్‌హౌస్ దగ్గ రికి సింఘానియా మనిషి ఆల్రెడీ చేరుకున్నాడని, అతడు బయటకు రావడం కోసం ఎదురు చూస్తున్నాడని.

రాజేంద్ర బయటికి రాగానే  అతడు తన మొబైల్ ఫోన్లో సింఘానియాకు కాల్ చేశాడు "పార్టీ బయలు దేరింది" అని

"సరే .. నువ్వు లోపలికెళ్ళు" అన్నాడు సింఘానియా.

అతడు లోపలికెళ్ళాడు. అతడి చేతిలో చిన్న పార్సెల్ ఉంది. గెస్ట్‌హౌస్ వాచ్‌మేన్

అడిగితే చెప్పాడు "కొరియర్"

లోపలికి వెళ్ళాక అక్కడి సర్వెంటుని అడిగాడు "టికెట్ ఏజంట్...ఫ్లయిట్ టికెట్ బుక్ చేశారు.. జెడి అండ్ కంపెనీ, బెంగుళూరు వాళ్ళు..ఉన్నారా?"

సర్వెంటు చెప్పాడు "కాదు ...ఇక్కడున్నది జె టెక్, హైదరాబాదు వాళ్ళు, ఆ కంపెనీ ఆయన రాజేంద్ర అని ఇప్పుడే బయటకి వెళ్ళారు..వచ్చే వరకూ ఉండండి.. ఒకవేళ వాళ్ళది అవునో కాదో మనకి తెలీదుగా"

"సరే ...కొంచెం...టీ కావాలి" అన్నాడు అతను ఓ ఇరవై అతడి చేతిలో పెడుతూ

"అలాగే" అని నవ్వి టీ తేవడానికి లోపలికి వెళ్ళాడు పనివాడు.

అతడు అలా వెళ్ళగానే ఇతడు గెస్ట్‌హౌస్ అంతా తిరిగివచ్చాడు. రూములన్నీ తాళం వేసిఉండటం, పరిస్థితి నార్మల్‌గా ఉండటంతో అది పోలీసుల ట్రాప్ కాదని సంతృప్తి చెందాడు.

అప్పుడు సింఘానియాకి ఫోన్ చేసి చెప్పాడు "సీన్ క్లియర్... సేఫ్"

"సరే నువ్వు వెళ్ళిపో అక్కడ్నించి" అన్నాడు సింఘానియా.

"రైట్ బాస్" అన్నాడు అతడు

ఇంతలో పనివాడు టీ తీసుకువచ్చాడు. "ఇప్పుడే ఫోన్ వచ్చింది...అది వేరే గెస్ట్‌హౌస్..అర్జంటు అట నేను వెళ్ళాలి... టీ నువ్వు తాగెయ్" అనేసి బయటకి వెళ్ళాడు

ఆ వెంటనే సింఘానియా రాజేంద్రకి ఫోన్ చేశాడు "సారీ మావాళ్ళు బండి మార్చారు ఇది హర్యానా రిసిస్ట్రేషన్ 2291 ...అదే ప్లేస్" అన్నాడు

రాజేంద్ర బేకరీ దగ్గరికి చేరుకున్నాడు. అతడు ఇన్నోవా కారు దగ్గరికి చేరుకోగానే సింఘానియా దిగాడు "హాయ్ ...నేను సింఘానియా.. మీరు రానా కదా" అన్నాడు

"అవును" అన్నాడు రాజేంద్ర

"కారెక్కండి" అన్నాడు అతడు మధ్య డోర్ తీసి

లోపల కళ్ళు జిగేల్ మనే అందంతో నలుగురు ముద్దుగుమ్మలున్నారు. వాళ్ళు జీన్స్ పాంటు, టీషర్టులు వేసుకుని ఉన్నారు.

పాలు, బంగారం కలిపినట్టుంది వాళ్ళ ఒంటిరంగు. వాళ్ళజుట్టు బంగారు తీగల్లాగా ఉంది.శరీర సౌష్టవం బావుండటంతో వాళ్ళఒంట్లో చిక్కడిన చూపు బయటపడటం కష్టం.

అతడు లోపలికెక్కాడు. ఎవర్ని ఎంచుకోవాలో తెలీక తికమక పడ్డాడు రాజేంద్ర. అతడికి అందరూ కావాలనిపిస్తోంది. కానీ ఉన్న సమయం, అయ్యేఖర్చు గుర్తొచ్చి ఒక్కరితో సరిపెట్టుకోవాల్సివచ్చింది అతడికి.

అమ్మాయిలందరూ 'హాయ్..' అంటూ చేతులు కలిపారు. ఆ స్పర్శకే రాజేంద్ర మతిపోయింది. ఎంతో సుకుమారంగా పూలగుత్తుల్లా ఉన్నాయి వాళ్ళ చేతులు. అప్పటికే రాజేంద్ర సోల అయిపోయాడు.

టుమారో నెవర్ డైస్ అన్న జేమ్స్‌బాండ్ ఆర్యోక్తి గుర్తుకొచ్చింది. నిజమే రేపన్నది ఎప్పుడూ చావదు. ఈ రోజు ఈ విరిబోణి...రేపు ఆ పూబోణి...మరో రేపు ఆ వనజాక్షి....అహో నీ జాతకంలో మన్మథ మహర్దశ మొదలయిందిరా రాజేంద్రా... అని తనలో తను అనుకుని

"సరే ఈ అమ్మాయి కావాలి... రేటెంత?" అని అడిగాడు

"పదివేలు..ఇప్పుడే ఇవ్వాలి... మూడు గంటలు ఉంటుంది.. నేను వచ్చి పికప్ చేసుకుంటాను" అన్నాడు సింఘానియా.

వాళ్ళ అందం చూశాక ఆ మొత్తం చాలా తక్కువ అనిపించింది రాజేంద్రకి. డబ్బు తీసి సింఘానియా చేతిలో పెట్టాడు.

"నాకు ..రేపు ఈ అమ్మాయి కావాలి ..సేమ్‌టైమ్..మళ్ళా లేటయిందంటే మావాళ్ళు వచ్చితగలడతారు" అన్నాడు రాజేంద్ర

"తప్పకుండా సాబ్ " అన్నాడు సింఘానియా అతడ్ని చూసి నవ్వుతూ

వాళ్ళ ఇన్నోవా సరాసరి గెస్ట్‌హౌస్‌కి చేరుకుంది. వాచ్‌మేన్ రాజేంద్రని చూసి గేటుతీశాడు. కారు లోపలికి చేరాక రాజేంద్రతో పాటు దిగింది అతడు ఎంచుకున్న అమ్మాయి.

విదేశీ అమ్మాయితో రూమ్‌లోకి వెళ్తున్న అతడినిచూసి నవ్వాడు పనివాడు 'ఇక్కడ ఇదంతా మామూలే ' అన్న అర్థం వచ్చేలా.

లోపలికి వెళ్ళగానే అతడ్ని చుట్టుకుంది ఆమె. రాజేంద్ర కంటే గుప్పెడు పొడవు ఎక్కువే ఉంది తను.

"నీ పేరు?" అడిగాడు ఇంగ్లీషులో

"మాషా సవిత్సకయ్"

"మీది ఏ ఊరు రష్యాలో" అన్నాడు అక్కడికి అతగాడికి రష్యా మొత్తం తెలిసి ఉన్నట్టు.

"మాది రష్యా కాదు... ఉక్రెయిన్.. దక్షిణ ఉక్రెయిన్‌లో ఒడెస్సా మా ఊరు... బ్లాక్ సీ ఒడ్డున మా ఊరు ఉంది. పోర్టు సిటీ..పది లక్షల జనాభా ఉంటుంది ...బాగా పెద్దదే" వచ్చీరాని ఇంగ్లీషులో చెప్పింది

"బాగుంది బంగారు...నువ్వెలా న్యూఢిల్లీకి వచ్చావు?"

"కొంచెం నీళ్ళుకావాలి" అని అడిగి నీళ్ళుతాగి అతడి వడిలో పడుకుని చెప్పడం మొదలు పెట్టింది

"మాది మొదట్లో బాగా ఉన్న కుటుంబమే..నేను ఓ చెల్లి..మానాన్న టింబర్ వ్యాపారం చేసేవాడు. ఒడెస్సాలో మాది బాగా పేరున్న టింబర్ డిపో. ఆయన మంచి అందగాడు. అమ్మ సామాన్యంగా ఉంటుంది. ఆయన అందం చూసి మా అమ్మ ఆయన్ని పెళ్ళి చేసుకుంది.ఆమె కూడా కులీన కుటుంబం నుండి వచ్చిందే.

నాన్న గారికి కలప వ్యాపారంలో నష్టం వచ్చింది. ఆ తరువాత మా బ్రతుకులే మారిపోయాయి. నేను అమ్మ ఇద్దరం ఇల్లు గడవటంకోసం పనిచేయాల్సి వచ్చింది. అమ్మ నర్సుగా మా పట్టణంలోనే ఓ ఆసుపత్రిలో చేరింది. నాకూ ఒడెస్సా పిరోగోవ్ మెడికల్ ఇనిస్టిట్యూట్ లో మెడిసిన్ సీటు వచ్చింది.

ఇల్లు గడవటమే కష్టంగా ఉంటే ఇంకా ఫీజులూ అవీ ఎలా? అక్కడ మీ ఇండియా నుండి ప్రతీ సంవత్సరం వందకి తగ్గకుండా విద్యార్థులు వస్తారు...వాళ్ళ వల్ల ఫీజులు పెరిగిపోయాయి. బోల్షవిక్ విప్లవం నాటి రోజులు ఎంతో బావుండేవని అమ్మ అంటుంది అందుకే...అప్పుడు ప్రభుత్వమే ఫీజులు అవీ భరించేది.

నేను మా పట్టణంలోనే  ఓ బొటిక్ లో పనికి కుదిరాను. కానీ ఆ సంపాదన ఏ మూలకి? ఇలాంటి దుర్భర పరిస్థితుల కారణంగానే మా చుట్టుపక్కల ప్రాంతాలైన మాల్దోవా,రొమేనియాల నుంచి కూడా అమ్మాయిలు ఈ విషవలయంలోకి దిగుతున్నారు " అంది తాపీగా సిగరెట్ వెలిగించి దమ్ములాగి అతడి మొహం మీదికి ఊదుతూ.

ఆమె విలాసం చూస్తే విషవలయంలో చిక్కుకున్న అమృతకన్యలా లేకపోయినప్పటికీ రాజేంద్ర గుండె బరువెక్కింది.

"ఎంత బాధాకరం....నీలాంటి అందమైన పిల్లకి రావలసిన కష్టాలు కావివి" అన్నాడు

"అంటే అందంగా లేనివాళ్ళకి రావచ్చునా కష్టాలు" అంది మాషా తమాషాగా నవ్వుతూ

రాజేంద్ర ఒక్క క్షణం గతుక్కుమని “నా ఉద్దేశ్యం అదికాదు...అయినా నువ్వు చాలా చమత్కారంగా మాట్లాడతావు..అయితే నాతో ఉన్నది డాక్టర్ అన్నమాట...నాకు ఇదో రికార్డు...ఇంత వరకూ మెడిసిన్ స్టూడెంట్ ఎవరూ నాకు తారసపడలేదు ” అన్నాడు

ఆమె లేచివెళ్ళి “మనం ప్రారంభిద్దామా” అంది

క్లినికల్ ప్రెసిషన్‌తో ఆమె క్షణాల్లో అతడి కంటికీ, తన వంటికీ మధ్యఉన్న వలువల్ని విసర్జించి తన నిజరూప దర్శనం ఇచ్చింది.

ఆమె విగ్రహ సౌందర్యానికి మగ్ధుడైన రాజేంద్ర “ఆహా....అందమంటే ఇంత గొప్పగా ఉంటుందా....! తాజ్‌మహల్ పక్కన పూరిగుడిసెలా, రేకుల షెడ్డులా ఉంటుంది నాపెళ్ళాం దీనిముందు....ఇద్దరూ ఆడవాళ్ళే...కానీ ఎంత తేడా ఆ బ్రహ్మ సృష్టిలో...శిల్పకళారహస్యాలు నిబిడీకృతమైన పాలరాయి విగ్రహం ఇక్కడుంటే ఎత్తికుదేసిన సిమెంటు దిమ్మె అక్కడుంది” అనుకున్నాడు

“థింక్ ఆఫ్ ఎ డెవిల్ అండ్ ద డెవిల్ ఈజ్ దేర్” అన్నట్టుగా తలుచుకున్నది ఆలస్యం అతడిభార్య సునంద ఫోన్ చేసింది

“ ఎక్కడున్నారండీ?” అంది

“వల్లకాట్లో ఉన్నాను....ఇక్కడ ఉక్రెయిన్ వాళ్ళతో సాఫ్ట్‌వేర్ గురించి సీరియస్ మీటింగ్‌లో ఉన్నాను...ఫోను పెట్టేయ్” అన్నాడు

“అయ్యో నా మతి మండా... అవును మీరీ టైమలో మీటింగ్‌లో ఉంటారు కదా... మరచేపోయాను సుమీ ...మీ ఆరోగ్యం జాగ్రత్త...వేళకింత తినడం మరచేరు” అని ఫోన్ పెట్టేసింది సునంద.

“ఎవరది?” అడిగింది మాషా

“నాభార్య ”

“ఓ...మీకు పెళ్ళయిందా...మీరు చాలాయంగ్‌గా ఉన్నారు ”

★ ★ ★

ఆ రోజు రాత్రి ఓ విజయోత్సవ సభలా ఏర్పాటు చేశాడు రాజేంద్ర. చిన్న మందుపార్టీ. కేవలం రామ్ ఇంకా సుధాకర్‌లని మాత్రమే పిలిచాడు.

మాషా గురించి, ఆమెతో తన అనుభవాన్ని గురించి ఎవరో ఒకరితో చెప్పుకోకపోతే అతడికి నిద్ర పట్టేలా లేదు.

ఆమె కథ మొత్తం విన్నాక సుధాకర్ "నాకయితే ఏదో సోవియట్ భూమి పత్రిక చదివినట్టుంది ఆమె చెప్పింది" అన్నాడు నిర్దాక్షిణ్యంగా.

అంతటితో ఆగకుండా "పాపం కట్టెల అడితిలో నష్టాలు వచ్చాయా వాళ్ళ నాన్నకి ...ఏం ఉక్రెయిన్ లో కట్టెలు మానేసి గాస్ పొయ్యిలు వాడుతున్నారేమో" అని కూడా అన్నాడు వెటకారంగా

"నీకసలు దయాదాక్షిణ్యాలు లేవు సుధాకర్" అన్నాడు రాజేంద్ర బాధగా

"తప్పు ....తప్పు..ఉన్నాయి...రేపు నేను కూడా పని మానేసి నీతోనే ఉండి ఉక్రెయిన్ దేశానికి చెందిన పేదరాలికి నావంతు సేవ చేసుకుంటాను...నాక్కూడా ఓమాషానో, నటాషానో చూడు " అన్నాడు

"సర్లే ...మడిసన్నాక కాసంత కళా పోషణ ఉండాలి...అది అందరితో కాదు...ఈ సెక్షన్ నాకు వదిలిపెట్టి నువ్వు పని చూసుకో " అని కాసింత ఆగి...ఓ పెగ్గు పూర్తి చేసి

"మొత్తానికి నా శృంగార జీవితంలో కొన్ని కొత్త రికార్డులు ఈరోజు సృష్టించానోయ్.. మొదటిసారి ఓ విదేశీ అమ్మాయి...మొదటి సారి ఓ మెడిసిన్ స్టూడెంటు..ఆహా... ఎక్కడి గోదారిగట్టు? ఎక్కడి ఒడెస్సా ఊరు...? ఎక్కడి ఉక్రెయిన్ దేశం..? ఈ సారి ఖండాంతర ఖ్యాతి కొట్టాలి...ఆసియా ఖండం దాటి ఐరోపా, అమెరికా, ఆఫ్రికా, ఆస్ట్రేలియాలకి మన శృంగార జైత్రయాత్ర సాగాలి" అన్నాడు

"అంటార్కిటికా వదిలేశావేం...ఓహో అక్కడ ధృవపు ఎలుగుబంట్లు తప్ప ఉండవుకదా.. ...అయినా నువ్వు ఖండాంతర ఖ్యాతి కొట్టేశావు....దక్షిణ ఉక్రెయిన్ నిస్సందేహంగా యూరోప్ లోనే ఉంది" అన్నాడు సుధాకర్ జీడిపప్పు నములుతూ

రామ్ పగలబడి నవ్వుతున్నాడు..

"పోన్లేరామం...సుధాకర్‌కి ఎలాగూ చేతకాదు... కనీసం ఇలా అన్నా సంతోషపడనీయ్" అన్నాడు రాజేంద్ర

"ఆ మాట నిజమే గురూ..నాకూ రామానికీ నీ అంత ధైర్యంలేదు" ఒప్పుకున్నాడు సుధాకర్

"సరేకానీ రాజేంద్రా...నీకు మీ ఆవిడ గుర్తురాలేదా...ఆవిడకి ద్రోహం చేస్తున్నాననిపించలేదా?" అడిగాడు రామ్

"నీవాదం...వింతగా ఉంది రామం... పడగ్గదిలో రతీదేవిని, మన్మధుడ్ని ఆరాధించాలి..అంతేకాని అంకాళమ్మలని, అప్పలమ్మలని తలుచుకుని రుచి

పోగొట్టుకోకూడదు. నాకు జాతకం ప్రకారం రాజయోగం నడుస్తోంది....ఆ యోగంలో ఇవన్నీ మామూలే...

అయినా నేనేమన్నా ముండలపిచ్చిగాడ్నా....ఎప్పుడైనా అమావాశ్యకి పౌర్ణమికి ఓసారి సరదా పడేవాడ్ని....ముండల్ని మరిగి పెళ్ళాన్ని నిర్లక్ష్యం చేస్తే తప్పుగానీ... " అన్నాడు రాజేంద్ర

సుధాకర్ గబగబా తన లాప్‌టాప్ ఆన్ చేశాడు...నెట్‌కి కనక్టయి తెలుగు కాలెండర్ చూశాడు

"ఇవాళ అమావాస్య కానీ, పౌర్ణమి కానీ కాదు... పిడపర్తి వారి పంచాంగం ప్రకారం అమావాస్య ఇంకా వారం ఉంది" అన్నాడు సుధాకర్

"ఓర్నీ దుంపతెగా... నేనేదోమాటవరసకి అంటే.. ఇంకా నయం రాహుకాలం ,యమగండం కూడా చూసుకోమన్నావుకాదు"

"అది సరే నువ్వు సుధాకర్ మాటలు పట్టించుకోకు..తనేదో తమాషాకి అంటాడు కానీ, రేపు మీ ఆవిడ సునందకి తెలిస్తే?" అన్నాడు రామ్

"మా ఆవిడ ఉక్రెయిన్ వెళ్ళదు...వీళ్ళు మా ఇంటికి రారు.. మీమీద నాకు నమ్మకం ఉంది... మీరు చెప్పరు. ఇక ఎలా తెలుస్తుంది? నేనా, ఇలాంటి విషయాలు చెప్పి ఆవిడ మనసు పాడుచేసేంత దుర్మార్గుడిని కాదు...అయినా, తెలిసినా ఏం చేస్తుంది? భర్త అనేవాడు ఒహడుండాలి కదా..అందువల్ల ఏమీ అనదులే...అయినా ఈ అపభ్రంశపు అనుమానాలేవిటి?" అన్నాడు రాజేంద్ర

"అయినా ఆ అమ్మాయిల నిస్సహాయతని దోచుకోవడమే కదా ఇది?" అన్నాడు రామ్

"బావుంది...వాళ్ళనేమైనా జుట్టుపట్టుకు ఈడ్చుకొచ్చారా? వాళ్లు ఇష్టపడేకదా వచ్చారు? ఇద్దరు వయోజనుల మధ్య పరస్పర అంగీకారంతో జరిగేదానికి నీ గోల ఏమిటి?"

"సరేలే ...నీ స్వేచ్ఛని నేనెందుకు కాదనాలి? వాళ్ళ ఆనందానికి, సంపాదనకి ఎందుకు అడ్డు తగలాలి? నేనేమీ మోరల్ పోలీసింగ్ చెయ్యబోవటంలేదు...నువ్వు చెప్పినదాంట్లో పాయింటు లేదనటం లేదు..కాకపోతే అది అందరికీ నచ్చాలని లేదు"

"అందరికీ ఒక దేవుడే నచ్చడు...అందుకేగా ఇంతమంది...అలాగే ఎవరి ఇష్టం వాళ్ళది..ఇది నేను స్థాపించిన సిద్ధాంతం కాబట్టి దీన్ని థియరీ ఆఫ్ రానా అని పిలు కావాలంటే... నీకురోజూ ఇంటిభోజనమే కావాలి..నేను మెస్సుల్లో, హొటళ్ళలో

తినేవాడిని అనుకో"

"మరయితే ఆడవాళ్ళుకూడా అలా అనుకోవచ్చునా అని అడుగుతారు కొందరు"

"చూడూ...మన చుట్టూ ఒక సమాజం ఉంది...నువ్వు దుర్మార్గం అను ఇంకోటను. ఆ సమాజం కొన్ని వర్గాలకి వెసులుబాట్లు, సుఖాలు, అందించింది. కొన్ని వర్గాలకి కట్టుబాట్లు, బాధలు పెట్టింది. ఆ రకంగా విభజన కులం ప్రాతిపదికగా, అలాగే ఆడ,మగ అనే లింగభేధం ఆధారంగా కూడా జరిగాయి....ఇది తప్పు అని నేను కూడా వప్పుకుంటాను...కానీ నాకు అందివచ్చిన అవకాశాన్ని ఎందుకు వదుల ఁకుంటాను? ఒకవేళ అది సమస్య అయితే ఆ సమస్యతో బాధపడేవాళ్ళు పోరాడాలి, ప్రశ్నించాలి, తిరగబడాలి. కానీ దాని వల్ల లబ్దిపొందే నావంటి వాడు ఏంచేస్తాడు?"

"రిచర్డ్ హోగన్ అనే అమెరికా సైకాలజిస్టు తన బయోసెక్సువల్ ఫాక్టర్ అనే పుస్తకంలో అంటాడు.... మగవాళ్ళ జీన్స్‌లో ఎక్కువమంది ఆడవాళ్ళని పొందా లనే కాంక్ష, ఆడవాళ్ళ జన్యువుల్లో ఒకడికే నమ్మకంగా ఉండాలనే కోరిక తరతరాల ప్రవర్తన వల్ల సీల్ చెయ్యబడ్డాయని....దీనికి కారణం...మగవాడ్ని ఉద్రిక్తపరిచి, సంతృప్తి పరిస్తే తప్ప స్త్రీ తల్లికావడం జరగదు. కానీ స్త్రీ తాలూకు ఆసక్తి కానీ సంతృప్తి కానీ అవసరం లేకుండానే పునరుత్పత్తి సాధ్యం కావడం వల్ల అని.....కానీ సమాజం పెట్టే కట్టుబాట్ల వల్ల క్రమేణా మార్పు సాధ్యం అంటాడు అతడు" అన్నాడు సుధాకర్

"వాడెక్కడ తగిలాడు నీకు...కన్నాట్ ప్లేస్‌లోనా ......నేనేదో జరిగిన విషయం రంజుగా చెబితే ఎంజాయ్ చేస్తారని పిలిస్తే ఈ శవ పరీక్షలు,శల్యపరీక్షలు ఏంటి? అబ్బాయ్ సుధాకర్ ..నువ్వు రామం కలిసి, ఫ్లో చార్టులు, కమాండ్‌చెయిన్ దయాగ్రములు తయారుచేసుకోండి....ఉక్రెయిన్ గురించి చెబితే ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారే" అని నిద్రకుపక్రమించాడు రాజేంద్ర

★ ★ ★

ఆ మర్నాడు కూడా టీమ్ మెంబర్స్ స్టడీట్రిప్‌కి వెళ్ళగానే సింఘానియాకి ఫోన్ చేశాడు రాజేంద్ర. ఆల్రెడీ వెరిఫికేషన్ అయి నమ్మకం కుదరటంతో సరాసరి గెస్ట్‌హౌస్‌కి తన కారులో వచ్చేశాడు సింఘానియా.

అతడు నిన్న వాడిన కారు మార్చడం గమనించాడు రాజేంద్ర. ఈరోజు టవేరాలో వచ్చాడు, మళ్ళా నలుగురు అమ్మాయిలతో

"నలుగురితోపాటు నారాయణా అంటే ఇదే కామోసు వీడు మినిమం నలుగురు లేకుండా బయటికి కదలడు కామోసు " అనుకున్నాడు రాజేంద్ర

“వీళ్ళేకాదు సాబ్..మన దగ్గర మంచి కాశ్మీర్ అమ్మాయిలు కూడా ఉన్నారు.... ఇంకా పంజాబ్..హర్యానా..కేరళ...బెంగాల్...మీకు ఎవరు కావాలంటే వాళ్ళు దొరుకుతారు...చాలా ఫ్రెష్ అమ్మాయిలు ఉన్నారు ” అన్నాడు సింఘానియా

“నీయబ్బ నువ్వు నడిపేది అమ్మాయిల కంపెనీయా లేక టూరిస్టు సర్వీసా? అక్కడికి ఏదో అన్ని రాష్ట్రాలకూ టూరిస్టుబస్సులు నడుపుతాం అన్నట్టు చెబుతున్నావ్. ” అనుకుని పైకి

“ఎక్కడ సింఘానియా గారూ....మీ రేట్లు చాలా ఎక్కువ రెండురోజుల స్వర్గానికి పాతాళంలోంచి డబ్బుతోడాల్సివచ్చింది..కొంచెం తగ్గించుకుంటే చూద్దాం” అన్నాడు.

“మీకు మంచి మొదటిరకం అమ్మాయి కావాలంటే ఆమాత్రం ఖర్చుపెట్టాలి సాబ్ ..ఉల్లిపాయలే కిలో అరవైరూపాయలు పలుకుతున్నాయ్...ఇంత మంచి అమ్మాయిలు మీకు ఎక్కడ దొరుకుతారు? ”

అవునవును నీకు ఊరి ఉల్లిపాయ, ఉక్రెయిన్ బుజ్జిపాప రెండూ ఒకటే అనుకుని “సరే....అవసరమైతే చెబుతాను ” అన్నాడు

తర్వాత ఆ నలుగురిలో తనకి నచ్చిన ఓ అమ్మాయిని ఎంచుకుని తన గదిలోకి తీసుకు వెళ్ళాడు రాజేంద్ర

ఈమె నిన్న వచ్చిన మాషాకంటే అందంగా ఉంది...చలాకీగా ఉంది. రాజేంద్రని తమాషాగా ఎత్తి మంచంమీద పడేసింది.

“డ్రింకేమన్నా తీసుకుంటావా ” అని అడిగాడు

“ఓ యస్ ” అంది హుషారుగా

అతడిచ్చిన వైన్ బాటిల్ తీసి రెండు గ్లాసులు గటగటా మంచినీళ్ళు తాగినట్టు తాగేసింది. ఆ స్పీడు చూసి అతడి గుండె జారిపోయింది.

“నీ పేరేంటి?... ఏ ఊరు?” అడిగాడు యధాలాపంగా

“నాపేరు స్వెత్లానా కోర్నికోవా...మాది నికోలెవ్ పట్టణం ... ఉక్రెయిన్‌లోనే.. మానాన్న పెద్ద తాగుబోతు...ఆయనకి తాగటం తప్ప వేరే పనిలేదు. మా అమ్మ సైకియాట్రీ పేషంట్... అంటే పెద్దగా ఏంలేదు...ఆమెకి మతం మత్తు...దేవుడు కనపడ్డాడని, దేవదూతలు కనపడ్డారనీ గోల చేస్తూ ఉంటుంది...కమ్యూనిస్టు ప్రభుత్వం కూలిపోయాక మాదేశంలోకి దేవుడు, ఆయన దూతలు వచ్చే పరిస్థితులు లేవు...నరకానికి నకళ్ళుగా మారిపోయాయి...అన్నీ బావుంటే మేం ఎందుకిలా రోడ్డున పడతాం...కమ్యూనిస్టులు ఉన్నపుడు స్వేచ్ఛలేదు...తిండి ఉండేది...ఇప్పుడు

కావల్సినంత స్వేచ్ఛ..మమ్మల్ని మేము అమ్ముకునేంత....కానీ తిండి లేదు" అంది

"నీ ఓటుదేనికి....తిండికా స్వేచ్ఛకా?"

"స్వేచ్ఛకే..... స్వేచ్ఛకే....దుబాయ్‌కి, టర్కీకి వెళ్ళిన అమ్మాయిలు అదిరిపోయేంత సంపాదించుకు వస్తున్నారు...నేను కూడా ఆ వీసా దొరికే వరకే ఇక్కడ...తర్వాత జంప్" అంది అతడిపైకి దూకుతూ.

★ ★ ★

"అబ్బో... దాని దూకుడు కాదుగాని..నేనే కుదేలయిపోయాను..రోలర్‌కోస్టర్ ఎక్కిదిగినట్టుంది"

అన్నాడు రాజేంద్ర మళ్ళా రాత్రిపూట రామ్, సుధాకర్ లతో బాతాఖానీ మొదలెట్టాడు

రెండు పెగ్గులు దాటిన తర్వాత అతడు మంచి హుషారులోకి వచ్చాడు

"నిన్న డాక్టరన్నావు...ఇవాళ ఇంజనీరా? " అన్నాడు రామ్

"కాదు...తనేమిటోకూడా అడిగే ఛాన్సివ్వలేదు...కుమ్మేసింది"

"కొంపతీసి కొట్టిందా ఏమిటి...చెప్పు దెబ్బలు దాచుకోకూడదు...పుత్తూరు రాజులదగ్గరకెళ్ళి కట్లు కట్టించుదాం " అన్నాడు రామ్

"ఒరేయ్ రామం... నిన్న సుధాకర్ ఇవాళ నువ్వు....షిఫ్టులేసుకుని మరీ నన్ను తగులుకుంటున్నారేంటిరా...? ఎటకారం కాకపోతే ఢిల్లీలో పుత్తూరు రాజులు ఎక్కడదొరుకుతారు?"

"భలే పనే...ఇక్కడ కూడా ఓ బ్రాంచిపెట్టారట...నువ్వు ఊ అను...అక్కడికి తీసుకువెళతాం " అన్నాడు రామ్ ఏమాత్రం తగ్గకుండా

"పడుకున్న గాడిదనిలేపిమరీ తన్నించుకున్నాడట వెనకటికి ఎవడో...వాడూ నాలాటివాడే అయిఉంటాడు...మందు పోయించి మరీ తిట్టించుకుంటున్నాను చూడు"

"అదేం మాట రాజేంద్రా...ఎంతయినా ఒక ఊరివాళ్ళం...రేపు నీకేదయినా అయితే నాకు మాట రాదూ...అందుకే అడిగా..అయినా నీ మన్మధవీరగాధ వినాలని మాకూ ఉత్సాహంగానే ఉంది " అన్నాడు రామ్ సమాధానంగా

"అదీ ...అలా అన్నారు ..బావుంది. అయితే వినండి...నేను టెస్ట్ క్రికెట్ ఆడే వాళ్ళలా శృంగారంలో చాలా నిదానంగా ఉంటాను...ఈమె మాత్రం ట్వంటీట్వంటీ ప్లేయర్..." అని మొదలెట్టి తన అనుభవం వాళ్ళకి వర్ణించడం మొదలెట్టాడు రాజేంద్ర

అంతలో ఫోన్ వచ్చింది రామ్ మామగారు, కంపెనీ సీయండీ హరిహరరావునుండి

"ఏం రాజేంద్రా...నీకీ ఉక్రెయిన్ వాళ్ళెక్కడ దొరికారు?" అన్నాడు ఆయన అవతలినుండి.

# 12

అతడి తడబాటు చూసి రామ్ స్పీకర్ ఫోన్ ఆన్ చెయ్యమన్నాడు.... రాజేంద్ర కంగారుగా స్పీకర్ ఫోన్ ఆన్ చెయ్యబోయాడు. కంగారులో అది కాస్తా కట్టయింది.

"ఏంటి ...కంగారు పడుతున్నావ్?" అడిగాడు రామ్

"సీయండి ఫోన్...ఉక్రేనియా వాళ్ళ గొడవ ఏమిటి అని అడుగుతున్నాడు...ఈ గెస్ట్‌హౌస్ వాళ్ళేమన్నా చెప్పారంటావా?"

"ఏది ఏమయినా నువ్వు కంగారుపడి ఏం మాట్లాడకు...ఆయన్ను మాట్లాడనీ. స్పీకర్ ఫోన్ ఆన్ లో పెట్టు... ఈ ఐ పాడ్ మీద మేం క్లూ రాస్తాం..దాన్నిబట్టి నువ్వు అల్లుకుపో" అన్నాడు సుధాకర్

బిక్కుబిక్కుమంటూ ఫోన్ ఆన్ చేశాడు రాజేంద్ర

"సారీ...సార్..లైన్ కట్టయింది "

"ఆ.. చెప్పు ఉక్రెయిన్ వాళ్ళ గొడవేమిటి? వాళ్ళతో బిజినెస్ డీల్‌గాని, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ గానీ మన ప్రోగ్రాంలో లేవుకదా? అసలు అక్కడ మెట్రో రైలు ఉందా?"

"ఉంది " అని రాశాడు సుధాకర్ పాడ్ మీద

"ఉంది సార్ " అన్నాడు రాజేంద్ర ఫోన్‌లో

"మూడు సిటీల్లో మెట్రో ఉంది ఉక్రెయిన్‌లో. కానీ అవి అండర్ గ్రౌండ్ ట్యూబ్‌లు.. ఆ టెక్నాలజీ చీప్ కానీ మనకి పనికిరాదు.. మనది దుబాయ్ తరహా ఎబవ్‌గ్రౌండ్ ఎలివేటెడ్ మెట్రో " అని రాశాడు సుధాకర్

దాన్నే తన మాడ్యులేషన్‌తో చెప్పాడు రాజేంద్ర.

"ఓకే....ఓకే...నువ్వు ఈ కాస్ట్‌సేవింగ్ పెట్టుకోకు వాళ్ళు డెడ్‌లైన్ కూడా ముందుకు జరపాలంటున్నారు...టైంకి పనికావడం ముఖ్యం"

"అలాగే సార్...ఇప్పుడుకూడా ఉదయం జరిగిన మీటింగ్ తాలూకు డిటెయిల్స్ చాక్‌డౌన్ చేస్తున్నాం" అన్నాడు రాజేంద్ర

"గుడ్...గుడ్....అలా ఉండాలి వర్క్‌మీద డెడికేషన్ " అని ఫోన్ పెట్టేశాడు హరి హరరావు

"పొద్దున్న పొరపాట్న మాఆవిడ ఫోన్ చేస్తే చిన్న కవరింగ్ ఇచ్చా..అది ఇలా రివర్సింగ్ అవుతుందనుకోలేదు....చావుతప్పి కన్ను లొట్టపోవడమంటే ఇదే" అన్నాడు రాజేంద్ర నిట్టూర్చి

ఆవిధంగా మెట్రో గురించిన పరిజ్ఞానంతో రామ్, సుధాకర్ ఇంకా మిగిలిన టీమ్, ఉక్రెయిన్ అమ్మాయిల దేహజ్ఞానంతో రాజేంద్ర ఢిల్లీ వదిలారు

★ ★ ★

రామ్, సుధాకర్ తిరిగివచ్చాక తమ పనిలో పూర్తిగా బిజీ అయిపోయారు. ఎప్పటికప్పుడు పూర్తయిన మాడ్యూల్స్ తీసుకువెళ్ళి లోడ్ చెయ్యటం, టెస్ట్ చేయడం ఏమన్నా బగ్స్ ఉంటే ఫిక్స్ చేయడం వీటితోనే గడచిపోతుంది సమయమంతా.

ప్రీతితో ఎక్కువ సమయం గడిపే అవకాశం వచ్చింది రామ్‌కి. ఆమె గురించి తెలుసుకోవడానికి వీలయింది.

ఓ రోజు మాడ్యూల్ చెకింగ్ పూర్తయ్యే సరికి బాగా ఆలస్యమయింది. రామ్ కంపెనీ కారు వేరేపనిమీద వెళ్ళిపోయింది.

"నేను మిమ్మల్ని డ్రాప్ చేస్తాను " అంది ప్రీతి

కారు మియాపూర్ నుండి బయలుదేరింది. ట్రాఫిక్ బాగా జామ్ అయింది. పిచ్చాపాటిగా మాట్లాడుకుంటున్నారు ఇద్దరూ

"మీది ఏ ఊరు? ఎంతమంది ఫామిలీ మెంబర్స్?" అడిగాడు రామ్.

"మాది కరీంనగర్ జిల్లా మెట్‌పల్లి....మాది భూస్వామ్య కుటుంబం...దొరలు అని వినే ఉంటావు... మాతాతముత్తాతలు దొరలు...వాళ్ళుండే ఇళ్ళని గడీలు అంటారు.. మా నాన్న చిన్నప్పుడే మాతాతగారిని నక్సలైట్లు కాల్చి చంపారు. దాంతో ఊళ్ళో ఇల్లు, భూములు  వదులుకుని మా కుటుంబం హైదరాబాదుకి వచ్చేసింది.

ఇలా రావడం వల్ల మేలు జరిగిన కుటుంబాల్లో మాదీ ఒకటి. అప్పట్లో చవగ్గా హైదరాబాదులో భూములు కొన్నారు మా నానమ్మ....అవి ఇప్పుడు విపరీతంగా పెరిగి పోయాయి.... మా నాన్నగారు అమెరికాలో యంబీయే చేశారు...ఓ మల్టీ నేషనల్‌లో రీజనల్ హెడ్‌గా చేసేవారు...రోడ్డు ఏక్సిడెంటులో చనిపోయారు....అప్పటికి నేను ఐఐయం అహ్మదాబాద్‌లో యంబీయే చేస్తున్నాను...మా ఇంట్లో నేను సింగిల్ చైల్డ్"

ఇంతలో కారు ఓ ఆర్ఫనేజి దగ్గర ఆగింది..."టూ మినిట్స్" అంది ఆమె కారు దిగుతూ

ఆమె కారు బూట్ తెరిచి ఓ పాకెట్ తీసుకుంది. అది బరువుగా ఉన్నట్టుంది.

రామ్ "ఇటివ్వండి నేను తీసుకువస్తాను" అన్నాడు

"లేదు లెండి.. నేను తీసుకురాగలను" అంది

"మీరు బరువు మోస్తున్నపుడు కెన్ ఐ లెండ్ ఎ హాండ్ అని అడగకపోతే నేను రూడ్‌గా ఉన్నట్టు అని ఈమధ్య ఓ ఎటికెట్ బుక్‌లో చదివాను"

"ఓహో...మీరు భలే వాళ్ళండీ...ఏదో ఆడపిల్ల కష్టపడుతుంది...సాయం చేద్దామని కాదు...ప్రపంచం దృష్టిలో జంటిల్మన్‌గా ఉండాలని మాత్రమే నాకు సాయం చేద్దామనుకుంటారా....వద్దులెండి"

"అయ్యో నా ఉద్దేశం అదికాదండి...జస్ట్ జోకింగ్ "

"నా ఉద్దేశం కూడా అది కాదండి...జస్ట్ కిడ్డింగ్... అయినా కొన్ని పనులు మనమే చేసుకోవడంలో తృప్తి ఉంటుంది...ఇది ఆకేటగిరీ...నాకోసం నేను చేసుకునేది"

చిన్న కాంపౌండ్ అది. పూర్వ కాలపు ఇల్లులా ఉంది. దీపాలు వెలుగుతున్నాయి. ఓ చిన్న హాలుకి నడిచింది ప్రీతి. అప్పటికే పిల్లలు భోజనాలు చేసి చదువుకుంటున్నారు.

ఆమెను చూడగానే "అక్కా.." అంటూ చుట్టుముట్టారు.

ఆమె తన కారునుండి తెచ్చిన పాకెట్ ఓపెన్ చేసింది. దాన్లో పిల్లల పేర్లు రాసి ఉన్నాయి. వాళ్ళ పేరు ప్రకారం ఎవరికివ్వాల్సిన పాకెట్ వాళ్ళకి ఇచ్చింది. కొన్ని పుస్తకాలు ఉన్నాయి, కొన్ని ఆటవస్తువులు, ఇంకొన్ని అలంకరణ సామాగ్రి, కొన్ని చాక్లెట్టు ఉన్నాయి.

ఆ పిల్లల అవసరాన్ని బట్టి ప్రత్యేకంగా కొన్నవి అని అర్థం అయింది రామ్‌కి. చాలా మంది దానాలు చేస్తారు. కానీ తమకి ఎక్కువ అయినవీ, తమకి తోచినవీ ఇస్తారు. ఇలా సొంత పిల్లలకి కొన్నట్టు వాళ్ళని అడిగి, తెలుసుకుని ఇచ్చేవాళ్ళు చాలా తక్కువ.

అతడికి ప్రీతి మీద గౌరవం, అభిమానం కలిగాయి. ఎంత మంచి అమ్మాయి. ఇంత మంచిరూపంతో పాటు, ఇంత అందమైన మనసు ఆ అమ్మాయికి ఉండటం చాలా గొప్ప కాంబినేషన్. బంగారం అందమయింది,విలువైనది. కాని దానికి సువాసన ఉండదు. ఒకవేళ ఎవరైనా సువాసన కల బంగారం తయారు చేసి దాంతో బొమ్మ చేస్తే ప్రీతి అవుతుందేమో అనుకున్నాడు రామ్

అతడిని ఇంకా ఆకట్టుకుంది కేవలం గిఫ్టులు ఇవ్వడమేకాకుండా వాళ్ళ ప్రోగ్రస్ కార్డులు చూసి బాగా చేసినవాళ్ళని అభినందించడం...తక్కువ మార్కులు వచ్చినవాళ్ళని ఓదార్చి ధైర్యం చెప్పడమే కాకుండా, ఎలా వాళ్ళ సమస్యల్ని అధిగమించాలో ఓపిగ్గా

చెప్పడం

అక్కడ రెండు గంటలు గడిచాయి. అతడు అక్కడ ఉన్నాడన్న విషయమే మరచిపోయింది ఆమె.

తిరిగి బయలుదేరాక "సారీ " అంది

"మిమ్మల్ని లిఫ్ట్ పేరుతో కిడ్నాప్ చేసినట్టున్నాను..."

"అవును...కిడ్స్‌కోసం...చేశారు"

"సరే...దీనికి కాంపన్సేషన్‌గా మీకు ట్రీట్ ఇస్తాను...ఎలాగూ మీ బాచిలర్ మెస్ క్లోజయి ఉంటుంది కదా...పదండి మీకు ఏంకావాలో చెప్పండి.. పారడైజ్ బిర్యానీ.... నాన్‌కింగ్ చైనీస్...మీ ఇష్టం"

అతడికి గుండె ఝల్లుమంది. తనని బాచ్‌లర్ అంటుందేమిటి?

అపుడు గుర్తొచ్చిందతనికి,తన గురించి ఆమెకి కో ఆర్డినేటర్ గా మాత్రమే తెలుసు. వ్యక్తిగత విషయాలు చెప్పే సందర్భం ఇంతవరకూ రాలేదు.

ఇప్పుడు ఏంచెయ్యాలి? ధర్మ సందేహం వచ్చిందతనికి. తనకి పెళ్ళయిందన్న విషయం చెప్పడమా, మానడమా?

అబద్ధం చెబితే మోసం. మరి నిజం చెప్పకపోవడం? సగం నిజం చెప్పడం? అవసరం లేనపుడు పనిగట్టుకుచెప్పాల్సిన పని లేదు. కానీ తను తనగురించి ఏమైనా ఆలోచనలు పెంచుకుంటే? అంత వరకూ రాకపోవచ్చు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఎవరికి వారే యమునాతీరే కావచ్చు. తను చేసేది తప్పే... అయినా తప్పులు చేయకుండా ఉండటానికి తనేమీ మహాత్ముడు కాడు.

ప్రస్తుతానికి వ్యూహాత్మక మౌనం పాటించాలని నిర్ణయించాడు.

"మీ ఇష్టం" అన్నాడు

"నేను వాయుభక్షణ చేస్తాను...మీరూ అదే చేస్తారా?" అంది ప్రీతి

పరాగ్గా ఉన్న రామ్ "మీ ఇష్టం " అన్నాడు మళ్ళా

"సరే అయితే...మీ బ్రహ్మచారి మఠం ఎక్కడో చెప్పండి...గాలిభోంచేస్తూ వెళ్ళిపోదాం...అక్కడ దింపేస్తాను" అంది

"సారీ...మీరన్నది సరిగా వినలేదు.. చైనీస్ తిందాం...పదండి..నాన్ కింగ్ అంటే సికింద్రాబాద్ వెళ్ళాలి కదా"

"అవసరం లేదు...ఇప్పుడు బంజారాహిల్స్‌లో సినీమాక్స్‌కి వెళ్ళే దగ్గరలో కూడా

పెట్టారు..అక్కడకెళదాం"

కారు మెత్తగా పరిగెడుతోంది...స్టీరియోలోంచి గులామ్అలీ గజల్ వినిపిస్తోంది.

"హంగామా ఎందుకు చేస్తారు? నేనేం దొంగతనం చేయలేదు...కొంచెం మధువు పుచ్చుకున్నానంతే " అంటున్నాడు గులామ్అలీ

"అవును...నేను కూడా ప్రీతి అనే అమ్మాయి సాన్నిహిత్యం అనే మధువు కొంచెం పుచ్చుకున్నాను....ఇదేమీ దొంగతనం కాదే" అనుకున్నాడు రామ్

★ ★ ★

"రామ్....రామ్....ఇటురా...హేయ్ సుధాకర్....నువ్వుకూడా" పిలిచాడు రాజేంద్ర

అతడి హడావుడి చూసి సాఫ్ట్‌వేర్‌లో ఏదయినా బగ్ సర్ఫేస్ అయిందేమో అనుకుని పరుగుపరుగున వెళ్ళారు ఇద్దరూ

అక్కడ రాజేంద్ర హాయిగా ఫేస్‌బుక్ ఓపెన్ చేసి మెసేజ్‌లు చూసుకుంటున్నాడు. ఫేస్‌బుక్ అంటే ఫ్రండ్స్ తో సంబంధాలు మరుగున పడకుండా ఇంటర్నెట్ ద్వారా లైవ్‌లో ఉంచుకునే ఓ కమ్యూనిటీ సైట్.

"యు ఆర్ సో నాటీ...నేను మీతో చాటింగ్ చాలా ఎంజాయ్ చేశాను...మిమ్మల్ని ఓ సారి చూడాలని ఉంది" అని ఉందా మెసేజ్. పక్కనే ఓ అమ్మాయి ఫోటో ఉంది. తను చాలా క్యూట్‌గా ఉంది. వయసు పద్దెనిమిదో పంతొమ్మిదో ఉండొచ్చు.

"చూశారా...మన టాలెంట్...షి ఈజ్ ఫ్లాట్...పడిపోయింది" అన్నాడు రాజేంద్ర గర్వంగా

"ఎక్కడ పడింది? దెబ్బలేమీ లేవుకదా... ఇంతకీ పడిపోయింది నీ సుందరముఖారవిందం చూసి తట్టుకోలేక కళ్ళు తిరిగి కాదుకదా?" అన్నాడు రామ్

"నీవన్నీ... సత్తెకాలపు ఆలోచనలు...కాదుకాదు...నువ్వింకా విండోస్ టుపాయింట్ జీరోలో ఉన్నావు ...కాదు కాదు డాస్‌లోనే ఉన్నావు .... అప్‌డేట్ కావాలి... పడిపోయింది అంటే...ఈ పిల్ల జింకలాగా మన వలలో పడిపోయింది " అన్నాడు.

"ఈ వేట లింగో ఎందుకు నీకు... నువ్వెపుడూ కుంటికోడిని కూడా వేటాడిన వాడివి కూడా కాదు" అన్నాడు రామ్

"వేటమాంసం రుచి ఫారంకోడికి వస్తుందా? వేటగాడి సంతృప్తి వూటగాడికి వస్తుందా" అన్నాడు రాజేంద్ర

“ఇవన్నీ మన జీన్స్‌లోనే ఉన్నాయిలే..ఆదిమానవుడు జంతువుల్ని వేటాడి తిండి సంపాదించేవాడు... ఆదిమానవి లేదా స్త్రీ వేటాడేది కాదు... అందుకే మగవాడికి ఆ హంటింగ్ ఇనస్టింక్ట్ ఉంటుంది” అన్నాడు సుధాకర్

“అందుకేనా యన్టీఆర్ ఒక్క బుల్లెట్ కూడా పేల్చకపోయినా...ఒక్క జంతువునైనా వేటాడకపోయినా హంటింగ్ ఈజ్ మైథ్రిల్... వేట నాకొక ఆట అని డైలాగులు చెబుతాడు...పైగా ఆ సినిమా పేరు వేటగాడు” అన్నాడు రామ్

“మిమ్మల్ని ఇక్కడికి పిలిచింది పాత సినిమాలని గురించి మాట్లాడుకోడానికి కాదు....మగవాడి సైకాలజీ గురించి ఎనలైజ్ చెయ్యడానికి అంతకన్నా కాదు....ఈ పిల్లని చూడండి ... మీకేమనిపిస్తోంది?”

“నాకయితే పౌష్టికాహారం తినమని కొంత డబ్బు సాయం చెయ్యాలనిపిస్తోంది” అన్నాడు సుధాకర్

“ఇంకా నయం... డప్పు కొట్టి దానికి పెళ్ళి చెయ్యాలనిపించడం లేదూ” అన్నాడు రాజేంద్ర

“నిజమే బాస్...నువ్వు చెప్పాక అనిపిస్తోంది... చెప్పు సంబంధం మాట్లాడెయ్యమంటావా” అన్నాడు సుధాకర్

“అప్పుడు మా ఆవిడ నన్ను బతికుండగానే చీరి, ఉప్పుపెట్టి అల్లం మురబ్బా అని అమ్మేస్తుంది... ఇదిపెళ్ళికి పనికిరాదోయ్...సరదాగా ఎంజాయ్ యంటీవీ అంతే”

“చూడబోతే నువ్వు వినిపిస్తున్నావ్ కానీ ఇది చాలా హాట్ గా ఉంది గురూ... నీకు వర్కవుట్ అవుతుందంటావా?”

“అవకపోతే నాపేరు... రాజేంద్ర నారాయణ కాదు... మాట తప్పే వంశంలో పుట్టలేదు”

“అసలు మాటే ఇవ్వని వంశంలో పుట్టావు కానీ ..ఈ బాతాఖానీ కబుర్లాపి పనిచూడు” అన్నాడు రామ్

“సరే మీ ఇద్దర్నీ తనతో మిమ్మల్ని డిన్నర్‌కి కూర్చోపెడతాను.... ఎంత ఓడిపోతారు?”

“చెరికో పదివేలు... ఇరవై వేలు సరేనా” అన్నాడు రామ్

★ ★ ★

“మీకు డ్రామాలంటే ఇష్టమేనా?” అంది ప్రీతి

"చూడ్డమంటే ఇష్టమండీ....ఆడటం ఇష్టం ఉండదండీ...ఇంతకూ ఎందుకు అడిగారు?"

"రవీంద్రభారతిలో మంచి ఇంగ్లీషు డ్రామాలున్నాయ్...నేను రెండు సీజనల్ పాసెస్ తీసుకున్నాను.... ఈ రోజు ఫైవ్‌పాయింట్ సమ్‌థింగ్ ఉంది మీరు వస్తారా?"

"తప్పకుండా...కానీ ఎందుకండీ మీ ఫ్రెండ్ ఎవరైనా వస్తానని రాలేదా?" అన్నాడు రామ్

"అవునండీ ...అంత కరెక్టుగా ఎలా గెస్ చేశారు?"

"ఏంటో ఒక్కోసారి అలా కుదురుతుందండీ....పదండి...చేసేదేముంది" అన్నాడు

అతడి గుండె బితుకు బితుకుమంటోంది. తమ ఇద్దర్నీ ఇలా పబ్లీగ్గా ఎవరైనా తెలిసిన వాళ్ళు చూస్తే? వెంటనే లైవ్ టెలీకాస్ట్ లాగా తమ ఇంటికి ఫోన్ చెయ్యడం... జానకి ఓ డజన్ ఛానల్స్ వాళ్ళని వెంటేసుకుని రవీంద్ర భారతికి రావడం....వాళ్ళు ....ఫలానా టీవీ ఎక్స్‌క్లూసివ్....పెళ్ళయి....కొత్త పెళ్ళాం ఇంట్లో ఉండగానే ఓ ప్రియురాలిని వెంటేసుకుని నాటకానికొచ్చాడో ప్రబుద్ధుడు...విషయం తెలిసిన ఇల్లాలు ఆ ప్రేమ నాటకానికి తెరదించింది....అటు భార్య...ఇటు ప్రియురాలు ఇద్దరూ కలిసి అతడ్ని ఉతికేసిన దృశ్యాలు ఇప్పుడు మనం లైవ్ లో చూద్దాం..అలా తన బతుకు అన్ని ఛానల్స్‌లో  చూపించేయడం.....బాబూరావ్ చెప్పండి...అక్కడి పరిస్థితి ఎలా ఉంది? అక్కడ ప్రజల రియాక్షన్ ఏమిటి?.... అని న్యూస్ ఏంకర్ అడగటం.... వీడ్ని ఉప్పుపాతర వేయాలా ఊరగాయ పెట్టాలా అని ప్రజలు తర్జనభర్జన పడుతున్నారు పుస్పా అని అతడు అనడం....అన్నీ లైవ్‌లో కళ్ళముందు కనపడ్డాయ్ రామ్‌కి.

తనకి ఊహాశక్తి అంత ఉందనీ...అన్ని ఫ్రేమ్సు అంత వేగంగా మారిపోయినా హెచ్‌డీ క్వాలిటీ అవుట్‌పుట్ రాగలదనీ మొదటిసారి తెల్సింది రామ్‌కి

ఆ రోజు ఆమె చాలా అందంగా కనిపిస్తోంది. స్కైబ్లూ ట్రౌజర్‌లో సెల్ఫ్ డిజైన్ వైట్ షర్ట్ టక్ చేసింది. మేకప్ చాలా సింపుల్‌గా ఉన్నా ఏదో ఆకర్షణ కొట్టొచ్చినట్టు కనపడుతోంది. మంచి  పరిమళం ఆమె నుంచి వస్తోంది.

"ఏంటలా చూస్తున్నారు రామ్?" అడిగింది ఆమె కారులో కూర్చున్న తరువాత

"ఏంలేదు...మీ పెర్‌ఫ్యూమ్... చాలా మంచివాసనవస్తోంది..మీ సెలక్షన్ బావుంది"

"ఓహ్ ...అదా..రాల్ఫ్ లారెన్ అని నాఫేవరెట్ బ్రాండ్...నేను కొనే డ్రెసెస్ కూడా ఎక్కువ వాళ్ళవే...ఐ హేవ్ రొమాన్స్ ఆన్‌మీ టుడే"

"మీరు రొమాంటిక్ అనే ధ్వని వస్తోంది మీరు వాడుతున్న ఫ్లేవర్ వల్ల...రాల్ఫ్ లారెన్ చాలా ఖరీదైన బ్రాండ్ అనుకుంటా కదా?"

"యా....యు ఆర్ రైట్....మనకి నచ్చినప్పుడు ఖరీదు చూడకూడదు...కొనగలిగితే కొనెయ్యడమే...ఆఫ్టాల్ మనకున్నది ఒక్కటే జీవితం" అంది ఆమె కారు రవీంద్ర భారతి వైపు పోనిస్తూ

"మీలో నేను మూడు షేడ్స్ చూశాను....ఆఫీసులో ఉన్నపుడు చాలా వర్క్‌మైండెడ్...పని తప్ప ఏమీ పట్టించుకోరు...నేను మీ దగ్గర నేర్చుకోవాలని ట్రై చేస్తున్నాను...కనీసం పర్సనల్ కాల్స్ అటెండ్ కారు...వర్క్‌హాలిక్ లాగా ఉంటారు... కానీ కాదు... ఆఫీసు వదలగానే దానికి సంబంధించిన అన్ని విషయాలు మర్చిపోయి రిలాక్స్‌డ్‌గా ఉంటారు...పిల్లలకి ఏదో పడేస్తున్నాం.. చాలా చేస్తున్నాం... అన్న సూడో తృప్తి లేకుండా నిజంగా కమిటెడ్‌గా...అంకితభావం అంటామే దాంతో ఆ అనాథ పిల్లలకి ఎవరెవరికి ఏం కావాలో చూసుకుంటారు...ఇది మీలో రెండో షేడ్...ఇక మూడోది మీ లీజర్ అండ్ హాబీస్...ఇక్కడా ఎంతో రిచ్ గా ఉంటారు... ఇలా ఇన్ని కాంట్రాస్ట్‌లు ఎక్కడా చూడం...వర్క్‌హాలిక్ అంటే ఇక ప్రపంచం మునిగిపోతున్నా పట్టించుకోకుండా, కుటుంబం ఏమైపోతుందో చూసుకోకుండా తన పని, ప్రమోషన్ దీంట్లోనే ఉంటాడు....ఇక సర్వీస్ మైండ్ అంటే ప్రపంచాన్ని త్యజించిన సన్యాసినిలా..దేశముదురులో హన్సికలా అన్నీ వదిలేసి ఉంటారు....ఇక లైకింగ్ ఫర్ ఫన్ ఉంటే ఎప్పుడూ పేజ్ త్రీలో పడటం కోసం రోజంతా మేకప్, ఎక్కడ పార్టీలున్నాయా, ఏ డ్రస్ వేసుకెళ్ళి ఎలా చేతిలో గ్లాసుతో ఫోటో పేపర్లో వేయించుకోవాలా అని చూస్తుంటారు....కానీ మీరేంటండీ బాబూ అన్నీ సమపాళ్ళలో రంగరించినట్టు పర్‌ఫక్ట్ ఉమెన్‌లా...ఇంకా చెప్పాలంటే పెర్‌ఫెక్ట్ హ్యూమన్‌బీయింగ్ లా ఉన్నారు.... ఇదెలా సాధ్యం?" అన్నాడు రామ్ ఎక్సయిటెడ్‌గా

"మీది హంపి విజయనగరం కాదుకదా" అడిగింది ఆమె

"లేదండీ పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు దగ్గర చిన్న ఊరు" కన్ఫ్యూజ్ అవుతూ అడిగాడు తను మాట్లాడిందానికి ఈమె అడిగే దానికి సంబంధం ఏమిటా అని

"ఏంలేదండీ...హంపీ విజయనగరం కవులకి ప్రసిద్ధి...మీరింత ఆశువుగా కవిత్వం చదివేస్తుంటే అనుమానం వచ్చి అడిగాను...థాంక్స్ ఫర్ ద కాంప్లిమెంట్స్... మీరనుకున్న విశిష్ట వనిత పురస్కారం తీసుకోవాల్సినంత ప్రత్యేకతలు ఏమీ లేవు కానీ...దటీజ్ మై ఆటిట్యూడ్ టువార్డ్స్ లైఫ్...జీవితం పట్ల నా దృక్పథం అది... నాలైఫ్‌ని నేను ఎంజాయ్ చెయ్యాలి...ఎట్ ద సేమ్‌టైమ్ దానికో అర్థం ఉండాలి...

మీనింగ్‌లెస్‌గా ఉండకూడదు.....ఆ పిల్లల్లో కొందరినైనా నా ఎఫర్ట్‌తో లైఫ్‌లో పైకి తీసుకొస్తే నాకా తృప్తి ఉంటుంది...నేను రిలాక్స్ కావడం కోసం ఈ సంగీతం, సినిమాలు, థియేటర్ లాంటివి" చెప్పింది ప్రీతి.

"మీకు ఇష్టమేనా ఈ డ్రామాలు చూడ్డంఅదీ లేక మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నానా?"

"మీతో సమయం గడపడం నాకు ఇష్టం...థియేటర్ గురించి నాకు తెలిసింది చాలా తక్కువ. అయితే దానికి కారణం ఆ అవకాశం రాకపోవడమే...తెలుగులో నాటకాలు ఆడేదే తక్కువ...నా చిన్నప్పుడు పరిషత్ నాటకాలని ఉండేవి కానీ అవి తెలుగు నాటకరంగం నుండి వినోదాన్ని శాశ్వతంగా బహిష్కరించి, తెలుగు ప్రజలను నాటకాలు చూసే పని నుండి విముక్తుల్ని చేశాయని చెప్పుకుంటారు.... ఒకప్పుడు నటులందరూ నాటకరంగం నుండి వచ్చేవాళ్ళు..ఇప్పుడు వారసత్వంగా నటులు తయారవుతున్నట్టు " అన్నాడు రామ్

"థియేటర్‌కీ సినిమాకి తేడా ఏంటో తెలుసా, ప్రతీ ప్రదర్శనకి నటుడు ఇంప్రూవ్ అవచ్చు థియేటర్‌లో, అదే సినిమాలో అయితే ఒక్కసారి చేసిందే రికార్డు అవుతుంది..తర్వాత ఏమీ ఉండదు " అంది ప్రీతి

"లైఫ్‌లో ఆర్ట్ ఉంటే...లైఫ్ ఆర్టిస్టిక్‌గా ఉంటుందన్న విషయం మీనుంచి నేర్చుకున్నాను" అన్నాడు రామ్ సిన్సియర్‌గా

"మీరు నన్ను ఎక్కువగా పొగుడుతున్నారు...అది నాకు కొంచెం ఇబ్బందిగా ఉంది" సిగ్గుపడుతూ అంది ప్రీతి.

"లేదు..లేదు....పొగడ్త కాదు ....ఉన్నమాటే అన్నాను...కొందరితో సమయం గడుపుతుంటే ఇకచాలు అన్పిస్తుంది...నిముషాలు గంటల్లా అనిపిస్తాయి...కొందరితో ఉంటే గంటలు నిముషాల్లా అయిపోతాయి...అది వాళ్ళ పర్సనాలిటీని బట్టి అనుకుంటాను"

"ప్రేమలో ఉన్నవాళ్ళకి గంటలు నిముషాల్లా....పెళ్ళయిన తర్వాత వాళ్ళకే నిముషాలు గంటల్లా ఉంటాయని నా ఫ్రెండ్ ఒకామె అంటూ ఉంటుంది....మీరు మాట్లాడుతుంటే ఆమె గుర్తుకువచ్చింది...తనది లవ్ మారేజీ లెండి" అని నవ్వింది ప్రీతి.

ఇద్దరూ ఆడిటోరియంలోకి వెళ్లబోతుండగా రామ్ మొబైల్ మోగింది...సుధాకర్ అవతల

"ఓ సారి అర్జంటుగా రా...నేను ఇక్కడ లకడీకాపూల్ లో ఉన్నా.." అన్నాడు

"సరే..నువ్వు రవీంద్ర భారతి దగ్గరకు రా..ఇద్దరం కలిసే వెళదాం" అన్నాడు రామ్

"ఏదో ... చిన్న ప్రాబ్లం...మా ఫ్రెండుది...మీరు లోపల కూర్చోండి....తను వచ్చి పికప్ చేసుకుంటాడు...మేం వెళ్ళాల్సింది కూడా ఇక్కడికి దగ్గరే...నేను వెంటనే వచ్చేస్తాను...సారీ" అన్నాడు రామ్ ప్రీతితో

"ఫర్వాలేదు...అవసరమైతే చెప్పండి ....నేను కూడా వస్తాను మీతో పాటు.." అంది ప్రీతి

"అబ్బే...అంత పెద్ద ఇస్యూలాగా ఏమీలేదు...వెంటనే వచ్చేస్తాను...మీకెందుకు ఇబ్బంది" అన్నాడు

ఆమె లోపలికి వెళ్ళడమూ సుధాకర్ తన కారులో అక్కడికి రావడమూ కొద్ది నిముషాల తేడాలో జరిగాయి.

"ఏంటి...సుధాకర్ సమస్య ...?" అన్నాడు రామ్.

"రాజేంద్ర ఫోన్ చేశాడు...ఏదో ఏజిటేటెడ్ మూడ్‌లో ఉన్నట్టుంది....మీరు డబ్బు ఇవ్వండి అంటున్నాడు...సూసైడ్ చేసుకుంటానంటూ ధమ్కీ ఇస్తోందిట...వాడలాగే డబ్బిమ్మంటాడుగానీ మనం ఓసారి వెళ్ళి మాట్లాడివస్తే బెటర్‌గా ఉంటుందనిపిస్తోంది.. కన్విన్స్ కావచ్చు అందుకే ఫోన్ చేశాను"

"చస్తే...చావమను...ఎవడ్నిబెదిరిస్తుంది...అసలు వెళ్ళడం అవసరమంటావా? ఒక్కోసారి వీళ్ళు తమాషాగా మొదలెట్టి నిజం చేస్తారు...ఎందుకు వెళ్ళడం...రిస్కు కదా" అన్నాడు రామ్

"మనకి తెలీకుండా జరిగితే అదివేరే.... కానీ తెలిసి కూడా ఎందుకు వదిలేయడం..పిచ్చముండ మనపేర్లు రాసి చస్తే మనం స్టేషన్ల చుట్టూ తిరగాలి...ఓ సారి కౌన్సిల్ చేసి వదిలేద్దాం" అన్నాడు సుధాకర్

ఓ అరగంట తర్వాత రామ్ తిరిగివచ్చి ప్రీతితో కలిసి ఫైవ్ పాయింట్ సంథింగ్ చూశాడు

# 13

ఓ కలలోంచి మెలుకువ వచ్చినట్టు ఉంది రామ్‌కి. ఆరోజు సాయంత్రం ప్రీతితో రవీంద్ర భారతికి వెళ్ళేంత వరకూ సాధారణంగా ఉన్న తన జీవితం ఆ తర్వాతే అసాధారణంగా మారింది. అంతవరకూ తాను మామూలు ఉద్యోగి, సగటు భర్త. ఈ

రోజు ఓ హత్య కేసులో నిందితుడు. అదృష్టం బాగోలేకపోతే హంతకుడు. అతడికి పేపర్లలో చదివింది గుర్తుకొచ్చింది. రమేష్ రాథోడ్ అనే సీరియల్ హంతకుడు తను చాలా హత్యలు చేసినట్టు ఒప్పుకున్నాడు. అయితే ఈలోగానే మూడు కేసుల్లో దిక్కుమొక్కులేనివాళ్ళని హంతకులుగా పేర్కొంటూ చార్జిషీట్లు కూడా దాఖలు చేశారు. ఇంకొంచెం ఆగి ఉంటే వాళ్ళకి శిక్ష కూడా పడి ధర్మం నాలుగు పాదాలమీద డాన్సింగ్ చేసేది. అంటే అమాయకుడు, అడిగే దిక్కులేని వాడు మూలన కూర్చున్నా వాడిమీద కేసు కావచ్చు. అదే రాజుగారి బావమరిదిలాగా బాగా డబ్బున్నవాడు తాపీగా ఇంట్లోనే కూనీలు చేసినా, ఎవడినైనా కుక్కని కాల్చినట్టు కాల్చేసినా హాయిగా, కాసింత సేపు కార్పోరేట్ ఆసుపత్రిలో విశ్రాంతితీసుకుని, ఆరోగ్యం బాగుచేసుకుని మరీ బయటకు రావచ్చు.

నిజమే....చట్టంనుండి ఎవరూ తప్పించుకోలేరు, నేరం చేసినవాళ్ళూ, చెయ్యని వాళ్ళూ..ఎవరూ. డబ్బు, పలుకుబడి ఉండటానికి లేకపోడానికి చాలా తేడా ఉంది, చట్టమంత తేడా, పోలీసు స్టేషనంత తేడా, ఘనత వహించిన కోర్టు అంత తేడా, లేని జబ్బులకి ఏసీ రూమ్వైద్యం చేసే హాస్పిటల్ అంత తేడా.

తన విషయంలో తన భార్యే తనకు ఎదురు సాక్ష్యం చెప్పినట్టుంది. ఇక తనని ఎవరు నమ్ముతారు? ప్రీతి కేవలం స్నేహితురాలు. భార్యకులేని దురద తనకు ఎందుకుంటుంది? పైగా పరువైన ఆడపిల్ల ఎవరూ పోలీసులదగ్గరకు వచ్చి నేను పెళ్ళయిన మగాడితో డ్రామాలకీ, షికార్లకీ తిరుగుతున్నానని చెప్పదు. బహుశా తనకు తెలీదంటుంది. దాంతో ఇప్పటికే ఉన్న అనుమానాలకి తోడు తాను అబద్ధం చెప్పానన్న అపప్రధ ఒకటి తోడై తనకి శ్రీకృష్ణజన్మస్థానవాసం ఖాయం అవుతుంది.

ఇలా సాగుతున్న అతడి ఆలోచనలకి బ్రేక్ పడింది. ఓ సెంట్రీ వచ్చాడు.

"డీసీపిగారు పిలుస్తున్నారు" అన్నాడు.

బహుశా ఇక బడితపూజ చేసి నేరం ఒప్పిస్తారు కాబోలు అనుకుని అతడివెంట నడిచాడు రామ్.

"మీరిద్దరూ వెళ్ళవచ్చు" అన్నాడు డీసీపి క్లుప్తంగా

సుధాకర్ అప్పటికే అక్కడ ఉన్నాడు.

రామ్ ఆశ్చర్యంగా చూశాడు. తలతిప్పిచూసే సరికి అపుడు కనపడింది ప్రీతి.

★ ★ ★

"మీ కంపెనీ వాళ్ళప్రవర్తన చాలా విచిత్రంగా ఉంది. ఇంత పెద్ద ప్రాజెక్టు

అదీ డెడ్‌లైన్ దగ్గర పడుతోంటే మెయిన్ ప్రోగ్రామర్స్ అయిన మీగురించి ఏమీ పట్టించుకోకపోవడం" అంది ప్రీతి

ఆమె డ్రైవ్ చేస్తోంది. రామ్ ఆమె పక్కన సీట్లో కూర్చుని ఉన్నాడు. సుధాకర్ వెనుక సీట్లోకూర్చుని ఉన్నాడు.

స్వేచ్ఛ విలువ ఏంటో అది ఉన్నంతవరకూ తెలీదు. దాదాపు ఓ రోజు దాన్ని కోల్పోయేసరికి దాని విలువ ఏమిటో తెలిసింది వాళ్ళకి. ఎప్పుడూ ట్రాఫిక్‌తో, దుమ్ముతో చికాకుగా అనిపించే సిటీ ఈరోజు చాలా అందంగా అనిపించింది. బట్టలు మాసిపోయి, శరీరం వాసన వస్తూన్నా హాయిగానే ఉంది.

"బహుశా ప్రోగ్రామింగ్ మొత్తం అయిపోయిందికదా కేవలం డ్రైరన్ కాబట్టి మా అవసరం లేదనుకున్నారేమో" అన్నాడు సుధాకర్

"ఏడ్చినట్టుంది వీళ్ళతెలివి.. ఇప్పుడువచ్చే ప్రోబ్లమ్స్ క్రిటికల్...ఇంతవరకూ మనం చేసినవి కేవలం మన ఎస్టిమేట్స్‌మీద చేసినవి...ఇప్పుడు ఫీల్డ్ కండీషన్స్‌లో వచ్చే ప్రాబ్లమ్స్ రెక్టిఫై చెయ్యకపోతే రిజల్ట్స్ చాలా ఫాటల్‌గా ఉంటాయి..ఇంతకు ముందు ఓ మెట్రోలో ఏంజరిగిందో మీకు తెలుసుకదా...రైలు చక్రం నిముషానికి ఇన్ని చుట్లు తిరుగుతుంది, ఇంత దూరం ప్రయాణిస్తుంది అని లెక్కవేసి ఇంతసేపు ప్రయాణిస్తే ఆఖరి స్టేషన్ వస్తుందని లెక్కవేశారు....సాఫ్ట్‌వేర్ కూడా అలాగేరాసి ప్రోగ్రాం చేశారు...అయితే ప్రారంభోత్సవం కదాని ఓ మామూలు వర్కర్ రైలు చక్రాలకి గ్రీజు ఎక్కువ పెట్టాడు. అవి తిరగాల్సిన సైకిల్స్ కంటే ఎక్కువ తిరిగాయి, దాంతో రైలు స్టేషన్‌దాటి సెక్యూరిటీవాల్‌నికూడా దాటి దూసుకుపోయింది...ఇలాంటి అన్‌ఫోర్‌సీన్ సిట్యుయేషన్స్ చాలా ఉంటాయి...అసలు మీ కంపెనీకి ఈ సబ్‌కాంట్రాక్ట్ ఎలా ఇచ్చారో కూడా నాకు అర్థంకావటం లేదు" అంది ప్రీతి

"అవునూ...రాజేంద్ర ఏడీ?" అడిగాడు రామ్

"మీకు తెలీదా...అతడు నిన్ననే ఆఫీసుకి తిరిగివచ్చాడు" అంది ప్రీతి.

"రాస్కెల్...వాడికోసం మేం ఇన్ని ఇబ్బందులు పడితే కనీసం మాగురించి పట్టించుకోలేదన్నమాట...అసలు సంబంధంలేని మమ్మల్ని అక్కడే ఉంచి, అసలు దివ్యతో సంబంధం ఉన్న వాడిని వదిలెయ్యడం ఏమిటి?" కోపంగా అన్నాడు సుధాకర్

"ఇప్పుడు అందరిమీదా అనుమానమే తప్ప ఆధారాల్లేవు...ఎవరినైనా వాళ్ళు వదిలేయవచ్చు లేదా ఉంచుకోవచ్చు...మిమ్మల్ని ఉంచుకున్నారు" అంది ప్రీతి.

"అబ్బా ఈ ఉంచుకోవడం బదులువేరే ఏదైనా మాట వాడొచ్చుకదా...అదోలా

ఉంది” అన్నాడు రామ్

“ఎక్కడికెళదాం?” అడిగింది ప్రీతి.

“మాఇంటికి” అన్నాడు రామ్

“ఓ అమ్మాయితో కలిసి ఇంటికి వెళ్ళడానికి భయంలేదా?” అడిగింది ప్రీతి.

“ఇంతకుముందు ఉండేది...ఓ రాత్రి లాకప్‌జీవితం చాలా నేర్పింది....అవునూ మమ్మల్నెందుకు వదిలారు? మీ సాక్ష్యం వల్లా?” అడిగాడు రామ్

“అవును...కాదు....మీరు నాతోపాటు రవీంద్రభారతికి వచ్చారని చెప్పాను..మీ స్టేట్‌మెంట్ నా స్టేట్‌మెంట్ సింక్ అవడంకూడా కావచ్చు కానీ....మా బంధువుల్లో కొందరు హైలీప్లేస్‌డ్ ఉన్నారు...వాళ్ళ ఫోన్లవల్ల కూడా కావచ్చు” అంది ప్రీతి.

“కేవలం మీ ప్రాజక్టు ఆగుతుందని మమ్మల్ని విడిపించారా?” అన్నాడు రామ్

“సుధాకర్ విషయంలో అదే కారణం కావచ్చు...మీ విషయంలో కాదు” అంది ప్రీతి.

ఇంతలో రామ్ ఉంటున్న అపార్ట్‌మెంట్ వచ్చింది. కిందనే సెక్యూరిటీ దస్కీవాడు చెప్పాడు ఈ రోజు ఉదయమే జానకి బెంగుళూరు ఫ్లైట్‌కి వెళ్ళిందని, మెసేజ్ ఇమ్మందని.

“సరే...నేను బట్టలు తీసుకుంటాను, తను వచ్చేవరకూ ఒంటరిగా ఉండటం ఇష్టంలేదు...సుధాకర్‌తో పాటు ఉంటాను” అన్నాడు రామ్

“రాజేంద్రగాడి ఇల్లు ఇక్కడికి దగ్గరేకదా...వెళ్ళి వాడ్ని నాలుగు ఉతుకుదామా” అన్నాడు సుధాకర్

“వాడి సంగతి తర్వాత ముందు కంపెనీకి రాజీనామా పంపాలి...మనల్ని ఆఫీసునుంచే కదా తీసుకువెళ్తా...మనమేమైపోయామో కూడా అక్కర్లేని వాళ్ళ అవసరం మనకిలేదు” అన్నాడు రామ్

“పద నా ఫ్లాట్‌కి వెళ్ళి ఈమెయిల్ కొడదాం” అన్నాడు సుధాకర్

★ ★ ★

మర్నాడు ఉదయమే ప్రత్యక్షమయ్యాడు రాజేంద్ర నారాయణుడు. అతడి మొహంమీద చెరగని సేల్స్‌మేన్ చిరునవ్వు.

“మనగురించి సీయండీ గారికి తెలిసి చాలా ఫీలయ్యారు. కాకపోతే ఆయనకు విషయం తెలీడం లేటయింది. ఆయన బిజినెస్‌పనిమీద బాంకాక్ వెళ్ళిఉన్నారు. నేను

ఆ రంగరాజుకి మస్కా కొట్టి బయటపడ్డాను.

మనలో ఎవరో ఒకరు బయటకు రాకపోతే సీయండీగారికి ఇన్ఫాం చేసేది ఎవరు?” అన్నాడు రాజేంద్ర

“ఏం ఆఫీసులో మిగతా అందరూ స్వైన్ఫ్లూ వచ్చి చచ్చారా?” కోపంగా అన్నాడు సుధాకర్

“మీరు బాగా కోపంలో ఉన్నట్టున్నారు. ఆయనతో యాక్సెస్ ఎంతమందికుంది? నాకు, అల్లుడుగా రామ్కి. మిగతా వాళ్ళతో ఆయన మీటింగ్స్లో తప్ప మాట్లాడరు కదా?”

“అందుకే నువ్వు ముందు బయటకి తగలడ్డావు...ఈరోజు ఆగి ఉంటే మమ్మల్నికూడా బయటకి తెచ్చేవాడివి...కాకపోతే మేం తొందరపడి బయటకొచ్చాం... వెళ్ళువెళ్ళవో...వెళ్ళి వెంపలోనో, వెల్లలోనో ఉంటారు గుడిపూడి జంగాలు వాళ్ళకి చెప్పు...” అన్నాడు రామ్

“మీకు కోపం ఉండటం సహజం కానీ రిజిగ్నేషన్ చాలా పెద్ద నిర్ణయం...” అన్నాడు రాజేంద్ర

“సుధాకర్కి కేవలం ఒకటే దెబ్బ...ఈ ఛండాలపు కంపెనీలో చేరడం వల్ల....ఓ బేడ్కంపెనీలో టైంవేస్ట్....నాకు రెండు దెబ్బలు...నా ప్రొఫైల్చూసి మీ సీయండీ, ఘనత వహించిన మా మామగారు తన పిల్లని నాకు అంటగట్టాడు....తనకి కావల్సింది టామీ అనే కుక్కపిల్లతప్ప లైఫ్పార్ట్నర్కాదు....నా లైఫే వేస్టయింది” అన్నాడు రామ్

“ఆయన కన్సర్న్ తెలీక మీరలా అంటున్నారు కానీ...ఇదిగో చూడండి మీ ఇద్దరికీ చెరికో పాతిక లక్షలు పోస్ట్డేటెడ్ చెక్స్...ఆయన మీకు ప్రాజెక్టు పూర్తయ్యాక ఇవ్వాల నుకున్నాడు సర్ప్రైజ్గా...కానీ మీరు రిజైన్ చేసే సరికి ఫీలయ్యాడు” తన బాగ్నుండి రెండు చెక్స్ తీసి చూపిస్తూ అన్నాడు రాజేంద్ర

“వియ్ కేరేడామ్ఫర్దట్ మనీ...నీకో పాతికా, నీ సియండీకో పాతికా టిప్గా పడేస్తున్నాం తీసుకో పో” అన్నాడు సుధాకర్

“మీరు ఎమోషనల్ అయి అలా మాట్లాడుతున్నారు కానీ మన ప్రైవేట్ అఫైర్స్కి కంపెనీ లీగల్ ఎయిడ్ ఇవ్వదు. ఆవిషయం మీకూ తెలుసు.”అన్నాడు రాజేంద్ర

“సరే...మీకు ఎలాగూ కన్సర్న్ లేదు. కనీసం మా అవసరం ఉన్నపుడుకూడా మా గురించిపట్టించుకోరా?” అడిగాడు సుధాకర్

"మీరలా మాట్లాడితే నేనేం చెప్పలేను...కానీ ఓ పని మొదలు పెట్టి పూర్తి చెయ్యకుండా వెళ్ళడంకూడా మంచి పద్ధతి కాదు....మీ మీద నమ్మకంతోనే కదా కనీసం బాండ్ కూడా తీసుకోలేదు" అన్నాడు రాజేంద్ర

"అది నమ్మకంతో కాదు...మమ్మల్ని ఇంకా ట్రైనీలుగా చూపించి పెర్క్స్ ఇవ్వకుండా ఎగదొబ్బడానికి ఎత్తు....సరే ఏదో మొరాలిటీ అంటున్నావుకాబట్టి వస్తాం...కానీ మెట్రో లాంచయిన తర్వాత క్షణం కూడా ఉండం" అన్నాడు రామ్

★ ★ ★

"నీకీ విషయం తెలుసా....రాజేంద్రగాడిని బయటకు తెచ్చింది సీయండీయే...తన ఇన్ఫ్లుయన్స్ వాడాడు...మన విషయంలో పట్టనట్టున్నాడు" అన్నాడు సుధాకర్

"అనుకున్నాను... సరే వీళ్ళతో మనకేముంది మన పని పూర్తిచేసుకుని వెళ్ళిపోదాం" అన్నాడు రామ్

"ఇంకో విషయం...అసలు వీళ్ళ అంచనా ఏమిటంటే అన్ని మాడ్యూల్స్ పూర్తయినయి కాబట్టి మన అవసరం లేదని...రాజేంద్రగాడు మెయింటనెన్స్ చూడగలడని..కానీ ప్రీతి చెప్పినట్టు చాలా ప్రాబ్లెమ్స్ వచ్చాయి... మెట్రో ట్రెయిన్ స్టేషన్కి వచ్చినపుడు మార్క్డ్ ప్లేస్లో కాకుండా అరకిలోమీటర్ బయట ఆగుతోంది. ఫ్లాట్ఫాం బయట కొన్ని కంపార్ట్మెంట్స్ ఉంటున్నాయి...ఇవన్నీ కాకుండా సింక్ కావల్సిన మైక్రో ప్రాబ్లెమ్స్ చాలా ఉన్నాయి..."

"అందుకే రాజేంద్రగాడు ఏడుపు మొహం పెట్టుకుని మనదగ్గరకు వచ్చాడు... మనం ఇంకా రాకపోతే నా మామ, సీయండీ హరిహరరావు కూడా వచ్చేవాడు...కానీ జానకి చూడు. ఒక్కమాటకూడా చెప్పకుండా పుట్టింటికి వెళ్ళిపోయింది...కనీసం ఇక్కడ ఏంజరుగుతుందో కూడా తనకి అవసరం లేదన్నమాట...ఫోన్ కూడా లేదు" అన్నాడు రామ్

"అప్సెట్ అవ్వకు...అన్నీ మంచిగానే జరుగుతాయి....నేను ఓ సారి బెంగుళూరు వెళ్ళి వస్తాను.కొంచెం పని ఉంది. ప్రాజెక్టు నువ్వుచూసుకో..నేను వచ్చిన తర్వాత పని మొదలెడతాను" అన్నాడు సుధాకర్

"ఎందుకు ఈ మధ్య తరచు బెంగుళూరు వెళ్తున్నావు?నువ్వెళ్ళి నా తరపున వాళ్ళని కన్విన్స్ చెయ్యడానికి ప్రయత్నించకు...తనంతట తను వస్తే రానీ..అంతే"

"అక్కడ మా రిలేటివ్ ఉన్నాడు...ఉడిపి అమ్మాయిని చేసుకుని అక్కడే సెటిల య్యాడు ...చాలా రోజుల్నించి రమ్మంటున్నాడు...సరే....అలాగే....చిల్......ఈ

రాజేంద్ర గాడు చూడు మళ్ళా ఫేస్‌బుక్ చూస్తున్నట్టున్నాడు ....ఒకసారి చూసే మనల్ని స్టేషన్‌కి పంపించాడు..ఈ సారి ఎక్కడికి పంపుతాడో" నవ్వుతూ అన్నాడు సుధాకర్

★ ★ ★

వాళ్ళు అనుకుంటున్నట్టుగా రాజేంద్ర ఫేస్‌బుక్ చూసి సరదాపడటంలేదు. భయపడుతున్నాడు.

దివ్య హత్యకేసునుండి అతడు పూర్తిగా బయటపడ్డట్టుకాదు. ఆ అమ్మాయికి వెళ్ళిన ఆఖరికాల్ తనదే. దానివల్ల తాను దూరంగా ఉన్నాననీ అందుకే ఫోన్ చేశాననీ పోలీసులు నమ్మవచ్చు.వాళ్ళకి తిక్క తిరిగిందంటే ఫోన్‌లో ఏదో ఘర్షణ జరిగిందనీ అందుకే తాను వేటకత్తి పుచ్చుకుని దివ్యను నరికేశాననీ అనవచ్చు. ఆనక ఆ కత్తి ఏదిరా కత్తికాంతారావూ? అని బడితపూజ చేసినా చెయ్యవచ్చు.

అతడికి గతం గుర్తుకువచ్చింది...అమ్మో..జరిగిందంతా పోలీసులకి తెలిస్తే..? అతడు గతంలోకి జారిపోయాడు

★ ★ ★

ఫేస్‌బుక్‌లో అన్నీ రొటీన్ మొహాలు, రొటీన్ మెసేజ్‌లు. మా పిల్లి పిల్లల్ని పెట్టిందని ఒక వెధవ రాసి ఫోటోలుకూడా పెట్టాడు. ఇంకోడు సిమ్లా వెళ్ళాడట ఇకిలిస్తూ వాడిఫోటోలు, వాడి పెళ్ళాంపిల్లల ఫోటోలు. నేను కొత్త హార్లెడేవిడ్సన్ బైక్‌కొన్నా పదిలక్షలకి ఇట్స్‌హాట్ అని ఇంకోడు. ఎవడిగొప్పలు వాడివి. పల్లెటూర్లో అమ్మలక్కలు చెప్పకునే ఇచ్చకాల కబుర్లకి హైటెక్ రూపమే ఈ ఫేస్‌బుక్ అనుకున్నాడు రాజేంద్ర

ఒన్ ఫ్రండ్‌షిప్ రిక్వస్ట్ పెండింగ్ అని కనబడింది తన హెూమ్‌పేజీ తియ్యగానే. మళ్ళా ఏ మటన్‌కత్తి మస్తాన్ గాడో అనుకుంటూనే ఆ నోటిఫికేషన్ పై క్లిక్ చేశాడు.

దివ్య వాంటెడ్ టుబియువర్ ఫ్రండ్...క్లిక్ హియర్‌టు యాక్సెప్ట్, టుసీ దివ్యాస్ ప్రొఫైల్ క్లిక్ హియర్ అని ఉంది.

ముందు ఆమెను ఫ్రండ్ గా యాక్సెప్ట్ చేసి ఆ తరువాత ఆమె ప్రొఫైల్ పేజీకి వెళ్ళాడు. స్లిమ్‌గా, చలాకీగా కనిపించింది ఆమె ఫొటో. అందులో ఆమె పర్సనల్ డిటైల్స్ చదివాడు.

"నేను మా అమ్మానాన్నలకి ఒకత్తే అమ్మాయిని...పాపా అమెరికాలో ఉంటారు..యునో హి ఈజె డాక్టర్. టూ బిజీ విత్ హిజ్ ప్రొఫెషన్..నేను నా ఓన్ బిపిఓ పెట్టాలన్నది నా యాంబిషన్" అని ఉంది.

హాబీస్‌లో అన్నీ మామూలువే ఉన్నాయి, సినిమాలు, అవుటింగ్, పబ్స్ కి వెళ్ళడం.

ఇంతలో ఆమె ఆన్‌లైన్ కి వచ్చింది "హాయ్ ...హాండ్సమ్.."అని పాపప్ అయింది.

అమ్మో పిల్ల ఫాస్టే అనుకుని "హాయ్ క్యూటీ" అని రిప్లయి ఇచ్చాడు.

"నన్ను ఫ్రెండ్‌గా యాక్సెప్ట్ చేసినందుకు థాంక్స్" ఇంగ్లీషు అక్షరాల్లో తెలుగు, ఇంగ్లీషు కలిపి టైప్ చేసింది దివ్య.

"ఇట్స్ మై ప్లెజర్" రాశాడు రాజేంద్ర

"మీరు ఏం చేస్తుంటారు?"

"ప్రస్తుతం మీతో చాటింగ్ చేస్తున్నాను"

"మీరు చాలా నాటీ...నన్ను నువ్వు అంటే చాలు..."

"సరే దివ్యా...నిన్ను అలాగే పిలుస్తాలే"

"వావ్...దట్స్ గ్రేట్....చెప్పండి..చాటింగ్ కి ముందు ఏంచేస్తున్నారు?"

"రేపు బెంగుళూరు వెళ్ళడానికి ఇండియన్‌లో ఫస్ట్‌క్లాస్ టికెట్ తెమ్మని నా సెక్రటరీ కి చెబుతున్నాను"

నిజానికి అతడికి సెక్రటరీయే లేడు. ఫస్ట్‌క్లాస్ అతను చూడటమే జరిగింది. ఎక్కే అవకాశాలు కనుచూపుమేరలో లేవు.

"ఏం మీరు ఎకానమీ ఎయిర్ లైన్స్‌లో వెళ్ళరా? మైగాడ్..ఫోర్‌టైమ్స్ ఎక్కువ అవుతుంది"

"కంపెనీ భరిస్తుంది..అయినా జెటెక్ మా మామయ్యది...నేను ఎకానమీలో వెళ్తానంటే ఆయన ఒప్పుకోడు"

"ఓ....చిల్...ఆయన కూతురు బాధ పడుతుందని కాబోలు"

"నో...నో...ఆయనకి పిల్లలు లేరు..నేనే అన్నీ"

"క్యూట్..."

"సరే దివ్యా...నువ్వేం చేస్తున్నావ్?"

"నేను ఓ బీపీవోలో ఎగ్జిక్యూటివ్..నేను నా ఓన్ కంపెనీ పెడదామని అడిగితే పప్పా చెప్పారు ముందునువ్వు పనిచేసి ఎక్స్‌పీరియన్స్ గెయిన్ చెయ్యి...అపుడు ఫైనాన్స్ చేస్తానని...అందుకే"

"యు ఆర్ సో యంగ్"

"థాంక్స్...యు ఆర్ యంగ్ అండ్ చార్మింగ్"

అలా ఆరోజు వాళ్ళిద్దరి పరిచయం మొదలైంది. ఆ తర్వాత అది కంప్యూటర్ వైరస్ పెరిగినంతగా పెరిగింది.

ఒకరిఫోన్ నంబర్ ఒకరు అడిగి తీసుకున్నారు. ఇక ఫోన్లలో గంటలకొద్దీ మాట్లాడుకోవడం కూడా అయింది.

“యు ఆర్ సో నాటీ...నేను మీతో చాటింగ్ చాలా ఎంజాయ్ చేశాను...మిమ్మల్ని ఓ సారి చూడాలని ఉంది ” అన్న మెసేజ్ రామ్, సుధాకర్‌లకు చూపించిన రోజు “మిమ్మల్నోసారి చూడాలని ఉంది ఎక్కడ కలుద్దాం” అంది ఆమె

అందుకే అంతధైర్యంగా వాళ్ళతో బెట్ కట్టాడు ఆమెతో ఆమె ఇంట్లోనే డిన్నర్‌కి కూర్చోపెడతానని.

ఆ రోజు ఆమెను కలిశాడు కూడా. తనకు తెలిసిన ఓ ఫ్రెండ్‌ని బతిమిలాడి ఆడి కారు అరువు తీసుకువెళ్ళి మరీ కలిశాడు. ఖరీదయిన పెర్ఫ్యూం ఆమెకి గిఫ్ట్‌గా తీసుకెళ్ళాడు. గ్రాండ్ కాకతీయలో ఉన్న పబ్‌లో కలిశారు ఇద్దరూ.

ఫోటోలోకంటే ఆమె నిజంగానే చాలా అందంగా, సెక్సీగా ఉందనిపించింది. ఇద్దరూ కలిసి డాన్స్‌చేసినపుడు కావాలని ఆమెను దగ్గరికి తీసుకున్నాడు. ఆమెకూడా అభ్యంతరం చెప్పలేదు. పబ్‌తాలూకు చీకటి, ఇద్దరూ కలిసి తీసుకున్న టకీలా షాట్స్ వాళ్ళకిఉన్న ఇన్‌హిబిషన్స్‌ని దూరం చేసి దగ్గరచేశాయి.

“షల్ వియ్ గో టు మై అపార్ట్‌మెంట్?” అంది ఆమె అతడిచెవిలో

“యా....”అన్నాడు

ఇద్దరూ లకిడాకాపూల్‌లో ఉన్న ఆమె అపార్ట్‌మెంట్‌కి వెళ్ళారు. అతడు తన లవ్‌లైఫ్‌లో ఎన్నడూ చూడని ఎక్సైట్‌మెంట్ ఆమె ఆ రాత్రి చూపించింది.

★ ★ ★

ఆమె లైఫ్‌స్టైల్, వాడేవస్తువులు చాలా ఖరీదయినవి. అంత ఎక్సపెండిచర్ చూసి అతడు హడలిపోయేవాడు. తన ప్రస్తుత భార్యను వదిలించుకునైనా సరే ఎలాగైనా ఆమెను పెళ్ళాడితే ఆ అమెరికా మామగారు సంపాదించిన లత్త తనకే దక్కుతుంది కదా అని కలలుకూడా కన్నాడు ఐమాక్స్ త్రీడీ రేంజిలో.

ఓ రోజు ఫోన్ వచ్చింది ఆమె దగ్గరనుండి “ ఎ స్మాల్ హెల్ప్ డియర్...పప్పాహాజ్ సెంట్ ఎ చెక్ ఫర్ టుతవుజెండ్ డాలర్స్ అండ్ యునో ఇటీజ్ హెల్డప్ ఇన్ ద బాంక్ ఫరే టెక్నికల్ రీజన్...ఇట్ విల్ బీ క్లియర్డ్ ఇన్ ఎ డే ఆర్ టూ...ఐ జస్ట్‌నీడ్ ఎ లాక్ ఆఫ్ రుపీస్ ఫర్ టూ డేస్, షల్ ఐ గివ్ యూ ఎ చెక్?” అంది దివ్య

అంటూనే " అఫ్‌కోర్స్...అది నీకు చిన్న ఎమవుంట్ అని నాకు తెలుసు" అంటూ దీర్ఘాలు తీసింది.

ఆడి కారు అరువుతీసుకున్నంత తేలిక కాదు లక్షరూపాయలు పుట్టించడం. బాంక్‌లో ఉన్న సేవింగ్స్‌నుంచి తీసి ఇచ్చాడు, సర్లే రెండురోజులకే కదా అని

రెండురోజులు, వారం అయ్యాయి. వారం రోజులు నెలరోజులయ్యాయి. తన దగ్గరనుండి ఆ డబ్బుమాటేలేదు. చిన్న ఎమవుంట్ ఆమెకు తన దృష్టిలో కాబట్టి ఆ ఇమేజ్ పోగొట్టుకోకూడదని అడగలేక ఆగిపోయాడు.

తరువాత ఓసారి తనే ఆడబ్బుమాట ఎత్తింది.

"సారీ డియర్...నీ ఎమవుంట్ సంగతి ...జస్ట్ ఇట్ స్కిప్ప్‌డ్ అవుటాఫ్ మై మైండ్...డాడ్‌నుండి మనీ ట్రాన్స్‌ఫర్ అయింది. కాకపోతే నా బెంగుళూరు ఎకవుంట్‌కి. ఫారిన్ ట్రాన్సాక్షన్ కదా... నేనే అక్కడికి వెళ్ళి తీసుకోవాలి. ఐ విల్ గెటిట్.." అంది

రాజేంద్ర సరిగ్గా ఆమె పన్నిన ఉచ్చులో చిక్కుకున్నాడు.

"ఓ.....యా....నేనుకూడా మర్చిపోయాను సుమా...చిన్న ఎమవుంట్ కదా" అన్నాడు స్టయిల్‌గా.

"నాకు తెలుసు డాళింగ్..ఓ చిన్న ఫేవర్...నేను బెంగుళూరు వెళ్ళివచ్చేలోగా ఇక్కడ కొన్ని చిన్న చిన్న ఎక్స్‌పెండిచర్ ఉంది... జస్ట్ ఒన్ లాక్....ఒక లక్ష ఈ రోజు ఇస్తే మళ్ళీ బెంగుళూరు నుండి రాగానే ఇచ్చేస్తాను" అంది.

చచ్చింది గొర్రె.....చిన్న మొత్తం...చిన్నమొత్తం అన్నందుకు అతడికి చితికిపోయింది. ఇప్పుడది పెద్దమొత్తం అనలేడు...ఏదైనా సాకు చెబితే...ఇంతేనా వీడు అనుకుంటుందనే భయం. పైగా అంతకు ముందు ఇచ్చిన సొమ్ము కూడా కలిపి వస్తుందని ఆశ...మామూలు ఆశ కాదు దింపుడు కళ్ళం ఆశ.

శ్మశానానికి శవాన్ని తీసుకెళ్ళేటపుడు శ్మశానానికి ముందు ఒకసారి దింపుతారు. చచ్చినవాడు ఒకవేళ పొరపాట్న ఏమన్నా ప్రాణం మిగిలి ఉంటే లేస్తాడు అని. దాన్నే దింపుడు కళ్ళం ఆశ అంటారు. పోయిందాన్ని కూడా పసిగట్టని గట్టి ఆశ.

తెలిసినవాళ్ళ దగ్గర యాభై, పది, ఇరవై పోగుచేసి లక్షాపూడ్చి ఆమెకు ఇచ్చాడు.

ఆమె బెంగుళూరు వెళ్ళిందీ లేదు....ఇతడి డబ్బు వచ్చిందీ లేదు.

ఆమె ఇచ్చిన సుఖం కరిగిపోయింది. ఇచ్చిన అప్పు మిగిలిపోయింది.

చాటింగ్, డేటింగ్, అవుటింగ్ మిగిలాయి. ఎప్పుడూ పొరపాటునకూడా

చాటింగ్‌లో కానీ ఫోన్‌లో కానీ ఆ ప్రస్తావన తేదు. అయినా ఇదివరకు అంత తరచుగా చాటింగ్ లేదు. ఫోన్‌లో కూడా దొరికేది అంతంతమాత్రమే

దింపుడు కళ్ళం ఆశ కూడా ముగిసింది. అతగాడిది ఎవరికీ చెప్పుకోలేని బాధ. ఆమెతో డిన్నర్‌కి వెళ్ళిబెట్ గెలిచినపుడు రామ్, సుధాకర్ ఇచ్చిన ఇరవైవేలు పోను చాలా అమవుంట్ పోయింది, ఖర్చులు, గిఫ్ట్‌లు రూపంలో

అమ్మో...అసలు ఆ డబ్బులు పెడితే కనీసం ఇరవైమంది ఉక్రెయిన్ అమ్మాయిలు వచ్చేవాళ్ళు. ప్రయత్నిస్తే ఓ సినిమా హీరోయిన్‌తో అనుభవం అయినా దక్కేది. ఏంటిలా అయిపోయింది? అనుకున్నాడు రాజేంద్ర నారాయణ.

తన మెయిల్ అడ్రస్‌తో లింకవడం వల్ల వాళ్ళిద్దర్నీ కూడా ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్స్‌గా చేర్చుకుని ముంచేస్తుందేమో అన్న అనుమానం వచ్చినా, సరే కానీ తనకు జరిగింది వాళ్ళకికూడా జరిగితే చూడాలనే శాడిస్టిక్ ఆలోచనతో ఊరుకున్నాడు వాళ్ళని హెచ్చరించకుండా.

ఇక తట్టుకునే పరిస్థితి లేదు...ఎలాగైనా ఆమెనుండి ఆ రెండు లక్షల అమవుంట్ వసూలు చేయాలని నిర్ణయించాడు. ఫోన్లో చేస్తే..“నేను వర్క్‌లో ఉన్నాను...వచ్చేసరికి కొంచెం లేట్ అవుతుంది...రాగానే ఫోన్ చేస్తాను...బట్ ఈ రోజు తప్పక కలుద్దాం” అంది.

ఆమెఫ్లాట్‌కి వెళ్ళాడు.

ఆమె ఫ్లాట్ లోపల్నించి లాక్ చేసిఉంది. తనెప్పుడూ డోర్‌బోల్ట్ వాడదు. రెండువైపుల్నించి పడే గోద్రెజ్ వాళ్ళది ఆటోలాక్ ఉంది అదే వాడుతుంది.

వెళ్ళిపోదామా అనుకున్నాడు. సరే తనెలాగూ వస్తానందిగా లోపల వెయిట్ చేద్దాం అనుకున్నాడు. అతడివద్ద ఓ స్పేర్ కీ ఉంది. తలుపు తీసి లోపలికి వెళ్ళాడు. అతడికి అలికిడి వినిపించింది. సోఫా రూమ్ దాటి వెళ్ళిన అతడికి వెయ్యి ఓల్టుల షాక్ కొట్టింది.

# 14

“మీరిద్దరూ మనప్రాజెక్టు పనిలో ఉండండి. ఇది చాలా ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్. ఉన్న చిన్నచిన్న బాటిల్‌నెక్స్ క్లియర్ చేయండి...రేపు వేరే ఎక్కడ మెట్రో వచ్చినా మన సాఫ్ట్‌వేర్ అడిగేలా ఉండాలి...సో అన్నీ మరచిపోయి మీరు పనిలో ఉండండి... నేను, సోఫీ దివ్య దెయ్యం గొడవ చూసుకుంటాము...ఆ హత్య కేసులోంచి మిమ్మల్ని బయట పడేస్తాము” అంది ప్రీతి

ఇక్కడ జరిగిన గొడవ ఊరి వరకూ పాకింది. ప్రహ్లాదశాస్త్రి, తులశమ్మ ఫోన్‌లో మాట్లాడారు. తామిద్దరూ వెంటనే బయలుదేరి వస్తామన్నారు. సుధాకర్ పేరెంట్స్ కూడా బయలు దేరబోయారు. అయితే అంత సమస్యేమీ లేదని, తాము ప్రాజెక్టులో బిజీగా ఉన్నామని, కొద్ది రోజుల్లో బయలుదేరి తామే ఇంటికి వస్తామని సర్ది చెప్పడంతో ఆగిపోయారు.

సుధాకర్ చెల్లెలు సోఫీ మాత్రం విశాఖపట్నం నుండి బయలుదేరి వచ్చేసింది. ఆపిల్ల అక్కడ స్వంతంగా ఓ చిన్న వెబ్‌హోస్టింగ్ కంపెనీ పెట్టుకుంది. విశాఖలో తమ బంధువులు ఉండటం, కొవ్వూరు వచ్చిపోవడానికి వీలుగా ఉండటంతో అక్కడ సెటిలయ్యింది.

సుధాకర్ ఫ్లాట్‌లో రామ్ ఉండటంతో తనను ప్రీతి దగ్గర ఉంచారు.

"అయితే నేను మర్డర్ చేసినా కూడా బయటపడేస్తానంటావు" అడిగాడు రామ్

"అద్దంలో ఎపుడన్నా మొహం చూసుకున్నావా? ఖూనీ చెయ్యగల ఫేసానీది?" అంది ప్రీతి

ఈ గొడవ పుణ్యమా అని వాళ్ళు అండీ,మీరు నుండి ఏకవచన సంబోధనకు వచ్చారు.

"వెనకటికి ఓ దొంగ... బాంక్ దొంగతనం కేసులో ఇతడు నిర్దోషి అని రుజువైనందున వదిలేస్తున్నాం అనగానే...అయితే బాబయ్యా ఆ ఇరవై లక్షలూ నేను వాడుకోవచ్చంటారు అని జడ్జినే అడిగాడట...అలా ఉంది రామన్నయ్యా నువ్వు అడిగింది... అయినా మా అన్నయ్యలు మంచివాళ్ళు...మర్డర్లు చెయ్యరు" అంది సోఫీ

"నేరం చేసేవరకూ అందరూ మంచివాళ్ళే...కొందరు క్షణికావేశంలో చేసి నేరస్థులవుతారు...కానీ కొందరికి నేరం ఒక ఎంజాయ్‌మెంట్...ఒక థ్రిల్" అన్నాడు సుధాకర్

"మీరింకా మంచివాళ్ళనే నమ్మకంతోనే మీకు సాయం చేస్తున్నాం...ఒకవేళ కాదని తెలిస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుంది" అంది ప్రీతి డ్రమెటిక్‌గా

"ఎందుకు నమ్ముతున్నావో నాకయితే అర్థం కావటంలేదు. నేను నీతో పాటు డ్రామాకివచ్చి కేవలం అరగంటపాటు దివ్యదగ్గరికి వెళ్ళి వచ్చాను...ఆ సమయం సరిపోతుంది ఎవరినైనా చంపడానికి" అన్నాడు రామ్.

"నువ్వు చెప్పింది కరక్టే కానీ...ఒకవేళ అలా అయితే నీ బట్టలనిండా రక్తపుమరకలు ఉండాలి. ఎందుకంటే ఆమెను హంతకుడు నరికి చంపాడు, చాలా రక్తం చిందింది,

ఆ మరకలు లేవు....నువ్వు ఏ బట్టల్లో వెళ్ళావో అవే బట్టల్లో వచ్చావు..కనీసం బట్టలు మారినా అనుమానం వచ్చేది" అంది ప్రీతి

"ఓహ్....ఈ మాత్రానికేనా...ఆ హత్య పథకం ప్రకారం జరిగింది. నేను సుధాకర్‌తో కారులో వెళ్తున్నపుడు వేరే బట్టలు వేసుకుని, హత్యచేసి రక్తం చిందిన ఆ బట్టలు, ఇంకా కత్తి మళ్ళా కారులోనే వదిలేసి ఇంతకుముందు నువ్వు చూసిన బట్టలు వేసుకుని ఏమీ తెలీనట్టు కూల్‌గా వచ్చి డ్రామా చూడవచ్చు కదా?" అన్నాడు రామ్

"అవును... తరువాత సుధాకర్ ఆ బట్టలు, హత్యాయుధం హుస్సేన్‌సాగర్‌లో పడేసి ఇంటికెళ్ళిపోయుంటాడు..అంతే కదా? కానీ రామ్ నువ్వు తిరిగివచ్చాక ఒక విషయం చెప్పావు గుర్తుందా...అది విన్న తర్వాత ఆల్‌రైట్...అని నిన్ను టాప్ చేశాను అప్పుడు నీ బాడీ టెంపరేచర్ నార్మల్‌గా ఉంది...హత్య చేసిన అరగంటలో అలా నార్మల్‌గా ఉండలేరు" అంది ప్రీతి

"పోనీ సుధాకర్ హత్య చేసి ఉండొచ్చుకదా?" అన్నాడు రామ్

"తనకి అంత దృశ్యం ఉందంటావా? తను మరీ సాధుజంతువు"

"సరే..నీ నమ్మకం నీది...ఎంతచెప్పినా వినకపోతే ఏం చెయ్యాలి" నవ్వుతూ అన్నాడు రామ్

"వెళ్ళి రంగరాజు యస్పైకి చెప్పు...తప్పక నమ్ముతాడు..సన్మానం చేస్తాడు" అని నవ్వింది ప్రీతి

"సరేకాని మేము మా షెర్లాక్ హోమ్స్ పని మీద బయటకు వెళ్ళాలి..మీరు సీరి యస్‌గా పని చేసుకోండి" అంది సోఫీ

"జాగ్రత్త...అనవసరమైన రిస్కు తీసుకోవద్దు...ఏమైనా ఉంటే యస్పై రంగరాజుకి చెప్పొచ్చు కదా" అన్నాడు రామ్

"సరే వాళ్ళకి ఇదొక్కటే కేసా ఏమిటి? మన గొడవ మనం కూడా చూసుకోవాలి" అంది ప్రీతి

★ ★ ★

తన మాక్‌బుక్ ప్రో లాప్‌టాప్ ఓపెన్ చేసింది ప్రీతి. అందులో మైండ్‌నోట్ అనే ప్రోగ్రాం ఓపెన్ చేసింది.

ఆమె ముందు దివ్య తాలూకు కాల్ డిటైల్స్ ఉన్నాయి. ముందు దివ్య ఫోన్ నంబర్‌ని పేజీ మధ్యలో పెట్టింది. దాన్నుంచి ఇన్ కమింగ్ నంబర్లన్నీ పైకి లింక్ చేసింది. ఇప్పుడు దివ్య నంబర్ చెట్టు మొదలులా ఉంటే చెట్టు ఆకుల్లా ఆమెకు వచ్చిన

నంబర్లు ఉన్నాయి. కిందికి చెట్టు వేరుల్లా అవుట్ గోయింగ్ నంబర్లు ఫీడ్ చేసింది. ఆ తర్వాత ఫ్రీక్వెన్సీని ఆఫ్ కాల్స్‌ని బట్టి వేరే షీట్‌లో ఒకటి,రెండు,మూడు అని ఎక్కువ కాల్స్ చేసిన కాలర్‌ని బట్టి ఒక ఆర్డర్ వేసుకుంది. అలాగే ఎక్కువ అవుట్‌గోయింగ్ కాల్స్ వెళ్ళిన నంబర్లని కూడా పట్టిక వేసింది.

దాని తర్వాత నెలలనిబట్టి ఏ పిరియడ్‌లో ఏ నెంబర్లు ఎక్కువగా ఇన్ కమింగ్ , అవుట్‌గోయింగ్‌లో ఉన్నాయో చూసింది.

కొన్ని నంబర్లు కొంతకాలం పాటు చాలాసార్లు ఆమెతో టచ్‌లో ఉండి తర్వాత అకస్మాత్తుగా ఆగిపోవటం గమనించింది ప్రీతి.

"ఈ నంబర్లు యూజ్ చేసినవాళ్ళ డిటెయిల్స్ కావాలి సోఫీ"

"ఓకే...కొంచెం టైం ఇవ్వు...ఇవి మూడు రకాల మొబైల్ సర్వీస్ ప్రొవైడర్స్... ముగ్గురి డాటాబేస్‌లు హాక్ చెయ్యాలి...బట్ ఐ విల్ గెటిట్"

"జాగ్రత్త మన ఇంటర్నెట్ ప్రోటోకాల్ అడ్రస్ ట్రేస్ కాకుండా చూడు"

"ఓ...యా...డోంట్ వర్రీ ఎబవుట్ ఇట్" అంది సోఫీ

అన్నట్టుగానే డాటాబేస్‌లనుండి వాళ్ళు సిమ్ కార్డు తీసుకునే సమయంలో ఇచ్చిన డిటెయిల్స్, ఫోటో, ఇంకా అడ్రస్‌ప్రూఫ్‌లు డౌన్‌లోడ్ చేసి ఓ ఫోల్డర్‌లో పెట్టింది. తర్వాత అవి ప్రింటవుట్ తీసింది.

అవన్నీ పరిశీలనగా చూస్తూ..."మైగాడ్...ప్రీతీ...ఇలా చూడు" అంది

"ఓహ్ గాడ్...." అంది ప్రీతి ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవిచేస్తూ

★ ★ ★

"నేను దివ్యగురించి మాట్లాడతానని ఎందుకు అనుకున్నారు? మీరు ఆడవాళ్ళు కాబట్టి మర్యాదగా చెబుతున్నా...దాని గురించి నాదగ్గర ఎత్తవద్దు...చెత్తముం..." అన్నాడు కృష్ణారెడ్డి

అతనో బిల్డర్. దివ్య ఉంటున్న ప్రాపర్టీ డవలప్ చేసింది అతడే.

"ఆమె చనిపోయింది తెలుసా? ఎవరో దారుణంగా హత్య చేశారు" అంది ప్రీతి

"అలాగా...నేను ఈ మధ్య ఇక్కడ లేను....హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ డల్‌గా ఉండటంతో బెంగుళూరులో వెంచర్స్ చేస్తున్నాను...దానికోసం నెలరోజులుగా అక్కడే ఉన్నాను..నిన్ననే ఇక్కడికొచ్చా...అందువల్ల పేపర్ చదివే అవకాశం కూడా లేదు... అయినా అలాంటి దాన్ని ఎవడోఒకడు చంపుతాడు....అది అలాంటి చావే చస్తుందని

అనుకున్నాను" అన్నాడు కృష్ణారెడ్డి

అతడి మొహం చూస్తే అబద్ధం చెబుతున్నట్టు అనిపించలేదు. కానీ చావును అతడు అంత లైట్‌గా తీసుకోవడమే చిత్రంగా అనిపించింది.

"సరే..తన కాల్ లిస్ట్‌లో మీ నంబర్‌కూడా ఉంది... అందువల్ల రేపు పోలీసులు మిమ్మల్ని తప్పక అడుగుతారు ...అప్పుడైనా మీరు ఆమెగురించి మీకు తెలిసింది చెప్పవలసి ఉంటుంది. అదేదో ఇప్పుడే చెబితే ఆమెను ఎవరు హత్య చేశారో తెలుసుకోవడానికి వీలు ఉంటుంది. అందువల్ల మీకు నష్టమేమీ ఉండదు" అంది సోఫీ.

"ఆమె హత్య మిస్టరీ సాల్వ్ చెయ్యాల్సిన అవసరం మీకేమిటి? అది పోలీసుల పని కదా?" అన్నాడు కృష్ణారెడ్డి

"నిజమే కానీ వాళ్ళు ఎక్కువ శ్రమ పడకుండా ఎవడుదొరుకుతారా అని చూస్తారు... అందులో మనలాంటి హైప్రొఫైల్ మనుషులు దొరికారంటే ఎంత ఇబ్బంది పెట్టాలో అంత ఇబ్బందీ పెడతారు, ఇక ప్రెస్ ఉండనే ఉంది. సెన్సేషన్ కోసం ఫలానా అమ్మాయి హత్యలో పేరుమోసిన రియల్టర్ హస్తం అని ప్రశ్న గుర్తుతో ప్రాణం తీస్తారు. తర్వాత హంతకుడు దొరికినా ఈలోగా అసలు హంతకులు మీరో, మేమో కానీ మనల్ని తప్పించడానికి పోలీసులు ఏ అనామత్తుగాడినో ఇరికించారన్న అభిప్రాయం తెస్తారు....అందుకే మేం దేవులాడేది" అంది ప్రీతి సరిగ్గా గురి చూసి బాణాన్ని వదులుతూ

అది ఎక్కడ తగలాలో అక్కడ తగిలింది. నిజమే త్వరగా అసలు హంతకుడు దొరక్కపోతే అది అందరిపీకమీదా కత్తే. బిజినెస్ రైవల్స్‌కూడా ఇలాంటివి వాడి కనీసం బద్నామ్ అయితే చెయ్యవచ్చు. పైగా అసలు దివ్యతో తనకు సంబంధం పూర్తిగా లేదని కూడా చెప్పలేని పరిస్థితి. ఏది ఎటునుంచి వచ్చి ఎలా చుట్టుకుంటుందో తెలీదు. వీళ్ళకి చెప్పడం వల్ల పెద్దగా నష్టంలేదు. తన నంబర్ కాల్‌లిస్టులో ఉంది కాబట్టి కేసు పెండింగ్ ఉన్నంత వరకూ తనకి నష్టమే అనుకున్న కృష్ణారెడ్డి తన కథ చెప్పడానికి సిద్ధపడ్డాడు.

"నాకు తెలిసున్నంత వరకూ చెబుతాను....అది మీకెంత వరకూ ఉపయోగపడుతుందో తెలీదు...దివ్య నాకు బయ్యర్‌గా పరిచయం. నేను కట్టిన ఫ్లాట్ కొనడానికి వచ్చింది. అంత చిన్న అమ్మాయి స్వంతంగా ఫ్లాట్ కొనడం నాకు ఆశ్చర్యం" అంటూ మొదలుపెట్టాడు కృష్ణారెడ్డి

★ ★ ★

"నాకు బాత్‌రూమ్‌లో కాన్సెప్టు టైల్స్ కావాలి" అంది దివ్య

అప్పటికే అరవై లక్షల విలువచేసే ఆ అపార్ట్‌మెంట్‌లో నలభై లక్షలు కట్టింది ఆమె. ఇంకా ఫ్లోరింగ్,పెయింటింగ్ పూర్తయిపోతే మిగిలిన ఎమవుంట్ కట్టి గృహ ప్రవేశం చెయ్యడమే తరువాయి.

"అవి ఎక్స్‌ట్రా అవుతాయి మేడమ్...మేం ఇచ్చేది మామూలు నలభైరూపాయల వెరైటీ...అయినా ఇవి బావుంటాయే" అన్నాడు కృష్ణారెడ్డి

"ఒకసారి చూద్దాం రండి" అంది ఆమె

సాధారణంగా అతడు సైట్‌పై ఉండడు. ఎప్పుడైనా వచ్చి వర్క్ ఎంతవరకూ పూర్తయిందో చూసివెళ్తాడు. ఆరోజు ఎకవుంట్స్ చూసుకుంటూ సాయంత్రం వరకూ ఉండిపోయాడు. అసిస్టెంట్స్ అందరూ టైల్స్ గోడౌన్‌కీ ఇంకా మిగతా పనులకీ వెళ్ళిపోయారు.

అప్పటికే వర్కర్స్ పనినుండి దిగిపోయి వెళ్ళిపోయారు.

"సరే పదండి" అని ఆమెవెంట నడిచాడు. మెట్లు ఎక్కి ఆమె ఫ్లాట్ ఉన్న ఫ్లోర్‌కి వెళ్ళారు. డోర్‌తీసి లోపలికి నడిచారు. ఫ్లోరింగ్ పూర్తయింది. పెయింటింగ్ కూడా ఇంకో కోట్ పడితే అయిపోయినట్టే. బాత్‌రూం వర్క్ పెండింగ్ ఉంది. అదికూడా వాల్స్, ఇంకా బాత్‌రూం టైల్స్ వెయ్యడమే.

వర్కర్స్ వెళ్తూ పవర్ కనక్షన్ తీసేసినట్టున్నారు. లోపల కొంచెం చీకటిగా ఉంది. బాత్‌రూంలో అయితే చిమ్మచీకటిగా ఉంది. పనివాళ్ళ సామాను, టైల్స్ ఉండటంతో ఇరుగ్గా ఉంది.

లోపల చీకటిగా ఉండటంతో సెల్‌ఫోన్ వెలుగులో అయినంత మేర టైల్స్‌ని చూపించాడు అతడు.

"చూడండి మంచికలర్....గుడ్ క్వాలిటీ" అన్నాడు

"కానీ చాలా ప్లెయిన్‌గా ఉన్నాయి...నాకు కాన్సెప్టు అయితేనే బావుంటుంది. మళ్ళీ మళ్లీ కట్టుకోం కదా" అంది

ఇంతలో అతడి సెల్ లైటింగ్ పోవటం, ఆమె కాలికి ఏదో తగిలి అతడిపై బలంగా పడటం ఒకేసారి జరిగాయి. ఆమె చెయ్యి చరచరా అతడిపై పాకింది. ఆమె అవసరమైన దానికన్నా ఎక్కువగా అతడ్ని హత్తుకుంది. పంతొమ్మిదేళ్ళ ఆమె స్పర్శకి అతడి మిడిల్‌ఏజ్ శరీరం కరెంటు తీగను తాకినట్టు జివ్వుమని వణికింది.

"సారీ" అంది ఆమె కొంచెం దూరం జరిగి.

"ఫర్వాలేదు" అన్నాడు అతికష్టం మీద

కృష్ణారెడ్డి మళ్ళా సెల్‌స్క్రీన్ ఏక్టివేట్ చేశాడు. ఆమె కొంటెగా నవ్వుతోంది.

ఇద్దరూ కిందికి దిగారు.

"నాకు తెలిసిన షోరూమ్ బేగంపేటలో ఉంది. నేను చెబుతాను. మీరు కావల్సిన కాన్సెప్ట్ ఎంచుకుంటే డిస్కౌంట్ ఇస్తాడు" అన్నాడు కృష్ణారెడ్డి

"ఏం మీరు నన్ను మీతో తీసుకెళ్ళచ్చు కదా ఇప్పుడు...నేను పనిచేసేది మల్టీనేషనల్ కంపెనీ... సెలవు దొరకదు...ఇప్పుడు సెలక్షన్ అయిపోతే ఇంకో వారం పదిరోజుల్లో నేను ఫ్లాట్‌లోకి వచ్చెయ్యచ్చు కదా" అంది దివ్య

ఇందాకటి స్పర్శ తాలూకు మత్తు ఇంకా దిగకపోవడంతో "సరే పదండి" అన్నాడు

అతడు కారు డ్రైవ్‌చేస్తుంటే సరదాగా మాట్లాడుతోంది దివ్య. టైల్స్ సెలక్ట్ చేసింది. అడుగు రెండువందలరూపాయల కాస్ట్‌లీ కాన్సెప్ట్ అది.

"నాకు ఎమవుంట్ ఎడ్జస్ట్ కావడానికి కొంచెం టైం పడుతుంది.యాక్చువల్‌గా ఎమవుంట్ తీసుకుని విక్రమ్‌ని రమ్మన్నాను..అతను ఎందుకో రాలేదు.. మీ అకవుంట్‌లో క్రెడిట్ చేయించండి...మీ ఫైనల్ పేమెంట్‌తో కలిసి ఇచ్చేస్తాను" అంది దివ్య

"విక్రమ్ అంటే మీతోపాటు వస్తూంటాడు అతనా? మీ ఫ్రెండా?" అడిగాడు.

"నోనో...హీ ఈజ్ జస్ట్ మై కొలీగ్...కొంచెం సాయంగా ఉంటాడు అంతే..ప్లీజ్ డూదిస్" అంది

ఇందాకటి మత్తు ఇంకా కంటిన్యూ అవుతుండటంతో " అలాగే" అన్నాడు. బిల్ అతడి కంపెనీ పేరుమీద జనరేట్ అయింది.

"చాలా థాంక్స్...పదండి మీకు ట్రీట్ ఇస్తాను" అంది.

"ఎక్కడికి?"

"బాటిల్స్ అండ్ చిమ్నీస్...మంచి పబ్...ఇక్కడికి దగ్గరే" అంది

అక్కడ పబ్‌లో లౌడ్ మ్యూజిక్, డిమ్‌లైటింగ్, రిధమిక్ వేసే డాన్స్...అతడికి అంతా కొత్తగా గమ్మత్తుగా ఉంది.

"యూ ఆర్ సో మాన్లీ..." అంది ఆమె అతడ్ని హత్తుకుంటూ

అతడికి కంట్రోల్ తప్పింది "ఇక్కడికి దగ్గరే నాది గెస్ట్‌హౌస్ ఉంది...పద" అన్నాడు.

దివ్యనవ్వింది. ఇంకో అరగంట తర్వాత వాళ్ళుఅతని గెస్ట్‌హౌస్‌లో ఉన్నారు, మరుసటిరోజు ఉదయం వరకూ అక్కడే ఉన్నారు.

దివ్య మరో పదిహేను రోజుల్లో గృహప్రవేశం చేసింది. అతడికివ్వాల్సిన ఇరవై లక్షలు, కాన్సెప్ట్ టైల్స్ అమవుంట్, లిఫ్ట్ ఇంకా పార్కింగ్ కి కట్టాల్సిన ఎమవుంట్ ఏమీ ఇవ్వకుండానే రిజిస్ట్రేషన్ పూర్తిచేసి పొసెషన్‌కూడా ఇచ్చాడు అతడు.

ఇంట్లో దిగింతర్వాత ఓ డిన్నర్ ఇచ్చింది దివ్య అతడికి. ఆ రాత్రి అతడు అక్కడే గడిపాడు.

ఇదయిన తర్వాత ఆమె అతడి ఫోన్స్ కూడా తీయడం మానేసింది. కృష్ణారెడ్డికి ఆమె మీద మోజు తీరలేదు. కానీ ఆమె తనను ఇగ్నోర్ చేయడం కూడా అతడి ఈగోని దెబ్బతీసింది.

చివరికి ఓసారి ఫోన్ దివ్య ఫోన్ తీసినపుడు ఎప్పుడు కలుద్దాం అని అడగకుండా "నా బాలెన్స్ ఎమవుంట్ ఎప్పుడిస్తావ్?" అన్నాడు

అలా అంటే ఆమె తనదారికొస్తుందని, ప్రాధేయపడి మళ్ళా డిన్నర్‌కి పిలుస్తుందని అనుకున్నాడు. అదే అతడు చేసిన పొరపాటు. అతడా కాల్ చెయ్యాల్సింది కాదు.

"సరే....ఈవెనింగ్‌రా...చెక్ ఇచ్చేస్తాను" అంది దివ్య నిర్లక్ష్యంగా

ఆ సాయంత్రం అతడు ఆమె ఫ్లాట్ కి వెళ్ళాడు. ముందు హాల్లో ఉన్న సోఫాలో కూర్చున్నాడు.

"టీపాయ్‌మీదున్న కవర్‌లో ఉంది చూడు నీచెక్" అంది ఆమె

టీపాయ్‌మీదున్న కవర్ అందుకుని ఓపెన్ చేశాడు అతడు. జీవితంలో ఎప్పుడూ తగలని షాక్ అతడికి అప్పుడు తగిలింది.

ఆ కవర్‌లో అతడు దివ్యతో అపార్ట్‌మెంట్‌లో గడిపిన రాత్రి తాలూకు ఫొటోలున్నాయి.

"చెక్‌లో ఎమవుంట్ సరిపోయిందా...ఇంకా కావాలా? చూడు ఒకవేళ లెక్క సరిగా ఉందోలేదో...ఏమయినా అనుమానం ఉంటే మీ ఆవిడతో కూర్చుని సరిచూసుకో" అంది దివ్య వెటకారంగా

"బ్లాక్ మెయిలింగా? నేను రియల్టర్ని వందకి మర్డర్ చేసేవాళ్ళు నాకు తెల్సు" కోపంగా అన్నాడు కృష్ణారెడ్డి

"అబ్బచా....నాకు పదిరూపాయలకి మర్డర్ చేసేవాళ్ళుకూడా తెలుసు...కానీ రెడ్డీ ఇక్కడ మేటరేంటంటే ...నువ్వు చూసిన ఫొటోలు వీడియో నుంచి తీసిన ఫొటోలు...

అసలు వీడియో ఒకటి ఉంది...మన కథ అంటే నేను రాసిన కథ...నువ్వు నన్ను బల వంతంగా లొంగదీసుకన్నావనీ, హత్యచెయ్యడానికి ప్రయత్నిస్తున్నావనీ రాసినది, ఆ వీడియోతో పాటు ఓ మెయిల్ రాసి అన్ని పత్రికలనీ, టీవీలకీ పోస్ట్ చేసిఉంచాను... కాకపోతే పదిరోజుల తరువాత డేట్‌లో అవి వాళ్ళకి చేరేలా పెట్టి ఉంచాను... నేను పొరపాటున మర్చిపోయినా అవి వాళ్ళకి చేరిపోతాయి...నీ బతుకు బస్టాండు అయిపోతుంది...అవి ఆపాలంటే నేను బతికి ఉండాలి....అంతే కాదు మర్చి పోకూడదు.....అర్ధమయిందా?" అని నవ్వింది దివ్య

జీవితంలో ఎవర్నిచూసీ అంత భయపడలేదు కృష్ణారెడ్డి. అతడికి పాంటు తడవటం ఒక్కటే తక్కువ.

"సరే.... నాకు అమవుంట్ అక్కర్లేదు" అన్నాడు

"నాక్కావాలి...నేను నిన్ను ఇరవై నాలుగు లక్షల చిల్లరతోనే వదిలేశాను.... కానీ నువ్వే అనవసరంగా ఫోన్ చేసి బెదిరించి కెలుక్కున్నావు....అందుకే ఇంకో ఇరవై నాకు రేపు తెచ్చి ఇవ్వు"

"అయితే నాకు నెగెటివ్‌లు ఇచ్చెయ్యాలి"

"ఓరి పిచ్చిమైసన్.... ఏ కాలంలో ఉన్నావురా....ఇంకా నెగెటివ్‌లు పాజిటివ్‌లు ఏమిటి? అది డిజిటల్ రికార్డింగ్...ఈ చిత్రముయొక్క సర్వహక్కులు ఆంధ్రా,సీడెడ్,నైజాంలలో దివ్యా ఆర్ట్స్‌వారికి చెందివున్నవి...వేరెవరికీ ఇవ్వబడవు... ఎందుకంటే అవి నీచేతిలో పడి, నీదగ్గర వందకి హత్యచేసేవాళ్ళకి నువ్వు పని చెప్పడం నాకు ఇష్టంలేదు" అంది దివ్య

దేవుడా అనుకుంటూ మర్నాడు ఆమె అడిగిన ఎమవుంట్ ఇచ్చాడు, దూలకి చేశాను ఆ ఫోన్ కాల్ ఆమెకి. ఒక్కఫోన్ కాల్ ఖరీదు ఇరవై లక్షలు అనుకున్నాడు కృష్ణారెడ్డి

★ ★ ★

ఆ శబ్దం ఏమిటా, ఎక్కడా అని చూసుకుంటూ ముందకు వెళ్ళిన రాజేంద్ర అది మనిషి మూలుగులా ఉందనుకుంటూ వెళ్ళి దివ్య ఫ్లాట్‌లోని బెడ్‌రూం డోర్ తోశాడు.

లోపల ఎవరో నడివయసువాడితో బెడ్‌మీద ఉంది దివ్య....అతడు ఈ లోకం స్పృహ అలాగే బట్టలూ లేకుండా ఉన్నాడు. అతడు విన్నది ఆమె చేసిన ఫాల్స్ మోనింగ్....నిశ్చేష్టుడయిపోయి నిలబడ్డాడు రాజేంద్ర. అతడికి ఏంచెయ్యాలో తోచలేదు.

దివ్యతో ఉన్నవాడు వాడిపని పూర్తయ్యేవరకూ ఈ లోకంలోకి రాలేదు. దివ్య రాజేంద్రని చూసి వెళ్ళి పోమన్నట్టు సైగ చేసింది. కానీ అతడు అది గమనించేలోపే ఆమెతో ఉన్నవాడు రాజేంద్రని చూడటం...చప్పున బట్టలు వేసుకుని వందమీటర్ల పరుగుపందెంలో పాల్గొంటున్నట్టు పారిపోవడం జరిగాయి.

తాపీగా లేచి, బట్టలు వేసుకుని హాల్లోకి వచ్చింది దివ్య.

"నువ్వు....నువ్వు...నన్ను మోసంచేస్తావా?" అడిగాడు రాజేంద్ర...అది ప్రాధేయ పడుతున్నట్టుఉంది.

"ఏడ్చావ్‌లే... నీ వల్ల బంగారు బాతు పారిపోయింది....నీ బతుకు నాకు తెలీదా? ఎవడో గన్నయ్యగాడి ఆడి కారు అరువు తీసుకొచ్చి నాకు పెద్ద సాఫ్ట్‌వేర్ టైకూన్ లాగా బిల్డప్ ఇస్తావా? అసలు కంపెనీలో నువ్వు ఈ మాత్రం పొజిషన్లో ఎందుకున్నావో నాకుతెలుసు....అది సరే గాని నీవల్ల నాకు ఈరోజు పదిలక్షలు నష్టం జరిగింది.... నువ్వంత ఏడవలేవుగానీ... ఐదు లక్షలు తీసుకురా...నిన్ను వదిలేస్తాను"

"ఎందుకివ్వాలి?...ముందు నేనిచ్చిన రెండు లక్షలూ కక్కు"

"ఏరా....నీతో ఎవతన్నా మోజుపడి పడుకుంటుందనుకుంటున్నావురా? బూడిదగుమ్మడికాయలా ఆపొట్టానువ్వూనూ....సరే ఉండు నీ రెండు లక్షలకీ చెక్కు ఇస్తాను" అని ఆమె లోపలికి వెళ్ళి ఓ కవర్‌తో తిరిగి వచ్చింది.

"చెక్...సరిగా చెక్ చేసుకో" అంది.

ఆనందంగా కవర్ ఓపెన్ చేసిన రాజేంద్రకి ఆమెతో బెడ్‌మీద ఉన్న ఫొటోలు చూసి కళ్ళు బైర్లు కమ్మాయి. అమాంతం ఆమె కాళ్ళమీద పడ్డాడు.

"నన్ను వదిలేయ్.... అంత మొత్తం ఇవ్వలేను" అన్నాడు.

"చెక్‌చూస్తే కానీ ఎవడూ దారికి రాడు....నేనడిగింది చిన్నమొత్తమే...ఎడ్జస్ట్‌చెయ్... నువ్వు నిజంగా జెటెక్ వారసుడివనుకుని చాలా టైమ్ వేస్ట్‌చేసుకున్నాను" అంది ఆమె

రామ్‌కి, సుధాకర్‌కి అసలు విషయం చెప్పలేక ఆమె తనని పెళ్ళిచేసుకోమని వేధిస్తుందనీ, చేసుకోకపోతే సూసైడ్ చేసుకుంటానని బెదిరిస్తుందనీ, కాని పక్షంలో ఐదు లక్షలు ఇమ్మని  అడిగిందనీ చెప్పాడు... ఆ ఐదు లక్షలు తనకు ఏదోలా ఎడ్జస్టు చెయ్యమనీ అడిగాడు.

రామ్ రవీంద్రభారతిలో ప్రీతి దగ్గరనుండి సుధాకర్‌తో కలిసి వెళ్ళడానికి కారణం రాజేంద్ర తన వాళ్ళదగ్గరనుండి డబ్బు అప్పుగా లాగటానికి ఆడిన పానిక్ కాల్ డ్రామానే. కానీ ఆమె చిన్న పిల్ల కాబట్టి ఏదో తొందరపడుతుందనీ, తప్పు ఇద్ద

రిదీ ఉందని సర్దిచెబితే సరిపోతుందనీ అనుకున్నారు వాళ్ళు ఇద్దరు. దానివల్లే రామ్, సుధాకర్‌లు లాకప్‌లో గడపాల్సివచ్చింది.

★ ★ ★

"బాబోయ్....గుర్తొచ్చింది...దీనిబండపడ...ఆ దొంగముండ ఏదో టైం బాంబులాగా సెట్ ఈమెయిల్ ఏదో సెట్ చేశానంది.... అదికూడా నా పీకమీద కత్తిలాగా ఉంచి ప్రతీ వారానికో పదిరోజులకో ఆపకపోతే దానంతట అది ఆటోమేటిగ్గా అన్ని పత్రికలకీ, ఛానల్స్‌కీ పోయేలా చేశానన్నది....మీరుచెప్పండీ.... అలా పెట్టొచ్చా లేకపోతే అది తిత్తిరి కూతలు కూసిందా" అన్నాడు కృష్ణారెడ్డి నెత్తిమీద చేతులుపెట్టుకుంటూ

"చెయ్యొచ్చు....అదేమీ పెద్దపనికాదు" అంది సోఫీ

"అయితే...ఇకనేను ఆనందస్వామిలాగా టీవీల్లో కనబడతానేమో....అంతకంటే దూకి చావడం నయం.." అన్నాడు కృష్ణారెడ్డి

"అవసరం లేదు...సోఫీ హాకింగ్‌లో ఎక్స్‌పర్ట్...తన మెయిల్ ఎకవుంట్స్ కనిపెట్టి ఆపవచ్చులెండి.... కాకపోతే ఆమె లాప్‌టాప్ పోలీసుల దగ్గర ఉంది...అది ఓ గంట మనదగ్గరకొస్తే చాలు" అంది ప్రీతి

"ఆ సంగతి నాకొదిలెయ్యండి... మా బందువు ఒకాయన చాలా పెద్ద పొజిషన్లో ఉన్నాడు..మీకో ఇరవై లక్షలు ఇస్తాను...రక్షించండి....దీనెమ్మ...పిల్లిచచ్చినా కంపుపోలేదు" అన్నాడు

"మాకు డబ్బు అక్కర్లేదండీ...పోతే...ఈ ఫోటోలు చూసి ఆమెతో మీరు చూసినవాళ్ళెవరైనా ఉన్నారేమో గుర్తు పట్టండి" అంది ప్రీతి తను తీసిన ప్రింటవుట్లు అతడిముందు పెడుతూ

"ఈ నాకొడుకేగదూ....విక్రమ్‌గాడు" అన్నాడు కృష్ణారెడ్డి ఎగ్జయిట్ అవుతూ

# 15

"ఇతడిని పట్టుకుంటే మరిన్ని వివరాలు తెలియవచ్చు..వీడి పేరు కృష్ణారెడ్డికి తెలిసినంత వరకూ విక్రమ్...కానీ చూడండి వీడు నాలుగు మొబైల్ నంబర్లు మార్చాడు. కానీ విక్రమ్ పేరుమీద ఏ నంబరూ తీసుకోలేదు.. నాలుగు సార్లు నాలుగు వేరువేరు పేర్లు ఇచ్చాడు కానీ ఫొటో మాత్రం ఒకటే...ఒక సెల్ కంపెనీకి రెండు పేర్లు ,రెండు రకాల ఫొటోలు ఇచ్చాడు.వీడి తీరు చాలా అనుమానాస్పదంగా ఉంది. ఇలా చెయ్యాల్సిన అవసరం ఎవరికుంటుంది? తన ఐడెంటిటీ దాచాల్సిన

అగత్యం ఇతడికి ఎందుకు వచ్చింది?" అంది ప్రీతి.

రామ్,సుధాకర్ ఇంకా సోఫీ అంతా సుధాకర్ అపార్ట్‌మెంట్‌లో కలిశారు. బ్రేక్‌ఫాస్ట్ చేసి, కాఫీ తాగుతూ మాట్లాడుకుంటున్నారు.

"మీ పరిశోధన బానే ఉంది...కానీ మనం ఏదో ప్రమాదం దగ్గరకు చేరుతున్నామని నాకు అనిపిస్తుంది...ఇప్పుడైనా రంగరాజు ఎస్పైకి వివరాలు ఇవ్వడం మంచిదేమో" అన్నాడు రామ్

"ఈ విక్రమ్ విషయం తేలిపోతే ఆ తర్వాత రంగరాజుకి చెప్పవచ్చు....ఇప్పుడు అతడుమాత్రం చెయ్యగలిగింది ఏముంది?" అంది ప్రీతి

"మిమ్మల్ని ఇద్దర్నీ అంత రిస్కులోకి పంపడం నాకు ఇష్టం లేదు...నాకు ఏమైనా ఫర్వాలేదు...మీకు ఏమీ అవకూడదు" అన్నాడు రామ్

"అన్న కొంచెం ఎమోషనల్ అవుతున్నాడు...ఏం ఫర్వాలేదన్నా....ప్రీతికి నేను గ్యారంటీ" అంది సోఫీ అల్లరిగా నవ్వుతూ

"ఏమ్మా! ప్రీతి ఏమన్నా మిక్సర్ అనుకున్నావా నువ్వు గ్యారంటీ ఇవ్వడానికి....తను నీవల్ల ఏమన్నా ఇబ్బంది పడుతుదేమో అని మా భయం...అంతకంటే ఏమీలేదు" అన్నాడు సుధాకర్

"రేయ్...విశాఖపట్నం నుండి ఈ కేసు పరిశోధన కోసం వచ్చిన వీర పరి శోధకురాలిని అంత మాటంటావా.. ఉండు నేను గోదావరి ఎక్కేస్తాను" అంది సోఫీ

"అసలు నిన్ను ఉండమంటానికి,పొమ్మనడానికి వీళ్ళెవరు సోఫీ...నీ బాస్‌ని నేను...అసలు నువ్వులేకపోతే ఈ డిటైల్స్ వచ్చేవే కాదు...ఏదో మెట్రోరైలుకి సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్ రాయడం అనుకుంటున్నారు....అసలు హాకింగ్ అంటే వీళ్ళకి ఏం తెలుసు?" అంది ప్రీతి.

"అవును. నేను తలుచుకుంటే మియాపూర్ రైలుని వనస్థలిపురం, కూకట్‌పల్లి రైలుని కుషాయిగూడ పంపగలను" అంది సోఫీ.

"అవునవును....దానికి నువ్వు హాకింగ్ చెయ్యక్కరలేదు...నువ్వు మామూలుగా ప్రోగ్రామింగ్ చేస్తే చాలు రైళ్ళు అలానే వెళ్తాయి" అన్నాడు సుధాకర్

"అయిపోయింది....ప్రీతీ..ఇక పద....ఇట్స్ ఎనఫ్..... రామ్ అన్నయ్యని తప్పించి ఈ సుధాగాడ్ని కేసులో ఇరికించేద్దాం....దానికి తగిన సాక్ష్యాలు సంపాదిద్దాం" అంది సోఫీ కోపం అభినయిస్తూ

"నీకన్నా ఆరంగరాజు నయం....ఆల్ ది బెస్ట్" అన్నాడు సుధాకర్

"సరే...నీ ఐఫోన్ ఎపుడూ ఆన్‌లో ఉంచు" అన్నాడు రామ్ సాలోచనగా, తర్వాత తన దగ్గర ఉన్న ఐపాడ్ తీసి తన మొబైల్‌మి అకవుంట్‌తో సోఫీ ఫోన్‌ని లింకప్ చేశాడు.

"టచ్‌లో ఉండండి.....ఏ మాత్రం ప్రమాదం అనిపించినా ఫోన్ చేయండి" అన్నాడు

రామ్ భయపడినట్టే వాళ్ళు పెద్ద ప్రమాదాన్ని వెతుక్కుంటూ వెళ్తున్నారని తెలిస్తే బహుశా వాళ్ళనలా వెళ్ళనిచ్చేవాడు కాదేమో!

★ ★ ★

అసలు డిటెక్షన్ అనేది ఎంత కష్టమో తెలిసొచ్చింది ప్రీతి, సోఫీలకి ఆ రోజు. మొదట ఓ అడ్రస్‌కి వెళ్ళారు.

అది నాలుగు పోర్షన్స్ ఉన్న ఇల్లు. రైలు పెట్టెల్లాగా వరసగా ఉన్నాయి. పైన ఇంకో ఫ్లోరు, కిందివాటిలాగే పైనో నాలుగు పోర్షన్‌లు. అద్దెలకి ఇవ్వడం కోసమే కట్టిన ఇల్లు అది.

డోర్ నంబర్ ప్రకారం ఓ పోర్షన్‌కి వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కారు. ఓ నడి వయసుఆవిడ  తలుపు తీసింది.

"ఎవరమ్మా మీరు...ఏం కావాలి?" అంది

"ఇతనికోసం వచ్చాం ఆంటీగారూ...ఇతను ఇక్కడ ఉంటున్నాడా?" అడిగింది ప్రీతి

"ఈ ఫొటోలో ఉన్నవాడు ఎపుడూ ఇక్కడలేడు...ఏమ్మా మీఇద్దరిలో ఎవరినన్నా మోసం చేశాడా? ఉత్త అమాయకురాళ్ళలాగా ఉన్నారు...అలా ఎవర్నిపడితే వాళ్ళని ఎలా నమ్ముతారమ్మా...? కనీసం అడ్రస్‌కూడా చూసుకోకుండా ఎలా నమ్ముతారమ్మా" అంటూ వాయించేసింది.

"సరేనండి...ఇకనుండి ప్రేమిస్తే ముందు అడ్రస్ కనుక్కుని ఆ తర్వాత ముందుకెళ్తామండి...కానీ మీరనుకున్నట్టు ఇతను మోసం చేసినవాడుకాదు... మతిస్థిమితం లేనివాడు" అంది సోఫీ.

"అంటే పిచ్చివాడామ్మా....కరుస్తాడా?"

"అవును...పిచ్చివాడే....కుక్కకన్నా గట్టిగా కరుస్తాడు...జాగ్రత్త" అంది సోఫీ

ఆవిడ మొహంలో భయం కనబడింది.

ఇద్దరూ అక్కడినుండి కదిలారు.

"ఆడపిల్ల మొగవాడిగురించి అడిగితే మోసపోవడం తప్ప వేరే ఏమీ ఉండరనుకుంటానే" అంది ప్రీతి

"ఆవిడ డైలీ సీరియల్స్ ఎక్కువ చూసేబాపతులా ఉంది...అయినా మనం ఏదో ఒక కవర్‌స్టోరీ అనుకోవాలి...లేకపోతే ఇబ్బందే" అంది సోఫీ

రెండో అడ్రస్ చింతల్‌బస్తీది. అక్కడసలు ఆ అడ్రస్సేలేదు. మూడోది దోమల్‌గూడ ఇక్కడ కనీసం ఆ అడ్రస్ ఉంది. కానీ మనిషిలేడు. ప్రశ్నలు మామూలే

"ఇతడికోసం ఎందుకు ఎంక్వయిరీ చేస్తున్నారు?" అడిగాడు బక్కగా ఉన్న ఓ ముసలాయన.

ఈసారి ప్రిపేర్ అయిఉన్న సమాధానం చెప్పారు ఇద్దరూ.

"ఇతను మా బాంక్‌లో క్రెడిట్ కార్డు తీసుకుని లక్షరూపాయలు ఎగ్గొట్టాడు... రికవరీ కోసం"

"అవును...మీ బాంకీవాళ్ళు ఎగ్గొట్టేవాడికి వెతికి మరీ అప్పులిస్తారు... అదే మాలాంటి వాళ్ళకైతేనే సవాలక్ష ప్రశ్నలు" అన్నాడాయన మీకిలా కావల్సిందే అన్నట్టుగా.

ఉసూరంటూ కదిలారు అక్కడనుండి ఇద్దరూ

"ఇంకో అడ్రస్ ఉంది...వెళ్దామా...నాకయితే వేస్ట్ అనిపిస్తుంది...వీడెవడో పెద్ద జాదూటోనాలా ఉన్నాడు..అక్కడ కూడా ఉంటాడని నమ్మకంలేదు" అంది సోఫీ.

"అలా అనుకోకూడదు... ఎంత తెలివైన నేరస్థుడయినా ఎక్కడో పొరబాటుచేస్తాడు. అది పట్టుకోవాలి...ఉదాహరణకి చూడు, వీడు పేర్లు, అడ్రస్‌లు మార్చినా ఫొటో మాత్రం ఒకటే ఇచ్చాడు.. వేరే ఎవరిదన్నా వాడుకోవచ్చుగా...అలానే ఇంకోటేదో ఉంటుంది...మనం వెతకటమే" అంది ప్రీతి.

అక్కడనుండి నాలుగో అడ్రస్‌కి వెళ్ళారు...అది బోయిన్‌పల్లిలో ఉంది. అది కూడా ఫేక్ అని తెలిసిపోయింది.

ఇద్దరూ కలిసి దార్లోఉన్న ఓ కాఫీ షాపులో ఆగారు. ఉదయం ఉన్న ఉత్సాహం అంతా ఆవిరైపోయింది.

"గుడ్డివాడు గడ్డివాములో సూదికోసం వెతుకుతున్నట్టు ఉంది మన వెతుకులాట" అంది సోఫీ

"అవును....అలానే ఉంది...కానీ చూశావా...మనం పోలీసుల్ని తిట్టుకుంటాం కానీ అసలు వాళ్ళ ఉద్యోగం ఎంత కష్టమో...ఒక కేసుకే మనం ఇంత శ్రమ పడుతున్నాం...వాళ్ళు కొన్ని వేల కేసులు ఎలాసాల్వ్ చేస్తారో కదా" అంది ప్రీతి

"అవును...ఇప్పుడు వాళ్ళు మన కొలీగ్స్‌కదా...అందుకే నీకు సానుభూతి"

"ఏమన్నావ్.....వాళ్ళు...మన కొలీగ్స్....ఓహ్....గాడ్...నిజంగానే మనం గుడ్డివాళ్ళలెక్క వెతుకుతున్నం....పద గెటప్" అంది ప్రీతి ఎగ్జయిట్ అవుతూ

★ ★ ★

మరికాసేపట్లో ఇద్దరూ కొంపల్లి వెళ్ళే దారిలో ఉన్నారు. అక్కడే ఉంది దివ్య పనిచేసిన బిపివో.

"అసలు విషయం మన మైండ్‌నుంచి స్లిప్పయింది....రొటీన్‌గా అడ్రస్‌లు చెక్‌చేస్తున్నాం కానీ కృష్ణారెడ్డి చెప్పిన ప్రకారం విక్రమ్ దివ్యకి కొలీగ్. తను పనిచేసే కంపెనీకి వెళ్తే సరిపోతుందిగా...అక్కడ ఎలానూ అతడే ఉంటాడు...అతడి డిటెయిల్స్ కూడా ఉంటాయి" అంది ప్రీతి డ్రైవ్ చేస్తూ

"కనీసం దివ్య విషయంలో ఈ ఒక్కటి అయినా నిజం అయితే బావుండు...తన జీవితమంతా అబద్ధాలే" అంది సోఫీ

"ఇది ఆఖరు ఆశ మనకి...ఇక ఇక్కడ దొరక్కపోతే దొరకనట్టే" అంది ప్రీతి

కాసేపట్లో కారు ఆ బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ కంపెనీకి చేరుకుంది. హెఆర్‌కి వెళ్ళారు ఇద్దరూ.

అతడి ఫొటో చూసి "ఇతనిక్కడ పనిచేయడంలేదు" అన్నాడు మేనేజర్

ఉసూరంటూ వెనుతిరిగారు. ఇక ఈ కేసు పరిష్కారమయ్యే అవకాశం లేనట్టే అనుకుంటూ... అప్పుడు వినపడింది వెనుకనుండి.

"అతను తన సాలరీ బాలన్స్‌కూడా తీసుకోకుండా మానేశాడు" అని

గిర్రున వెనుతిరిగారు ఇద్దరూ.....డెడ్ ఎండ్ అనుకున్నచోట చిన్న బ్రేక్‌త్రూ..

"ఇతను విక్రమ్..చనిపోయిన దివ్యకి మంచిఫ్రెండ్...ఫియాన్సీ అని కూడా అనుకున్నారు. ఏమైందో ఏమో....సడెన్‌గా మానేశాడు...తెలివైనవాడు, చురుకైనవాడు" అన్నాడు ఆయన

"ఎప్పుడు ఆమె చనిపోయాక మానేశాడా?" అడిగింది ప్రీతి.

"లేదమ్మా అంతకంటే చాలా ముందు" చెప్పాడాయన

"ఎందుకడుగుతున్నారు?"

ఈసారి కవర్‌స్టోరీ ఏమీ చెప్పలేదు ప్రీతి. తన కార్డు ఇచ్చింది. ఆమె చాలా మంచి పొజిషన్‌లో ఉంది తన కంపెనీలో. అదిచూడగానే ఇంకా మర్యాదగా ట్రీట్‌చేశాడు ఆయన.

"ఇతను ఎక్కడున్నాడో చెప్పగలరా?"

"ఇంతకుముందు ఎక్కడో ఉండేవాడుకానీ అక్కడనుండి మారిపోయాడనుకుంటా.... ఈ మధ్య మా డ్రైవర్ ఖైరతాబాద్ స్లమ్‌లో రెండుమూడుసార్లు చూశాడట... బహుశా అక్కడ ఉండొచ్చు...అతన్ని పంపిస్తాను..తను ఉండేది అక్కడే...అతన్ని చూసిన ఇల్లు మీకు చూపిస్తాడు" అన్నాడాయన.

సాయంత్రం అయింది వాళ్ళు ఖైరతాబాద్‌లో రాజ్‌భవన్ ఎదురుగా ఉన్న స్లమ్ చేరుకునే సరికి. చీకట్లు అలుముకుంటున్నాయి.

"ఈ ఇంట్లోంచి వస్తూంటేనేఅమ్మా నేను చూశాను...ఆయన నన్నుగమనించలేదు పల్కరిద్దామంటే" అన్నాడు డ్రైవర్ ఓ ఇంటిని చూపిస్తూ.

మూడు అంతస్తుల ఇల్లు అది. పైన పెంట్‌హవుస్ ఉంది. అక్కడ వాచ్‌మేన్ ఎవరూలేరు. కానీ ఇంటిఓనర్ ఉన్నాడు.

"ఈ సార్ ఈడనే ఉంటడుగదా?" అని అడిగాడు డ్రైవర్ ఇంటి ఓనర్ని.

"అవ్...పైన పెంట్‌హవుస్‌ల ఉంటడు...మస్తు కామోష్‌మనిషి" అన్నాడు అతడు

ముగ్గురూ పైకి వెళ్ళారు. పెంట్‌హవుస్ కరెక్టుగా మధ్యలో ఉంది. నాలుగువైపులా ఖాళీ స్థలం ఉంది.

డోర్‌మూసి ఉంది. తాళం వేలాడుతోంది.

"సార్ లేడనుకుంటమ్మా ....రేపొస్తరా" అన్నాడు డ్రైవర్

"మేం వెయిట్ చేస్తాంలే...నువ్వెళ్ళు...థాంక్స్" అంది ప్రీతి అతడిచేతిలో ఓ వంద రూపాయలు పెడుతూ.

"మంచిదమ్మా" అని వెళ్ళిపోయాడు అతడు.

అక్కడంతా రణగొణ ధ్వనులు వినపడుతున్నాయి. రైల్వే ట్రాక్ కూడా దగ్గరగా ఉండటంతో వచ్చిపోయే రైళ్ళ శబ్దాలు బాగా ఎక్కువగా ఉన్నాయి.

అలానే పిట్టగోడ వారన ఆనుకుని చుట్టూ చూస్తూ గడిపారు ఇద్దరూ. ఎక్కువ సేపు అలా ఉండటం బోర్‌కొట్టి ఏంచెయ్యాలో తోచక ఇంటిచుట్టూ రౌండ్ కొట్టడం

మొదలుపెట్టారు.

పెంట్‌హౌస్ వెనక్కి వచ్చిన ఇద్దరూ సడెన్‌గా ఆగిపోయారు. దానికి కారణం ఓ అలికిడి....బయటనుండి కాదు....లోపలినుండి వచ్చింది అది.....అంటే ముందు తాళం వేసి లోపల ఎవరో ఉన్నారు...వెనుకవైపు తలుపు వాడుతున్నారు.

వాళ్ళు ఆశ్చర్యంనుండి కోలుకునేలోపు హఠాత్తుగా వెనుక తలుపు తెరుచుకుంది.... కాల యముడిలా ఓ చేతిలో రాడ్‌తో వాళ్ళముందు ప్రత్యక్షమయ్యాడు.....విక్రమ్

మరో క్షణం ఆగితే ప్రీతి తల పచ్చడయిపోయేదే....అప్పుడు వినిపించింది

"కదిలావో....కాల్చేస్తా" అని.

అక్కడ ప్రత్యక్షమయ్యాడు రంగరాజు, అతడి చేతిలో రివాల్వర్ ఉంది...ఈ వెనుకే నిలబడి ఉన్నారు రామ్, సుధాకర్.

★ ★ ★

"నేను చెప్పానా ఏమైనా ప్రమాదం అనిపిస్తే ఫోన్ చెయ్యమని? ఎందుకు చెయ్యలా? మేం రావటం ఓ క్షణం ఆలస్యమయిఉంటే" ప్రీతి చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అడిగాడు రామ్ , అతడి కళ్ళలో తడి

"అంటే నాకు ప్రమాదమనిపించలా అతడు కనబడే వరకూ ....అందుకే ఫోన్ చెయ్యలా...అతడు చేతిలో రాడ్‌తో కనపబడ్డాక చేద్దామనుకున్నా కానీ టైం లేదు... ఈలోగా మీరే వచ్చారు" అంది

"అవునూ...మేమిక్కడ ఉన్నట్టు మీకెలా తెలిసింది?" అడిగింది సోఫీ

"ఫైండ్ మై ఐ ఫోన్ వల్ల....నీ ఫోన్‌ని నా ఐపాడ్‌కి లింక్ చేశానుకదా...పోయిన ఫోన్‌ని మాప్‌మీద ప్రిసైస్‌గా ట్రాక్ చేసే ఆ అప్లికేషన్ వల్ల...నేను ఫోన్‌చేశాను ఎందుకు లిఫ్ట్ చెయ్యలా?" అడిగాడు రామ్

"తనేమో ఫోన్ కారులో వదిలేసింది...నా ఫోన్ రింగ్‌సౌండ్ చాలా చిన్నగా ఉంటుంది అందుకే వినబడలా...ఈ చుట్టుపక్కల అంతా నోయిసీగా ఉందికదా" అంది సోఫీ

విక్రమ్‌ని స్టేషన్‌కి తీసుకుపోయాడు రంగరాజు. పెంట్‌హవుస్‌లో బుచర్‌నైఫ్‌లా ఉండే కత్తి దొరికింది...దానిమీద రక్తపు మరకలు అలానే ఉన్నాయి...రక్తంతో తడిచిన విక్రమ్ బట్టలుకూడా దొరికాయి.

★ ★ ★

"చెప్పరా బాబూ....ఆ పిల్ల దివ్యని ఎందుకు చంపావు? అంత కోపం ఎందుకు ఆ పిల్లమీద? నీకిది మొదటి మర్డరా లేక ఇంతకు ముందు అనుభవం ఉందా?" అడిగాడు రంగరాజు ఏదో మర్డర్ చేసే ఉద్యోగాలకి ఇంటర్వ్యూ చేస్తున్నట్టుగా.

"ఎందుకంటే నేనామెను పిచ్చిగా ప్రేమించాను కాబట్టి...తను లేకుండా బతకలేనంతగా ప్రేమించాను కాబట్టి....నేను మోసాన్ని తట్టుకోలేను కాబట్టి" అన్నాడు విక్రమ్

"సరే...నీ కథేమిలో చెప్పుకో....విని పెడతాం" అన్నాడు రంగరాజు

★ ★ ★

"చూడు విక్రమ్...నన్ను ప్రేమించినందుకు చాలాథాంక్స్...నాకు తెలుసు నువ్వు మంచివాడివి..ఇంకా సిన్సియర్ లవర్‌వి... కానీ నీ ప్రేమ నా ఆకలి మాత్రం తీర్చగలదు...కానీ నేను కన్న కలల్ని నిజం చెయ్యలేదు... అందుకే నాకొద్దు...నీప్రేమ" అంది దివ్య.

"నేను కష్టపడతాను...ఏమైనా చేస్తాను...నీకోసం...మనకి పుట్టే పిల్లల కోసం" అన్నాడు విక్రమ్

"ఆగాగు....నువ్వు అనుకున్నట్టు పిల్లల్ని కని, పెంచే యంత్రం నేను కాదు...దానికి వేరేవాళ్ళని చూసుకో"

"అదేంటి...పెళ్ళి చేసుకుని, పిల్లల్ని కని, వాళ్లని పెంచి గౌరవంగా, సుఖంగా బతకాలని లేదా నీకు"

"నువ్వన్న దాంట్లో నాకు అసలు సెన్స్ కనబడటంలేదు....సరిగా ఆలోచించు...పిల్లల్ని కని, వాళ్ళ మలమూత్రాలు ఎత్తి, వాళ్ళకి రోగాలు రొష్టులు వస్తే ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ, నీకు, వాళ్ళకి వండి పెడతూ, బట్టలుతుకుతూ, ట్యూషన్ చెప్పుకుంటూ...చెమటోడుస్తూ.. మనకొచ్చే చాలీ చాలని జీతంతో బతుకు ఈడ్చటం..ఇదేనా నీ ప్రేమకు ప్రతిఫలంగా నువ్వు ఇచ్చే ఉజ్వల భవిష్యత్? ఇందులో ఏం సుఖం ఉంది చెప్పు...నేను కనేకలలు వేరు..హాయిగా బతకాలి..నౌకర్లు ఉండాలి, వంట చేసేవాడుండాలి, కారుండాలి, విదేశయాత్రలు చేయాలి, సరదాగా గడపాలి అదీ జీవితం..నువ్వన్న ఏడుపుగొట్టు బతుకు బతికితే గౌరవమా...అంటే ఏంటది? ఎపుడన్నా ఎవరన్నా వచ్చి నాకు రవీంద్రభారతిలో సన్మానం చేస్తారా? ఒకవేళ చేసినా నాకు అది అక్కర్లేదు"

"నీలా మీ అమ్మ అనుకుని ఉంటే నువ్వు అనేదానివి ఉండే దానివి కాదు"

"అవును...మా అమ్మమ్మ అనుకుని ఉంటే మా అమ్మకూడా ఉండేదికాదు... అయితే ఏమిటి? వాళ్ళలా నేనుండాలా? వాళ్ళెంత సుఖపడ్డారో నేను చూడలేదా? నా లైఫ్ నాఇష్టం..."

"సరే...నీకు కావల్సినవన్నీ నేను సంపాదిస్తాను...ఏం చేసి అయినా నిన్ను సుఖపెడతాను...నువ్వు మాత్రం దయచేసి వేరే ఎవర్నీ కన్నెత్తి అయినా చూడొద్దు"

"అలాగే..లకడీకాపూల్‌లో ఓ ఫ్లాట్ నాకు నచ్చింది...సిక్ష్టీలాక్స్...ముందదికొను.. తరువాత చూస్తాను" అంది

నేను మా ఊరు వెళ్ళి నాకున్న భూమి అమ్మి నలభై లక్షలు తెచ్చి ఎడ్వాన్స్ కట్టాను. ఉద్యోగంతో తన కోరికలు తీర్చలేనని అర్థమైంది. నాకున్నవన్నీ అమ్మినా కూడా ఆమె కోరికలు తీర్చలేనని కూడా అర్థమైంది.

అందుకే ఉద్యోగం మానేశాను. నేరాలు చెయ్యడానికి అలవాటు పడ్డాను. మొదట పెట్రోల్ బంకుల్లో రాత్రిపూట దొంగతనాల్తో మొదలెట్టాను. నేను నా జీవితాన్ని నాశనం చేసుకుని దొంగగా మారాను. తను మాత్రం నామీద నమ్మకం పెట్టుకోకుండా తన శీలాన్ని పణంగా పెట్టి డబ్బు సంపాదించడానికి పూనుకుంది.

నేను చాలా బాధపడ్డాను. నా బాధచూసి ఓరోజు అన్నీ మానేస్తున్నానని అంది. కానీ మళ్ళీ మామూలే.

ఆ రోజు రాత్రి ఏం జరిగిందంటే.....

గతాన్ని తలుచుకుంటున్నాడు విక్రమ్

★ ★ ★

తన బాక్‌పాక్ సర్దుకుంటున్నాడు విక్రమ్. రాత్రిపూట సెక్యూరిటీ తక్కువగా ఉండే బంకులు అతడి టార్గెట్...మంకీ కాప్ పెట్టుకుంటాడు తనని వాళ్ళు గుర్తుపట్టకుండా. ఒకోసారి బండినంబర్, కలర్‌ని బట్టికూడా పోలీసులు పట్టుకోవచ్చు అందుకే తరచుగా అవి మారుస్తూ ఉంటాడు.

బట్టలుకూడా ఫలానా రంగు చొక్కా అని విక్టిమ్ పోలీసులకి చెబితే వాళ్ళు కంట్రోల్‌రూమ్ నుండి అన్ని మొబైల్స్‌కి మెసేజ్ ఇస్తారు కాబట్టి దారిలోనే మార్చుకోవడానికి ఓ స్పేర్ డ్రస్, అవసరమైతే దాడి చేయడానికి చిన్న హేండిల్ ఉన్న బుచర్‌నైఫ్, కళ్ళలో చల్లడానికి చిల్లీపౌడర్ అన్నీ సర్దుకున్నాడు.

ఇక ఈ దందా లాభంలేదు. పెద్దమొత్తంలో గిట్టుబాటు కావటంలేదు. ఇది మార్చి ఇంకా పెద్దది ఏదైనా ప్లాన్ చెయ్యాలి..ఏటీయమ్, మనీ ట్రాన్స్‌పోర్ట్ వాన్,

జుయల్రీ షాప్ ఇలాంటివి ప్లాన్ చెయ్యాలి అనుకున్నాడు.

ఓ సారి దివ్యని చూడాలనిపించింది.బైక్ లకడీకాపూల్ వైపు తిప్పాడు. దివ్య ఇంటి దగ్గరగా వెళ్ళాక ఆమె ఉందో బయటకి వెళ్ళిందో అని అనుమానం వచ్చింది

ఆమెకి ఫోన్ చేశాడు " కాసేపట్లో వస్తున్నా....నిన్ను చూడాలి"

"సరే...రా...ఇంట్లోనే ఉన్నాను" అంది ఆమె అవతలినుండి

బైక్ లకడీకాపూల్ చర్చి దగ్గరపెట్టి నడుచుకుంటూ వెళ్ళాడు. పార్కింగ్‌లో పెట్టి వాచ్‌మాన్ దృష్టిని ఆకర్షించడం ఇష్టంలేదు అతనికి.

మెట్లు ఎక్కి ఆమె ఫ్లాట్ ఉన్న ఫ్లోర్‌కి వెళ్ళాడు. అంతలో డోర్ తెరుచుకుంది. చప్పున పై ఫ్లోర్ కి వెళ్ళే మెట్లు ఎక్కి తొంగి చూశాడు. అపుడు కనపడ్డారు అతడికి ఇద్దరు మగాళ్ళు దివ్య అపార్ట్‌మెంట్‌నుండి బయటకి వస్తూ. వాళ్ళు రామ్, సుధాకర్. రాజేంద్ర దగ్గర అంత డబ్బులేదనీ, పెళ్ళికూడా చేసుకోలేడనీ చెప్పడానికి వచ్చారు వాళ్ళు. విక్రమ్ ఫోన్ రావడంతోనే దివ్య వాళ్ళతో రాజేంద్ర విషయం తర్వాత మాట్లాడదామని చెప్పి పంపింది.

అతడిలో అసహనం పెరిగింది. అనుమానం ఎక్కువైంది. నేను మానమన్నా తను ఈ చెడ్డపనులు మానలేకపోతోంది. ఎవరికోసమైతే తన జీవితం నాశనం చేసుకున్నాడో ఆమెకు తనగురించి అసలు పట్టింపులేదు.

ఆ కోపంతోనే లోపలికి వెళ్ళాడు. సోఫాలో కూర్చుని సిగరెట్ వెలిగించుకున్నాడు.

"నువ్వు చేసే పనులు నాకు నచ్చడంలేదు దివ్యా.... అన్నీ మానేస్తానన్నావు... మళ్ళా ఈ మొగాళ్ళెవరు? నీ ఫ్లాట్ నుండి ఎందుకు వస్తున్నారు?"

"చూడు విక్రమ్....నేను చేసే పనులు నాకు నచ్చితే చాలు...ఇక నువ్వు కనిపించిన మగాడితోనల్లా నాకు ఏదో ఊహించుకోవడం నాకు చాలా చిరాగ్గా ఉంది. అయినా నువ్వు ఎప్పుడు సంపాదిస్తావు? ఎప్పుడు మనం సెటిలవుతాము? నేను ముత్తవ్వ వయసుకి చేరాకా?" చిరాగ్గా అంది దివ్య

అతడికి కోపం పతాక స్థాయికిచేరింది. ఇంతలో ఆమె ఫోన్ రింగయ్యింది. అవతల రాజేంద్ర నారాయణ

"దయచేసి నన్ను వదిలేయ్...నువ్వు అడిగినంత నేను ఇచ్చుకోలేను" అంటున్నాడు

ఆమెకి కోపం వచ్చింది. మామూలుగా అయితే విక్రమ్‌తో మాట్లాడి అతడు వెళ్ళిన తర్వాత చెయ్యవచ్చు. కానీ ఇరిటేషన్ మూడ్‌లో ఉండటంతో హాల్లోంచి లేచి బెడ్‌రూంకి వెళ్ళింది. తమ సంభాషణ విక్రమ్ వినకూడదని. కానీ అతడు తన వెనుకే

లేచి రావడం గమనించలేదు.

"రేయ్....సన్నాసి....నీ అంత వెధవని నేను చూడలేదు...ఇరవై లక్షల డీల్‌కూడా ఒక్కరోజులో సెటిల్ చేశానురా....అంతా చేసి వాడు నన్ను వాడుకుంది రెండుసార్లు... నువ్వు ఆడి కారు అరువు తెచ్చి ట్రాప్ చేసి ఎన్నిసార్లు ఎంజాయ్‌చేశావు....గాడిదా నిన్ను ఎంటర్‌టెయిన్ చెయ్యడానికి ఎంత కష్టపడ్డాను....ఇంతా చేసి ముండా అయిదు లక్షలకి ఇన్నిసార్లు ఫోన్‌చేస్తావా...నీ ఫ్రెండ్స్‌కి కాకమ్మ కథలు చెప్తావా...నేను నిన్ను పెళ్ళి చేసుకోమని అడుగుతున్నానా? పెట్రా ఫోన్..రేపు సాయంత్రంకల్లా డబ్బుతో రా...లేకపోతే మీ ఆవిడకి పంపిస్తా మన సినిమా మొత్తం...ఇంకా నీకు సిగ్గురాకపోతే ఇంటర్నెట్‌లో పెడతా నామొహం తీసి మీ ఆవిడ మొహం మార్ఫింగ్ చేసి " అని ఫోన్‌పెట్టింది ఆమె

"ఈ పనులు ఎప్పుడు మానతావ్?" కోపంగా అరిచాడు విక్రమ్.

"మానను....నీ జన్మలో నువ్వు నాకు కావల్సింది ఇవ్వలేవు...." అంది దివ్య రోషంగా

"నీకు ఫ్లాట్ ఇచ్చాను...ఇంకా కష్టపడుతున్నాను...నా బతుకు నాశనం చేసుకున్నాను" అతడు కోపంతో ఊగిపోతున్నాడు

"నువ్వు ఇచ్చిన నలభైకి ఈ ఫ్లాట్ వచ్చిందనుకున్నావా? ఏంటీ నా మీద అధారిటీ ఉన్నట్టు మాట్లాడుతున్నావ్...కావాలంటే నీ డబ్బునీకు విసిరేస్తాను....పో...నా ఇంట్లోంచి.. నాగురించి నాశనం చేసుకోకపోయినా నీదేం గొప్ప బతుకుకాదులే... పెద్దగా ఫీలవకు...వెళ్ళి టీవీ సీరియల్స్ చూస్తూ , టీవీషోలకి పొరుగూరి వంటలు వండేదాన్ని చూసి చేసుకో" ఆమెకూడా ఉద్రేకంతో ఊగిపోయింది.

"నా బతుకు నాశనం చేసి...నన్ను మోసం చేసి...నీకు డబ్బిచ్చేవాళ్ళందరితో కులుకుదామనుకుంటున్నావా....నన్ను గెటవుట్ అంటావా? చూస్తాను నాకు కానిది ఊరుమ్మడి వాళ్ళకెలా దక్కుతుందో....నీకిదే ఆఖరి రోజు" అని అరిచాడు అతడు.

ఆ వెంటనే అతడు తన వీపువైపు దాచుకున్న కత్తి తీయడం ఆమె మీద వేటువేయడం వెంటనే జరిగిపోయాయి.

ఆమె పరిగెడుతూ ఉంది తనని తాను రక్షించుకోవడం కోసం. అతడు తరుముతూ దొరికిన చోట్లల్లా కసిగా నరుకుతన్నాడు. ఆమె రక్తం చివ్వున చిమ్ముతోంది. బెడ్‌రూం నుండి సోఫా ఉన్న డ్రాయింగ్‌రూం వరకూ ఆమె రక్తం చిందింది. సోఫాలో పడిపోయినా వదలక నరికాడు. కత్తితో వచ్చిన రక్తం గోడలనిండా పెయింట్ చిమ్మినట్టు చిమ్మింది.

దివ్య మెడలో తాను బహుమతిగా ఇచ్చిన డైమండ్‌పెండెంట్ ఉన్నచెయిన్, చెవులకి డైమండ్ స్టడ్స్....ఓ సారి రక్తంతో తడిచిన చేత్తో ప్రేమగా వాటిని తాకాడు.

"నేనూ వచ్చేస్తా నీతో" అన్నాడు.

కానీ అతడికి చావబుద్ధి కాలేదు. అసలు ఏమీ తెలియని శూన్యం అతడిని ఆవరించింది. దొంగతనం కోసం తెచ్చిన స్పేర్ బట్టలు మార్చుకున్నాడు. నెమ్మదిగా బయటకు వచ్చి  చర్చి వరకూ నడిచివెళ్ళాడు. అక్కడ ఉంచిన బండితీసుకుని ట్రాఫిక్‌లో కలిసిపోయాడు

# 16

మెట్రో రైలు ట్రై రన్స్ మొదలయ్యాయి. అన్ని సిస్టమ్స్ చాలా చక్కగా పనిచేస్తున్నాయి. ఐదునిముషాలకి ఒకరైలుచొప్పున మియాపూర్ నుండి యల్‌బి నగర్‌కి అలాగే అటునుండి ఇటు నడుస్తాయి.

వారం పాటు ట్రైరన్స్ అన్నీ చాలా బాగా జరిగాయి. ఎక్కడా ఒక్క ఇంచి అటూఇటూ లేదు. ఇక ఢోకాలేదనుకున్నారు.

రెండురోజుల్లో భారీగా ప్రారంభం, ప్రధాని చేతులమీదుగా.

"నేను బెంగుళూరు వెళ్లి వస్తాను..." అన్నాడు సుధాకర్

"అంతా రెడీయా?" అన్నాడు రామ్

"యస్..బాస్..పాజిటివ్"

అన్నట్టుగానే అతడు ఓరోజు సాయంత్రం ఫ్లైట్‌కి వెళ్ళి మర్నాడు తిరిగివచ్చాడు.

"యువర్ గిఫ్ట్ ఈజ్ రడీ" అన్నాడు

"ఎక్కడపెట్టావ్?"

"ప్రీతి దగ్గర"

"సేఫ్"

"డబుల్"

★ ★ ★

ఇంకో రోజులో మెట్రో ప్రారంభం అనగా రామ్, సుధాకర్‌లకి పిలుపు వచ్చింది సీయండీ హరిహరరావుని కలవమని. ఇద్దరూ ఆఫీసులో ఆయన ఛాంబర్‌కి వెళ్ళారు.

పెద్ద ఛాంబర్, ఖరీదయిన ఇంటీరియర్స్,గ్లాస్‌వాల్‌తో గొప్పగా ఉంది. పెద్ద

సింహాసనంలాంటి చైర్‌లో కూర్చున్నాడు అతడు. అతడి పక్కనే పామేరియన్ కుక్కపిల్లలా నిలబడి ఉన్నాడు రాజేంద్ర.

దివ్య హత్య జరిగిన తరువాత కనీసం అతడితో మాట్లాడే ప్రయత్నం చేయలేదు హరిహరరావు. జానకి పుట్టింటికి వెళ్ళిపోయాక కనీసం ఆ టాపిక్ మాట్లాడిన వాళ్ళుకూడా లేరు.

వాళ్ళిద్దరికీ కనీసం సీటుకూడా ఆఫర్ చెయ్యలేదు హరిహరరావు. రాజేంద్ర రెండు కవర్లు వాళ్ళ చేతిలో పెట్టాడు.

"ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఇస్తామన్న ఇరవై అయిదు లక్షలు ఇచ్చినట్టున్నారు...చాలా థాంక్స్" అన్నాడు రామ్

"తొందరపడకు సుందరవదన....ముందు ఆ కవర్లో ఏముందో చూసుకో" అన్నాడు రాజేంద్ర...అతడి కంఠంలో వెటకారం చాలా స్పష్టంగా తెలుస్తోంది

కవర్ తీసి చూసి షాక్ తిన్నారు రామ్, సుధాకర్. అది వాళ్ళ టెర్మినేషన్ లెటర్. మూడు నెలల జీతం ఇస్తూ వాళ్ళిద్దరూ ఇంకా ట్రెయినీలే కాబట్టి, వాళ్ళ పనితీరు షుమారుగానే తప్ప ఆశించిన స్థాయిలో లేనందువల్ల తీసేస్తున్నట్టు ఉంది ఆ లెటర్లో.

"ఇది చాలా అన్యాయం...." అన్నాడు సుధాకర్

"ఏమిట్రా అన్యాయం? మీరు చేసిన దానికన్నానా? నా కూతురి గొంతు కోశారు... ప్రాజెక్టు పనికని ఢిల్లీ పంపిస్తే అక్కడ ముండల్తో ఎంజాయ్ చేశారు....నాకూతురుకి ఒక అచ్చటాలేదు ముచ్చటా లేదు...వీడు చూస్తే తాగుబోతు...అది చాలదన్నట్టు కాలేజీ రోజుల్లోనే దేన్నో ప్రేమించానని ధైర్యంగా మా అమ్మాయి ముందే కూస్తాడు...ఎంత పొగరురానీకు...? పల్లెటూరి గబ్బిలాయివి... ఏంచూసుకునిరా నీకు ఆ నిక్కు...? మా అమ్మాయి కాలి గోటికి సరిపోవు...చూడు నీతో ఊచలు లెక్కపెట్టిస్తా....వారం టైమురా నీకు....బెంగుళూరు వచ్చి మా అమ్మాయి కాళ్ళు పట్టుకో....అది దయతలిస్తే దాని కాళ్ళదగ్గర పడి ఉందువుగాని...ఉద్యోగంకూడా తను ఇమ్మంటే మళ్ళా ఇస్తాను" అన్నాడు హరిహరరావు రౌద్రంగా

"మీరిచ్చేది ఏమిటి...మెట్రో ప్రాజెక్టులో మా అనుభవం చూస్తే ఎవరైనా కళ్ళకి అద్దుకుని తీసుకుంటారు" అన్నాడు సుధాకర్

"సార్...వీళ్ళు సామాన్యులుకారు....రేపు ఆ ప్రాజెక్టు మేమే చేశామని ఎక్కడా క్లయిము కూడా చేసుకోకుండా చూడాలి...వీడి వాలకం చూస్తే కోర్టుకి పోయేలా ఉన్నాడు" అని సలహా చెప్పాడు రాజేంద్ర

“కరెక్టు...నీలాంటి స్మార్ట్‌ఫెలో దొరకడం నాలక్కయ్యా...లీగల్ ఎడ్వయిజర్‌ని పిలు...అసలు మెట్రో రైలు సాఫ్ట్‌వేర్‌కి వీళ్ళకి సంబంధంలేదని, కేవలం వీళ్ళు వెబ్‌పేజీలు చేసే టుమ్రీలని అండర్‌టేకింగ్ రాయించు...లీగల్‌గా పడి ఉంటారు... అది ప్రెస్టీజియస్ ప్రాజెక్టు...ఎలాంటి గొడవా ఉండకూడదు” అన్నాడు హరిహరరావు

“మేం ఎందుకు సంతకం పెట్టాలి? నేను పెట్టను” అన్నాడు సుధాకర్

“సంతకం పెట్టకపోతే...వరకట్నం కేసువాడిమీదా, దొంగతనం కేసు నీ మీదా పెట్టి బొక్కలో వేయిస్తాను...చెప్పరా వాడికి సంతకం పెట్టమని” అన్నాడు హరి హరరావు

“ఆలోచించు రామ్... మనం చేయగలిగింది ఏముంది...? వాళ్ళు అన్నంతపనీ చెయ్యగలరు.మనకి ఇదికాకపోతే మరో ఉద్యోగం...పోనీ” అన్నాడు సుధాకర్

“ఇన్నాళ్ళూ నీ బోడి సలహాలు వినే వీడు ఈ రోజు ఇలా తయారయ్యాడు... నువ్విచ్చిన మంచి సలహా ఏదైనా ఉందంటే అది ఇదే అయిఉంటుంది” అన్నాడు రాజేంద్ర వ్యంగ్యంగా నవ్వుతూ.

మరి కాసేపట్లోనే కాయితాలు తయారయ్యాయి. ఇష్టపూర్వకంగా రాసిచ్చామని ఆ ప్రోగ్రామింగ్‌కి తమకి ఎలాంటి సంబంధం లేదనీ, కేవలం కొన్ని స్క్రీన్స్‌మాత్రం చేసిచ్చామని, అది వెబ్‌డిజైనింగ్ తెలిసిన ఏ బుడ్డోడయినా చెయ్యవచ్చని రాసి ఇచ్చారు రామ్, సుధాకర్.

వాళ్ళిద్దరికీ ఓ కాపీ ఇచ్చి, కాపీ ముట్టినట్టు సంతకం కూడా తీసుకున్నాడు ఒరిజినల్‌మీద.

“వారంలో బెంగుళూరు వెళ్ళడం మర్చిపోకురా రామం” అన్నాడు రాజేంద్ర వాళ్ళు మెట్లు దిగుతుంటే.

★ ★ ★

ఎంతో అట్టహాసంగా ప్రారంభమైంది మెట్రో. స్వయంగా దేశప్రధాని రిమోట్ కంట్రోల్ నొక్కి మొదటిరైలు ప్రారంభించారు. అన్ని టీవీ చానళ్ళు ఆ కార్యక్రమాన్ని లైవ్ చూపించాయి. జెటెక్ కంపెనీ పేరు మారుమోగిపోయింది మీడియాలో.

ఒక తెలుగువాడు బెంగుళూరు వెళ్ళి స్వయంకృషితో ఎలా పైకి వచ్చాడో, అతడి పాత్ర ఈ ప్రాజెక్టు వెనుక ఎంత ఉందో చాలా వివరంగా రాశారు, ప్రసారం చేశారు. హరిహరరావు సెలబ్రిటీ అయిపోయాడు.

ఇదంతా టీవీలో లైవ్ చూస్తున్నారు రామ్, సుధాకర్.

★ ★ ★

మరుసటిరోజు మొదలైంది రచ్చ....హరిహరరావు ఆనందం ఆవిరయ్యి ఆందోళనగా మారింది.

ఉదయం తొమ్మిదిన్నర....విపరీతమైన రద్దీ ఉండే వేళ...జెయన్‌టీయూ దగ్గర ఆగిపోయింది మెట్రో రైలు. అది కూడా స్టేషన్‌లో కాదు....బయట. ప్రయాణీకుల్ని దింపి, నడకన స్టేషన్ లోకి తీసుకువచ్చారు. ఆ రైలు కదలకపోవడంతో ఆ మేరకు ట్రాక్ పనికిరాకుండా పోయింది. రెండో ట్రాక్‌లోకి ట్రాఫిక్ మొత్తం మార్చాల్సి వచ్చింది.

మెకానిక్‌గా ఏం ప్రాబ్లెమ్‌లేదని, కేవలం కంట్రోల్ రూం నుండి ఆ రైలుని నియంత్రించే వ్యవస్థలో ఏదో లోపం వల్లే ఆగిపోయిందనీ తేల్చారు....సాఫ్ట్‌వేర్ రిలే టెడ్.

సరిగ్గా అరగంట తర్వాత రెండోరైలు ఆగిపోయింది....యూసుఫ్‌గూడా దగ్గర. మరో అరగంట తర్వాత మూడోది ఖైరతాబాద్ దగ్గర.

ఇంకో రెండుమూడు గంటలు గడిస్తే మొత్తం ట్రాఫిక్ అంతా ఆగిపోయే పరిస్థితి.

"ఆదిలోనే హంసపాదు...ఇరవైనాలుగ్గంటలైనా నడవని మెట్రో" టీవీలు ఏకిపారేస్తున్నాయి.

"రాజేంద్రా....నువ్వే కదా టీమ్‌లీడర్‌వి....చూడు..చూడు ఏమయిందో... సాయంత్రానికల్లా నార్మాలిటీ రాకపోయిందో మనకి సబ్ కాంట్రాక్ట్ ఇచ్చిన వాళ్ళ టెర్మ్ ్స ప్రకారం నేను కోట్లరూపాయల డెమరేజస్ కట్టాలి....అది సరే పరువు....చూడు...చూడు ....గంట టైం నీకు.... నార్మాలిటీ రావాలి" అరుస్తున్నాడు హరిహరరావు పిచ్చివాడిలాగా.

అతడి జుట్టు రేగిపోయింది.... కళ్ళు ఎర్రగా మారిపోయాయి....మొహం పీక్కుపోయింది... చూడ్డానికి భయంకరంగా ఉన్నాడు.

"ఎలా...ఎలా సాధ్యం ఇది? ఏం జరుగుతోంది?" అని అరుస్తున్నాడు

రాజేంద్రకి అతడిముందు మాట్లాడే ధైర్యం చాలడంలేదు... అసలు ప్రోబ్లెమ్ ఏమిటో తెలుసుకునేందుకు అతడికున్న పరిజ్ఞానం చాలదు.

"ఓసారి చీఫ్ ప్రోగ్రామర్ సుధాకర్‌ని, కో ఆర్డినేటర్ రామ్‌ని పిలిస్తే బెటర్" అని చెప్పించాడు చివరికి వేరే టెక్నికల్ పర్సన్‌తో.

"సరే.....ఫోన్ చెయ్...ఆ వెధవల్నిద్దర్నీ పది నిముషాల్లో ఇక్కడుండమని నా

ఆర్డర్ అని చెప్పు....ఉచ్చపోసుకుంటూ వస్తారు..మొన్న ఇచ్చిన డోస్ ఇంకా దిగి ఉండదు" అరిచాడు హరిహరరావు.

రాజేంద్ర ఫోన్ తీసుకున్నాడు రామ్ కి ఫోన్ చేశాడు.

"ఏంటి రాజేంద్రా" అన్నాడు రామ్

"నువ్వూ...సుధాకర్ వెంటనే ఇక్కడికి రండి...పదినిముషాల్లో ఇక్కడుండాలి సీయండీగారి ఆర్డర్"

"ఛా...ఎవడ్రాడు?సీయండీ ఏంట్రా సీయండీ? పేరులేదా వాడికి?"

"రామ్...పొద్దుటే తాగావా?వారు హరిహరరావుగారు....వారు మీ మామగారు"

"రేయ్....నాఇష్టం వచ్చినప్పుడు తాగుతాను...నువ్వెవడివిబే అడగటానికి. నాది జమీందారీ వంశం...నేనో పిల్లజమీందార్ని...వారు...వారు అంటున్నావు పందివారా? వాడునాకు సీయండీకాదు రెండురోజులనుండి, మామో కాదో అబె యన్స్‌లో ఉంది, క్లారిటీ లేదు...ఇక నేను నాభార్యకాళ్ళు పట్టుకోవడం ఎలా అని ప్రాక్టీసులో ఉన్నా...అందువల్ల రావడం కుదరదని చెప్పు"

"మర్యాదగా చెబుతుంటే అర్ధంకాదా...ఆయన తలుచుకుంటే..."

"నీ బొచ్చు వాడూ, వాడి బొచ్చు నువ్వూ పీక్కోవడం తప్ప చేయగలిగింది ఏ మీలేదు... అయినా వాడో లోఫర్ నువ్వో చీటర్...నేను రెండూ కాదు..మీతో నాకు మాటలేంట్రా...పెట్టేయ్ ఫోను"

"ఏమంటున్నాడు వాడు?"

"ఛండాలమైన తిట్లు తిడుతున్నాడు సార్"

"తిడితే తిట్టాడు...నిన్నేకదా"

"నాతో పాటు మిమ్మల్నికూడా"

"ఎంత ధైర్యం....సరే వాడి సంగతి తర్వాత....వాళ్ళు లేకుండా ఈ ప్రాబ్లమ్‌సాల్వ్‌చేయలేమా?"

"సాల్వ్‌కాదు సార్" అన్నాడు టెక్నికల్ పర్సన్ రాజేంద్ర తనని గిల్లడంతో.

"సరే...ఫోన్ చేయ్ నేను స్ట్రోక్ ఇస్తాను" అన్నాడు హరిహరరావు

"వద్దు సార్...వాడి ఊపు చూస్తుంటే ఎవర్నయినా తిట్టేట్టున్నాడు" అన్నాడు రాజేంద్ర భయంగా

“ఫర్వాలేదు చెయ్....నువ్వంటే ఫ్రెండువికాబట్టి ధైర్యం చేసుంటాడు... నన్ననే ధైర్యం ఉంటుందా వాడికి? లాండ్‌లైన్ స్పీకర్ ఫోన్ ఆన్ చేసి కలుపు” అన్నాడు హరి హరరావు

అదే అతడు చేసిన తప్పు. పోగాలము దాపురించిన హితవచనముల్ చెవినపడవు అనుకుంటూ అలానే చేశాడు రాజేంద్ర

“రేయ్ రామ్...” అన్నాడు హరిహరరావు గంభీరంగా

“ఏంట్రా హరహరమహాదేవ శంభో” అన్నాడు రామ్ అవతలినుండి అంతకంటే గంభీరంగా.

“ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా?”

“తెలీకపోడానికి ఏముంది..తనకి పనీపాటా లేక నా పని పాడుచేస్తున్న ఓ గుడిపూడి జంగంతో”

“నాతో ఇలా మాట్లాడితే ఏం జరుగుతుందో తెలుసా?”

“తెలుసు...నీ ఫోన్‌బిల్లు,బీపీ రెండూ జమిలిగా పెరుగుతాయి...ఎవడ్రా నిన్ను మాట్లాడమంది...ఫోన్ ఎవడు చేశాడు నువ్వా,నేనా?...నీతో మాట్లాడాల్సిన అవసరం నాకు లేదు పెట్టరాఫోను...నీకు అంత ఖాళీగా ఉంటే రేడియోమిర్చికి ఫోన్‌చేసి భార్గవితో బంపర్‌టుబంపర్ కి సమాచారం చెప్పు లేదా బ్రేకింగ్‌న్యూస్‌బాబూరావ్‌తో ముచ్చట్లు పెట్టు...నాకు ఫోన్ చేసి వాగటం కాదు”

ఫోన్ కట్టయింది.అవమానంతో హరిహరరావు మొహం కందిపోయింది.

“నన్ను రా అంటాడావాడు? వాడి అంతు చూస్తాను” అన్నాడు

“సార్...ర గుణింతం అనేది మొదలెట్టిందిమీరు... వాడు కేవలం కంటిన్యూ చేశాడంతే...వీడికంటే సుధాకర్ నయం...వాడితో మాట్లాడుతాను...మీరు శాంతించండి...మన ప్రాబ్లం తీరింతర్వాత మెట్రోకి బలిఇద్దాం ఇద్దర్నీ” అన్నాడు రాజేంద్ర.

సుధాకర్‌కి ఫోన్ చేశాడు.

“సుధాకర్...ఏం లేదు...చిన్న ప్రాబ్లం వచ్చింది...నిన్నటిదాకా బాగా పని చేసిన కంట్రోలింగ్ సాఫ్ట్‌వేర్ ఇవ్వాళ మొరాయించింది..నువ్వు రావాలి” అన్నాడు స్పీకర్ ఆన్ చేసి.

“ఏదో స్కూటర్ ఆగిపోతే మెకానిక్‌ని రమ్మన్నట్టు పిలుస్తావేంటి రాజేంద్రా... నువ్వూ మీ సీయండీ ఇద్దరూ కలిసి నా అపార్ట్‌మెంట్‌కి రండి...నేనేమన్నా చెయ్య

గలనో లేదో చూస్తాను...ఓ అరగంట దాటితే ఉండను..నేనూ రామ్ సినిమాకి వెళ్తున్నాం ...ఏ సినిమా బెటరంటావ్ ...మిరపకాయ్ ఇంకా రగడ ఉన్నాయి" అన్నాడు సుధాకర్ చాలా కూల్‌గా.

"మేం రావడమేంటి సుధాకర్?"

"అయితే రావద్దు రాజేంద్రా...మేంకూడా సినిమాకి వెళ్ళాలి"

ఫోన్ కట్టయింది.

"సార్...వీళ్ళు మనతో ఆడుకుంటున్నారు...మీరు వసుదేవుడిని జ్ఞాపకం తెచ్చుకుని ఓ సారి పదండి...అవసరం మనది...ప్లీజ్"

పదిహేను నిముషాలలోపే వాళ్లు సుధాకర్ ఫ్లాట్‌లో ఉన్నారు.

★ ★ ★

"కూర్చోండి...మేము మీలా సంస్కారహీనులం కాదు...నించోబెట్టి మాట్లాడటానికి" అన్నాడు రామ్.

"కానీ ఫోన్లోమాత్రం తిడతావు" అన్నాడు రాజేంద్ర కసిగా.

"కాదు...దాన్ని తోకజాడిస్తే కత్తిరించడం అంటారు" అన్నాడు రామ్ కూల్‌గా.

"విషయానికొద్దాం...ఆ సాఫ్ట్‌వేర్ రాసిందే అలా రాశాం...గ్రాండ్ ఇనాగరేషన్ అయిన మర్నాడే ఒక్కోరైలూ ఆగిపోతాయి...కావాలంటే పెద్ద ప్రమాదాలు జరిగేలా ప్రోగ్రాం చేయవచ్చు కానీ సామాన్య ప్రజల్ని ఇబ్బంది పెట్టడం మా ఉద్దేశ్యం కాదు... అందుకే అలా రాశాం" అన్నాడు రామ్.

"దాన్ని మార్చడం మీవల్లకాదు...ఇది కేవలం ప్రారంభం మాత్రమే... తరువాత అంటే ఇంకో పన్నెండు గంటల తర్వాత కంట్రోల్ పానెల్స్ అన్నీ షార్ట్ సర్క్యూట్ అయి బ్లాస్టయిపోతాయి. కోట్ల విలువైన ఎక్విప్‌మెంట్ నాశనం అవుతుంది.చేతనయితే ఆపుకోండి" అన్నాడు సుధాకర్.

"మేం పవర్ ఆఫ్ చేస్తే" అన్నాడు రాజేంద్ర.

"నీకు ఇలాంటి చెత్త ఐడియాలు తప్ప మామూలువి ఎలా వస్తాయి? కనీసం ఇప్పుడున్న సాఫ్ట్‌వేర్ రిమూవ్ చెయ్యడానికైనా మళ్ళా ఆన్ చెయ్యవా? అప్పుడు మళ్ళా ప్రాసెస్ మొదలవుతుంది" అన్నాడు రామ్.

"ఎవడో హాకర్ ఎక్కడో ఉండి ఎవడి ప్రోగ్రామింగ్‌లోనో జొరబడి ఎన్ని చేస్తున్నాడు? అలాంటిది మొత్తం ప్రోగ్రామింగ్ మేము చేశాం...ఇక మేం చెయ్యలేంది

ఏముంది?" అన్నాడు సుధాకర్

"ఇప్పుడే పోలీస్ కంప్లయింట్ ఇస్తాం...ఇది సైబర్ టెర్రరిజం" అన్నాడు హరి హరరావు

"ఛా..సైబర్ కుర్రరిజం కాదూ......కేవలం హెచ్‌టీయంయల్ స్క్రీన్‌లు మాత్రం డిజైన్ చేసినవాడు ప్రోగ్రామింగ్ చెయ్యగలడంటే వాళ్ళు నమ్ముతారంటారా? మీరే రాసిచ్చిన రక్షరేకు మా దగ్గర ఉంది..మేము చాతకాని వాళ్ళమని ఈ ప్రాజెక్టుకి మాకు ఏ సంబంధంలేదు అని రాసిచ్చారు..మరిచిపోయారా?" అన్నాడు రామ్

హరిహరరావు రాజేంద్రవైపు తినేసేలా చూశాడు. నువ్విచ్చిన చెత్త సలహా నాకొంప ముంచిందని దానికర్థం.

"సరే లక్షమంది ప్రోగ్రామర్లు దొరుకుతారు మార్కెట్లో...మీరే అక్కర్లేదు" అన్నాడు రాజేంద్ర.

"అలాగే...వాళ్లు లక్షరోజుల్లో పూర్తి చేస్తారా? పిచ్చి పుల్లయ్య....మేం కావాలంటే ఇనాగరేషన్‌కి ముందే ఈ పని చేసేవాళ్ళం కదా?మీకు తేరుకునే టైం, ఆల్టర్‌నేటివ్స్ వెతుక్కునే టైం ఇవ్వకూడదనే ఇలా చేశాం. మీ సబ్ కాంట్రాక్టు క్లాజులు చూసుకోండి. అయిదేళ్ళపాటు సక్రమంగా పని చేసే సాఫ్ట్‌వేర్ ఇవ్వకపోతే మిమ్మల్నిమీరు అమ్ముకోవాలి డామేజెస్ కట్టడానికి...మరో విషయం అప్పుడు కూడా కాంట్రాక్టు మీకు ఉండదు...రోడ్డునపడతారు" అన్నాడు రామ్.

"ఏదో అమ్మాయితో మీరు సఖ్యంగా ఉండాలని అలా అన్నానుకానీ....మీకు హాని చేసే మనిషినా? మమ్మల్ని ఇబ్బంది పెడితే మీకేం వస్తుంది అల్లుడుగారు" కాళ్లబేరానికి దిగాడు హరిహరరావు.

"సింపుల్...మిమ్మల్నిలా ఇబ్బందిపెడితే మాకు ఈ కాంట్రాక్టు వస్తుంది" అన్నాడు రామ్.

హరిహరరావు గొంతుకు ఏదో అడ్డంపడినట్టు అయింది. "ఎలా?" అన్నాడు.

"చాలా సింపుల్ ఈ కాంట్రాక్టు మా కంపెనీకి ఇచ్చెయ్యండి.. ఏయంసీ తో సహా . మధ్యలోంచి మీరు తప్పుకోండి. ఇది సక్రమంగా నడిచేలా మేం చూసుకుంటాం.. మీరు డామేజీలు కట్టకుండా మేము మాట్లాడతాము...క్రైసిస్ నుండి బయట పడటం ముఖ్యం కాబట్టి సాఫ్ట్‌వేర్ మీకు సబ్ కాంట్రాక్టు ఇచ్చిన కంపెనీ కూడా ఏ మీ అనదు...ఆ విషయం ప్రీతి చూసుకుంటుంది...మీరు కాదు కూడదు అంటే ఈ ప్రాజెక్టు చేయలేక డామేజెస్ మీ జేబునుండి కట్టాలి, అదీ వందకోట్లు..ఇకపోగా

జరిగిన డామేజ్ తక్కువ జరగబోయేది చాలా ఎక్కువ..ప్రాజెక్టు వదులుకుంటే నో లాస్...నో గెయిన్" అన్నాడు రామ్.

"సరే...అలాగే.... ఎలా అయినా కాంట్రాక్టు మన కుటుంబంలోనే ఉంటుంది గా" అన్నాడు హరిహరరావు.

"చాలా బాగా చెప్పారు హరిహరరావుగారు....మీరన్నట్టే ఇది మీ కుటుంబంలోనే ఉంటుంది....మన కుటుంబంలో కాదు" అన్నాడు రామ్.

"ఏం చెబుతున్నారో అర్థం కావడం లేదు" అన్నాడు హరిహరరావు.

"కొంచెం కాఫీ తాగండి...ఉడిపి కాఫీ....మా అత్తయ్య బాగా పెడుతుంది" అని

"అత్తెయవరే.. ఉడిపి కాఫీ స్పెషల్ తొబొబన్ని" అంటూ లోపల ఎవర్నో పిలిచాడు.

కిచెన్‌లోంచి కాఫీ తెచ్చిన ఆవిడని చూసి బిగుసుకుపోయాడు హరి హరరావు....అతడి నవ నాడులూ కుంగిపోయాయి....పాతాళంలోకి పడిపోవడం అంటే ఏమిటో అపుడు తెలుసుకున్నాడు అతడు....తన జీవితంలో ఇలాంటి షాక్, ఇలా తింటానని ఊహించనే లేదు అతడు.

ఆ ఉడిపి కాఫీ తెచ్చిన రామ్ అత్త ఎవరోకాదు...తను అనంతపురంనుంచి బెంగుళూరు వెళ్ళిన కొత్తల్లో మోసం చేసిన కంప్యూటర్ సెంటర్‌వాడి కూతురు!!!!

★ ★ ★

"సర్లే...ఈ ముసలవ్వని అడ్డం పెట్టుకుని ఏం సాధించబోతున్నావ్? ఇప్పుడు ఈమెకీ నాకూ ఉన్న సంబంధం గురించి చెబితే ఎవరు నమ్ముతారు? మూలనున్న ముసలమ్మకూడా నమ్మదు" అన్నాడు హరిహరరావు తేరుకున్నాక.

"నిజమే...ఇన్నేళ్ళ తరువాత...మామూలుగా అయితే ఎవరు నమ్ముతారు? కానీ మీ దురదృష్టం ఏమిటంటే అందరూ నమ్ముతారు.... హరిహరరావు గారూ మీకు అపుత్రస్యగతిన్నాస్తి అన్న బాధలేదు..ఉడిపి నుండి మీకు మరో కానుక....జయంత్" అన్నాడు రామ్.

లోపల్నుంచి అచ్చు హరిహరరావులా ఉన్న ఓ యువకుడు వచ్చాడు.

"మీ అబ్బాయి..." అన్నాడు సుధాకర్ అతడికి పరిచయం చేస్తూ

"ఇదికూడా...." అన్న హరిహరరావు మాట పూర్తవకుండానే

"ఒక సర్టిఫికెట్ మీ జీవితాన్నే మార్చేస్తుంది "అంటూ అతడి చేతిలో ఓ కాయితం పెట్టాడు రామ్.

అది డియన్ఏ టెస్టు చేసి పేరెంట్స్ ఎవరో నిర్ధారించే టెస్టు రిపోర్టు.... ఇంతకుముందు కేవలం హైదరాబాదు సీసీయంబీ లాబ్ మాత్రమే చేసే టెస్టు... ఇప్పుడు బెంగుళూరులోని ప్రైవేట్ లాబ్స్‌లో కూడా చేస్తున్నారు....ఇంతకీ ఆ లాబ్ తాను రొటీన్‌గా మెడికల్ టెస్టులు చేయించుకునేదే.

దాన్లో క్రోమోజోములనిబట్టి హరిహరరావు తండ్రిగానూ, ఉడిపి ముసలావిడ తల్లిగానూ నిర్ధారించారు.

"మోసం....నేనెపుడూ ఈ టెస్టులు చేయించుకోలేదు" అరిచాడు హరిహరరావు.

"తప్పు...తప్పు...మీకు తెలిసి ఎపుడూ చేయించుకోలేదు" సవరించాడు రామ్.

"అంటే తెలియకుండా చేయించారా? ఎలా?" అడిగాడు రాజేంద్ర.

★ ★ ★

"అదీ డాక్టరుగారూ జరిగింది...మా మామగారికి ఈ సొసైటీలో ఉన్న పరువు, పలుకుబడి మీకు తెలిసిందే... ఆయనను అల్లరి చేయాలని చాలా మంది ప్రయత్నిస్తూ ఉంటారు...కాకపోతే చాలామందికి తెలియంది ఏమిటంటే ఆయనకు ముందే పెళ్లయింది. కొన్ని కుటుంబ కలహాల వల్ల మా పెద్ద అత్తగారు అంటే ఆయన మొదటి భార్య ఆయనను విడిచి ఏడాది వయసున్న కొడుకుతో వెళ్ళిపోయింది.

ఆవిడకోసం చూసీచూసీ ఇక రాదని నిర్ధారించుకన్నాక ఈయన ద్వితీయ కళత్రాన్ని తెచ్చుకున్నారు. మొదటి భార్య ఎవరినో పెళ్లాడిందని కర్ణాకర్ణిగా వినడమే తప్ప నిర్ధారణలేదు. ఆ కుర్రవాడి ఆచూకీ కూడా తెలియలేదు.

ఇన్నేళ్ళ తర్వాత నేనే మీ అబ్బాయినంటూ ఓ కురాడ్రొచ్చాడు తన తల్లితో సహా. అయితే వీడు నిజంగా తన వారసుడే అయితే ఆయనకి ఏ బెంగా లేదు...తన ఆస్థిలో భాగం ఇవ్వడానికి కూడా సిద్ధం..కానీ ఒకవేళ వాడుగానీ ఆవిడ రెండో భర్తకి పుట్టినవాడు అయితే? ఈనగాసి నక్కలపాలు అయినట్టుకాదా? అపాత్రదానం కాదా? రేపు తనకి కర్మకాండలు చేయడానికి అర్హుడుకాని అతడు చేస్తే తనకి సద్గతులు ఉండవు కదా? అదీ వారి చింత

ఆయనకి కొడుకునైనా అల్లుడినైనా నేనేకదా...అందుకే ఈ బాధ్యత నామీద పెట్టారు. ఈ విషయం మీతో సైతం ఆయన మాట్లాడలేకపోతున్నారు.. అందుకే గుట్టుచప్పుడు కాకుండా ఈ కార్యక్రమం జరిపించాలి" అన్నాడు రామ్ బెంగుళూరులోని ఆ లాబ్‌లోని డాక్టర్‌తో.

"కానీ ఇద్దరి సంతకాలూ ఉండాలి...తాము ఈ టెస్ట్‌లకి అంగీకరిస్తున్నట్టు"

అన్నాడు డాక్టర్.

"అలాగే మీరు మా మామగారికి విల్లింగ్‌నెస్ ఫాం మిగతావాటితో కలిపి ఇవ్వండి సైన్ చేస్తారు....టెస్టు రొటీన్ చెకప్‌లతో పాటు కలిపి చెయ్యండి...విషయం బయటకి పొక్కకుండా..అన్ని శాంపిల్స్‌తోపాటు ఈ బ్లడ్ శాంపిల్స్ తియ్యండి" అన్నాడు రామ్.

"అలాగే" అన్నాడు డాక్టర్.

"ఈ విషయం ఆయనతో....."

"డిస్కస్‌చెయ్యను...ఐ నో ఇటీజ్ ఎంబరాసింగ్" అన్నాడు ఆయన

తర్వాత ఆయన రొటీన్ హెల్త్ చెకప్‌కి వచ్చినపుడు మిగతావాటితో పాటు ఆ టెస్ట్‌కి సంబంధించిన కాయితం మీదకూడా సంతకం అయింది. లాబ్‌లో ఉన్న టెక్నీషియన్‌కి మంచి ఎమవుంట్ ఇచ్చాడు రామ్ హరిహరరావుకి అనుమానం రాకుండా సంతకం పెట్టించేందుకు

★ ★ ★

"అదీ విషయం....చూశారా హరిహరరావుగారూ నేను మీకొడుకుని మీ దగ్గరికి చేర్చడానికి ఎంత కష్టపడ్డానో...పైగా మీరు కోట్ల కాంట్రాక్టు ఇస్తున్నకంపెనీలో ఇతను పార్ట్నర్...సుధాకర్ దానికి కొత్త సీయండీ, అతడి చెల్లెలు ఇంకో పార్టనర్" అన్నాడు రామ్

"ఈ సర్టిఫికెట్ చెల్లదు...మీరేం చెయ్యలేరు...ఇది నాలిక గీసుకోవడానికి కూడా పనికిరాదు  పిచ్చోళ్ళారా"

"ఈ మధ్య సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది మీలాంటి పెద్దాయన ఇలా పేచీ పెడుతూంటే...కిక్కురుమనకుండా ప్రభుత్వ లాబ్‌లో పేరెంట్ డిటర్మినేషన్ టెస్టు చేయించుకోవాల్సిందే అని... మాకు ఆ డైరెక్షన్ తీసుకోడానికి ఈ సర్టిఫికెట్ పనికొస్తుంది" అన్నాడు రామ్

"మీరు ఇతడ్ని చూపించకపోయినా కాంట్రాక్టు మీకు ఇవ్వాల్సిందే కదా మళ్ళా వీళ్ళని ఎందుకు తీసుకొచ్చారు?" అడిగాడు హరిహరరావు

"మాకు మొదట ఏ ఉద్దేశ్యమూ లేదు. కానీ వీళ్ళు మీ వల్ల అన్యాయమైన వాళ్ళన్న విషయం సుధాకర్ తన బంధువుల దగ్గరికి ఉడిపి వెళ్ళినపుడు యాధృచ్ఛికంగా తెలిసింది. మిమ్మల్ని నా పెళ్ళిలో చూసిన సుధాకర్‌కి  అతడిలో మీ పోలికలు చూశాక అనుమానం బలపడింది. అయితే వీళ్ళు మీ పలుకుబడికి భయపడిపోయారు. చాలా ధైర్యం చెప్పి తీసుకురావల్సి వచ్చింది...కాకపోతే ఓ అన్యాయమైపోయిన స్త్రీకి

న్యాయం చేయాలన్న కోరిక తప్ప వేరే ఏమీలేదు నాకు.

ఈ కాంట్రాక్టు కూడా కొట్టేయాలని నేను అనుకోలేదు. అంతకు ముందే మేం ఢిల్లీలో ఉన్నపుడు ఉక్రెయిన్ గురించి ఫోన్ చేశారు గుర్తుందా?

అపుడే అనుమానం వచ్చింది. ప్రతీ చిన్న విషయం మీకుచేర్చేంత ఏక్సస్ ఓ చిన్న ఉద్యోగికి ఎలా వచ్చింది అని. రాజేంద్ర తన భార్యతో అన్న చిన్న విషయంకూడా మీకెలా చేరింది?

దివ్యతో మాట్లాడటానికి వెళ్ళినపుడు తను చెప్పింది...వీడెంత మాయగాడో.తనకి చాలా ఇన్‌ఫర్మేషన్ ఉంది వీడి గురించి. వీడూ వీడి పెళ్ళాం నామీద మీకూ, జానకికి పితూరీలు చెప్పి బతికేస్తున్నారని తనే చెప్పింది.

రంగరాజు దగ్గర వీడు వాగిందికూడా మొన్ననే నాకుతెలిసింది. మీరు ఏదోరోజు మమ్మల్ని ఎక్కడో ఇరికిస్తారని తెలుసు... అందుకే మీ వెన్ను విరవాలనుకున్నాం... అలానే వీళ్ళకి న్యాయం చెయ్యాలని కూడా అనుకున్నాం" అన్నాడు రామ్

"అయితే నువ్వే ఆ కంపెనీకి సీయండీ అవ్వచ్చు కదా...మళ్ళా వీడెందుకు?"

"అయ్యా...బలహీనుల్ని ఉద్ధరిస్తున్నాం అని చెప్పుకుంటూ వాళ్ళ శక్తియుక్తులు పిండుకునే పిండారీ యుగానికి రామ్ చరమగీతం పాడుతున్నాడు...ఉద్ధారక యుగం నుండి దళిత నాయకత్వంలో పని చేయడానికి సిద్ధపడటం పరిణామంలో మేలి మలుపు....ఇది చేయడానికి చాలా విశాల హృదయం ఉండాలి... నేను దిగివచ్చాను నిన్ను ఉద్దరిస్తాను అనడం సులభం...నువ్వు నాకంటే ప్రతిభావంతుడివి అని అంగీకరిస్తున్నాను...అనడం చాలా కష్టం...అది రామ్ చేస్తున్నాడు..కష్టపడింది నువ్వు.. తెలివైనవాడివినువ్వు..డబ్బు అవసరంకూడా నాకంటే నీకు ఎక్కువ అందువల్ల ఈ కాంట్రాక్టు నువ్వు తీసుకో.కాకపోతే అన్యాయమైపోయిన హరిహరరావు కొడుక్కి న్యాయంగా సగం వాటా ఇమ్మన్నాడు రామ్ నాతో... వేలమంది సంస్కర్తల కంటే ఇతడు గొప్పవాడు" అన్నాడు సుధాకర్

"నేను మీ అమ్మాయి దగ్గరా, మీ దగ్గరా, ఈ కమీనా రాజేంద్రగాడి దగ్గరా చాలా పాఠాలు నేర్చుకునాను..నావాళ్ళంటే నాతో ఉండేవాళ్ళు, నాకోసం పనిచేసేవాళ్ళు, నా క్షేమాన్ని ఆశించేవాళ్ళు...అంతే కాని బంధువయినంత మాత్రాన, ఒకే కులం అయినంత మాత్రాన నా మనిషి కానక్కరలేదు.. స్వంత కులం వాడిని, బంధువుని అయిన నన్నే తొక్కేసి మీ చెప్పుచేతల్లో పెట్టుకోవాలని, ఆడించాలని చూశారే ఇక ఇలాంటి బలహీనుల్ని మీరెలా కనబడకుండా తొక్కేస్తున్నారో ఊహించగలను.

తొలగితోవనిచ్చువాడెవడు తోసుకొనిపోవలెగాని అన్నాడు మహాకవి కాళోజీ.. అదే నేను సుధాకర్‌కి నేర్పాను...అందరికీ అధికారం కావాలి, పదవి కావాలి,డబ్బు కావాలి...ఊరికే ఎవడూ తెచ్చి మీ దళితుల చేతుల్లో అన్నీ పోయడు...లాక్కోవడం నేర్చుకోండి...అతి విశ్వాసం కుక్క లక్షణం, అవకాశం అందిపుచ్చుకోవడం మనిషి లక్షణం.... అవకాశాల్ని వదులుకునే స్థాయిలో విశ్వాసాన్ని ఉంచుకోకండి. తనకి మాలిన ధర్మం పనికిరాదు. నీకు అనుకూలంగా ఉంటేనే దేవుడయినా దేవుడవుతాడు, నీకు అనుకూలంగా ఉన్నదే ధర్మం, నీకు వ్యతిరేకంగా ఉంటే, నిన్ను అవమానిస్తే, నువ్వు బానిసవని చెబితే దేవుడని చెప్పుకునేవాడ్నయినా చెప్పుతీసుకు తన్ను, నీకు పనికిరానిది ధర్మం కానీ, నమ్మకంగానీ నువ్వు వప్పుకోకు, ఇదే నీతి. ఇదే ధర్మం. అమెరికా అయినా, మీ ఊరి అయ్యవారయినా అందరూ అనుసరించే అసలునీతి.

పనికి రాని ధర్మాలు మీకు, ఫలహారాలు వాళ్ళకి....ఇదే తెలుసుకోమన్నాను.

స్నేహానికి, పెళ్ళికి కులం అక్కర్లేదు...కానీ అధికారానికి కులం ఉంది, అవమానానికి కులం ఉంది, రెండు చొక్కాలున్నవాడు మూడో చొక్కాకోసం చూస్తాడుకానీ రెండో చొక్కా మీకివ్వాలని చూడడు... రెండో చొక్కా మీరు లాక్కోండి.

నాకు మేలు చేసిన వాళ్ళకి, నాతో నిలబడ్డవాళ్ళకి నేను చేయగలిగింది చేశాను" అన్నాడు రామ్.

"మిమ్మల్ని మీరు ఉద్ధరించుకోండి...మీరేంట్రా నా కుటుంబాన్ని ఉద్ధరించేది... ఉడిపి అమ్మాయిని భార్యగా అంగీకరిస్తున్నాను...నా కొడుకుని నాతో తీసుకెళ్తాను" అంటూ వాళ్ళ దగ్గరికి వెళ్ళాడు హరిహరరావు.

ఆమెకు వినపడేలా "నన్‌హెండతియన్ను నానే కర్కొండోహోగినినన్‌జెతేబా" అన్నాడు నాటకీయంగా

మరుక్షణం ఆశబ్దం రివ్వున మోగింది ఆ రూమ్‌లో... "ఇష్టుదివస ఎల్లిసచ్చిరి యా..నాయి" అంటూ దశాబ్దాల తనబాధని చేతిలోకి తీసుకుని ఈడ్చికొట్టింది ఆవిడ. అదే ఆ శబ్దం.

★ ★ ★

ఓ గంటలో మెట్రో కాంట్రాక్టు, ఖర్చులుపోను మిగిటిన డబ్బు బదిలీ కావడమూ, మరో అరగంటలో అన్ని రైళ్ళూ సజావుగా నడవటమూ జరిగిపోయాయి.

★ ★ ★

వచ్చి తనని బతిమిలాడని కారణంగా జానకి రామ్‌తో కలసి ఉండబోవటం

లేదని చెప్పడంతో, ఆమెకు వేరే సంబంధాలు చూడటం మొదలెట్టింది రాజరాజేశ్వరి. ఆవిడ బతికుండగా జానకిని సొంతంగా ఆలోచించనివ్వదు. సొంతంగా కాపురం చేసుకోనివ్వదు. ఆమెది ప్రేమకాదు. అధికారదాహం.

★ ★ ★

రాజేంద్ర నారాయణ భార్యకి, అన్ని చానెళ్ళకి, పేపర్లకి దివ్య నుండి మెయిల్స్ వచ్చాయి. అతడి రొమాంటిక్ ఎపిసోడ్ అందులో ఉంది. రంగరాజు దగ్గర దివ్య లాప్‌టాప్ తీసుకున్న సోఫీ ఆమె పెట్టిన మిగతా అన్ని మెయిల్స్‌నీ డెలీట్ చేసింది, ఒక్క రాజేంద్రకి సంబంధించిన మెయిల్ మాత్రం అలానే వదిలేసింది, సుధాకర్ చెప్పడంతో.

అపకారమూ లేదు, ఉపకారమూ లేదు అంటే ఇదే. జరిగేదాన్ని జరగనివ్వడం.

★ ★ ★

దివ్య తల్లి ఆమె శవాన్ని తీసుకెళ్ళిందని రంగరాజు చెప్పాడు. ఆమెకి తండ్రి చిన్నపుడేపోయాడు. తల్లి ప్రైవేటు స్కూల్లో టీచర్. కష్టపడి కూతుర్ని పెంచింది. ఆవిడ వైజాగ్‌లో ఉంటుంది. దివ్య తాలూకు ఫ్లాట్ ఆవిడ ఓ అనాధ శరణాలయానికి ఇచ్చేసింది.

★ ★ ★

“వదినతో రవీంద్రభారతిలో నువ్వు ఆ రోజు చెప్పిందేమిటన్నా?” అడిగింది సోఫీ.

“ఏం లేదు..నాకు ఆల్రెడీ పెళ్ళయిందని నా వ్యూహాత్మక మౌనాన్ని వీడి చెప్పాను” అన్నాడు రామ్.

“ఆ చెప్పడం వ్యూహాత్మకమా?” అడిగింది సోఫీ.

“కాదు...ప్రేమాత్మకం” చెప్పింది ప్రీతి.

# (సమాప్తం)



**పి.వి. సునీల్ కుమార్** పశ్చిమగోదావరి జిల్లావాసి. చింతలపూడిలో పుట్టారు. పెనుగొండలో పెరిగారు. తణుకు, విశాఖపట్నం, హైదరాబాదులలో విద్యాభ్యాసం గడిచింది. మాతామహులు ఆంగ్లభాషా పండితులు, ప్రధానోపాధ్యాయులు. షేక్స్పియర్ రచనలని వారే రచయితకు బాల్యంలో పరిచయం చేశారు. తల్లిగారు దయామణి. శరత్, చలం సాహిత్యాల అభిమాని. అలా ఆంగ్ల, ఆంధ్ర సాహిత్యాల పట్ల అభిరుచి ఏర్పడింది. ప్రవృత్తిరీత్యా పాఠకుడు, రచయిత అయిన సునీల్ కుమార్, వృత్తిరీత్యా ఐ.పి.యస్ అధికారి. ఫ్యాక్షన్ ప్రాంతమైన కడప జిల్లాలో తన కెరీర్ ప్రారంభించారు. వీరు ఉన్నంత కాలం కడపలో ఒక్క ఫ్యాక్షన్ నేరం కానీ, ఎన్నికలలో రీపోల్‌కానీ లేవు. సంస్కరణలకు, ప్రజాహిత పోలీసింగ్‌లో అనేక ఆవిష్కారాలకు వీరు చిరునామా. యాత్లై కథలు, సయ్యాట అనే మరో నవల వీరి కలం నుంచి వచ్చాయి.

గోదారి ఒడ్డున అగ్రహారం నుండి వచ్చిన కుర్రాడు హైదరాబాదులో హత్య కేసులో ఇరుక్కుపోయాడు.
ఫేస్‌బుక్ పరిచయాలు అతన్నీ అతడి స్నేహితుల్నీ ప్రమాదం అంచుకు తీసుకెళ్ళాయి.
ప్రపంచమంతా అతడు దోషి అని నమ్ముతోంది. అండగా ఉండాల్సిన వాళ్ళు దూరమయ్యారు.
అనుకోని వాళ్ళు దగ్గరయ్యారు, సాయపడ్డారు.
జీవితమంటే అంతే.
అగ్రహారం నుండి హైటెక్ సిటీకి అతడి ప్రస్థానంలో ఉక్కిరి బిక్కిరి చేసే ఉత్కంఠ భావాలనుండి,
మలిపెట్టే మెట్లో ప్రాజెక్టు వరకూ ఎన్ని మలుపులో..!
ఊహించని ట్విస్టులతో ఊపిరి సలపనివ్వని ఉత్కంఠతో, ఉరకలు, పరుగులు పెట్టే రచనా శైలితో
మెగాహిట్ సీరియల్‌గా నిలిచిన 'ప్రారంభం' ఇప్పుడు నవలగా మీ ముందుకొచ్చింది.
ప్రారంభించడమే మీ వంతు.. పూర్తిగా చదివించడం ఈ థ్రిల్లర్ వంతు.

*భారీ వాక్యనిర్మాణం చదవడానికి కష్టంగానూ, అర్థంచేసుకోవడం క్లిష్టంగానూ వుంటుందని తన నవలలో తేలికైన, పొందికైన, అందమైన, సూటైన, సొగసైన వాక్య నిర్మాణాన్ని అందించారు పి.వి.సునీల్‌కుమార్.*

– వేమూరి బలరామ్, ఎడిటర్, స్వాతి వార పత్రిక

*ఇంతకుపూర్వం జనాకర్షణా, జనహితమూ కలగలిపిన రచయితలు చలం, రావిశాస్త్రి, బీనాదేవి, వడ్డెర చండీదాస్ ఉన్నారు. మళ్ళీ వారికోవలో చేరిన ఈ తరం రచయిత సునీల్ కుమార్.*

– సతీష్ చందర్, ప్రముఖ రచయిత, కవి, సంపాదకులు

*సునీల్‌కుమార్ రచనా శైలి రావిశాస్త్రిలా ఉంటుంది. పతంజలి వచనంలా ఉంటుంది...*

– జగన్నాథశర్మ, సంపాదకులు, నవ్య

prarambham

a novel by p v sunil kumar